
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 188
శనివారం 28-9-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'



మొదటి రోజు 35 ఓవర్లు
భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టుకు వర్షం అడ్డంకి.. బంగ్లాదేశ్ 107/3 - 17లో



రికార్డుల ర్యాలీకి బ్రేక్
సెన్సెక్స్ 264, నిఫ్టీ 37 పాయింట్లు డౌన్.. సరికొత్త గరిష్టాలకు మార్కెట్లు - 17లో




టార్గెట్ నస్రల్లా
హెజ్‌బొల్లాను అంతం చేస్తామన్న కాసేపటికే హెజ్‌బొల్లా ప్రధాన కార్యాలయంపై ఇజ్రాయెల్ బాంబు దాడులకు దిగింది.
- వివరాలు 6లో▶



కిషిదా వారసుడిగా ఇషిబా
జపాన్ నూతన ప్రధానిగా షిగెరు ఇషిబా బాధ్యతలు చేపట్టనున్నారు. ఎల్‌డీపీ ఆయనను తమ అధ్యక్షుడిగా ఎన్నుకుంది.
- వివరాలు 6లో▶



పొంగులేటి ఇంట్లో ఈడీ సోదాలు
రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇల్లు, వ్యాపార సంస్థలకు చెందిన కార్యాలయాల్లో ఈడీ బృందాలు సోదాలు జరిపాయి.
- వివరాలు 7లో▶



పాక్ నోట మళ్లీ పాతపాట
ఐరాసలో పాక్ మరోసారి కశ్మీర్ ప్రస్తావన తెచ్చింది. ఆర్టికల్ 370 పునరుద్ధరించాలని ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అన్నారు.
- వివరాలు 6లో▶

'రెడ్ మార్క్' గోబ్యాక్!

మూసీ నది వెంట సర్వే కోసం వెళ్లిన అధికారులను అడ్డుకున్న స్థానికులు

రెండో రోజూ తీవ్ర నిరసనల సెగ.. పలుచోట్ల ఉద్రిక్తత

ఇల్లు కూల్చేస్తారనే బాధతో యువకుడి ఆత్మహత్యాయత్నం

చాలా చోట్ల రోడ్లపై బైఠాయించిన బాధితులు.. ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు

అభివృద్ధి పేరిట తమ జీవితాలను నాశనం చేయవద్దంటూ ఆక్రోశం.. పలుచోట్ల ఉద్రిక్తతల మధ్యే పోలీసు బందోబస్తుతో ఇళ్లకు మార్కింగ్

మరికొన్ని చోట్ల వెనుదిరిగిన అధికారులు

సాక్షి, హైదరాబాద్: మూసీ నది గర్భంలో, బఫర్‌జోన్‌లో నిర్మాణాలను గుర్తించేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నం తీవ్ర ఉద్రిక్తత రేపుతోంది. నివాసాల కూల్చివేత కోసం మార్కింగ్ చేయడానికి వెళ్తున్న అధికారులకు అడుగడుగునా తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. ఏళ్లకేళ్లుగా కష్టపడి సంపాదించుకుని కట్టుకున్న ఇళ్లను వదిలిపొమ్మనడం ఏమిటంటూ పరీవాహకంలోని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రక్రియ కోసం రెండోరోజు శుక్రవారం వివిధ ప్రాంతాలకు వెళ్లిన అధికారులను స్థానికులు మిగతా 8వ పేజీలో ▶



వినాయకనగర్‌లో ఒంటిపై కిరోసిన్ పోసుకున్న మహేశ్‌పై నీళ్లు చల్లుతున్న పోలీసులు

'మూసీ'కి పర్యాటక శోభ



పరీవాహక ప్రాంతంలోని చారిత్రక భవనాలను తీర్చిదిద్దుతాం

- హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే ప్రతి కట్టడాన్నీ పరిరక్షిస్తాం
- పురాతన 'మెట్లబావుల దత్తత' కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

5 లో

హెచ్‌సీఎల్ మరో క్యాంపస్.. అదనంగా 5 వేల ఉద్యోగాలు

- సీఎం రేవంత్‌తో హెచ్‌సీఎల్ చైర్‌పర్సన్ రోష్నీ నాడార్ భేటీ
- క్యాంపస్ ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానం

5 లో

మళ్లీ అడుగుతున్నాం.. 'హైడ్రా'కు చట్టబద్ధత ఏంటి?



నోడల్ ఏజెన్సీకి ఎందుకంత దూకుడు.. హైడ్రా తీరుపై హైకోర్టు ఆగ్రహం 8లో

ముందు రోజు నోటీసులు ఇచ్చి తెల్లారే కూల్చేస్తారా?

- సెలవు రోజు కూడా కనీస అవకాశం ఇవ్వరా?
- కోర్టు పరిధిలో ఉన్న ఆస్తిని ఎలా కూలుస్తారు?
- రంగనాథ్ నేరుగా హాజరై వివరణ ఇవ్వాల్సిందే..

హైడ్రా భయంతో మహిళ ఆత్మహత్య



కుమార్తెలకు ఇవ్వాలనుకున్న ఇళ్లు కూల్చేస్తారేమోనని.. 8లో

హైడ్రాకు ఎలాంటి సంబంధం లేదు
కమిషనర్ రంగనాథ్ 8 లో

నోరు తెరిస్తే అబద్ధాలే
కల్తీ.. బాబు సృష్టే

శ్రీవారి లడ్డూల తయారీలో కల్తీ నెయ్యిని అసలు వాడనేలేదని టీటీడీ ఈవో అత్యంత స్పష్టంగా చెప్పినా నీచ రాజకీయం చేస్తూనే ఉన్నావ్

సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగిన వైఎస్ జగన్

అన్నీ తెలిసినా.. జరగని విషయం జరిగినట్లుగా.. కల్తీ ప్రసాదాన్ని భక్తులు తిన్నట్లుగా అబద్ధాలు చెబుతున్నావ్

- తిరుమల పవిత్రతను, ప్రసాదాన్ని నీ రాజకీయం కోసం అపవిత్రం చేశావ్
- నా తిరుమల పర్యటనకు అనుమతి లేదని నోటీసులిస్తావ్.. మళ్లీ అదేమీలేదని బుకాయిస్తావ్
- తిరుమల లడ్డూ విషయంలో నీ పాపాలు బయటకు రావడంతో టాపిక్ డైవర్షన్ కోసం డిక్లరేషన్ అంటున్నావ్
- తిరుమలకు 10 - 12 దఫాలు వెళ్లిన తరువాత ఇప్పుడు నోటీసులు.. డిక్లరేషన్ అడగటం ఏమిటి?

14 లో



తిరుమల పర్యటనకు అనుమతి లేదని పార్టీ నేతలకు పోలీసులు ఇచ్చిన నోటీసును చూపుతున్న జగన్

లడ్డూలో 'కుట్ర' కోణం

భారత వ్యవసాయ పరిశోధన సంస్థ పాలక మండలి సభ్యుడు బద్రవాడ వేణుగోపాల్ సంచలన నిజాలు

సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలంటూ రాష్ట్రపతికి లేఖ 7 లో


DB
Siggnature
Finest Silver Elaichi
New Pack
DB
Siggnature
Finest Silver Elaichi
A Premium Product from Dilbagh
www.dbsiggnature.com
For Calorie conscious people, the product shown here contains artificial sweeteners like Sodium Saccharin (INS 954), Sucralose (INS 955), and Neotame (INS 961. Not recommendable for kids.
A Premium Product from Dilbagh®


మెట్రో
హోల్ సేల్
మెట్రో కి విచ్చేయండి
సంబరాలు జరుపుకోండి
దసరా ప్రత్యేక ఆఫర్లు
28 సెప్టెంబర్ - 3 అక్టోబర్
జీడిపప్పు హోల్ / కాలిఫోర్నియన్ ఆల్మండ్ /
ఎండు ద్రాక్ష ఎల్లో ఒక్కొక్క ప్యాక్ 500 g
₹485
MRP ₹800*
₹369
MRP ₹650*
₹129
MRP ₹350*
పూజా అవసరాలు
(విస్తృత శ్రేణి)
50%
తగ్గింపు* MRPపై
బంధన్వర్ మామిడి ఆకుల తోరణం
₹69
51% OFF*
MRP ₹140*
మేరిగోల్డ్ 30 ఫ్లవర్
(2 యూనిట్లు)
₹99
51% OFF*
MRP ₹200*
షుగర్ లూజ్
1 kg
₹41.53
మార్కెట్ ధర ₹43*
బొంబాయి రవ్వ
లూజ్ 1 kg
₹42
మార్కెట్ ధర ₹45*
కంది పప్పు పాపులర్
లూజ్ 1 kg
₹157
మార్కెట్ ధర ₹160*
సాగో ప్రీమియం
లూజ్ 1 kg
₹72
మార్కెట్ ధర ₹76*
సోనామసూరి స్టీమ్
రైస్ లూజ్ 1 kg
₹49
మార్కెట్ ధర ₹52*
వేరుశెనగ లూజ్
1 kg
₹135
మార్కెట్ ధర ₹138*
మైదా 1 kg
₹45
25% OFF*
MRP ₹60*
విజయ ఘీ 1 L
₹549
20% OFF*
MRP ₹690*
బ్రిటానియా మ్యారీ గోల్డ్ బిస్కట్
250 g
₹34
15% OFF*
MRP ₹40*
బ్రిటానియా లిటిల్ హార్ట్స్ బిస్కట్
75 g
₹24
20% OFF*
MRP ₹30*
ఆశీర్వాద్ గోధుమ
పిండి 5 kg
₹277
17% OFF*
MRP ₹335*
రెడ్ లేబుల్ టీ
500 g
₹261
12% OFF*
MRP ₹300*
బింగో స్నాక్స్
(విస్తృత శ్రేణి)
కనీసం 33% తగ్గింపు* MRPపై
బాంబినో రోస్టెడ్ వెర్మిసెల్లి
850 g
₹89.70
22% OFF*
MRP ₹115*
దసరా సంబరాలు జరుపుకోండి
మెట్రో వారి పొదుపు యొక్క
ప్రయోజనాలు పొందండి.
బ్రూ ఇన్‌స్టెంట్ సూపర్ స్ట్రాంగ్
కాఫీ పౌడర్ 200 g
₹208.80
13% OFF*
MRP ₹240*
మాజా మ్యాంగో డ్రింక్
600 ml
₹32.77
22% OFF*
MRP ₹42*
కోకా కోలా
750 ml
₹34.16
24% OFF*
MRP ₹45*
MTR గులాబ్ జామూన్ రెడీ మిక్స్ 175 g
1 కొనండి 1 పొందండి ఉచితం
₹127.50
15% OFF*
MRP ₹150*
కోల్గేట్ మాక్స్‌ఫ్రెష్ సేవర్ ప్యాక్
300 g
₹177
33% OFF*
MRP ₹265*
పారాచ్యూట్ ప్యూర్
కోకోనట్ ఆయిల్ 1 L
₹296.40
24% OFF*
MRP ₹390*
షాంపూ
(విస్తృత శ్రేణి)
కనీసం 50% తగ్గింపు* MRPపై
డవ్ క్రీమ్ బ్యూటీ బాతింగ్ బార్ 3 N X 75 g
పియర్స్ ప్యూర్ & జెంటిల్ సోప్ 4 N X 75 g
17% తగ్గింపు* MRPపై
MRP ₹149* Onwards
సర్ఫ్ ఎక్సెల్ ప్రో లాండ్రీ పౌడర్
5 kg
₹554.40
30.70% OFF*
MRP ₹800*
విమ్ లెమన్ డిష్‌వాష్ బార్
4 N X 200 g
₹71.38
17% OFF*
MRP ₹86*
లైజాల్ డిస్‌ఇన్ఫెక్టెంట్ సర్ఫేస్
క్లీనర్ 975 ml ఒక్కొక్కటి
₹199.52
14% OFF*
MRP ₹232*
METRO
పండుగ
బహుమతులు
డ్రై ఫ్రూట్స్ & నట్స్ గిఫ్టింగ్ శ్రేణి
50% వరకు తగ్గింపు*
చాకొలెట్స్ గిఫ్ట్ ప్యాక్ శ్రేణి
25% వరకు తగ్గింపు*
బిస్కట్స్/కుకీస్ గిఫ్ట్ ప్యాక్స్ శ్రేణి
50% వరకు తగ్గింపు*
స్వీట్స్ & నమ్‌కీన్ గిఫ్టింగ్ శ్రేణి
25% వరకు తగ్గింపు*
లాహోపాలా డిన్నర్ సెట్ 12 N
₹599
59% OFF*
MRP ₹1,445*
వండర్ చెఫ్ ఇవిటా-గాలక్సీ నాన్-స్టిక్ సెట్ 3 N
₹1,050
74% OFF*
MRP ₹4,000*
లోటస్ సస్పెన్స్ డబుల్ బెడ్‌షీట్
₹699
72% OFF*
MRP ₹2,499*
లగేజీ
(విస్తృత శ్రేణి)
₹1,999
MRP ₹7,199* Onwards
కాంపాక్ 32" (81 cm) గూగుల్ TV
HUEQ A
₹9,990
58% OFF*
MRP ₹23,999*
వండర్ చెఫ్ ఓవెన్ టోస్టర్
గ్రిల్లర్ 19 L బ్లాక్
₹3,399
53% OFF*
MRP ₹7,200*
వర్ల్‌పూల్ 235 L
2 స్టార్ టైటాన్ స్టీల్
₹21,999
28% OFF*
MRP ₹30,400*
₹499 మాత్రమే
62% ఆదా చేయండి
MRP ₹1,299
బోరోసిల్ స్టైల్ రౌండ్ గ్లాస్ లంచ్ బాక్స్ 3 N X 400 ml
₹999 మాత్రమే
38% ఆదా చేయండి
MRP ₹1,600
ప్రెస్టీజ్ పాప్యులర్ అల్యూమినియం స్వచ్ఛ్ ఔటర్ లిడ్ ప్రెషర్ కుకర్ 3 L
₹2,999
₹1,699 మాత్రమే
79% ఆదా చేయండి
MRP ₹7,999
₹1,799 మాత్రమే
75% ఆదా చేయండి
MRP ₹7,199
Whirlpool
WONDERCHEF
safari
మూసాపేట: సర్వే నంబర్ 133-140, మూసాపేట గ్రామం, బాలా నగర్ మండలం, కూకట్ పల్లి, పోలీసు స్టేషన్ వద్ద, హైదరాబాద్ - 500072.
ఉప్పల్: సర్వే నంబర్ 588/1 & 591/1, ఉప్పల్ ఖల్సా గ్రామం, ఉప్పల్ మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ - 500 039.
గచ్చిబౌలి: సర్వే నంబర్ 262, గచ్చిబౌలి గ్రామం, రాజేంద్ర నగర్ మండలం, హైదరాబాద్ - 500075.
సుచిత్రా జంక్షన్: సర్వే నంబర్ 25...
*Offers valid till 3rd October, 2024
www.metro.co.in
1860-266-2010
METRO
Wholesale

> సముద్రంలోకి ప్రవహించే నదులు తమ పేర్లను, రూపాలను కోల్పోయే విధంగా... తన పేరు నుండి, ప్రఖ్యాతి నుండి విముక్తి పొందిన వ్యక్తి జ్ఞానులను మించిన జ్ఞాని అవుతాడు.
> – ముండకోపనిషత్తు (హిందూ ధర్మం)

సాక్షి
శనివారం, 28 సెప్టెంబర్ 2024

వంకర బుద్ధులు మారవా?

ఏదో వంకన కులమతాల కుంపట్లు రాజేసే పనికి పాల్పడవద్దని సర్వోన్నత న్యాయస్థానం చెప్పిన హితవు కూడా ప్రభుత్వాల చెవికెక్కడంలేదు. ఇందుకు ఉత్తరప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వాల పోకడలు నిదర్శనం. కావడ్ యాత్ర సాగే పొడవునా ఆహారం, ఇతర తినుబండారాలు విక్రయించే వ్యాపారులు తమ పేర్లను తెలిపే బోర్డుల్ని ప్రదర్శించాలని ఉత్తరప్రదేశ్ పోలీసు విభాగం జారీ చేసిన హుకుంను మొన్న జూలైలో సుప్రీంకోర్టు నిలిపి వేయగా, దాన్ని వమ్ము చేస్తూ వేరే మార్గంలో అమలు చేయటానికి అక్కడి ప్రభుత్వం పూనుకోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది. యూపీని చూసి మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్‌లు సైతం వాతలు పెట్టుకున్నాయి. అవి కూడా బీజేపీ ప్రభుత్వాలే. కానీ ఈ మాదిరి ధోరణులకు వ్యతిరేకమని చెప్పే కాంగ్రెస్ నేతృత్వంలోని హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం సైతం ఈ ప్రయత్నమే చేయటం మరింత దిగ్భ్రాంతిని కలిగిస్తుంది. ఒక మంత్రి తెలిసీ తెలియక ఏదో అన్నారని కాంగ్రెస్ సంజాయిషీ చెబుతున్నా ఆత్మవిమర్శ చేసుకోవటం ఆ పార్టీ బాధ్యత. ఎవరూ కుల మతాలను ఎంచుకుని పుట్టరు. కానీ పుట్టకనుబట్టి వివక్ష ప్రదర్శించే దురాచారం మన దేశంలో రాజ్యాంగం నిషేధించినా కొనసాగుతూనేవుంది. దహనకాండకు దిగే వ్యక్తులను దుస్తుల్ని బట్టి పోల్చుకోవచ్చని అయిదేళ్లక్రితం ప్రధాని నరేంద్ర మోదీ అన్నప్పుడు దుమారం రేగింది. అప్పటికి పౌరసత్వ సవరణ చట్టంపై కొనసాగుతున్న ఉద్యమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన ఆ వ్యాఖ్యలు చేశారు. దుస్తులే కాదు... ఇంటిపేర్లూ, పేర్లూ, పేర్లచివరవుండే తోకలు, తినే తిండి కూడా సమస్యాత్మకం కావటం వర్తమానంలో ఎక్కువైంది. దీన్నంతటినీ గమనించబట్టే యూపీ పోలీసుల ఉత్తర్వులను సుప్రీంకోర్టు నిలిపివేసింది. ఇలాంటి ఉత్తర్వులిచ్చే అధికారం పోలీసు విభాగానికి ఉండదని చెబుతూనే తోపుడు బండ్లు, ధాబాలు, హోటళ్ల యజమానులు స్వచ్ఛందంగా తమ పేర్లు ప్రదర్శించదల్చుకుంటే అభ్యంతరంలేదని, అయితే బలవంతంగా ఆ పని చేయించరాదని సుప్రీంకోర్టు అప్పట్లో తెలిపింది. ఇప్పుడు ఏకంగా ఆహార భద్రత, ప్రమాణాల చట్టం సవరణ మాటున యూపీ సర్కారు దాన్ని అమలుచేయడానికి పూనుకుంటున్నది. ఆహారంలో కల్తీ జరగకుండా, అపరిశుభ్రత లేకుండా చూడటం తన ఉద్దేశమంటున్నది. హిమాచల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి విక్రమాదిత్య సింగ్ సైతం ఆ బాణీనే వినిపిస్తున్నారు. రాష్ట్రంలో ఇటీవల మతఘర్షణలు చెలరేగటం వెనక ఆహారపదార్థాల విక్రయానికి సంబంధించి బలమైన చట్టం లేకపోవటమే కారణమని ఆయనకు అనిపించిందట!


యూపీఏకు ఆవును చేరిస్తే అది ఎన్డీయే అవుతుందని చాన్నాళ్లక్రితం ఎవరో చమత్కరించారు. తమ చాపకిందకు నీళ్లు రాబోతున్నాయని చివరాఖరులో అర్థమయ్యాక హిందూ ఓటు బ్యాంకును కాపాడుకోవటానికి ఆనాటి యూపీఏ సర్కారు వేసిన అనేక పిల్లిమొగ్గలు చూశాకే అలాంటి వ్యాఖ్యానాలు వినబడ్డాయి. ఆ మనస్తత్వం పార్టీలో ఇంకా సజీవంగా ఉండటంవల్లే విక్రమాదిత్యసింగ్ ఇలా అన్నారా లేక సీఎం రేసులో భంగపడి కేబినెట్ పదవితో సరిపెట్టుకోవటం జీర్ణించుకోలేక వివాదాస్పదంగా మాట్లాడారా అన్నది ఆ పార్టీ తేల్చుకోవాలి. ఆహార విక్రయ దుకాణాల దగ్గర యజమానుల పేర్లుండాలన్న అంశంలో కమిటీ వేశామని, ఇంతకుమించి ముందుకుపోలేదని కాంగ్రెస్ ప్రతినిధి ఇస్తున్న వివరణ సందేహాలను తగ్గించకపోగా పెంచింది. పార్టీకంటూ ఒక సిద్ధాంతం, విధానం ఉందా లేదా? యూపీ నిర్ణయాన్ని నిర్ణయాన్ని పార్టీ వ్యతిరేకించినప్పుడు వేరే రాష్ట్రంలో ఆ పార్టీ ప్రభుత్వం సరిగ్గా అదే పనికి పూనుకోవటంలోని మతలబేమిటి? పేర్లు కాదు... వారి వారి గుర్తింపు కార్డులు ప్రదర్శించాలన్న ప్రతిపాదన వచ్చిందని మరో సంజాయిషీ. ఏమైతేనేం... మతం పేరిట విద్వేషాలు సృష్టించటమే అంతరార్థంగా కనబడుతోంది.

దుకాణంలో విక్రయించే ఆహార పదార్థాలు పరిశుభ్రమైనవని, ప్రామాణికమైనవని విశ్వసిస్తేనే వాటిని జనం కొనుక్కుతింటారు. కానీ ఆ నమ్మకాన్ని వమ్ము చేయటమే మన దేశంలో కనిపిస్తుంది. ఈ విషయంలో అవసరమైన చట్టాలున్నాయి. ఆ నిబంధనలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకునే విభాగాలు ఉంటున్నాయి. కానీ వాటిని పకడ్బందీగా అమలు చేయటానికి సిద్ధపడని ప్రభుత్వాలు ఆ వంకన విభజన రాజకీయాలకు తెరతీస్తున్నాయి. ప్రత్యర్థులను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అలవికాని హామీలిచ్చి అధికారంలోకొచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అందరూ ఎంతో భక్తివిశ్వాసాలతో స్వీకరించే లడ్డూపై ఎలాంటి దుష్ప్రచారం చేసిందో దేశమంతా చూస్తూనే వుంది. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ తెలివితక్కువ చర్యను స్ఫూర్తిగా తీసుకున్నట్టు కనబడుతోంది.

మనుషుల పేర్లనుబట్టి, వారి ఆహారపుటలవాట్లనుబట్టి వారి మతాలను తెలుసుకోవటం సులభమవుతుందన్నది వాస్తవమే కావొచ్చు. కానీ వారు విక్రయించే పదార్థాలు సమస్తం కేవలం ఆ కారణంతో మంచివి, ప్రామాణికమైనవి లేదా అపరిశుభ్రమైనవి ఎలా అవుతాయో అనూహ్యం. విపరీత పోకడలున్నవారికి తప్ప ఇటువంటి ఆలోచనలు రావు. సొంతంగా ఎటూ ఉన్నతమైన ఆలోచనలు రావు. కనీసం రాజ్యాంగాన్ని అనుసరించి మాత్రమే పాలించాల్సినవారు సర్వోన్నత న్యాయస్థానం హితవు చెప్పాకైనా మారాలికదా! వ్యక్తులుగా వక్రమార్గాలు వెదుక్కోవటం మానవ స్వభావమని సరిపెట్టుకోవచ్చు. రాజ్యం అటువంటి పనులకు పూనుకుంటే అంతిమంగా అరాచకానికి దారితీస్తుంది. కనుక మతిమాలిన చేష్టలను ఇకనైనా మానుకోవాలి.

చరిత్రను చెరగనివ్వని ద్వీపాలు!

విశ్లేషణ



భోపిందర్ సింగ్

అండమాన్, నికోబార్ ద్వీపవాసులు 'పునరుద్ధరణ'ను ఆశ్రయించకుండా, చరిత్రను తిరగ రాసుకోవాలని ఉరకలెత్తకుండా తమ గాయపడిన గతాన్నే వాస్తవ వర్తమానంగానూ స్వీకరించారు. స్వాతంత్ర్యానంతరం సెల్యులార్ జైలుకు చెందిన రెండు రెక్కలు కూల్చివేతకు గురైనప్పుడు, స్వాతంత్ర్య సమర యోధులు తమ పోరాట ఫలితాలకు ప్రతీకాత్మకమైన ఆ ప్రదేశానికి మరమ్మతులు చేసే ప్రయత్నాలను గట్టిగా వ్యతిరేకించారు. ఎందుకంటే చరిత్రలో రెక్కల కూల్చివేతా ముఖ్యమైన అధ్యాయాన్ని సూచిస్తుందని వారు విశ్వసించారు. ఆ విశ్వాసమే... దేశంలో అందరినీ కలుపుకొని ఉన్న సమాజాల్లో తమది కూడా ఒకటిగా ఉండేలా చేసింది. కానీ, మితిమీరిన జాతీయవాదంతో ఇప్పుడు అభివృద్ధి కన్నా పేర్ల మార్పుపై దృష్టి పెట్టడం విషాదం.

దేశభక్తి గురించి లేదా 'భిన్నత్వంలో ఏకత్వం' అనే రాజ్యాంగ భావన గురించి దేశం మొత్తంలో ఎలాంటి పాఠాలూ, ప్రబోధాలూ అవసరం లేని ప్రదేశం ఏదైనా ఉందీ అంటే అవి... అండమాన్, నికోబార్ దీవులే. ఆ దీవుల జనాభాలో ఎక్కువ భాగం (సుమారు ఐదు లక్షల మంది) బ్రిటిష్ వారు ఖైదు చేసిన స్వాతంత్ర్య సమరయోధుల వారసత్వం కలిగి ఉన్నవారే. ఆ తర్వాతి స్థానంలో ఈ ప్రాంతంలో స్థిరపడిన వారు, నెగ్రిటో జరావాస్, ఒంగెస్, గ్రేట్ అండమానీస్, సెంటినెలీస్ (బయటి ప్రపంచంతో సంబంధం లేని చివరి రక్షిత తెగ) లేదా షాంపెన్, నికోబారీస్ వంటి మంగోలాయిడ్ తెగలకు చెందిన స్థానిక తెగల సభ్యులు ఉన్నారు.

'భారతదేశ భావన'కు ఆధారభూతమైన ఈ సుదూర కేంద్రం నేడు భారతదేశంలోని అనేక వైవిధ్యాల అధివాస్తవిక సమ్మేళనం. స్వాతంత్ర్య పోరాటం, 'కాలా పానీ' అపఖ్యాతి (కఠిన శిక్షల విధింపు, సెల్యులార్ జైలు మొదలైనవి) బెంగాల్, పంజాబ్, బిహార్, ఉత్తర ప్రదేశ్ నుండి ఖైదీలను ఎక్కువగా ఇక్కడికి రప్పించాయి. వారిలో చాలామంది జాతీయ నిర్మాణంలో గుర్తింపునకు, ప్రశంసలకు నోచుకోకుండా మిగిలిపోయారు. వారి గర్వించదగిన వారసుల కోసం మతాలు, ప్రాంతాలు, జాతులకు అతీతంగా విచిత్రమైన 'హిందూస్థానీ' మాండలికాన్ని ఉపయోగించడం ద్వారా మత సామరస్య భావం నెలకొల్పే ప్రయత్నాలు జరిగాయి. బెంగాలీలు, తమిళులు, పూర్వాంచలీలు, పంజాబీలు... భారత ప్రధాన భూభాగాన్ని కబళిస్తున్న విషపూరితమైన విభజన, రాజకీయ 'విభజన' విధానాల చెంప చెళ్లుమనిపిస్తూ ఇక్కడ తమ బతుకు తాము జీవిస్తున్నారు. దూరంగా (చెన్నై లేదా కోల్‌కతా నుండి 1,200 కి.మీ), ప్రధాన భూభాగంలో సాగుతున్న 'దారుణమైన' రాజకీయాలు అంటకుండా ఉండటం అనేది ఈ దీవులు ఆదర్శవంతమైన 'మినీ-ఇండియా'ను తలపించేందుకు దోహదపడింది.

నిజానికి 'మేము-వారు' అనే ఆధిపత్య ధోరణి మతాలు లేదా జాతుల మధ్య కాదు... సామూహిక 'ద్వీపవాసులు వర్సెస్ ప్రధాన భూభాగవాసుల మధ్య కనిపిస్తుంటుంది. ఇక్కడ ప్రధాన భూభాగస్థులను దోపిడీదారులుగా చూస్తారు. ప్రధాన భూభాగంలోని సాధారణ అవగాహన కంటే ద్వీపాలలో చరిత్రపై అభిప్రాయాలు చాలా సూక్ష్మంగా ఉంటాయి. ఉదాహరణకు జపనీయులతో నేతాజీ సుభాష్ చంద్రబోస్ సాగించిన మూడేళ్ల పొత్తు గురించి ఇక్కడ మిశ్రమ భావాలు ఉన్నాయి, ఎందుకంటే ఆ మూడు సంవత్సరాలు బ్రిటిష్ వారిని మించిన క్రూరత్వంతో ఇక్కడ ముడిపడి ఉన్నాయి.

ఈ శాంతియుత ద్వీపవాసులు పునరుద్ధరణ వాదాన్ని ఆశ్రయించలేదు. లేదా చరిత్రను తిరగరాయలేదు. సంక్లిష్టమైన, గాయపడిన చరిత్రనే తమ వాస్తవ గుర్తింపుగా స్వీకరించారు. స్వాతంత్ర్యానంతరం సెల్యులార్ జైలుకు చెందిన రెండు రెక్కలు కూల్చివేతకు గురైనప్పుడు, చాలా మంది స్వాతంత్ర్య సమర యోధులు తమ బాధను సూచించే ప్రదేశానికి మరమ్మతులు చేసే ప్రయత్నాలను వ్యతిరేకించారు. ఎందుకంటే ఇది చరిత్రలో ఒక ముఖ్యమైన అధ్యాయాన్ని కూడా సూచిస్తుందని వారు విశ్వసించారు. ఆ విశ్వాసమే దేశంలో అందరినీ కలుపుకొని ఉన్న సమాజాలలో వారు ఒకటిగా ఉండేలా చూసింది.



జాతీయ స్మారక చిహ్నంగా నాటి సెల్యులార్ జైలు (పోర్ట్ బ్లెయిర్)

2006లో ఆ ప్రాంతానికి ఒక అడ్మినిస్ట్రేటర్‌గా, గవర్నర్‌గా నియమితుడనయ్యాను. 2004 డిసెంబర్ నాటి ఘోరమైన సునామీ కారణంగా నష్టపోయిన ద్వీపాలలో ఉపశమనం, పునరావాసం నిర్వహించే బాధ్యతను ప్రభుత్వం నాకు అప్పగించింది. ప్రకృతి వైపరీత్యం వల్ల ఏర్పడిన సామాజిక ఆర్థిక విధ్వంసాల నుండి మనం కోలుకున్నప్పుడు, సమాజం కలిసి ఉండే విధానం వల్ల నేనెంతో ఉపకారం పొందాను. ఒక మాజీ పోరాట యోధుడిగా, నేను సామాజిక అనుకూలత, శాశ్వతమైన దేశభక్తి, ఇంకా లేహ్ ప్రాంతంలోని సుదూర సరిహద్దు ప్రాంతాలు, కశ్మీర్ ఎత్తైన ప్రాంతాలు లేదా లోతట్టు ఈశాన్య ప్రాంతాలకు ప్రత్యేకమైన ఒక పెద్ద జాతీయ ప్రయోజనాన్ని చూశాను. తక్కిన 'భారతదేశం'లో ఇది కనిపించలేదు.

చాలా సాధించినా, ఇంకా చాలా చేయాల్సి ఉంది. ఈ ద్వీపాల వ్యూహాత్మక స్థానం (మలక్కా జలసంధి వద్ద చైనీస్ 'చోక్ పాయింట్' మినహా) – అలాగే హానికి లేదా దాడికి గురయ్యే గిరిజనులకు రక్షణగా ఉన్న భౌగోళిక స్థితి, వీటితో పాటుగా... సహజమైన గ్రీన్ కవర్ అభివృద్ధి కోసం గోవా, కేరళ మార్గాల్లో సాంప్రదాయికతకు తలుపులు 'తెరవడం'పై కొన్ని పరిమితులు అవసరం. ప్రైవేట్ అభివృద్ధి లేనప్పుడు ప్రభుత్వ మద్దతు చాలా అవసరం. మౌలిక సదుపాయాలు, పౌర సౌకర్యాలు, ఉపాధి అవకాశాల కొరత కూడా ఒక సవాలు. అయినప్పటికీ ఈ భారతదేశ 'షైనింగ్ ఔట్ పోస్ట్' దాని ప్రత్యేక మార్గాలకు, చరిత్రకు కట్టుబడి ఉంది.

ప్రధాన భూభాగపు గాలులు, స్వచ్ఛమైన సహజ ద్వీపాలకు చేరుకోవడానికి ఎంతో కాలం పట్టదు. జాతీయవాదాన్ని ప్రోత్సహించడానికి ప్రముఖ స్థలాల పేర్లను మార్చడం అటువంటి దిగ్విషయాలలో ఒకటి. హ్యావ్‌లాక్, నీల్, రాస్ దీవులకు వరుసగా స్వరాజ్ ద్వీప్, షహీద్ ద్వీప్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ద్వీప్ అని పేరు పెట్టారు. ద్వీపాలు టూరిజంపై ఎక్కువగా ఆధారపడటం, పర్యాటక 'బ్రాండ్'లను అభివృద్ధి చేయవలసిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని పేర్లను మార్చటం తగదని మార్కెటింగ్ జ్ఞానం సలహా ఇస్తుంది. అన్నింటి కంటే, వాడుకకు చెందిన స్థిరత్వం, నామకరణపు క్లుప్తత, దీర్ఘకాల గుర్తింపును నిర్మించడం అనేది సాధారణ భావన. అయినప్పటికీ, స్థానికులు కోరుకున్నందున పేర్లు మార్చడం జరగలేదు, కానీ మితిమీరిన జాతీయవాదం ఫార్ములా కారణంగా వీటి పేర్లు మార్చారు. ఈ పేరు మార్పు వెనుక చోదకశక్తిగా ఉన్నవారు నేతాజీ మనవడు చంద్ర కుమార్ బోస్. అయితే దిగ్గజ స్వాతంత్ర్య యోధుడి భావజాలాన్ని ప్రచారం చేయడానికి బీజేపీ నుండి తనకు మద్దతు లభించలేదంటూ తర్వాత ఆయన పాలకవ్యవస్థ నుండి వైదొలిగారు.

తరువాత, జనావాసాలు లేని 21 ద్వీపాలకు పరమవీర చక్ర అవార్డు గ్రహీతల పేరు మార్చారు. భారతదేశపు అర్హులైన వారసులకు నివాళి గనక, ఆచరణాత్మక చిక్కులు కూడా లేవు గనక ఈ పేర్ల మార్పును అంగీకరించడం జరిగింది. ప్రభుత్వ పెట్టుబడులు, ఇంకా చాలా అంశాలు అస్పష్టంగానే ఉన్నాయి. ఈ క్రమంలో అండమాన్, నికోబార్ దీవులకు సరికొత్త జాతీయవాద ఔన్నత్య 'వైభవం' సంప్రాప్తించింది. రాజధాని పోర్ట్ బ్లెయిర్‌కు ఇటీవల 'శ్రీ విజయపురం' అని పేరు పెట్టారు. ఇది 'వలసవాద ముద్రల నుండి దేశాన్ని విముక్తి చేయడానికి' జరిగిందంటున్నారు. ఆర్చిబాల్డ్ బ్లెయిర్ (ఈయన పేరునే పోర్ట్ బ్లెయిర్‌కు పెట్టారు) బొంబాయి మెరైన్‌లో సాపేక్షంగా అసంగతమైన నావికా సర్వేయర్ అని పట్టించుకోలేదు, ఎందుకంటే సోషల్ మీడియా అతని గురించి తీవ్రమైన దూషణలతో నిండిపోయింది. పోర్ట్ బ్లెయిర్ పేరు మార్చడం గురించి కొంతమంది ద్వీప వాసులకు చేసిన కాల్స్ ఉదాసీనత, ఉద్రేకాలతో మిశ్రమ స్పందనను రేకెత్తించాయి. ద్వీపవాసులకు నిజంగా ముఖ్యమైన వాటిపై దృష్టి పెట్టకుండా, ఇలాంటి కసరత్తులు ఇంతకు ముందు చాలాసార్లు జరిగాయి. ఇది తప్పు కాదు కానీ ప్రత్యేకించి దేశంలోని మిగిలిన ప్రజలకు గౌరవప్రదమైన దేశభక్తి (అత్యంత తీవ్రమైన జాతీయవాదం కాదు), కలుపుగోలుతనం, లౌకికవాదం గురించి ఒకటి లేదా రెండు విషయాలు చెప్పగలవారికి ఇది ఉన్మాద రాజకీయాల పునరావృతమే. పేర్లు మార్పు సరే... అర్థవంతమైన అభివృద్ధి మాటేమిటి? అది జరిగే సూచనలు కనిపించటం లేదు.

వ్యాసకర్త రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

'ద్వంద్వ' వేత్త!



కశ్మీర్‌లోని తన ఇంటిలో అమెరికా దౌత్యవేత్తలకు ఆతిథ్యం ఇవ్వటంలో ఒమర్ అబ్దుల్లాకు ఎలాంటి ఇబ్బందీ లేదు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత నెలకొన్న శాంతియుత వాతావరణంలో జరుగుతున్న ఎన్నికల పరిశీలనకు 15 మంది దౌత్యవేత్తలు జమ్ము-కశ్మీర్‌కు రావటం మాత్రం సమస్య అయింది. ఇంత కన్నా కపటత్వం ఉంటుందా?

– ఆదిత్య రాజ్ కౌల్, భద్రతా వ్యవహారాల వ్యాఖ్యాత

అది మీ ఇష్టం..!



మీరు వాటిని చదివినా, కాల్చినా నాకు అదే రాయల్టీ వస్తుంది. మీ మాష్‌మెలో (ఒక రకం మిఠాయి)లను ఆస్వాదించండి. ('నువ్వొక బుద్ధిహీనురాలివి. నేను, నా పిల్లలు నీ పుస్తకాలను కాలుస్తూ, ఆ మంటల్లో మాష్‌మెలోలను తయారు చేసుకుంటున్నాం' అంటూ వచ్చిన ఒక హేట్ ట్వీట్‌కు స్పందిస్తూ...)

– జె.కె. రోలింగ్, హ్యారీ పోటర్ సిరీస్ రచయిత్రి

'పాజిటివ్' కష్టాలు



మీకు తెలుసా? నకిలీ ప్రెగ్నెన్సీ పాజిటివ్ టెస్ట్ కిట్‌లు, సిలికాన్ బంప్స్‌ను (పొట్ట ఉబ్బెత్తుగా కనిపించటానికి తగిలించుకునేవి) అమ్మేందుకు కూడా కొన్ని ఆన్‌లైన్ దుకాణాలు ఉన్నాయి. అంతే కాదు, వాటి మార్కెట్ విస్తరిస్తోంది కూడా! ఎందుకంటే నకిలీ గర్భాలను ధరించే మహిళలు క్రమంగా ఎక్కువవుతున్నారు. కారణాలు : తెలిసినవి కొన్ని, తెలియనివి కొన్ని.

– డాక్టర్ రింపీ శర్మ, హెల్త్ యాక్టివిస్ట్

అమ్మేవారి పేర్లు



బీజేపీ పాలిత రాష్ట్రాల తర్వాత, ఇప్పుడు కాంగ్రెస్ పాలిత రాష్ట్రమైన హిమాచల్‌ప్రదేశ్ తినుబండారాలను అమ్మే యజమానుల పేర్లను బయటికి కనిపించేలా రాసి ఉంచాలని ఆదేశించింది. మీరు చెబుతున్న 'మొహబ్బత్ కి దుకాన్' ఇదేనా?

– మొహమ్మద్ జుబేర్, ఫ్యాక్ట్ చెకర్

పాటించి చూడండి!



ఉత్తమ ఉత్పాదక వ్యవస్థ : పెన్ను, కాగితం, టైమర్ మరియు కొద్దిగా క్రమశిక్షణ.

– బ్లేక్ ఎమాల్, 'పేజ్‌టియర్' ఫౌండర్

జాషువా కవిత్వంలో అంబేడ్కర్ స్ఫూర్తి

ఆధునిక తెలుగు పద్య కవిత్వాన్ని మరో మలుపు తిప్పిన మహాకవి గుర్రం జాషువా. 'బాపూజీ, బుద్ధుడు, క్రీస్తు నడిచిన వజ్రమార్గంలో నేనొక అజ్ఞాత ప్రవాసిని' అని జాషువా సగర్వంగాప్రకటించాడు. ఈ ముగ్గురు మూర్తుల ఉమ్మడి ప్రభావంతో ఆయన కవిత్వం మానవతా వాదానికి మేనిఫెస్టో లాగా దర్శనమిస్తుంది. గాంధీతో భావోద్వేగమైన అనుబంధాన్ని ఏర్పరచుకున్నాడు. 'గాంధీ మహాత్ముని చెప్పుల జాడలో కాలాడ చరింతునని' సంతోషంగా చెప్పుకున్నాడు. కానీ స్వాతంత్ర్యానంతర సామాజిక పరిస్థితులను గమనించిన తరువాత జాషువా ఎంతగానో మథనపడ్డాడు.

అంబేడ్కర్, జాషువాల సామాజిక అస్తిత్వం ఒకటే కావడం వల్ల జాషువా వెలిబుచ్చిన అభిప్రాయాలెన్నో అంబేడ్కర్ వాదానికి చాలా దగ్గరగా ఉంటాయి. 'స్వాతంత్ర్యం అనే మంత్రదండం దోపిడీ పాలక వర్గాలను అంతం చేయగలదా? స్వరాజ్య భారత దేశంలో దళితుల హక్కులకు హామీ లభిస్తుందా' అంటూ బాబాసాహెబ్ అంబేడ్కర్ జాతీయోద్యమ పరిమితులను ప్రశ్నించాడు. అంబేడ్కర్ లాగా జాషువా జాతీయోద్యమ కార్యాచరణను అనుమానించాడు. 'స్వాతంత్ర్యంబను స్వర్ణ సౌధమున మా భాగంబు మాకిత్తురో, ఖాతా లేదని త్రోసి పుచ్చెదరో' అంటూ జాషువ ధర్మసందేహాన్ని వ్యక్తం చేశాడు. **'వెఱపు వలదు నీకు హరిజన సోదరా / స్వీయ రాజ్య రథము వెడలి వచ్చె / లాగికొమ్ము నీకు భాగమ్ము కలదంచు/ పాడుచుండె రత్న భరతమాత'** (గబ్బిలం) అంటూ... దళితులు రాజ్యాధి కారంలో తమవంతు భాగం పంచుకోవాల్సిన అవసరముందని జాషువ పిలుపు నిచ్చాడు. రాజ్యాధికారం మాస్టర్ కీ వంటిదన్న అంబేడ్కర్ దృష్టికి ఈ పద్యమే ప్రబల తార్కాణం.



గుర్రం జాషువా

భారత దేశ మహిళల సర్వతోముఖ ప్రగతిని కాంక్షిస్తూ పార్లమెంటులో అంబేడ్కర్ ప్రవేశపెట్టిన చారిత్రాత్మకమైన హిందూ కోడ్ బిల్లును బాబూ రాజేంద్ర ప్రసాద్, సర్దార్ వల్లభాయి పటేల్ వంటి నాయకులు వ్యతిరేకించారు. ఇందుకు నిరసనగా అంబేడ్కర్ రాజీనామా చేశాడు. 'స్త్రీ జగము దుఃఖము వాపెడిశాసనాలకున్ నాయకులే విరోధులయినారని' ఖండకావ్యం-5లో ఆనాటి నాయకుల సంకుచిత వైఖరిని జాషువా నిరసించాడు. 'కలడంబేడ్కరు నాసహోదరుడు' (గబ్బిలం రెండవ భాగం) అనే పద్యంలో జాషువ అంబేడ్కర్‌ను గూర్చి పరిమితంగా ప్రస్తావించాడు. అయితే అంబేడ్కర్ మహాపరినిర్వాణం అనంతరం 'శ్రద్ధాంజలి' శీర్షికతో రాసిన పద్యాలను పరిశీలిస్తే అంబేడ్కర్ అద్వితీయ కృషిని జాషువా సముచితంగా కవిత్వీకరించాడని అర్థమవుతుంది. మొత్తంగా జాషువా కవిత్వంలో 'భీమ'శంఖారావం స్పష్టంగా వినిపిస్తుంది.

– డా।। కోయి కోటేశ్వరరావు । తెలుగు ఆచార్యులు, హైదరాబాద్
(నేడు జాషువా జయంతి)

అస్పష్టత పౌర హక్కులకు హానికరం

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

వివాదాస్పదమైన ఉపాలో ఉన్న ఉగ్రవాద (టెర్రరిజం లేదా తీవ్రవాద) నిర్వచనాన్ని కేంద్ర ప్రభుత్వం యథాతథంగా కొత్తగా తెచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లో చేర్చింది. ఈ కొత్త చట్టంలోని సెక్షన్ 113లో దీనిని భాగం చేసింది. చట్ట వ్యతిరేకమైన వ్యవహారాలను నిరోధించే చట్టం (యూఏపీఏ- ఉపా)ను 1967లో కేంద్ర ప్రభుత్వం తెచ్చింది. దాన్ని సుప్రీంకోర్టు తీర్పుల్లో పూర్తిగా వ్యతిరేకించలేదు.

2023లో కేంద్రం తెచ్చిన కొత్త నేరచట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్‌లలో ముఖ్యమైనది ఐపీసీ స్థానంలో తెచ్చిన భారతీయ న్యాయ సంహిత. ఇందులో పౌర హక్కులకు ప్రమాదకరమైన సెక్షన్ 113 ఉంది. రాజ్యాంగంలో, క్రిమినల్ చట్టాల్లో స్పష్టత ఉండాలి. కాని ప్రభుత్వాలు, అధికారులు కావాలని అయోమయ నిర్వచనాలు ఇరికిస్తారు. ఎక్కడైతే దుర్మార్గపు అస్పష్టత ఉంటుందో దాన్ని ఆసరాగా చేసుకుని వారు అధికారాన్ని దుర్వినియోగం చేస్తారు. అందుకు ఉదాహరణ... టెర్రరిస్ట్ చర్య అంటే ఏమిటి అన్న అంశంపై ఉన్న అస్పష్టమైన నిర్వచనమే. ఉపాలో ఉన్న 'ఉగ్రవాదం చర్య' నిర్వచనం కన్నా మరింత భయానకమైన కొత్త నిర్వచనాన్ని కొత్త చట్టంలోని సెక్షన్ 113లో సృష్టించారు. ఈ సెక్షన్‌లోని ముఖ్యమైన అంశాలు:

1.సెక్షన్ 113 ప్రకారం ఒక వ్యక్తి ప్రమాదకర చర్యలకు ప్రయత్నించినట్టు అనిపించినా అతడిని జైల్లో పెట్టవచ్చు.

2. పాత చట్టంలోని ఉగ్రవాద చర్య నిర్వచనానికి అదనంగా... 'నకిలీ కరెన్సీ నోట్లను తయారు చేసినా, ముద్రించినా, స్మగ్లింగ్ చేసినా, పంపిణీ చేసినా లేదా నకిలీ నోట్ల తయారీకి అవసరమైన మెటీరియల్‌ను తయారు చేసినా' అది టెర్రరిస్టు చర్య అని చేర్చారు.

3. టెర్రరిజం చర్యల ద్వారా ఆస్తిని సంపాదించడం శిక్షించదగిన నేరం.

4. ఉపా చట్టంలోని 18ఏ, 18బీ సెక్షన్ల కింద టెర్రరిస్టు శిక్షణకు వ్యక్తులను చేర్చుకోవడం, చేర్చుకోవడానికి పనిచేయడం నేరం.

5. ఎస్పీ స్థాయి ఉన్నతమైన అధికారి ఈ నేరాలు చేసినా వారిని టెర్రరిస్టుగా భావించి ప్రాసిక్యూట్ చేసే అధికారం సెక్షన్ 113కు ఉంది.

6.సెక్షన్ 113 కింద కొత్తగా మరణ శిక్ష లేదా యావజ్జీవ శిక్ష విధించాలి.

ఇవీ మన కొత్త చట్టాలు-8



7. సెక్షన్ 113 టెర్రరిస్టు నిర్వచనం ప్రకారం... ఉగ్ర చర్యకు కుట్ర చేసినా, ప్రోత్సహించినా, రెచ్చగొట్టినా, అందుకు సహకరించినా అయిదేళ్ల యావజ్జీవ కారాగార శిక్ష విధించవచ్చు.

బీఎన్ఎస్ ప్రకారం ఒక వ్యక్తి ఉగ్రవాద చర్య ఎవరి మరణానికైనా దారితీస్తే... మరణశిక్ష లేదా పెరోల్ లేకుండా జీవిత ఖైదు, లేకుంటే ఐదు సంవత్సరాల నుండి జీవితకాలం వరకు జైలు శిక్ష విధించవచ్చు. దానితో పాటు, అదే నిబంధనలో అనేక సంబంధిత నేరాలు కూడా చేర్చారు. ప్రస్తుతం, తీవ్రవాదానికి సంబంధించిన నేరాలను ఉపా కింద విచారిస్తున్నారు.

ఇంతకు ముందు టాడా, దాని తర్వాత వచ్చిన పోటాలను రద్దు చేసిన తర్వాత 2004లో ఒక సవరణ ద్వారా ఉపాలో తీవ్రవాదం లేదా టెర్రరిజంను చేర్చినా ప్రస్తుత బీఎన్ఎస్ సెక్షన్ 113లో వీటన్నింటినీ తిరిగి చేర్చారు. ఇది నిజానికి సాధారణ చట్టంగా ఉండాలి. కాని దాన్ని అసాధారణమైన ప్రత్యేక చట్టంగా తెచ్చారు. ప్రత్యేక పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రత్యేక చట్టాలు ఉంటాయి. ఒక ప్రత్యేక చట్టం కొత్త నేరాలను నిర్వచిస్తుంది. ఆ నేరాల విచారణలో అనుసరించాల్సిన ప్రత్యేక దర్యాప్తు, న్యాయపరమైన విధానాలను అందిస్తుంది. సీఆర్‌పీసీ వారి నిబంధనలు... ఉపా ప్రత్యేక నిబంధనలకు విరుద్ధంగా ఉన్నంత వరకు, చట్టం ప్రకారం ప్రాసిక్యూషన్లకు వర్తించదని చెప్పారు.

తీవ్రవాద చట్టాల ప్రకారం, సాధారణ నేరాలు నిర్దిష్ట ఉద్దేశంతో చేసినట్లయితే అవి 'ఉగ్రవాద చర్యలు' అవుతాయని మార్చారు. సెక్షన్ 113 కింద వివిధ రకాల చర్యలు తీవ్రవాద చర్యలుగా మార్చారు. ఉపా కింద భారతదేశ ఐక్యత, సమగ్రత, భద్రత, ఆర్థిక భద్రత లేదా సార్వభౌమాధికారానికి భంగం కలిగించే 'ఉద్దేశ్యం'తో చేసే పనులు ఉగ్రవాద చర్యలే. సాధారణ ప్రజలను భయపెట్టడం లేదా పబ్లిక్ ఆర్డర్‌కు భంగం కలిగించడం అంతకన్న తక్కువ స్థాయి నేరం అని నిర్ణయించారు.

స్ట్రైకింగ్ టెర్రర్ చర్యను 'కేవలం నేరపూరితం' లేదా 'లా అండ్ ఆర్డర్' సమస్యకు మించినదిగా పోటాలో వివరించబడింది. బెదిరింపు అంటే సాధారణంగా ఒక వ్యక్తి ప్రాణం, ఆస్తులకు చేసే బెదిరింపులను సూచిస్తుంది. కొత్త శిక్షాస్మృతి నిబంధనలలో అస్పష్టత, నూతన నేర చట్టాల పరిధిని విస్తృతం చేయడం వంటి కారణాల వల్ల వాటిని రాజ్యాంగ విరుద్ధమైనవిగా భావించడం జరుగుతోంది. చట్టాల్లోని అస్పష్టత వల్ల పౌర హక్కులకు ప్రమాదం వాటిల్లుతుందని అర్థం చేసుకోవాలి.

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా'లో ప్రొఫెసర్

అనుసరణ – అనుకరణ

సమాజంలో వివిధ రంగాలలో 'శ్రేష్ఠులు'గా పేరుమోసిన వారిని ఇతరులు అనుసరించటం స్వాభావికం. యద్యదాచరతిశ్రేష్ఠః, తత్తదేవ ఇతరో జనః.

కొందరు తాము ఎంచుకొన్న రంగంలో శ్రేష్ఠులయిన వారిని ఆదర్శంగా ఉంచుకొని, వాళ్ళ అధ్యయన పద్ధతులనూ, అభ్యాసాలనూ, పరిశ్రమనూ స్ఫూర్తిగా స్వీకరిస్తారు. ఆ ఆదర్శ పురుషుల అనుభవ సారాన్ని గ్రహిస్తారు. దాని ద్వారా తమ స్వబుద్ధికీ, ప్రజ్ఞకూ సానబట్టి, తమదైన ధోరణితో తమ నైపుణ్యాలను వికసింపజేసుకొంటారు. కాలక్రమంలో తామే ఇతరులకు అనుసరణీయు లౌతారు. ఈ పరంపర మానవ నాగరికత పురోగతికి దోహదం చేస్తుంది.

జ్యోతిర్మయం

కొందరు తమకు తారసిల్లిన శ్రేష్ఠులను విధేయతతో, భక్తితో అనుసరిస్తారు. తమ శక్తివంచన లేకుండా, ఆ పెద్దల విశిష్టతలతో పాటు, వాళ్ళ అలవాట్లనూ, జీవన విధానాన్నీ, వేషభాషలనూ, దృక్పథాలనూ కూడా యథాతథంగా పుణికి పుచ్చుకొనేందుకు కృషి చేస్తారు. కాలక్రమంలో ఆ 'అసలు'కు సిసలైన 'నకలు'గా మారతారు. అయితే అసలుకున్న విలువలో పదోవంతు కూడా నకలుకు ఉండదు. అది ఎంత పరిపూర్ణమయిన నకలయినా సరే.

కొందరు, అసాధారణులైన ఘనులను ఆరాధిస్తూ, వాళ్ళ పైపై లక్షణాలను మాత్రం అనాలోచితంగా అనుకరిస్తారు. రోజూ పద్నాలుగు గంటలు తన కళను ఏకాగ్రతతో అభ్యసించే శ్రేష్ఠుడి అభిమానులు, గుబురు గడ్డం పెంచటంలోనూ, సిగరెట్లు కాల్చడంలోనూ ఆయన్ని అనుకరిస్తారు. ఇలాంటి అనుకరణాలు యువతలో సర్వసాధారణం. ఈ అనుకరణ కొన్నాళ్ళపాటు జోరుగా సాగి, తరువాత దానంతటదే తగ్గిపోతూ ఉంటుంది.

ఇలాంటి 'అనుకరణ'ల వల్ల ఒక నష్టం, వీటివల్ల ఏ ప్రయోజనమూ లేకపోవటం. వృథా కాలయాపన. రెండో నష్టం, పులిని చూసి వాత పెట్టుకొన్న నక్కలా నలుగురిలో నవ్వులపాలు కావటం. ముఖ్యమైన నష్టం మాత్రం ఈ అనుకరణల ధోరణిలో పడి, వ్యక్తి తన సొంత బుద్ధితో, తనదయిన వ్యక్తిత్వాన్నీ, ప్రజ్ఞనూ ఏర్పరచుకొనే లక్ష్యం నుంచి దారి మళ్ళటం.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** బ.ఏకాదశి సా.4.28 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** ఆశ్లేష పూర్తి (24 గంటలు), **వర్జ్యం:** సా.6.11 నుండి 7.51 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.43 నుండి 7.29 వరకు, **అమృతఘడియలు:** తె.4.14 నుండి 5.54 వరకు (తెల్లవారితే ఆదివారం); **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.53, **సూర్యాస్తమయం:** 5.51.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



విద్యార్థిని వర్ష

పటాన్‌చెరు టౌన్: బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం.. ఏపీలోని అనంతపురంలో విద్యుత్ శాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్న నాగరాజు రెండో కూతురు వర్ష (19) పటాన్‌చెరు మండలంలోని గీతం విశ్వవిద్యాలయంలో బీటెక్ చదువుతోంది. అక్కడే బాలికల హాస్టల్‌లో ఉంటోంది. శుక్రవారం మధ్యాహ్నం ఆమె తన గదిలోకి వెళ్లి బెడ్‌షీట్‌తో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. కొద్దిసేపటి తర్వాత తోటి విద్యార్థినులు తలుపు కొట్టినా తీయకపోవడంతో వాచ్‌మన్ వచ్చి తలుపు పగులగొట్టి లోపలకు వెళ్లి చూడగా.. వర్ష ఫ్యాన్‌కు వేలాడుతూ కన్పించింది.

పర్యాటక ప్రాంతాలుగా తీర్చి దిద్దుతాం

మూసీ పరీవాహకంలోని చారిత్రక భవనాలపై సీఎం రేవంత్

హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే ప్రతి కట్టడాన్ని పరిరక్షిస్తామని వెల్లడి



ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి జూపల్లి తదితరులు

సాక్షి, హైదరాబాద్: మూసీనది పరీవాహక ప్రాంతంలో చారిత్రక భవనాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణకు ముందుకురావాలని ఆయన పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతోపాటు పర్యాటక రంగాన్ని కూడా ముందుకు తీసుకెళుతోందని తెలిపారు. హైదరాబాద్‌లోని పలు పురాతన మెట్ల బావుల పునరుద్ధరణకు సీఐఐ(కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ)తో రాష్ట్ర పర్యాటక శాఖ శుక్రవారం ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ మూసీ ప్రక్షాళనను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. ప్రస్తుతం పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తున్నామని, త్వరలోనే అందులో శాసనమండలి ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రస్తుతం శాసనమండలి ఉన్న జూబ్లీహాలుకు చారిత్రక ప్రాధాన్యం ఉందని, ప్రత్యేక టెక్నాలజీతో ఆ భవనాన్ని నిర్మించారని, భవిష్యత్‌లో దాన్ని పరిరక్షించాల్సిన అవసరముందన్నారు. జూబ్లీహాలును కూడా దత్తత తీసుకొని పరిరక్షించాలని ఆయన సీఐఐకి సూచించారు. ఉస్మానియా ఆస్పత్రి భవనాన్ని పరిరక్షిస్తామని, ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్ స్టేడియానికి తరలిస్తున్నట్టు సీఎం ప్రకటించారు. హైకోర్టు భవనం, హైదరాబాద్ సిటీ కాలేజ్ భవనంతో పాటు పురానాపూల్ బ్రిడ్జి వంటి కట్టడాలను కూడా పరిరక్షిస్తామని, ఇప్పటికే చార్మినార్ పరిరక్షణ ప్రాజెక్ట్ కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్, సీఐఐ తెలంగాణ చైర్మన్ సాయిప్రసాద్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

పురాతన మెట్ల బావులను దత్తత తీసుకున్న పారిశ్రామికవేత్తలు

- నగరంలో పురాతన మెట్ల బావులను పునరుద్ధరించి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడానికి పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారు. ఈ మేరకు సీఎం రేవంత్‌కు వారు ఒప్పందపత్రాలు అందజేశారు.
- ఉస్మానియా యూనివర్సిటీలోని మహలఖా మెట్ల బావి పునరుద్ధరణకు ఇన్ఫోసిస్ సంస్థ ఒప్పందం చేసుకుంది.
- సాయిలైఫ్ సంస్థ మంచిరేవుల మెట్ల బావిని దత్తత తీసుకుంది.
- భారత్ బయోటెక్ సంస్థ సాలార్ జంగ్, అమ్మపల్లి బావులను పునరుద్ధరించనున్నది.
- అడిక్‌మెట్ మెట్ల బావిని దొడ్ల డెయిరీ, ఫలక్‌నుమా బావిని ఆర్టీసీ, రెసిడెన్సీ మెట్ల బావిని కోఠి ఉమెన్స్ కాలేజీ పునరుద్ధరించనుంది.

హెచ్‌సీఎల్ మరో క్యాంపస్.. అదనంగా 5 వేల ఉద్యోగాలు

- సీఎం రేవంత్‌తో హెచ్‌సీఎల్ చైర్‌పర్సన్ రోష్నీ నాడర్ భేటీ
- కొత్త క్యాంపస్ ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానం



సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన రోష్నీ నాడర్. చిత్రంలో వేం నరేందర్‌రెడ్డి, శాంతికుమారి, జయేశ్ రంజన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నగరంలోని హైటెక్ సిటీలో త్వరలో కొత్త క్యాంపస్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. కొత్త క్యాంపస్ ద్వారా మరో 5 వేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించింది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చైర్‌పర్సన్ రోష్నీ నాడర్ మల్హోత్రా శుక్రవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. కొత్త క్యాంపస్ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్.. విద్యార్థులకు మెరుగైన శిక్షణ, విద్యావనరుల విస్తరణ లక్ష్యంగా ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో కలిసి పనిచేయాల్సిందిగా హెచ్‌సీఎల్‌ను కోరారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉపాధి అవకాశాల కల్పనకు హెచ్‌సీఎల్ చేస్తున్న కృషిని సీఎం అభినందించారు. హెచ్‌సీఎల్‌కు తగినంత సహకారం అందిస్తామని చెప్పారు. నైపుణ్య శిక్షణ ద్వారా యువత సాధికారత కోసం చేపట్టే కార్యక్రమాల్లో భాగస్వాములం అవుతామని రోష్నీ నాడర్ హామీ ఇచ్చారు. స్కిల్స్ యూనివర్సిటీతోపాటు హెచ్‌సీఎల్ విద్యా కార్యక్రమాలను రాష్ట్రంలోని ఇతర వర్సిటీలకు విస్తరిస్తామన్నారు.

అటవీశాఖ అధికారులపై హత్యాయత్నం

- సెక్షన్, బీట్ ఆఫీసర్‌లపై దుండగుల దాడి
- బాధితులకు మంత్రి కొండా సురేఖ పరామర్శ



వినోద్‌కుమార్



గాయపడిన శరత్‌చంద్ర

ఎస్ఎస్‌తాడ్వాయి/ములుగు/రామన్నపేట/సాక్షి, హైదరాబాద్: ములుగు జిల్లా అటవీశాఖ అధికారులపై గురువారం అర్ధరాత్రి కొందరు వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో సెక్షన్, బీట్ ఆఫీసర్లకు తీవ్ర గాయాలుకాగా, వరంగల్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం.. తాడ్వాయి అటవీ ప్రాంతంలో గంట సురోజ్‌రెడ్డి అనే వ్యక్తి తన జేసీబీతో అడవిని ధ్వంసం చేస్తున్నాడనే సమాచారం మేరకు ఎఫ్ఎస్ఓ వినోద్‌కుమార్, బీట్ ఆఫీసర్లు శరత్‌చంద్ర, సుమన్, బేస్ క్యాంపు ఉద్యోగి ఎట్టి శ్రీను, డ్రైవర్ రాజేందర్‌లు కలసి గురువారం రాత్రి ఘటనా స్థలానికి వెళ్లారు. దామెరవాయి గ్రామం వద్ద జేసీబీని స్వాధీనం చేసుకుని తాడ్వాయిలోని కార్యాలయానికి తీసుకెళ్తున్న క్రమంలో సురోజ్‌రెడ్డి, గంట శశిధర్, పాండవుల సాయి, నీరటి శ్రీకాంత్, మాదరి చంటిలు కలసి ఎఫ్ఎస్ఓ వినోద్, ఎఫ్‌బీ శరత్‌చంద్రలపై ఇనుప రాడ్లతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన వినోద్, శరత్‌చంద్రలను శుక్రవారం తెల్లవారుజామున వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా,బాధితులను అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం పరామర్శించారు. దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ డాక్టర్ శబరీశ్ తెలిపారు. ఈ ఘటనను మంత్రి సీతక్క ఖండించారు.

సహారాలో పచ్చందనం

- గడ్డి, మొక్కలు, నీటి మడుగులు
- పలు దేశాల పరిధిలో పరుచుకున్న వైనం
- అంతరిక్షం నుంచీ కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న పచ్చదనం
- వాతావరణ మార్పులే కారణం
- కొన్నాళ్లుగా ఎడతెరిపి లేని భారీ వర్షాలు


సహారా. ప్రపంచంలోనే అతి పెద్ద ఎడారి. కనుచూపుమేర సుదూరాల దాకా పరుచుకున్న ఇసుక మేటలు. ఏళ్ల తరబడి వాన ఆనవాలు కూడా కనిపించని ప్రదేశాలకు ఆలవాలం. అలాంటి సహారా పచ్చబడుతోంది. నీళ్లు నిండిన మడుగులు, పచ్చని గడ్డితో, అప్పుడప్పుడే ప్రాణం పోసుకుంటున్న పలు జాతుల మొక్కలతో కనువిందు చేస్తోంది...!

వాతావరణ మార్పులు సహారాను కూడా వదలడం లేదు. పశ్చిమ ఆఫ్రికాలోని ఈ ఎడారిలో అరుదైన దృశ్యాలు కనిపిస్తున్నాయి. భారీ వర్షాలు ఈ ప్రాంతాన్ని కొద్ది రోజులుగా ముంచెత్తుతున్నాయి. అసలు వాన చినుకే పడని ప్రాంతాలు కూడా కుండపోతతో తడిసి ముద్దగా మారుతున్నాయి. దాంతో సహారాలో విస్తారంగా గడ్డి మొలుస్తోంది. పలు రకాల మొక్కలు పుట్టుకొస్తున్నాయి. ఏకంగా అంతరిక్షం నుంచి నాసా తీసిన తాజా చిత్రాల్లో ఎడారిలోని విస్తారమైన ప్రాంతం ఆకుపచ్చగా కనిపిస్తోందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు! చాద్ రిపబ్లిక్, సూడాన్, ఎరిత్రియా, మాలి, నైగర్ వంటి పలు దేశాల్లో సహారాలోని విస్తారమైన ప్రాంతం పచ్చని కళ సంతరించుకుని కనిపిస్తోంది.

భారీ వర్షాలు

సహారాలోని పలు ప్రాంతాలను భారీ వర్షాలు ముంచెత్తాయి. ముఖ్యంగా సెప్టెంబర్ 7, 8 తేదీల్లో కుండపోత కురిసింది. ఆ ప్రాంతాల్లో సాధారణంగా కొన్నేళ్లలో పడాల్సిన వాన కేవలం ఆ రెండు రోజుల్లోనే నమోదైంది. దాంతో ఎన్నడూ నీటి ఆనవాళ్లకు కూడా నోచుకోని విస్తారమైన ఇసుక మేటలు కాస్తా కొలనులుగా మారి ఆశ్చర్య పరుస్తున్నాయి. ఇంటర్ ట్రాపికల్ కన్వర్జెన్స్ జోన్ (ఐటీసీజెడ్)లో మార్పులే దీనికి కారణమని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. వర్షాకాలంలో ఆఫ్రికాలోని ఉష్ణమండల గాలులు ఉత్తర దిశ నుంచి వచ్చే పొడి గాలితో భూమధ్యరేఖ సమీపంలో కలుస్తుంటాయి. ఫలితంగా తుపాన్లు, భారీ వానలు ఏర్పడే ప్రాంతాన్నే ఐటీసీజెడ్‌గా పిలుస్తారు. ఈ సీజన్‌లో ఇది సహారా ఎడారికి సమీపంగా జరిగింది. వానలు, వరదలకు కారణమయ్యే లా నినా పరిస్థితులు ఇందుకు తోడయ్యాయి. ఈ విపరీతమైన వాతావరణ పరిస్థితుల కారణంగా సహారా పరిధిలోని పలు ప్రాంతాల్లో రెండు నుంచి ఆరు రెట్లు ఎక్కువ వర్షపాతం నమోదైంది. దాంతో పలు దేశాల్లో 40 లక్షల మందికి పైగా తీవ్రంగా ప్రభావితులయ్యారు. వెయ్యికి పైగా మరణాలు సంభవించాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్



21 వేల ఏళ్లకోసారి...

సహారా ఎడారి ప్రతి 21 వేల ఏళ్లకోసారి పూర్తిగా పచ్చదనం సంతరించుకుంటుందట. విస్తారమైన అడవులు, నదులు, సెలయేళ్లు, గుట్టలతో కళకళలాడుతూ ఉంటుందట. కొన్ని వేల ఏళ్లపాటు ఇలా సాగాక తీవ్ర వాతావరణ మార్పుల కారణంగా మళ్లీ విస్తారమైన ఇసుక మేటలతో ఎడారిగా మారిపోతుంది. ఒక్క చివరి మంచు యుగాన్ని మినహాయిస్తే గత 8 లక్షల ఏళ్లుగా ఇది క్రమం తప్పకుండా జరుగుతూ వస్తోందని సైంటిస్టులు తేల్చారు. భూ అక్షంలో 21 వేల ఏళ్లకు ఒకసారి కలిగే స్వల్ప మార్పులే ఇందుకు కారణమని గతేడాది జరిగిన ఒక అధ్యయనం తేల్చింది.

టార్గెట్ నస్రల్లా

- హెజ్‌బొల్లా కేంద్ర కార్యాలయం నేలమట్టం
- బీరుట్‌పై ఇజ్రాయెల్ భీకర దాడి
- ఇద్దరి మృతి, 76 మందికి గాయాలు
- నస్రల్లా పరిస్థితిపై రాని స్పష్టత

బీరుట్: హెజ్‌బొల్లాను అంతం చేస్తామని ఐరాస వేదికగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ప్రతిజ్ఞ చేసిన కొద్దిసేపటికే లెబనాన్‌లోని హెజ్‌బొల్లా ప్రధాన కార్యాలయంపై భారీ బాంబు దాడులు జరిగాయి. బంకర్లను సైతం భూస్థాపితం చేసే భారీ బాంబులతో ఇజ్రాయెల్ వైమానిక దాడులకు తెగబడింది. బీరుట్ నగరంలోని దహియే పరిధిలోని హరేట్ రీక్ ప్రాంతంలో జరిగిన ఈ దాడిలో ఆరు ప్రధాన భవనాలు నేలమట్టమయ్యాయి. ఇద్దరు మృతిచెందారు. 76 మంది గాయపడ్డారు. మరణాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముంది. ఘటనాస్థలి వద్ద పెద్దసంఖ్యలో జనం గుమికూడారు. హెజ్‌బొల్లా చీఫ్ సయ్యద్ హసన్ నస్రల్లాను మట్టుపెట్టే లక్ష్యంగా ఈ దాడి చేసినట్లు ఇజ్రాయెల్ టీవీ ఛానెళ్లు పేర్కొన్నాయి.



ఏకధాటిగా బాంబులు వేయడం, పెద్ద సైజు బాంబులు వాడటం చూస్తుంటే హమాస్ అగ్రనేతను అంతంచేయడానికే ఈ దాడులు జరిగాయని అంతర్జాతీయ మీడియాలో వార్తలొచ్చాయి. అయితే నస్రల్లా పరిస్థితిపై ఎలాంటి స్పష్టత రాలేదు. బీరుట్‌లో గత ఏడాదికాలంలో ఇంతటి భారీస్థాయిలో బాంబు దాడులు జరగడం ఇదే తొలిసారి. దాడుల ధాటికి ఆరు ప్రధాన భవంతులు నేలమట్టమయ్యాయి. అవి కూలాక బాంబులను వేయడం చూస్తుంటే అక్కడి భూగర్భంలో నిర్మించిన బంకర్లను కూల్చేయడమే అసలు లక్ష్యమని తెలుస్తోంది. ''ఈ బంకర్లలో నస్రల్లా ఉన్నట్లు భావిస్తున్నాం. ఖచ్చితత్వంతో కూడిన లక్షిత దాడి చేశాం'' అని ఇజ్రాయెల్ సైన్యం అధికార ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియల్ హగేరీ చెప్పారు. బాంబు పేలుళ్ల ప్రభావంతో ఏకంగా 30 కి.మీ.ల దూరంలోని ఇళ్ల గాజు కిటికీలు, అద్దాలు సైతం పగిలిపోయాయి. గురువారం చనిపోయిన హెజ్‌బొల్లా కమాండర్ అంత్యక్రియలు జరిగిన గంటకే బీరుట్‌పై దాడులు జరగడం గమనార్హం.

పర్యటనను అర్ధంతరంగా ముగించిన నెతన్యాహూ

అమెరికా పర్యటనలో ఉన్న నెతన్యాహూ ఈ దాడుల వార్త తెల్సి వెంటనే తన పర్యటనను అర్ధంతరంగా ముగించుకుని స్వదేశం బయల్దేరారు. నస్రల్లా మరణిస్తే తదుపరి కార్యాచరణపై రక్షణ, సైనిక, పాలనా వర్గాలతో చర్చించేందుకు ఆయన తిరిగొస్తున్నారని మీడియాలో వార్తలొచ్చాయి. అయితే నస్రల్లా దాడి ప్రాంతంలో లేదని హెజ్‌బొల్లా ప్రకటించింది. నస్రల్లా సురక్షితంగా వేరే ప్రాంతంలో ఉన్నారని ఇరాన్ అధికార 'తస్నీమ్' వార్తా సంస్థ ప్రకటించింది. దాడులపై అమెరికాకు ముందే సమాచారం ఇచ్చామని ఇజ్రాయెల్ చెబుతుండగా, అలాంటి సమాచారం తమకు అందలేదని అమెరికా స్పష్టంచేసింది.



బాంబు దాడుల్లో ధ్వంసమైన హెజ్‌బొల్లా ప్రధాన కార్యాలయం భవనాలు. (ఇన్‌సెట్లో) నస్రల్లా

కిషిదా వారసుడిగా ఇషిబా



- జపాన్ లిబరల్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నిక
- వచ్చే నెల 1న ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం
- ఇషిబా పదవీ కాలం సంవత్సరమే

టోక్యో: జపాన్ నూతన ప్రధానమంత్రిగా షిగెరు ఇషిబా(67) బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఫుమియో కిషిదా వారసుడిగా ఆయన ఎన్నికయ్యారు. రక్షణ శాఖ మాజీ మంత్రి అయిన ఇషిబాను జపాన్ అధికార లిబరల్ డెమొక్రటిక్ పార్టీ(ఎల్‌డీపీ) శుక్రవారం తమ అధ్యక్షుడిగా ఎన్నుకుంది. ప్రస్తుత ప్రధాని ఫుమియో కిషిదాపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. పార్లమెంట్‌లో మెజార్టీ ఉన్న పార్టీ అధ్యక్షుడే ప్రధాన మంత్రి కావడం ఆనవాయితీ. కిషిదా తప్పుకోవడంతో నూతన అధ్యక్షుడి ఎంపిక కోసం ఓటింగ్ నిర్వహించారు. ఎల్‌డీపీ పార్లమెంట్ సభ్యులతోపాటు దాదాపు 10 లక్షల మంది పార్టీ ప్రతినిధులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ప్రధానమంత్రి పదవి కోసం ఇద్దరు మహిళలు సహా మొత్తం 9 మంది ఎంపీలు పోటీపడ్డారు. ఇషిబాతోపాటు ఎకనామిక్ సెక్యూరిటీ మంత్రి సనాయే తకైచి చివరి వరకు బరిలో కొనసాగారు. కానీ, ఇషిబాను విజయం వరించింది. ఒకవేళ తకైచి గెలిచి ఉంటే జపాన్ మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రిగా రికార్డు సృష్టించి ఉండేవారు. ఎంపీల ఓట్లు 368, స్థానిక ప్రభుత్వాల్లోని ఓట్లు 47 ఉన్నాయి. ఇషిబాకు అనుకూలంగా 215 ఓట్లు, తకైచి అనుకూలంగా 194 ఓట్లు వచ్చాయి. కొందరు ఎంపీలు ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు. జపాన్ ప్రధాని కిషిదా, ఆయన కేబినెట్ మంత్రులు అక్టోబర్ 1న రాజీనామా చేయబోతున్నారు. అదే రోజు పార్లమెంటరీ ఓటింగ్‌లో ఇషిబాను ప్రధానిగా లాంఛనంగా ఎన్నుకుంటారు. తర్వాత అదే రోజు ప్రధానమంత్రిగా ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. నూతన మంత్రివర్గాన్ని ఏర్పాటు చేస్తారు.

ఎవరీ ఇషిబా?

షిగెరు ఇషిబా న్యాయ విద్య అభ్యసించారు. బ్యాంకింగ్ రంగంలో సేవలందించారు. తర్వాత రాజకీయాల్లో అడుగుపెట్టారు. 1986లో 29 ఏళ్ల వయసులో ఎల్‌డీపీ టికెట్‌పై తొలిసారిగా పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 38 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో కీలక పదవులు చేపట్టారు. ఎల్‌డీపీ సెక్రెటరీ జనరల్‌గా వ్యవహరించారు. వ్యవసాయం, రక్షణ శాఖల మంత్రిగా పనిచేశారు. ప్రధానమంత్రి పదవిపై ఎప్పటి నుంచో కన్నేశారు. గతంలో నాలుగుసార్లు గట్టిగా ప్రయత్నించి భంగపడ్డారు. ఎట్టకేలకు ఐదో ప్రయత్నంలో విజయం సాధించారు. ఇషిబా తండ్రి సైతం రాజకీయ నాయకుడే. ఆయన కేబినెట్ మంత్రిగా పనిచేశారు. కిషిదాకు, ఇషిబాకు మధ్య భేదాభిప్రాయాలు ఉన్నాయి. ఎల్‌డీపీలో ఇషిబాకు తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టారన్న విమర్శలున్నాయి. ఎల్‌డీపీలో ఇషిబా పలు సందర్భాల్లో అసమ్మతి గళం వినిపించారు.

జపాన్‌ను సురక్షితమైన దేశంగా మారుస్తా: ఇషిబా

ప్రజల పట్ల తనకు ఎనలేని విశ్వాసం ఉందని ఇషిబా చెప్పారు. ధైర్యం, నిజాయతీతో ఎల్లప్పుడూ నిజాలే మాట్లాడుతానని అన్నారు. ఎల్‌డీపీ అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం ఇషిబా శుక్రవారం టోక్యోలో మీడియాతో మాట్లాడారు. జపాన్‌ను సురక్షితమైన, సౌభాగ్యవంతమైన దేశంగా తీర్చిదిద్దడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ప్రకటించారు. ద్రవ్యోల్బణం, అధిక ధరల నుంచి ప్రజలకు విముక్తి కల్పించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతానని తెలిపారు. పునరుత్పాదక ఇంధన వనరులకు పెద్దపీట వేస్తానని వెల్లడించారు. అణు ఇంధనంపై ఆధారపడడాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆసియా ఖండంలో 'నాటో' తరహా కూటమి ఏర్పాటు కావాలని ఇషిబా ఆకాంక్షించారు. జపాన్‌లో పెళ్లయిన మహిళలకు ఏదో ఒక ఇంటిపేరు ఉండాలి. పుట్టింటివారు లేదా అత్తింటివారి ఇంటి పేరుతో కొనసాగవచ్చు. కానీ, రెండు ఇంటి పేర్లతో కొనసాగేలా చట్టం తీసుకురావాలని ఇషిబా నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇలాంటి చట్టం కావాలని ఆయన ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. అంతేకాదు స్వలింగ వివాహాల పట్ల సానుకూలత వ్యక్తం చేస్తున్నారు.

బంకర్ బస్టర్ బాంబు వినియోగం

బీరుట్: హెజ్‌బొల్లా ప్రధాన కార్యాలయంపై దాడిలో 'బంకర్ బస్టర్' బాంబును వాడినట్లు రక్షణ రంగ నిపుణుడు ఎలిజా మాగ్నియర్ చెప్పారు. అత్యంత ఆధునాతన జీబీయూ–72 రకం బాంబును ఇజ్రాయెల్ వాడింది. దీనిని ప్రయోగించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ''2021లో రూపొందించిన ఈ బాంబు బరువు ఏకంగా 2,200 కేజీలు. దాడి చేసిన చోట ఎవ్వరూ ప్రాణాలతో బయటపడకూడదనే గట్టి నిశ్చయంతో ఇజ్రాయెల్ ఈ బాంబు వేసినట్లు స్పష్టమవుతోంది. జార విడిచిన వెంటనే భవనం అండర్‌గ్రౌండ్‌లోకి దూసుకుపోవడం, ఆ మొత్తం భవనం నేలమట్టం కావడం అంతా క్షణాల్లో జరిగిపోతుంది. ఇక్కడ ఏకకాలంలో ఇలాంటి బాంబుల్ని ఇంకొన్ని జారవిడిచినట్లు ఘటనాస్థలిని చూస్తే తెలుస్తోంది. భారీ భవనాలను క్షణాల్లో శిథిలాల కుప్పగా మార్చే సత్తా వీటి సొంతం'' అని ఎలిజా వ్యాఖ్యానించారు. శుక్రవారం లెబనాన్‌లో వేర్వేరు చోట్ల ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 25 మంది చనిపోయారు. దీంతో ఇప్పటిదాకా ఈవారంలో మరణాల సంఖ్య 720 దాటింది.

హెజ్‌బొల్లాపై యుద్ధం ఆగదు

ఐరాస వేదికగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ పునరుద్ఘాటన

ఐక్యరాజ్యసమితి: ఉత్తర ఇజ్రాయెల్ సరిహద్దు వెంట తరచూ తమపై కవ్వింపు దాడులు చేస్తున్న హెజ్‌బొల్లాపై తమ వైమానిక దాడులను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఐక్యరాజ్యసమితి సాక్షిగా సమర్థించుకున్నారు. హెజ్‌బొల్లా సాయుధ సంస్థపై పోరాటం ఆపబోమని, విజయం సాధించేదాకా పోరు కొనసాగుతుందని పునరుద్ఘాటించారు. న్యూయార్క్ నగరంలో ఐరాస సర్వ సభ్య సమావేశాల సందర్భంగా శుక్రవారం నెతన్యాహూ ప్రసంగించారు. హెజ్‌బొల్లాపై దాడులు ఆపబోమని చెప్పి అమెరికా జోక్యంతో పుట్టుకొస్తున్న కాల్పులవిరమణ ప్రతిపాదనలకు నెతన్యాహూ పురిట్లోనే సంధికొట్టారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలు కొన్ని..

రోజూ రాకెట్ దాడులను సహించం

''పొంచిఉన్న ప్రమాదాన్ని తప్పించాల్సిన కర్తవ్యం ఇజ్రాయెల్‌పై ఉంది. మెక్సికోతో సరిహద్దును పంచుకుంటున్న అమెరికా నగరాలు ఎల్ పాసో, శాండిగోలపైకి ఉగ్రవాదులు దాడులు చేస్తే జనం పారిపోయి నగరాలు నిర్మానుష్యంగా మారితే అమెరికా ఎన్ని రోజులు చూస్తూ ఊరుకుంటుంది?. మేం కూడా అంతే. దాదాపు ఏడాదికాలంగా హెజ్‌బొల్లా దాడులను భరిస్తున్నాం. మాలో సహనం నశించింది. ఇక చాలు. సొంతిళ్లను వదిలి వెళ్లిన 60,000 మంది సరిహద్దు ప్రాంతాల ఇజ్రాయెలీలను సొంతిళ్లకు చేర్చాల్సిన బాధ్యత మాపై ఉంది. సరిహద్దు వెంట ఇప్పుడు మేం చేస్తున్నది కూడా అదే. మా లక్ష్యం నెరవేరేదాకా హెజ్‌బొల్లాపై దాడులను ఆపేది లేదు'' అని నెతన్యాహూ అన్నారు.

అందుకే వచ్చా

''నిజానికి ఈ ఏడాది ఐరాసలో మాట్లాడేందుకు రావొద్దనుకున్నా. అస్తిత్వం కోసం గాజాస్ట్రిప్‌పై సైనిక చర్య మొదలయ్యాక నా దేశం యుద్ధంలో మునిగిపోయింది. అయితే ఐరాస పోడియం నుంచే పలు దేశాధినేతలు వల్లెవేస్తున్న అబద్ధాలు, వదంతులకు చరమగీతం పాడేందుకే ముక్కుసూటిగా మాట్లాడుతున్నా. ఇరాన్ శాంతిని కోరుకుంటా అంటుంది కానీ చేసేది వేరేలా ఉంటుంది. ఒక్కటి స్పష్టంగా చెబుతున్నా. మాపై ఎవరు దాడి చేస్తే వాళ్లపై దాడి చేస్తాం. ఈ ప్రాంతంలో ఎన్నో సమస్యలకు ఇరాన్ మూల కారణం'' అని అన్నారు.

90% హమాస్ రాకెట్లు ధ్వంసంచేశాం

''గాజాలో యుద్ధం తుది దశకు వచ్చింది. ఇక హమాస్ లొంగిపోవడమే మిగిలి ఉంది. ఆయుధాలు వీడి బందీలను వదిలేయాలి. లొంగిపోబోమని మొండికేస్తే గెలిచేదాకా యుద్ధంచేస్తాం. సంపూర్ణ విజయమే మా లక్ష్యం. దీనికి మరో ప్రత్యామ్నాయమే లేదు. యుద్ధబాటలో హమాస్ పయనించడం మొదలెట్టాక మాకు కూడా ఇంకో మార్గం లేకుండాపోయింది. 90 % హమాస్ రాకెట్లను ధ్వంసంచేశాం. 40వేల హమాస్ బలగాల్లో సగం మంది చనిపోవడమో లేదంటే మేం వాళ్లను బందీలుగా పట్టుకోవడమో జరిగింది అని అన్నారు.



తమతో మైత్రి ఆశీర్వాదం, ఇరాన్‌తో మైత్రి శాపం అంటూ మ్యాప్‌లను చూపెడుతున్న నెతన్యాహూ

ఓవైపు ఆశీస్సులు... మరోవైపు శాపం


ఆశీస్సులు, శాపం అనే పేర్లు పెట్టి రెండు భిన్న ప్రాంతాల భౌగోళిక పటాలను నెతన్యాహూ పట్టుకొచ్చి వివరించారు. ''ఆశీస్సులు కావాలో, శాపం కావాలో ప్రపంచదేశాలు తేల్చుకోవాల్సిన సమయం వచ్చింది. అరబ్ దేశాలతో మైత్రి బంధం పటిష్టం చేసుకుంటూ ఇజ్రాయెల్.. ఆసియా, యూరప్‌ల మధ్య భూతల సేతువును నిర్మిస్తూ ఇజ్రాయెల్ ఆశీర్వదిస్తోంది. ఇంకో మ్యాప్ మొత్తం శాపాలతో నిండిపోయింది. హిందూ మహాసముద్రం నుంచి మధ్యధరాసముద్రం దాకా పరుచుకున్న ఉగ్రనీడ ఇది. ఇది ప్రపంచదేశాలకు శాపం. ఇరాన్‌లో ఇజ్రాయెల్ చేరుకోలేనంత దూరంలో ఏ భూమీ లేదు'' అంటూ తప్పనిపరిస్థితుల్లో అవసరమైతే ఇరాన్‌పైనా దాడి చేస్తామని పరోక్షంగా హెచ్చరించారు. నెతన్యాహూ తెచ్చిన మ్యాప్‌లో గాజాస్ట్రిప్ మొత్తాన్నీ ఇజ్రాయెల్‌లో భాగంగానే చూపారు. హమాస్, హెజ్‌బొల్లాలపై పోరాడుతున్న తమ సైనికులను పొగుడుతూ నెతన్యాహూ చేస్తున్న ప్రసంగం వినడం ఇష్టంలేని చాలా మంది ప్రపంచ నేతలు ఆయన ప్రసంగం మొదలెట్టగానే హాల్ నుంచి వెళ్లిపోయారు.

ఐఎన్‌ఎస్ అధ్యక్షుడిగా శ్రేయామ్స్ కుమార్



సాక్షి, న్యూఢిల్లీ: 'ది ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ' (ఐఎన్‌ఎస్) అధ్యక్షుడిగా ఎంవీ శ్రేయామ్స్ కుమార్ (మాతృభూమి) ఎన్నికయ్యారు. శుక్రవారం న్యూఢిల్లీలోని ఐఎన్‌ఎస్ బిల్డింగ్‌లో 85వ వార్షిక సమావేశం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగింది. ఈ సమావేశంలో 2024–25 సంవత్సరానికి అధ్యక్షుడిగా ఎంవీ శ్రేయామ్స్ కుమార్‌ను ఎన్నుకోగా.. వివేక్ గుప్తా డిప్యూటీ ప్రెసిడెంట్‌గా, కరణ్ రాజేంద్ర దర్డా (లోక్‌మత్) ఉపాధ్యక్షుడిగా, తన్మయ్ మహేశ్వరీ (అమర్ ఉజాలా) కోశాధికారిగా, మేరీపాల్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనట్లు ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ తెలిపింది. కేఆర్‌పీ రెడ్డి (సాక్షి), వివేక్ గోయెంకా (ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్), అతిదేవ్ సర్కార్ (టెలిగ్రాఫ్), మహేంద్ర మోహన్ గుప్తా (దైనిక్ జాగరణ్), ఐ.వెంకట్ (ఈనాడు), జయంత్ మమెన్ మాథ్యూ (మలయాళ మనోరమ)లు ఎగ్జిక్యూటివ్ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

సిద్ధరామయ్యపై లోకాయుక్త ఎఫ్‌ఐఆర్



మైసూరు: మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) భూకుంభకోణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై లోకాయుక్త పోలీసులు శుక్రవారం ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. అక్రమ భూకేటాయింపుల వ్యవహారంలో సిద్ధరామయ్యతోపాటు ఇతర నిందితులపై దర్యాప్తు ప్రారంభించాలని లోకాయుక్తను బెంగళూరు ప్రత్యేక కోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. కోర్టు ఆదేశాల మేరకు సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, బావమరిది మల్లికార్జున స్వామి, దేవరాజుతోపాటు ఇతరుల పేర్లను ఎఫ్‌ఐఆర్‌లో చేర్చినట్లు లోకాయుక్త పోలీసులు వెల్లడించారు. ముడా భూకేటాయింపుల కేసులో సిద్ధరామయ్యను ఏ1 నిందితుడిగా, పార్వతిని ఏ2గా, మల్లికార్జున్ స్వామిని ఏ3గా, దేవరాజును ఏ4 నిందితుడిగా ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్నట్లు తెలిపారు.

నేనంటే బీజేపీకి భయం: సిద్ధరామయ్య

తనను చూసి బీజేపీ భయపడుతోందని, అందుకే ముడా కేసులో తనను లక్ష్యంగా చేసుకుందని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య చెప్పారు. తనపై నమోదైన రాజకీయపరమైన మొదటి కేసు ఇదేనని అన్నారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. తాను ఏ తప్పూ చేయలేదని, సీఎం పదవికి రాజీనామా చేయబోనని మరోసారి తేల్చిచెప్పారు.

కేరళలో మరో మంకీపాక్స్ కేసు

తిరువనంతపురం: కేరళలో మరో మంకీపాక్స్ కేసు బయటపడింది. ఈ వారంలోనే దేశంలోనే మొట్టమొదటి మంకీ పాక్స్ కేసు ఇక్కడ వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. రెండో కేసు నిర్ధారణ కావడంతో కేరళ ప్రభుత్వం అప్రమత్తమయింది. విదేశాల నుంచి రాష్ట్రానికి వచ్చిన వారు వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స చేయించుకోవాలని కోరింది. తాజా కేసుకు సంబంధించిన కాంటాక్టు జాబితా తయారు చేసి, వ్యాప్తి నివారణ చర్యలు ప్రారంభించామని ఆరోగ్య మంత్రి వీణా జార్జి ప్రకటించారు. అన్ని జిల్లా ఆస్పత్రుల్లో ఐసోలేషన్ విభాగాలను ఏర్పాటు చేశామన్నారు. యూఏఈ నుంచి మల్లప్పురం వచ్చిన 38 ఏళ్ల వ్యక్తికి మంకీ పాక్స్ సోకినట్లు నిర్ధారణయిందని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం తెలిసిందే.


కొండచరియలు పడి 15 మంది మృతి

పడంగ్: ఇండోనేసియాలో అక్రమంగా తవ్వుతున్న బంగారు గనిలోకి వరద ప్రవేశించిన ఘటనలో 15 మంది చనిపోగా, 25 మంది వరకు గల్లంతయ్యారు. పశ్చిమ సుమత్ర ప్రావిన్స్‌లో కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. గురువారం సొలోక్ జిల్లా నగరి సుంగాయ్ అబు గ్రామ సమీపంలో కొండచరియలు విరిగిపడి, సమీపంలోని బంగారు గనిలోకి వరద ప్రవేశించింది. బురద ప్రవాహం గని ఉన్న ప్రాంతాన్ని చుట్టుముట్టిందని అధికారులు తెలిపారు. 15 మృతదేహాలను వెలికి తీశామని, గనిలో ఇంకా 25 మంది వరకు ఉన్నట్లు భావిస్తున్నారు.

పాక్ నోట మళ్లీ పాతపాట

- ఐరాస వేదికపై కశ్మీర్ ప్రస్తావన
- ఆర్టికల్ 370ని పునరుద్ధరించాలి
- పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్

యునైటెడ్ నేషన్స్: ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో పాకిస్తాన్ మరోసారి కశ్మీర్ ప్రస్తావన తెచ్చింది. దీర్ఘకాలిక శాంతి కోసం భారత్ ఆర్టికల్ 370ని పునరుద్ధరించాలని, జమ్మూకశ్మీర్ సమస్యకు శాంతియుత పరిష్కారం కోసం చర్చలకు రావాలని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అన్నారు. భారత్ తన సైనిక సంపత్తిని భారీగా పెంచుకుంటోందని ఆరోపించారు. ఐరాస సర్వసభ్య సమావేశాన్ని ఉద్దేశించి షరీఫ్ శుక్రవారం ప్రసంగించారు. ఆర్టికల్ 370, హిజ్బుల్ ముజాహిదిన్ ఉగ్రవాది బుర్హాన్ వనీల ప్రస్తావన తెచ్చారు. 'పాలస్తీనియన్ల లాగే జమ్మూకశ్మీర్ ప్రజలు కూడా తమ స్వాతంత్య్రం, స్వీయ నిర్ణయాధికారం కోసం శతాబ్దకాలంగా పోరాడుతున్నారు' అని షహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. కశ్మీరీల అభిమతానికి అనుగుణంగా, ఐరాస భద్రతా మండలి తీర్మానాలకు అనుగుణంగా జమ్మూకశ్మీర్‌పై భారత్ చర్చలకు రావాలన్నారు. శాంతి ప్రయత్నాలకు భారత్ దూరంగా జరిగిందని ఆరోపించారు. స్వీయ నిర్ణయాధికారం జమ్మూకశ్మీర్ ప్రజల ప్రాథమిక హక్కని, దానిపై ప్రజాభిప్రాయ సేకరణ జరగాలని భద్రతా మండలి తీర్మానాలు చెబుతున్నాయని అన్నారు.



షెహబాజ్ షరీఫ్

భారత్‌కు బ్రిటన్ మద్దతు

ఐరాస భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వముండాలనే ప్రతిపాదనకు బ్రిటన్ ప్రధానమంత్రి కియర్ స్టార్మర్ మద్దతు పలికారు. భారత్ డిమాండ్‌కు అమెరికా, ఫ్రాన్స్‌లు ఇదివరకే మద్దతు పలికిన విషయం తెలిసిందే. ప్రపంచ ఐక్యవేదిక మరింత ప్రాతినిధ్యంతో, మరింత స్పందనతో కూడి ఉండాలని స్టార్మర్ ఐరాస సర్వసభ్య సమావేశాన్ని ఉద్దేశిస్తూ అన్నారు.

కాలుష్యం పెరిగిపోతున్నా మొద్దునిద్రేనా: సుప్రీం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యాన్ని అరికట్టడంలో విఫలమైన కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్(సీఏక్యూఎం)పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను దహనం చేస్తుండడంతో ఢిల్లీలో కాలుష్యం పెరిగిపోతోందని, అయినా సీఏక్యూఎం మొద్దునిద్ర వీడడం లేదని ఆక్షేపించింది. సీఏక్యూఎంకు ఎన్నో అధికారాలు ఉన్నాయని, వాటిని ప్రభావవంతంగా ఉపయోగించుకోవాలని సూచించింది. ఢిల్లీలో కాలుష్యాన్ని అరికట్టాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసీతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటీ వాదనలు వినిపించారు. పంట వ్యర్థాల దహనాన్ని అడ్డుకోవడానికి చర్యలు చేపట్టామని, రైతులకు సలహాలు సూచనలు ఇచ్చామని, మార్గదర్శకాలు విడుదల చేశామని చెప్పారు. దీనిపై ధర్మాసనం స్పందించింది. ప్రభుత్వం చెబుతున్నవన్నీ గాల్లో కలిసిపోయాయని పేర్కొంది.

స్కూల్ కోసం విద్యార్థిని బలిచ్చారు

ఉత్తర ప్రదేశ్‌లో స్కూల్ యాజమాన్యం దారుణం

ఆగ్రా: ఓవైపు సాంకేతికంగా దూసుకుపోతున్న భారత్ మరోవైపు మూఢ విశ్వాసాలకు వేదికగా నిలిచిన ఘటన ఉత్తరప్రదేశ్‌లో జరిగింది. చిన్నారిని బలి ఇస్తే స్కూలు మరింత వృద్ధిలోకి వస్తుందన్న మూఢ విశ్వాసంతో ఒక పాఠశాల యజమాని సొంత స్కూలు పిల్లాడిని చంపేసిన ఘటన హత్రాస్ జిల్లాలోని జరిగింది. రాస్‌గవాన్ గ్రామంలో ఈనెల 23వతేదీన జరిగిన ఈ ఘటన తాలూకు వివరాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఈ హత్య కేసులో స్కూల్ యజమాని, డైరెక్టర్, ప్రిన్సిపల్, ఇద్దరు ఉపాధ్యాయులను పోలీసులు అరెస్ట్‌చేశారు. పిల్లాడిని గొంతు నులిమి చంపేశారని పోస్ట్‌మార్టమ్ నివేదికలో తేలింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డీఎల్ పబ్లిక్ స్కూల్ యజమాని జశోధన్ సింగ్ తాంత్రిక శక్తులను బాగా విశ్వసిస్తాడు. కుటుంబ సమస్యలు పోయి స్కూల్‌కు మంచి పేరు, వృద్ధిలోకి రావాలంటే చిన్నారిని బలి ఇవ్వాల్సిందేనని కుమారుడు, స్కూల్ డైరెక్టర్ దినేశ్ బఘేల్‌కు చెప్పాడు. దీంతో క్షుద్ర పూజలు చేసి పిల్లాడిని చంపాలని తండ్రీకొడుకులు పథక రచన చేశారు. వీరికి ప్రిన్సిపల్ లక్ష్మణ్ సింగ్, ఉపాధ్యాయులు రాంప్రకాశ్ సోలంకీ, వీర్‌పాల్ సింగ్ జతకలిశారు. బలి ఇచ్చేందుకు రెండో తరగతి చదివే తొమ్మిదేళ్ల కృతార్థ్‌ను ఎంచుకున్నారు. సెప్టెంబర్ 23వ తేదీన స్కూల్ హాస్టల్ గదిలో నిద్రపోతున్న పిల్లాడిని ఎత్తుకొచ్చి స్కూల్ ప్రాంగణంలోని ఒక గదిలో పడుకోబెట్టి క్షుద్ర పూజలు మొదలెట్టారు. కొద్దిసేపటికి పిల్లాడు లేచి ఏడ్వడంతో భయపడి వెంటనే టీచర్ సోలంకీ పిల్లాడి మెడ విరిచి గొంతు నులిమి చంపేశాడు. తర్వాత పిల్లాడి తండ్రికి ఫోన్ చేసి ''మీ అబ్బాయికి ఒంట్లో బాగోలేదు. స్కూల్ డైరెక్టర్ తన కారులో ఆస్పత్రికి తీసుకెళ్లాడు'' అని చెప్పాడు. అనుమానంతో తండ్రి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కారులో పిల్లాడి మృతదేహంతో పారిపోతున్న దినేశ్ బఘేల్‌ను పోలీసులు కారు ఆపించి అరెస్ట్‌చేశారు. కారులోని పిల్లాడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామని హత్రాస్ అదనపు ఎస్పీ అశోక్ సింగ్ చెప్పారు.

లడ్డూలో 'కుట్ర' కోణం

భారత వ్యవసాయ పరిశోధన సంస్థ పాలక మండలి సభ్యుడు బద్రవాడ వేణుగోపాల్ సంచలన నిజాలు

- టీటీడీ ఈవో శ్యామలరావు, ఎన్‌డీడీబీ చైర్మన్ మీనేశ్ షా, మాజీ చైర్మన్ వర్షాజోషిలే బాధ్యులు
- ఎన్‌డీడీబీకి నెయ్యి శాంపిళ్లు పంపడానికి ముందు రోజు ఆ ముగ్గురి భేటీపై అనుమానాలు
- వారికి కఠిన శిక్ష విధించాలి.. వారి ఆస్తులను సీజ్ చేసి ధార్మిక సంస్థలకు దానం చేయాలి
- సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలంటూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు లేఖ
- ప్రధాని నరేంద్ర మోదీ, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌లకూ లేఖ ప్రతులు


జులై 5న టీటీడీ ఈవో శ్యామలరావుతో మీనేశ్ షా, వర్షాజోషి సమావేశమైన దృశ్యం

సాక్షి, హైదరాబాద్: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడారనడంలో కుట్రకోణం దాగి ఉందని భారత వ్యవసాయ పరిశోధన సంస్థ పాలక మండలి సభ్యుడు బద్రవాడ వేణుగోపాల్ సంచలన విషయాలు వెల్లడించారు. జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ (ఎన్‌డీడీబీ) ఇచ్చిన నివేదికలోనే అసలు కుట్ర దాగి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆ నివేదికపై సమగ్ర విచారణ జరిపించాలని, కోట్లాది మంది భక్తుల మనోభావాలపై తీవ్రమైన దాడి చేసేందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. రాష్ట్రపతితో పాటు భారత ప్రధాన మంత్రి, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌లకు కూడా ఆ లేఖను పంపారు. ఆ లేఖలో ప్రధానాంశాలు ఇలా ఉన్నాయి.

వ్యాపార ప్రయోజనాల కోసమే ఆ భేటీ

- టీటీడీ లడ్డూ వివాదానికి లోపభూయిష్టమైన ఎన్‌డీడీబీ కాఫ్ రిపోర్టుతో పాటు టీటీడీ, ఎన్‌డీడీబీ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ (ఆర్‌జీఎం) పెద్దల అనుమానాస్పద వ్యాపార భేటీలు ఉత్ప్రేరకాలుగా మారాయి. ఈ నివేదిక తదనంతర పరిణామాలతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తుల విశ్వాసం దెబ్బతింది. ఈ విషయానికి లభించిన విపరీత ప్రచారం టీటీడీ విశ్వసనీయతను దెబ్బ తీసింది.
- జులై 6న నెయ్యి శాంపిళ్లను పరీక్ష కోసం పంపగా, అంతకంటే ముందు అంటే జులై 5న టీటీడీ ఈవో జె.శ్యామలరావు, ఎన్‌డీడీబీ చైర్మన్ మీనేశ్.సి.షా, ఎన్‌డీడీబీ మాజీ చైర్మన్ ఆర్‌జీఎం అదనపు కార్యదర్శి వర్షా జోషిల మధ్య భేటీ జరిగింది. ఈ భేటీ అనేక అనుమానాలకు తావిస్తోంది.
- ఈ భేటీ కారణంగానే నెయ్యి కల్తీ జరిగిందని వచ్చిన నివేదిక వెనుక రాజకీయ దురుద్దేశాలున్నాయేమోననే అనుమానాలు కలుగుతున్నాయి. ఈ ముగ్గురి చర్యల కారణంగా లడ్డూ ప్రసాదానికి ఉన్న విశ్వసనీయత దెబ్బతింది. ఇందుకు వారే బాధ్యత వహించాలి. వ్యాపార లావాదేవీల కోసం వారి దురాశపూరిత వైఖరి క్షమించరానిది. వారు కఠిన శిక్షలు ఎదుర్కోవాలి. వారి ఆస్తులన్నింటినీ సీజ్ చేసి, ధార్మిక సంస్థలకు దానం చేయాలి. ఈ వ్యవహారంతో సూక్ష్మ సంబంధమున్న ఎవరినైనాసరే జైలుకు పంపాలి.
- వాస్తవాలను పరిశీలించి ఆరోపణల వెనుక ఉన్న నిజాలను తెలుసుకోవడం కంటే హడావుడి ప్రకటనలకే రాజకీయ నాయకులు ప్రాధాన్యమిచ్చారు. అదే నిజమైతే సదరు రాజకీయ నాయకులు కూడా న్యాయ పరంగా తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. లడ్డూ పవిత్రతను కాపాడడం, మతపరమైన ఆచారాలను సంరక్షించడం అత్యవసరం. ఇలాంటి రాజకీయ అపస్వరాలు వినిపిస్తున్న వేళ దేవాలయాల నిర్వహణను మత పెద్దలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఏకపక్షంగా నియామకం

- వ్యాపార లావాదేవీల కోసం టీటీడీ ఈవో శ్యామలరావుతో భేటీ అయిన ఎన్‌డీడీబీ చైర్మన్ మీనేశ్.సి.షా, వర్షాజోషీల ట్రాక్ రికార్డు వివాదాస్పదం. అధికార, ఆర్థిక దుర్వినియోగాలకు సంబంధించి ఆరోపణలు వీరిపై వచ్చాయి. 2021 మే 31న వర్షాజోషి ఎన్‌డీడీబీ చైర్మన్‌గా రిటైర్ అయ్యారు. ఆ తర్వాత ప్రస్తుత చైర్మన్ మీనేశ్.సి.షాను ఆమె ఏకపక్షంగా నియమించారు.
- డిప్యూటీ జనరల్ మేనేజర్ హోదాలో ఉన్న షాను అనేక హోదాలు దాటించి మరీ చైర్మన్, ఎండీగా నియమించారు. ఈ ఇద్దరు దేశీయ పశు సంపదను పెంపొందించడం కంటే బహుళ జాతి సంస్థల ప్రయోజనాల కోసం విదేశీ రకాలను, జెర్సీ ఆవులను ప్రోత్సహించడంపైనే దృష్టి పెట్టి పని చేశారు. ఇది ప్రధాని మోదీ ఆలోచనకు, ఆయన హయాంలో నడుస్తున్న రాష్ట్రీయ గోకుల్ మిషన్‌కు విరుద్ధం. వీరిద్దరిపై ఆర్‌జీఎంకు సంబంధించి రూ.4,109 కోట్లు, నేషనల్ డెయిరీ ప్లాన్–1కు సంబంధించి రూ.2,242 కోట్ల నిధుల దుర్వినియోగంపై కూడా ఆరోపణలున్నాయి.

వాళ్లే జవాబుదారీ

- టీటీడీ ఉపయోగించిన నెయ్యిలో కల్తీ జరిగిందని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు కాఫ్ ఇచ్చిన రిపోర్టుపై సమగ్ర విచారణ జరిపించాలి. ఇందుకు బాధ్యులైన అధి కారులతో పాటు కోట్లాది మంది భక్తులను తప్పుదోవ పట్టించినందుకు టీటీడీ ఈవో జె. శ్యామలరావుతో పాటు ఎన్‌డీడీబీ చైర్మన్ మీనేశ్.సి.షాలను జవాబుదారులుగా చేయాలి.
- ఎన్‌డీడీబీ చైర్మన్‌గా మీనేశ్.సి.షా నియామకమే నేరపూరితం. ఆయన పదోన్నతి లభించేందుకు దారి తీసిన పరిస్థితులపై విచారణ జరిపించాలి.
- విదేశీ రకాలను ప్రోత్సహించి, స్వదేశీ పశు సంపద కార్యక్రమాలను నిర్వీర్యం చేయడంలో ఎన్‌డీడీబీ చైర్మన్‌గా, రాష్ట్రీయ గోకుల్ మిషన్ అదనపు కార్యదర్శిగా వర్షాజోషి తన హోదాను దుర్వినియోగం చేయడంపై కూడా విచారణ జరిపించాలి.
- దేశంలోని అన్ని దేవాలయాల్లో దేశీయ ఆవు నెయ్యిని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలి.
- మీనేశ్.సి.షా, వర్షాజోషిల హయాంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ , పశుసంపద వృద్ధి (సీడీడీ) కార్యక్రమాల్లో జరిగిన ఆర్థిక అక్రమాలపై విచారణ జరిపించాలి.
- ఈ విచారణ పూర్తి పారదర్శకంగా, జవాబుదారీగా ఉండేందుకు సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి లేదా ఉన్నత స్థాయి అధికారితో విచారణ జరిపించాలి. కోట్లాది మంది భక్తుల విశ్వాసాలను పునరుద్ధరించడంతో పాటు ఈ వ్యక్తుల కారణంగా నష్టపోయిన రైతులకు మోదీ ప్రభుత్వం పట్ల ప్రజా విశ్వాసం కలిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలి.

'హైడ్రా'పై సందేహాలా?



కమిషనర్ రంగనాథ్ స్వయంగా సమాధానమిస్తారు..

ఫిర్యాదులు, సందేహాలు, సమాచారం కోసం 89777 94588కు వాట్సాప్ చేయండి..

మీతో సాక్షి

హైడ్రా.. ఇప్పుడు అందరి నోటా ఇదే మాట. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలో ఉన్న చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల పరిరక్షణే లక్ష్యంగా ఈ హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) ఏర్పాటైంది. బుల్డోజర్లతో చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్లలో, నాలాలపై ఉన్న పార్కులు, ఫాంహౌస్‌లు, విల్లాలు, ఇళ్లు, ఇతర నిర్మాణాలను కూల్చేస్తోంది. దీంతో హైదరాబాద్ నగర వ్యాప్తంగా ప్రజలను సవాలక్ష సందేహాలు చుట్టుముడుతున్నాయి. అసలు హైడ్రా ఏ నిర్మాణాలు కూల్చేస్తుంది? వేటిని వదిలేస్తుంది? ఏది ఎఫ్‌టీఎల్? ఏది బఫర్ జోన్? భవిష్యత్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి? ప్లాట్లు, ఇళ్లు ఖరీదు చేసే ముందు ఏఏ అంశాలు సరి చూసుకోవాలి? ఇలాంటి ప్రశ్నలన్నీ వేధిస్తున్నాయి. మరోవైపు తమ చుట్టూ కబ్జాలు జరుగుతున్నా ఏం చేయాలో, ఎవరికి చెప్పాలో తెలియని పరిస్థితి మరికొందరిది. ఈ నేపథ్యంలోనే 'మీతో సాక్షి'మీ ముందుకొస్తోంది. హైడ్రాకు సంబంధించి మీకు ఎలాంటి సందేహాలున్నా, సమాచారం కావాలన్నా, ఫిర్యాదు చేయాలనుకున్నా 89777 94588 నంబర్‌కు వాట్సాప్ చేయండి. సందేశం, వాయిస్ మెసేజ్, ఫొటోల రూపంలో పంపండి. వీటిని 'సాక్షి'హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ దృష్టికి తీసుకువెళ్తుంది. ఆయన స్పందన మీకు చేరేలా చేస్తుంది. అసలు హైడ్రా ఏం చేయబోతోందో తెలియజేస్తుంది.

నోట్: తమ పేరు, వివరాలను గోప్యంగా ఉంచాలని ఎవరైనా కోరితే.. వారి అభిప్రాయాన్ని 'సాక్షి' కచ్చితంగా గౌరవిస్తుంది.

రిలయన్స్ రూ.20 కోట్ల విరాళం


సీఎం రేవంత్‌కు విరాళం చెక్‌ను అందజేస్తున్న రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు. చిత్రంలో మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి సహాయనిధికి రిలయన్స్ ఫౌండేషన్ భారీ విరాళం అందించింది. ఈ నెల మొదటి వారంలో భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన ప్రజానీకాన్ని ఆదుకోవడానికి రిలయన్స్ ఫౌండేషన్ సీఎం సహాయ నిధికి రూ. 20 కోట్ల విరాళాన్ని ఇచ్చింది. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలసి నీతా అంబానీ తరఫున రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు చెక్‌ను అందచేశారు.

భారత్ బయోటెక్ విరాళం రూ.కోటి: ముఖ్యమంత్రి సహాయనిధికి భారత్ బయోటెక్ సంస్థ రూ.కోటి విరాళం అందజేసింది. శుక్రవారం సచివాలయంలో సీఎం రేవంత్‌ని కలసిన భారత్ బయోటెక్ కో–ఫౌండర్, జేఎండీ సుచిత్ర ఎల్లా రూ.కోటి చెక్‌ను ఇచ్చారు.

ఫిడే విజేతలు ఒక్కొక్కరికి రూ. 25 లక్షలు

సాక్షి, హైదరాబాద్: ఇటీవల హంగేరిలోని బుడాపెస్ట్‌లో జరిగిన ఫిడే చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణపతకం సాధించిన తెలంగాణ ఆటగాళ్లకు ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.25 లక్షల నజరానాను ప్రకటించింది. శుక్రవారం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని.. చెస్ విజేతలు మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా సీఎం ఈ ప్రకటన చేశారు. చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణ పతకాలు సాధించిన ఆటగాళ్లు అర్జున్ (హనుమకొండ), ద్రోణవల్లి హారిక(ఖమ్మం)ను సీఎం అభినందించారు.

క్లుప్తంగా...

'డిస్కంల' బదిలీలకు మార్గదర్శకాలు

సాక్షి, హైదరాబాద్: దక్షిణ/ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్/టీజీఎన్పీడీసీఎల్)ల్లో గత జూన్ 30నాటికి రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు బదిలీ కానున్నారు. ఈ మేరకు విద్యుత్ ఉద్యోగుల సాధారణ బదిలీలకు మార్గదర్శకాలను ప్రకటిస్తూ ఆయా సంస్థల సీఎండీలు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం ఉద్యోగుల్లో 50 శాతం మందికి మించకుండా స్థాన చలనం కల్పించనున్నారు. వచ్చే ఏడాది సెప్టెంబర్ 30లోగా ఉద్యోగ విరమణ చేయనున్న వారికి బదిలీల నుంచి మినహాయింపు కల్పించారు. ప్రాధాన్య స్థానం నుంచి అప్రాధాన్య స్థానానికి, అప్రాధాన్య స్థానం నుంచి ప్రాధాన్య స్థానానికి బదిలీలు జరగనున్నాయి.

అక్టోబర్ 3, 4వ తేదీల్లో తెలుగు వర్సిటీ ప్రవేశ పరీక్షలు

నాంపల్లి: 2024–2025వ విద్యా సంవత్సరానికి గాను వివిధ కోర్సుల్లో ప్రవేశాల కోసం అక్టోబర్ నెల 3, 4వ తేదీల్లో ప్రవేశ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బి.ఎఫ్.ఎ. శిల్పం, చిత్రలేఖనం, ఎం.పి.ఎ. నృత్యం, జానపదం ప్రాయోగిక పరీక్షలకు, ఎం.ఏ చరిత్ర, సంస్కృతి, పర్యాటకం పీజీ డిప్లొమా కోర్సులకు, యోగా, లలిత సంగీతం డిప్లొమా ప్రాయోగిక పరీక్షలకు, యానిమేషన్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీల సర్టిఫికెట్ కోర్సుల ప్రవేశ పరీక్ష అక్టోబర్ 3న హైదరాబాద్ బాచుపల్లి ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 4న ఎం.ఏ, జ్యోతిషం, ఎం.ఏ కమ్యూనికేషన్ జర్నలిజం పరీక్షలు బాచుపల్లిలో జరుగుతాయన్నారు. ఎం.ఏ తెలుగు ప్రవేశ పరీక్ష అక్టోబర్ 4న బాచుపల్లి, వరంగల్ ప్రాంగణాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. 28 నుంచి తెలుగు వర్సిటీ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు పొందవచ్చని సూచించారు.

ఆ ధర్నాలో పాల్గొనడం లేదు

స్పష్టం చేసిన గురుకుల విద్యా జేఏసీ

సాక్షి, హైదరాబాద్: ఇందిరాపార్క్ వద్ద ఈ నెల 28న కొందరు తలపెట్టిన ధర్నా కార్యక్రమంలో గురుకుల విద్యా జేఏసీ పాల్గొనడం లేదని శుక్రవారం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. శుక్రవారం పూలే ప్రజాభవన్‌లో గురుకుల విద్యా జేఏసీ ప్రతినిధుల బృందం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డిని కలిసింది. గురుకుల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించింది.

రీనోటిఫికేషన్ కోర్టు ధిక్కరణే

- మెయిన్స్‌కు మళ్లీ అభ్యర్థులను ఎంపిక చేయాలి
- గ్రూప్ 1 పై పిటిషనర్ల వాదనలు
- టీజీపీఎస్సీకి అన్ని అధికారాలు ఉంటాయన్న ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 పరీక్షకు మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చే అధికారం టీఎస్‌పీఎస్సీకి లేదని పలువురు పిటిషనర్లు హైకోర్టులో తమ వాదనలు వినిపించారు. ప్రభుత్వం అనుమతిస్తేనే టీఎస్‌పీఎస్సీ చర్యలు చేపట్టాల్సి ఉంటుందని చెప్పారు. గతంలో హైకోర్టు ప్రిలిమ్స్‌ను మాత్రమే రద్దు చేసిందని, పరీక్ష మళ్లీ నిర్వహించాలని చెప్పిందని పేర్కొన్నారు. అయితే తొలుత జారీ చేసిన నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ రద్దు చేయడం ధిక్కరణ కిందకే వస్తుందన్నారు. రెండో నోటిఫికేషన్ ప్రకారం నిర్వహించిన ప్రిలిమ్స్‌లో తప్పుడు ప్రశ్నలు తొలగించి, మెయిన్స్‌కు మళ్లీ అభ్యర్థులను ఎంపిక చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పిటిషనర్ల వాదనను ప్రభుత్వం తప్పుబట్టింది. టీఎస్‌పీఎస్సీకి అన్ని అధికారాలుంటాయని స్పష్టం చేసింది. అనంతరం హైకోర్టు తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

6 శాతం ఎస్టీ రిజర్వేషన్లే అమలు చేయాలి: పిటిషనర్లు

గ్రూప్–1కు రీ నోటిఫికేషన్ ఇవ్వడాన్ని, తాజా ప్రిలిమ్స్‌లో తప్పుడు ప్రశ్నలను సవాల్ చేస్తూ కొందరు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ పుల్ల కార్తీక్ శుక్రవారం విచారించారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది జొన్నలగడ్డ సుధీర్ వాదనలు వినిపించారు. 'టీఎస్‌పీఎస్సీ 503 పోస్టులకు 2022, ఏప్రిల్ 26న తొలి నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు ఎస్టీ రిజర్వేషన్లు 6 శాతమే ఉన్నాయి. ఆ తర్వాత 10 శాతానికి పెంచారు. అప్పటి రిజర్వేషన్ ప్రకారం ఇప్పుడు 6 శాతమే అమలు చేయాలి. లేదంటే జనరల్ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుంది..' అని చెప్పారు.

రీనోటిఫికేషన్‌తో అభ్యర్థులకు లబ్ధి: ప్రభుత్వం

ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'టీఎస్‌పీఎస్సీ చట్టబద్ధమైన సంస్థ. నియామకాలకు సంబంధించి ఎలాంటి చర్యలైనా చేపట్టే అధికారం కమిషన్‌కు ఉంది. ప్రభుత్వం నుంచి అనుమతి పొందాల్సిన అవసరం లేదు. నేరుగా నిర్ణయాలు తీసుకోవచ్చు. 2024 ఫిబ్రవరి 19న 563 పోస్టులకు ఇచ్చిన రీ నోటిఫికేషన్‌తో ఎవ రికీ నష్టం కలుగలేదు. పైగా 60 పోస్టులు పెరగడం అభ్యర్థులకు లబ్ధి చేకూర్చింది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కూడా పెరిగారు. కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన ఎక్కడా జరగలేదు..' అని తెలిపారు. అనంతరం సమయం ముగియడంతో న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు.

డీకే కార్యాలయాన్ని సందర్శించిన బీఆర్ఎస్ బీసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు తమిళనాడుకు వెళ్లిన బీఆర్ఎస్ బీసీ నేతల బృందం శుక్రవారం చెన్నైలోని ద్రవిడ కజగం (డీకే) కార్యాలయాన్ని సందర్శించింది. ద్రవిడ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన వీరమణితో సమావేశమయ్యారు. ద్రవిడ ఉద్యమం పుట్టుక, దాని పూర్వాపరాలు, తదనంతర పరిణామాలు, వెనుకబడిన కులాల సమున్నతికి దోహదపడిన అంశాల గురించి బీఆర్ఎస్ నేతలు డీకే అధ్యక్షుడు వీరమణిని అడిగి తెలుసుకున్నారు. ద్రవిడ ఉద్యమానికి మూల పురుషుడైన పెరియార్ రామస్వామి నాయకర్ ఫొటోలు, ఆయన ఉపయోగించిన వస్తువుల ప్రదర్శనను బీఆర్ఎస్ నేతలు తిలకించారు. అనంతరం తమిళనాడు ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి రాంమోహన్, బీసీ సంఘాలకు చెందిన పలువురు నేతలతోనూ ఈ ప్రతినిధి బృందం భేటీ అయ్యింది. తాము బసచేసిన హోటల్‌లో బీఆర్ఎస్ నేతలు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ అభివృద్ధి సాధించిందన్నారు. తమకు దక్కాల్సిన న్యాయమైన వాటా కోసం దేశంలో బీసీలు ఉద్యమిస్తున్న సమయంలో బీఆర్ఎస్ వారికి బాసటగా నిలవడం హర్షణీయమని చెప్పారు.

పెట్టుబడులకు స్వర్గధామం హైదరాబాద్

మైన్స్ ఎక్స్‌పో–2024 సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: ఐటీ, రెన్యూవబుల్ ఎనర్జీ, వస్తు సేవల ఉత్పత్తి రంగాల్లో పురోగమిస్తున్న తెలంగాణ..అమెరికన్ కంపెనీల భాగస్వామ్యాన్ని సహకారాన్ని కోరుతోందని, గ్లోబల్ సిటీ అయిన హైదరాబాద్‌కు పెట్టుబడులతో తరలిరావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చారు. అమెరికాలోని లాస్‌వేగాస్‌లో జరుగుతున్న మైన్స్ ఎక్స్‌పో–2024 సదస్సులో గురువారం ఆయన ప్రముఖ అమెరికన్ కంపెనీలతో సమావేశమయ్యారు. భారత ఆర్థిక పురోగతిలో అమెరికన్ కంపెనీలు కీలక పాత్ర పోషించాయని, దిగ్గజ కంపెనీలైన మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, ఫేస్‌బుక్, ఆపిల్ సంస్థలు హైదరాబాద్‌ను తమ స్వస్థలంగా భావిస్తూ.. వ్యాపారాలు నిర్వహిస్తున్నాయని, తద్వారా హైదరాబాద్ గ్లోబల్ ఐటీ కేంద్రంగా, ఇన్నోవేషన్ హబ్‌గా రూపుదిద్దుకున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యాపార అనుకూల విధానాలు, నైపుణ్యం గల మానవ వనరులు, చక్కని మౌలిక సదుపాయాలు గల హైదరాబాద్ సిటీ పెట్టుబడులకు స్వర్గధామం అని అన్నారు. హైదరాబాద్ టెక్నాలజీ హబ్‌గానే కాకుండా ఫార్మాసిటీ రంగంలో గ్లోబల్ లీడర్‌గా ఉంటుందన్నారు. కరోనా విపత్కర సమయంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, అరబిందో ఫార్మా, బయోలాజికల్–ఈ, భారత్ బయోటెక్ వంటి కంపెనీల ఆవిష్కరణలతో 'వ్యాక్సిన్ క్యాపిటల్ ఆఫ్ ద వరల్డ్'గా నగరం ఖ్యాతి గడించిందని చెప్పారు. ఐటీ అభివృద్ధిలో, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంతో హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ ఆవిష్కరణ జరుగుతోందని, ఇక్కడ ఏఐతో నిర్వహించే పరిశ్రమలు, ఏఐ అభివృద్ధి, స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, గ్రీన్ ఎనర్జీ ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తున్నామని, ఈ విభాగాల్లో ఆసక్తి, అనుభవం ఉన్న కంపెనీలకు తెలంగాణ స్వాగతం పలుకుతుందన్నారు. తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఇంధన, పారిశ్రామిక విధానాలు రూపొందించామని, కొత్త ఆవిష్కరణలకు, ఆర్థికాభివృద్ధికి, పునరుత్పాదక విద్యుత్ అభివృద్ధికి ఎక్కువ అవకాశాలుంటాయన్నారు. ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీని వృద్ధి చేయడానికి ఎక్కువ అవకాశాలున్నాయని తెలి పారు. సదస్సులో ఆస్ట్రేలియాకు చెందిన డోపల్ మేర్ కంపెనీ స్టాల్‌ను సందర్శించారు. ఈ కంపెనీ రూపొందించిన అత్యాధునిక బొగ్గు, ఓవర్ బర్డెన్ రవాణా బెల్టులు, వాటి పనితీరును పరిశీలించారు. సౌత్ ఆఫ్రికా, స్విజర్లాండ్ వంటి దేశాలలో తమ కంపెనీ బెల్టులతో జరుగుతున్న రవాణా ప్రక్రియను స్టాల్ నిర్వాహకులు వివరించారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్, స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్ పాల్గొన్నారు.

సోమశిలకు జాతీయ అవార్డు

ఉత్తమ పర్యాటక గ్రామంగా ఎంపిక చేసిన కేంద్రం


సోమశిల గ్రామంలో కృష్ణాతీరం

సాక్షి, నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని సోమశిల గ్రామం పర్యాటకంగా జాతీయ అవార్డు సాధించింది. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఈ అవార్డులను ప్రదానం చేశారు. తెలంగాణలోని నిర్మల్, సోమశిల గ్రామాలు జాతీయస్థాయిలో అవార్డులకు ఎంపికయ్యాయి. 'ఆధ్యాత్మికత– వెల్‌నెస్'విభాగంలో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని సోమశిల గ్రామం జాతీయ అవార్డును పొందగా..జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ అవార్డును అందుకున్నారు. సోమశిల గ్రామం జాతీయ అవార్డుకు ఎంపికకావడం పట్ల రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు.

ఇదీ సోమశిల సోయగం..

ఒకవైపు పచ్చని నల్లమల కొండలు, మరోవైపు నీలిరంగు పులుముకుని సాగిపోయే కృష్ణమ్మ పరవళ్లతో సోమశిల గ్రామం చూడముచ్చటగా కనిపిస్తోంది. గ్రామంలో ఉన్న పురాతన కాలం నాటి లలితా సోమేశ్వర ఆలయం ఈ గ్రామానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. శ్రీశైలం ప్రాజెక్ట్ నిర్మాణం సమయంలో ప్రాజెక్ట్ అంతర్భాగంలో నీటి ముంపులో మునిగిపోయే ఈ ఆలయాన్ని పురావస్తు శాఖ సోమశిల గ్రామంలో పునర్నిర్మించిన సంగతి తెలిసిందే.

నేతన్నల అభ్యున్నతికి కృషి: తుమ్మల

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు


పద్మశాలి దసరామేళ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రులు తుమ్మల, జూపల్లి, పొన్నం, సీతక్క

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): రైతన్న, నేతన్నల అభివృద్ధి, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో బీసీ సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖల ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతుల రుణమాఫీతో పాటు నేతన్నలకు కూడా రుణమాఫీ చేసినట్లు గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో పద్మశాలీలకు రాజకీయంగా సముచిత గౌరవాన్ని కల్పిస్తామన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బతుకమ్మ చీరల పంపిణీపై కొంతమంది అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, అయితే నేతన్నలకు అన్యాయం చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ చేనేత దుస్తులను వాడాలని సూచించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మహనీయుల జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అణగారిన వర్గాల కోసం పోరాడిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. అనంతరం పద్మశాలి దసరామేళ పోస్టర్లను ఆవిష్కరించారు.

సత్వరం 'సీతారామ' పూర్తి: ఉత్తమ్


ప్రాజెక్టు పురోగతిపై భేటీలో మంత్రులు ఉత్తమ్, తుమ్మల పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: సీతారామ ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. గత ఆగస్టు 15న ప్రాజెక్టు పంప్‌హౌస్–2ను ప్రారంభించిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టు సొరంగం, కాల్వల నిర్మాణంలో పురోగతిపై శుక్రవారం ఆయన జలసౌధలో సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. భూసేకరణను వేగంగా పూర్తి చేయాలని, అలసత్వం వహించరాదని సూచించారు. భూసేకరణకు పాలనాపరమైన అనుమతుల జారీలో జాప్యం జరగరాదని సూచించారు. టెండర్ల ప్రక్రియ పూర్తికి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీలు అనిల్ కుమార్, నాగేందర్ రావు పాల్గొన్నారు.

ఇదండీ జగత్



నాకు ఓటేయ్యక పోయావో.. నీ ఇల్లు కూల్చేస్తా!

మంత్రి పొంగులేటి ఇంట్లో ఈడీ సోదాలు

ఢిల్లీ నుంచి వచ్చిన అధికారులు... 15 బృందాలతో ఏకకాలంలో తనిఖీలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇల్లు, వ్యాపార సంస్థలకు చెందిన కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బృందాలు సోదాలు జరిపాయి. ఢిల్లీ నుంచి వచ్చిన ఈడీ అధికారుల ప్రత్యేక బృందాలు ఈ సోదాల్లో పాల్గొన్నట్టు తెలిసింది. శుక్రవారం ఉదయం 5:30 గంటల నుంచి జూబ్లీహిల్స్‌లోని మంత్రి పొంగులేటి ఇంటితో పాటు కుటుంబసభ్యులు, బంధువుల ఇళ్లు, పొంగులేటి కుమారుడు హర్షరెడ్డికి సంబంధించిన రాఘవ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ కార్యాలయాల్లోనూ సోదాలు కొనసాగాయి. ఏకకాలంలో మొత్తం 15 ఈడీ అధికారుల బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి. విదేశాల నుంచి ఖరీదైన వాచీల కొనుగోలుకు సంబంధించిన ఆరోపణలపై ఈ ఏడాది మార్చి 28న చెన్నై కస్టమ్స్ అధికారులు హర్షరెడ్డికి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. కస్టమ్స్, డీఆర్ఐ కేసుల ఆధారంగా రంగంలోకి దిగిన ఈడీ అధికారులు దర్యాప్తులో భాగంగా స్థానిక పోలీసులు, కేంద్ర బలగాల రక్షణలో సోదాలు కొనసాగాయి. పొంగులేటి కుమారుడు హర్షరెడ్డికి సంబంధించిన రాఘవ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆఫీసుల్లో సోదాలు నిర్వహించారు. రాఘవ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సహా పొంగులేటి కుటుంబ సభ్యులకు చెందిన సంస్థల ఆర్థికలావాదేవీలపైన ఆరా తీసినట్టు సమాచారం.


ఈడీ సోదాల నేపథ్యంలో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మంత్రి పొంగులేటి ఇంటి బయట కేంద్ర బలగాలు

కేసు వివరాలివీ..: హాంగ్‌కాంగ్‌లో నివాసముండే మహ్మద్ ఫహెర్దీన్ ముబీన్ ఈ ఏడాది ఫిబ్రవరి 5న సింగపూర్ నుంచి చెన్నైకి వచ్చాడు. అతని వద్ద కస్టమ్స్ అధికారులు విదేశాలకు చెందిన రెండు లగ్జరీ వాచ్‌లు స్వాధీనం చేసుకున్నారు. మహ్మద్ ఫహెర్దీన్ ముబీన్‌ను కస్టమ్స్ అధికారులు విచారించగా, మధ్యవర్తి నవీన్‌కుమార్ పేరు వెల్లడించాడు. ఈ క్రమంలో నవీన్‌కుమార్ ద్వారా పొంగులేటి కుమారుడు హర్షరెడ్డి ముబీన్ నుంచి దాదాపు రూ.7 కోట్లు విలువ చేసే ఏడు లగ్జరీ వాచ్‌లను కొనుగోలు చేసినట్టు ఆరోపణలున్నాయి. దీనిపై సమాధానం ఇవ్వాలని కస్టమ్స్ అధికారులు గతంలో నోటీసులు జారీ చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో రూ.100 కోట్ల విలువైన లావాదేవీలు జరిగినట్టు ఈడీ అనుమానిస్తోంది. దీంతోమనీలాండరింగ్ కోణంలో తనిఖీలు కొనసాగుతున్నాయి.

ఈడీ దాడులను ఖండించిన మంత్రి సీతక్క

ఈడీ దాడులను మంత్రి సీతక్క ఖండించారు. 'ప్రతిపక్ష ప్రభుత్వాలున్న చోట బీజేపీ దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తోంది. ఈడీ, సీబీఐలను పచ్చిగా దుర్వినియోగం చేస్తోంది. తమకు అనుకూలంగా రాజ్యాంగ విరుద్ధంగా దర్యాప్తు సంస్థలను వాడుకుంటోంది' అని సీతక్క ఒక ప్రకటనలో మండిపడ్డారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇంటిపై ఈడీ అధికారులకు సోదాలకు కారణం బీజేపీ కుట్రలేనని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి తెలిపారు.

క్లుప్తంగా...

మాది నిర్మాణం.. కాంగ్రెస్‌ది విధ్వంసం: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ ప్రభుత్వం లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించిందనే వాస్తవాన్ని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టకేలకు అంగీకరించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మూసీ నది పునరుద్ధరణలో ఇళ్లు కోల్పోతున్న వారికి.. డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడమే దీనికి నిదర్శనమన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణంపై ఇన్నాళ్లూ కాంగ్రెస్ పార్టీ చేసిన విష ప్రచారం, అబద్ధాలకు తాజా ఉత్తర్వులే సాక్ష్యమని 'ఎక్స్'వేదికగా కేటీఆర్ పేర్కొన్నారు. 'మాది నిర్మాణం.. మీది విధ్వంసం. లక్షల నిర్మాణాలు మావి.. లక్షల కూల్చివేతలు మీవి. డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టలేదని ఇన్నాళ్లూ ప్రజలను మభ్యపెట్టారు. మరి లక్ష ఇళ్లు రాత్రికి రాత్రే ఎక్కడి నుంచి పుట్టుకొచ్చాయి. మీ జూటా మాటలు, కుట్రలు, మెదడు తక్కువ పనుల ద్వారా జరుగుతున్న నష్టాన్ని నివారించేందుకు నేడు కేసీఆర్ పాలనలో జరిగిన నిర్మాణాలే దిక్కయ్యాయి'.. అని కేటీఆర్ మండిపడ్డారు.

ఎనుముల కాదు.. ఎగవేతల రేవంత్‌రెడ్డి: హరీశ్‌రావు



సాక్షి, సిద్దిపేట/నంగనూరు: హామీలన్నీ తుంగలో తొక్కుతున్న సీఎం.. ఇక నుంచి ఎనుముల రేవంత్‌రెడ్డి కాదని, ఎగవేతల రేవంత్‌రెడ్డి అని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. సిద్దిపేట జిల్లా నంగనూరు మండలకేంద్రంలో శుక్రవారం రైతు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హరీశ్‌రావు మాట్లాడుతూ దసరాలోపు రైతులందరికీ రుణ మాఫీ చేయాలని, లేకపోతే రైతులందరితో కలిసి సచివాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ జరిగే వరకు రేవంత్‌రెడ్డి గుండెల్లో నిద్రపోతా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని చెబుతున్న సీఎం.. మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ ఎలా నిండిందో చెప్పాలన్నారు.

పేదల జోలికొస్తే ఊరుకోబోం

రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన: బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్



చైతన్యపురి (హైదరాబాద్): రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన నడుస్తోందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. ఎమర్జెన్సీ కాలంలో వేల మంది గుడిసెలను కూల్చేసి ఓ కంపెనీకి కట్టబెట్టిన సంజయ్ గాంధీకి వారసుడిగా సీఎం రేవంత్‌రెడ్డి పిచ్చిపనిచేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం చైతన్యపురి మూసీ పరీవాహక ప్రాంత బస్తీలలో ఈటల పర్యటించారు. పేదలకు మద్దతుగా మధ్యాహ్నం నుంచి సాయంత్రం దాకా ధర్నా చేశారు. సీఎం రేవంత్ యముడిలా వ్యవహరిస్తున్నాడే తప్ప.. వారి ఆక్రందనలు వినడం లేదని మండిపడ్డారు. రెవెన్యూ అధికారులు పేదల వద్దకు వెళ్లి ఇళ్లు ఖాళీ చేయకపోతే.. బుల్డోజర్లతో కూల్చేస్తామని, డబుల్ బెడ్రూమ్ ఇల్లుకూడా రాదని బెదిరిస్తున్నారని ఈటల ఆరోపించారు. ఏకపక్షంగా కూల్చివేతలు జరిపితే సీఎం ఇంటిని ముట్టడిస్తామన్నారు.

ముఖ్యమంత్రి నిర్ణయం సరికాదు: ఆర్.ఎస్. ప్రవీణ్

నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటుతో ప్రకృతి విధ్వంసం



తాండూరు: వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం సరైంది కాదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం తాండూరుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటుతో వందల ఏళ్ల నాటి చెట్లను తొలగించాల్సి వస్తుందని తెలిపారు. ప్రకృతి విధ్వంసకరమైన ఈ కేంద్రం ప్రజల మనుగడకు ప్రమాదకరమని అన్నారు. రాడార్ సెంటర్ ఏర్పాటు చేయాలనుకుంటే సీఎం రేవంత్ సోదరులకు ఉన్న 5 వేల ఎకరాల్లో ఎక్కడైనా ఏర్పాటు చేయాలని సూచించారు. హామీలను నెరవేర్చకుండా హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూలుస్తున్న ప్రభుత్వానికి తగిన శాస్తి తప్పదని హెచ్చరించారు.


విద్యార్థుల్లో పర్యాటక స్పృహకే 'తెలంగాణ దర్శిని'

సాక్షి, హైదరాబాద్: విద్యార్థుల్లో పర్యాటక రంగం పట్ల స్పృహ అంతంతే. ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు రావటం సంగతి అటుంచితే స్థానిక విద్యార్థులూ వాటిని సందర్శించేందుకు ఆసక్తి చూపటం లేదు. దీనిని గుర్తించిన రాష్ట్రప్రభుత్వం విద్యార్థుల్లో పర్యాటక రంగంపై ఆసక్తి పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉచితంగా రాష్ట్రంలో పర్యాటక, చారిత్రక ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పిస్తున్నట్టు సీఎం రేవంత్ తెలిపారు. ఇందుకోసం తెలంగాణ దర్శిని పేరుతో జీవో జారీ చేశారు. రెండో తరగతి నుంచి డిగ్రీ విద్యార్థుల వరకు వీటిల్లో పాల్గొనేందుకు అర్హులు. లక్ష మంది విద్యార్థులు పర్యటనలకు వెళ్లేలా కార్యాచరణ రూపొందించారు.

'హైడ్రా'కు చట్టబద్ధత ఏంటి?

మళ్లీ అడుగుతున్నాం.. నోడల్ ఏజెన్సీకి ఎందుకంత దూకుడు.. హైడ్రా తీరుపై హైకోర్టు ఆగ్రహం

- ముందు రోజు నోటీసులు ఇచ్చి తెల్లారే కూల్చేస్తారా?
- సెలవు రోజు కూడా కనీస అవకాశం ఇవ్వరా?
- కోర్టు పరిధిలో ఉన్న ఆస్తిని ఎలా నేలమట్టం చేస్తారు?
- హైడ్రా కమిషనర్ నేరుగా హాజరై వివరణ ఇవ్వాల్సిందే..
- 30న ఉదయం 10.30కు రావాలని కోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ''గతంలోనూ అడిగాం.. మరోసారి అడుగుతున్నాం. 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్, అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)'కి ఉన్న చట్టబద్ధత ఏమిటో చెప్పండి''అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. నోడల్ ఏజెన్సీ ఎందుకు అంత దూకుడుగా వెళ్తుందో అర్థంకావడం లేదని.. శనివారం నోటీసులు అందితే ఆదివారం ఉదయం కూల్చివేస్తారా అని అసహనం వ్యక్తం చేసింది. 'కనీసం సెలవు రోజు కూడా అవకాశం ఇవ్వరా? సోమవారం వరకైనా ఆగే పరిస్థితి లేకపోవడానికి కారణం ఏమిటో చెప్పండి'అని హైడ్రా కమిషనర్‌ను ఆదేశించింది. దీనిపై ఈ నెల 30న తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలని తేల్చిచెప్పింది.

కోర్టు పరిధిలో ఉన్నా కూల్చివేతతో..

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట్ గ్రామ పంచాయతీ నుంచి 2022 నవంబర్ 10న మహ్మద్ రఫీ భవన నిర్మాణ అనుమతి పొందారు. ఈ మేరకు సర్వే నంబర్ 165, 166లోని తన 270 గజాల స్థలంలో 24 నెలల్లో అంటే 2024 నవంబర్ 10 కంటే ముందు నిర్మాణం పూర్తి చేయాలి. ఈ మేరకు పూర్తి చేశారు. ఈ నిర్మాణాన్ని గణేశ్ అనే నిర్మాణ సంస్థ కొనుగోలు చేసింది. అయితే ఈ నిర్మాణం అక్రమమంటూ తహసీల్దార్, హైడ్రా దాన్ని కూల్చివేసేందుకు ప్రయత్నిస్తున్నారని మహ్మద్ రఫీ, గణేశ్ నిర్మాణ సంస్థ ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ విచారణ సందర్భంగా తాము ఎలాంటి కూల్చివేత కార్యక్రమం చేపట్టడం లేదని, అధికారులెవరూ ఇంతవరకు ఆ భవనాన్ని సందర్శించలేదని హైడ్రా కోర్టుకు వెల్లడించింది. దీంతో పిటిషనర్ల భవనం విషయంలో జోక్యం చేసుకోవద్దని అధికారులను ఆదేశిస్తూ కోర్టు విచారణను ముగించింది. మరోవైపు సదరు భవనానికి నిర్మాణ అనుమతి రద్దు చేస్తూ అధికారులు ఇచ్చిన నోటీసులను కూడా పిటిషనర్లు సవాల్ చేశారు. ఈ పిటిషన్‌లో విచారణ చేపట్టిన కోర్టు.. నోటీసులను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఆ విచారణ ఇంకా పెండింగ్‌లో ఉంది. అంతేగాకుండా ఆ నిర్మాణం అక్రమమంటూ, ప్రభుత్వ భూమిలో నిర్మించారంటూ అధికారులు ఇచ్చిన నోటీసులకు పిటిషనర్లు వివరణ కూడా ఇచ్చారు. ఈ వివరణపై సంతృప్తి చెందని తహసీల్దార్.. 48 గంటల్లో బిల్డింగ్ ఖాళీ చేయాలంటూ ఈ నెల 20న స్పీకింగ్ ఆర్డర్ ఇచ్చారు. 22న కూల్చివేత చేపట్టారు. దీంతో పిటిషనర్లు మరోసారి హైకోర్టును ఆశ్రయించారు.

ఒక్కరోజులోనే వచ్చి నేలమట్టం చేశారు..

ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది జి.నరేందర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ''ఈ నెల 20న ఇచ్చిన స్పీకింగ్ ఆర్డర్ 21న సాయంత్రం పిటిషనర్‌కు అందింది. ఆదివారం ఉదయం 7.30 గంటలకే అధికారులు భవనం వద్దకు వచ్చారు. బుల్డోజర్లు, జేసీబీతోపాటు సిబ్బందిని మోహరించారు. భవనంలోని సామగ్రిని బయటికి విసిరేశారు. విద్యుత్ కట్ చేసి, నిర్మాణాన్ని నేలమట్టం చేశారు. కోర్టు ఆదేశాలు ఉన్నాయని చెప్పినా పట్టించుకోలేదు..''అని కోర్టుకు విన్నవించారు. దీనికి సంబంధించిన ఫొటోలను కూడా అందజేశారు. మరోవైపు హైడ్రా కమిషనర్ ఇచ్చిన రాతపూర్వక వివరాలను హైడ్రా తరఫు స్టాండింగ్ కౌన్సిల్ కటిక రవీందర్‌రెడ్డి కోర్టుకు సమర్పించారు. ''తహసీల్దార్ నుంచి ఈ నెల 21న హైడ్రాకు లేఖ అందింది. జూలై 19న ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 99 ప్రకారం ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ మా బాధ్యత. నోడల్ ఏజెన్సీగా స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహిస్తున్నాం. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట్ గ్రామం సర్వే నంబర్ 164లోని ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించడానికి తహసీల్దార్ విజ్ఞప్తి మేరకు చర్యలు చేపట్టాం. పోలీసులు, ఇతర సిబ్బందితోపాటు యంత్రాలను పంపించాం''అని కోర్టుకు వివరించారు.

కోర్టు ఆదేశాలున్నా లెక్క లేదా?

ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి హైడ్రాపై ఘాటుగా స్పందించారు. ''భవనం కూల్చివేత కార్యక్రమంలో భాగస్వాములైన అమీన్‌పూర్ తహసీల్దార్, హైడ్రా కమిషనర్, అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారి, పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, పటాన్ చెరు డీఎస్పీ, టీఎస్ఎస్పీడీసీ ఏఈ(ఆపరేషన్స్) చర్యలు చట్టవిరుద్ధం. రిట్ పిటిషన్ 24724/2024లో సెప్టెంబర్ 5న ఈ కోర్టు ఇచ్చిన ఆదేశాలను ధిక్కరించారు. దీనికి సమాధానం చెప్పాల్సిందే. హైడ్రా కమిషనర్‌తోపాటు అమీన్‌పూర్ తహసీల్దార్ హాజరై వివరణ ఇవ్వాలి. ఈ నెల 30న ఉదయం 10.30 గంటలకు నేరుగా హాజరుకాలేని పక్షంలో వర్చువల్‌గా పాల్గొని సమాధానమివ్వాలి. ఈలోగా అమీన్‌పూర్ మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సి ల్ తరఫు న్యాయవాది కమిషనర్ నుంచి వివరాలు తెలుసుకుని చెప్పాలి''అని ఆదేశించారు. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

'కిమ్స్' కృష్ణయ్యను జైలుకు పంపాలి

మీడియాకు విడుదల చేసిన వీడియోలో రెండో భార్య డిమాండ్



కృష్ణవేణి



బొల్లినేని కృష్ణయ్య

సాక్షి, హైదరాబాద్: తెలుగుదేశం పార్టీ కీలక నేత, 'కిమ్స్'హాస్పిటల్ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య, ఇతర బంధువులపై ఆయన రెండో భార్య కృష్ణవేణి మరోసారి మండిపడ్డారు. దీనికి సంబంధించి తాజాగా ఓ వీడియోను మీడియాకు విడుదల చేశారు. 'బొల్లినేని కృష్ణయ్య మొదటి భార్య సుజాత చనిపోయిందని మాయమాటలు చెప్పి నన్ను పెళ్లి చేసుకున్నారు. నా ముగ్గురు సంతానంలో ఇద్దరిని కృష్ణయ్య తీసుకువెళ్లారు. నన్ను, పిల్లల్ని కలవనీయలేదు. కనీసం వారిని చూపించలేదు. నా కుమారుడికి 20 ఏళ్లు వచ్చాక మొదటిసారి కలిశా. అప్పుడే నా కుమార్తెను వేరే వారికి ఇచ్చినట్లు తెలిసింది. దీనిపై కృష్ణయ్యను నిలదీయగా పరుష పదజాలంతో దూషించారు. అప్పటి నుంచి నన్ను దూరం పెడుతున్నారు. నన్ను ఏదో ఒకటి చేయాలని కుట్ర పన్నుతున్నట్లు అర్థమై పోలీసులకు ఫిర్యాదు చేశా. నా పిల్లల పుట్టుకకు సంబంధించిన ప్రతి ధ్రువీకరణ పత్రం నా వద్ద ఉంది. అయితే కృష్ణయ్య ఆస్తుల కోసం మొదటి భార్య సుజాత తరఫు వాళ్లు కుట్రపన్నారు. నా కుమార్తెను లోటస్ హాస్పిటల్ ఎండీ హేమమాలిని ఆమె భర్త ప్రసాద్ తీసుకొని వారే తల్లిదండ్రులు అన్నట్లుగా బర్త్ సర్టిఫికెట్లను ఫోర్జరీ చేశారు. దీనిపై అన్ని ఆధారాలు సేకరించి సీసీఎస్ పోలీసులకు అందించాను. నా పిల్లల్ని దిక్కులేని వారిని చేసి సుజాత, హేమమాలిని తదితరులు ఈ కథ నడిపారు. హేమమాలిని పెద్ద విలన్. తొలుత ఆమెను జైలుకు పంపాలి. నా భర్తతో కలిసి రెమిడీ హాస్పిటల్ నుంచి నకిలీ పత్రాలు తీసుకున్నారు. వారందరినీ జైలుకు పంపితేనే నాకు న్యాయం జరుగుతుంది'అని వీడియోలో కృష్ణవేణి పేర్కొన్నారు. రెండో భార్య సంతానాన్ని మొదటి భార్య, మరో బంధువు సంతానంగా చూపుతూ నకిలీ పత్రాలు సృష్టించారన్న ఆరోపణలపై కృష్ణయ్యపై క్రిమినల్ కేసు నమోదవడం తెలిసిందే.

ఉమ్మడి జిల్లాల్లో కేన్సర్ రీజనల్ సెంటర్లు

మొదట 5 జిల్లాల్లో ఏర్పాటుకు సన్నాహాలు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌కే పరిమితమైన కేన్సర్ వైద్య సేవలు జిల్లాలకు కూడా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్, రంగారెడ్డి మినహా అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో కేన్సర్ రీజనల్ సెంటర్లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. తొలిదశలో కొత్తగూడెం, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, కరీంనగర్‌లో సెంటర్లు నెలకొల్పాలని యోచిస్తోంది. కేన్సర్ లక్షణాలను గుర్తించడం, స్క్రీనింగ్ చేయడం, ఆయా జిల్లాల్లో ఉన్న కేన్సర్ పేషెంట్లకు ఎంఎన్‌జే ఆస్పత్రి వైద్యులు సూచించిన చికిత్సను అందించడం ఈ సెంటర్ల ప్రథమ లక్ష్యం. ఇందుకోసం ఆయా సెంటర్లలో ఆంకాలజిస్టులు, రేడియాలజిస్టులను నియమించడంతోపాటు, జిల్లా ఆస్పత్రుల్లో పనిచేసే డాక్టర్లు, సిబ్బందికి శిక్షణ ఇస్తారు. వరంగల్‌లో ఇప్పటికే ఉన్న రీజనల్ కేన్సర్ సెంటర్‌ను హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే తరహాలో పూర్తి స్థాయి వైద్య సేవలు అందేలా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

కొడంగల్‌లో విద్యార్థులకు అల్పాహారం

సాక్షి, హైదరాబాద్: కొడంగల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందించనున్నారు. ఈ మేరకు వియాట్రిస్, హెచ్‌కేఎమ్ చారిటబుల్ ఫౌండేషన్ మధ్య ఒప్పందం కుదిరింది. శుక్రవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఎంవోయూపై ఫౌండేషన్ సీఈవో కౌంతేయ దాస, వియాట్రిస్ కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్స్, అడ్మినిస్ట్రేటివ్ హెడ్ మిషెల్ డొమినికా సంతకాలు చేశారు. దీనికి సంబంధించి వియాట్రిస్ సంస్థ రూ.6.4 కోట్ల విరాళాన్ని అందించింది.

సీఎంను కలసిన జపాన్ కాన్సుల్ జనరల్: చెన్నైలో ఉండే జపాన్ కాన్సుల్–జనరల్ టకాహషి మునియో రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

'రెడ్ మార్క్' గోబ్యాక్!

▶ మొదటి పేజీ తరువాయి

అడుగడుగునా అడ్డుకున్నారు. రోడ్లపై బైఠాయించి గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. వారిని చెదరగొట్టే ప్రయత్నం చేసిన పోలీసులపైనా తమ ఆక్రోశం వెళ్లగక్కారు. అభివృద్ధి అంటే ప్రజలకు మంచి జరగాలని.. తమను ముంచి చేసే అభివృద్ధి ఎందుకంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొందరు మహిళలు బాధతో శాపనార్థాలు పెట్టారు. మరికొన్ని ప్రాంతాల్లో భారీ పోలీసు బందోబస్తు మధ్య సర్వే బృందాలు ఇళ్ల మార్కింగ్ కొనసాగిస్తున్నాయి. మూసీ పరీవాహకంలో తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేసుకున్న కొన్ని కుటుంబాలు పునరావాసం కింద డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇస్తే తరలివెళ్లేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినా.. పక్కా ఇళ్లు కట్టుకున్నవారు కూల్చివేతను, తరలిపోవడాన్ని అత్యంత తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కష్టపడి కట్టుకున్న ఇంటిని కూల్చేస్తే ఎలా బతకాలంటూ చైతన్యపురి వినాయక్‌నగర్ కాలనీలో మహేశ్ అనే యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇంటికి మార్కింగ్ చేసేందుకు వచ్చిన అధికారుల ఎదుట తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. తన భార్య 9 నెలల గర్భిణి అని, తన ఇల్లు కూల్చేస్తే ఎక్కడికి వెళ్లాలంటూ.. ఒంటిపై కిరోసిన్ పోసుకున్నాడు. స్థానికులు, పోలీసులు వెంటనే అతడిని అడ్డుకున్నారు. అదే ప్రాంతంలో మరో మహిళ తమ ఇల్లు పోతే ఎలాగనే కలతతో రోదిస్తూ స్పృహతప్పి పడిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. చైతన్యపురిలో బాధితులకు మద్దతుగా బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి, పలువురు కార్పొరేటర్లు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు.

తహసీల్దార్ ఆఫీసును ముట్టడించి..

మూసీ పరీవాహకంలో లంగర్‌హౌస్‌లోని వివిధ బస్తీల్లోని ఇళ్లకు అధికారులు గురువారం రాత్రి మార్కింగ్స్ వేశారు. అలా మొఘల్‌నగర్ రింగ్‌రోడ్డు వైపు వెళ్లే ప్రయత్నం చేయగా.. అక్కడి బాధితులు రాళ్లు పట్టుకొని ఉన్నారన్న హెచ్చరికలతో వెళ్లలేదు. అప్పటికే స్థానికులు ఆందోళనకు సిద్ధమయ్యారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ అక్కడికి చేరుకుని.. రాత్రివేళ ఆందోళనలు వద్దని చెప్పడంతో వెనక్కి తగ్గారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముట్టడికి వెళ్లారు. తహసీల్దార్ లేకపోవడంతో ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. రెండు గంటల పాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి.

మూడు గంటలు దిగ్బంధం

కార్వాన్‌లోని జియాగూడ, పరిసర ప్రాంతాల వారు.. సర్వేకు వచ్చిన అధికారులను అడ్డుకుని భారీ ఆందోళనకు దిగారు. ఇక్కడి ప్రధాన రహదారిని మూడు గంటల పాటు దిగ్బంధించారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి.. అధికారులు గోబ్యాక్ అంటూ నిరసన వ్యక్తం చేశారు. తమ ఇళ్లను కూల్చనివ్వబోమని, ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. దీనితో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.

కంటిమీద కునుకు కరువు!

మూసీ పరీవాహక ప్రాంతాల్లోని నివాసితులకు కంటిమీద కునుకు కరువైంది. జీవితకాలం సంపాదించి కట్టుకున్న ఇళ్లను కూల్చేస్తారనే ఆందోళనతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. తమ ఇళ్లను కూల్చివేసి పాపం మూటగట్టుకోవద్దంటూ వేడుకుంటున్నారు. ఉదయం ఆరేడు గంటల నుంచే బస్తీల్లో అలజడి కనిపిస్తోంది. పెద్దలు పనులకు వెళ్లకుండా, పిల్లలను బడులకు పంపకుండా ఇళ్లలోనే ఉంటున్నారు. ఎవరెవరు బస్తీలోకి వస్తున్నారు, అధికారులు వస్తున్నారా అని ఆందోళనగా చూస్తూ ఉండిపోతున్నారు.

ఇంటిని ఖాళీ చేసే మాటేలేదు




30ఏళ్లుగా ఉంటున్నాం. ఇప్పుడు కూలగొడతామంటూ ఊరుకునే మాటే లేదు. ఎక్కడికి వెళ్లాలి? మా పిల్లలు ఇక్కడే పుట్టారు. ఇక్కడే పెరిగారు. మేం అన్ని పన్నులు కడుతున్నాం. ఇక్కడే బతుకుతాం. – నవనీత, కమలానగర్

భవిష్యత్తు ఆశలను కూల్చేస్తారా?



పైసా పైసా కూడబెట్టి చిన్న ఇల్లు కట్టుకున్నాం. భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో బతుకుతున్నాం. ఆకస్మాత్తుగా ఇల్లు కూల్చేస్తే.. ఇల్లు మాత్రమేకాదు. భవిష్యత్తు ఆశలూ పోయినట్టే. మా బతుకులను బజారున పడేయొద్దు. – స్వప్న, గోల్నాక

అనుమతులు తీసుకుని ఇళ్లుకట్టుకున్నాం



ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని అనుమతులు తీసుకుని బ్యాంకు లోన్‌తో ఇళ్లు కట్టుకున్నాం. 70–80 ఏళ్ల వయసున్న వృద్ధ తల్లిదండ్రులు ఇంట్లో ఉన్నారు. ఇప్పుడు ఇల్లు కూల్చివేస్తామని నోటీసులు ఇస్తున్నారు. ఇదేం న్యాయం? మనం ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా? – లక్ష్మి, న్యూమారుతీనగర్

56 ఏళ్లుగా ఉంటున్నాం.. ఎక్కడికి వెళ్లాలి?



1968 నుంచి అంటే 56 ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నాం. ఇక్కడివారంతా బ్యాంకు రుణాలు తీసుకుని ఇళ్లు కట్టుకుంటున్నారు. హైటెక్ సిటీ కంటే సేఫ్‌గా ఉంటున్నాం. ఏ ఇబ్బందులూ తలెత్తలేదు. ఇప్పుడు మూసీ సుందరీకరణ పేరిట రోడ్ల పాలు చేస్తున్నారు. మేమేం కబ్జా చేసి ఇళ్లు కట్టుకోలేదు. ఇంత ఖరీదైన ఇళ్లు కూల్చి డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇస్తారా? న్యాయం కోసం పోరాడుతాం. – ఉపేందర్, న్యూమారుతీనగర్

మూసీ నిర్వాసితులను ఆదుకుంటాం

- మూసీ రివర్ ఫ్రంట్ ఎండీ దాన కిషోర్
- డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వడంతోపాటు ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటాం
- కొత్త ప్రాంతాల్లోని స్కూళ్లలో నిర్వాసితుల పిల్లలకు ప్రవేశాలు కల్పిస్తాం
- అవసరమైతే గురుకులాలల్లో చేర్చేందుకూ ప్రయత్నిస్తామని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: మూసీ ప్రాజెక్టు కింద నిర్వాసితులయ్యే కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ దాన కిషోర్ చెప్పారు. శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని కార్యాలయంలో మూసీ పౌర సంస్థల ప్రతినిధులతో సుదీర్ఘంగా నిర్వహించిన సమావేశంలో సలహాలు, సూచనలు స్వీకరించారు. అనంతరం మాట్లాడారు. హైదరాబాద్ నగర భవిష్యత్తును కాపాడాలంటే.. మూసీ నదిని పునరుద్ధరించాల్సిందేనని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఏకపక్షంగా కాకుండా.. ఎన్జీవోలు, నిర్వాసిత కుటుంబాలతో చర్చించి, తరలింపు, పునరావాస కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రతి నిర్వాసిత కుటుంబానికి జీవనోపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పట్టా ఉంటే పరిహారం, ప్రయోజనాలు

త్వరలోనే బఫర్ జోన్‌లో నిర్మాణాల సర్వే, మార్కింగ్ ప్రక్రియ చేపడతామని దాన కిశోర్ తెలిపారు. వారికి పునరావాస చట్టం ప్రకారం.. పరిహారం, ప్రయోజనాలు అందిస్తామని, ఆ తర్వాతే నిర్మాణాలను తొలగిస్తామని చెప్పారు. నిర్వాసిత కుటుంబాల్లోని విద్యార్థుల చదువు దెబ్బతినకుండా.. వారిని తరలించిన ప్రాంతంలోని పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారిని గురుకులాల్లో కూడా చేర్పిస్తామన్నారు. మూసీ పునరావాస ప్రక్రియ సజావుగా జరిగేందుకు ఉన్నతాధికారులతో హైలెవెల్ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు.

'మంత్రితో ముఖాముఖి'కి 320 అర్జీలు

తక్షణమే కొన్ని సమస్యలకు మంత్రి ఉత్తమ్ పరిష్కారం



గాంధీభవన్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మంత్రితో ముఖాముఖి కార్యక్రమానికి ప్రజల నుంచి భారీ స్పందన వస్తోంది. ఈ నెల 25న గాంధీ భవన్‌లో ఈ కార్యక్రమం ప్రారంభమవగా శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి తమ సమస్యలు తెలియజేశారు. మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరై ప్రజల నుంచి 320కిపైగా దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు మంత్రి ఉత్తమ్ సిఫారసు చేశారు. కొన్ని దరఖాస్తులను వెంటనే పరిష్కరించేలా అధికారులతో ఆయన ఫోన్లో మాట్లాడి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎం. సునీతారావు, ఫిషర్‌మెన్ చైర్మన్ సాయికుమార్, గజ్జి భాస్కర్ యాదవ్, బొజ్జా సంధ్యారెడ్డి, రవళిరెడ్డి పాల్గొన్నారు.

మరుగుజ్జు కుటుంబానికి భరోసా..: అర్జీలు ఇచ్చేందుకు కొమురం భీం జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన మరుగుజ్జులు పాల్గుణి మల్లిక్, పూర్ణిమా మల్లిక్‌లు సోదరుడు మంగల్‌తో కలిసి గాంధీభవన్‌కు వచ్చారు. తమకు ఉపాధి కల్పించాలని మంత్రి ఉత్తమ్‌ను కోరగా తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత వారు టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌ను కలిశారు.

గల్ఫ్ బాధిత కుటుంబాలకు రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా: పొన్నం



ప్రవాసీ ప్రజావాణి కౌంటర్‌ను ప్రారంభించి, అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి పొన్నం

లక్డీకాపూల్ (హైదరాబాద్): గల్ఫ్ దేశాల్లో ప్రమాదాల్లో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్టు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గల్ఫ్‌లో పనిచేసే కార్మికుల కుటుంబాల పిల్లల చదువుకు ఇబ్బంది లు లేకుండా గురుకులాల్లో సీట్లు కల్పిస్తున్నామని చెప్పారు. శుక్రవారం బేగంపేట్‌లోని జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రవాసీ ప్రజావాణి కౌంటర్‌ను ప్రారంభించిన మంత్రి పొన్నం.. గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు పడుతున్న షేక్ హుస్సేన్ కుటుంబం నుంచి మొదటి అభ్యర్థనను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలతో గల్ఫ్ కార్మికుల కోసం సలహా కమి టీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రజావాణి నోడల్ ఆఫీసర్ దివ్య, అమరేందర్‌రెడ్డి, భీంరెడ్డి, దేవేందర్ రెడ్డి, నరేశ్‌రెడ్డి, శ్రీని వాస్‌రావు, మహ్మద్ జబ్బార్, ఉపాధ్యక్షుడు మహ్మద్ మిస్రీ పాల్గొన్నారు.

పగటి వేషగాళ్ల మాటలు నమ్మొద్దు: పొన్నం

సాక్షి, హైదరాబాద్: హైడ్రాపై పగటి వేషగాళ్ల మాటలు నమ్మొద్దని, అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట...అధికారం కోల్పోయిన తర్వాత మరో మాట మాట్లాడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. సచివాలయంలో శుక్రవారం పొన్నం విలేకరులతో మాట్లాడారు. మూసీలో ఉన్న ఆక్రమణలు తొలగించాలని స్వయంగా నాటి మంత్రి కేటీఆర్ చెప్పిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. .

సచివాలయం ముట్టడిస్తామంటే ఊరుకోం

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: గత పదేళ్లలో బీఆర్ఎస్ సర్కార్ రైతులకు చేసిన రుణమాఫీ సొమ్ము ఎంతో, తొమ్మిది నెలల కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ సొమ్ము ఎంతో? చర్చించేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు సిద్ధమా అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సవాల్ చేశారు. రుణమాఫీ విషయంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాల్సి వస్తుందనేదే హరీశ్ భయమని, అందుకే అల్టిమేటం అంటూ మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. శుక్రవారం మహేశ్‌కుమార్ గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు జమ అయ్యాయో లేదో హరీశ్‌రావు సమాధానం చెప్పాలన్నారు. సచివాలయం ముట్టడిస్తామంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, సరైన సమాధానం చెప్తామని హెచ్చరించారు.

హైడ్రా భయంతో మహిళ ఆత్మహత్య


కుమార్తెలకు ఇవ్వాలనుకున్న ఇళ్లు కూల్చేస్తారేమోనని ఉరి వేసుకుని బలవన్మరణం

కూకట్‌పల్లి (హైదరాబాద్): హైడ్రా అధికారులు తమ ఇళ్లు కూడా కూల్చివేస్తారేమో అన్న భయంతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. కూకట్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..కూకట్‌పల్లి రామాలయం సమీపంలోని యాదవబస్తీకి చెందిన గుర్రంపల్లి బుచ్చమ్మ (56).. భర్త శివయ్యతో కలిసి సొంత ఇంటిలో నివసిస్తోంది. వీరికి నల్లచెరువు సమీపంలో మరో రెండు ఇళ్లు, కారు షెడ్డు ఉన్నాయి. వీటిని అద్దెకు ఇచ్చిన భార్యాభర్తలు పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి ముగ్గురు కుమార్తెలకు వివాహాలు కావడంతో తమ ఇళ్లను వారికి ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. అయితే గత ఆదివారం హైడ్రా అధికారులు నల్లచెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్న కొన్ని అక్రమ నిర్మాణాలను తొలగించారు. వీటికి ఎదురుగానే రోడ్డుకు అవతలి వైపు బుచ్చమ్మ ఇళ్లు, కారు షెడ్డు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న నిర్మాణాలను సైతం హైడ్రా అధికారులు కూల్చేస్తారని స్థానికులు చర్చించుకుంటున్నారు. దీంతో బుచ్చమ్మ ఆందోళనకు గురై శుక్రవారం సాయంత్రం భర్త హాల్లో ఉండగానే బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. 'మా తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచి కష్టపడి మా కోసం ప్లాట్లు కొని ఇళ్లు కట్టించారు. అయితే హైడ్రా వాళ్లు చుట్టుపక్కల ఇళ్లు పడగొడుతున్నారు. మా ఇళ్లూ అలాగే అవుతాయనే టెన్షన్‌తో మా అమ్మ ఆత్మహత్య చేసుకుంది..' అని బుచ్చమ్మ కుమార్తె సరిత చెప్పింది.

హైడ్రాకు సంబంధం లేదు: కమిషనర్ రంగనాథ్

మహిళ ఆత్మహత్య సంఘటనతో హైడ్రాకు ఎలాంటి సంబంధం లేదని కమిషనర్ రంగనాథ్ శుక్రవారం రాత్రి తెలిపారు. సదరు మహిళ కుమార్తెలు ఎఫ్‌టీఎల్‌కు దూరంగా చెరువు సమీపంలో ఉంటున్నట్టుగా కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ చెప్పారన్నారు. తమ ఇళ్లు (తల్లిదండ్రులు ఇచ్చినవి) కూల్చివేస్తారేమోనన్న భయంతో కూతుళ్లు తల్లిని ప్రశ్నించారని, ఈ నేపథ్యంలో తల్లి ఆవేదన చెంది ఆత్మహత్య చేసుకున్నట్టుగా తెలిసిందని చెప్పారు.

మూసీలో సర్వేతోనూ మాకు సంబంధం లేదు: హైడ్రా గురించి భయాందోళనలు సృష్టించడం మానేయాలని సోషల్ మీడియాను రంగనాథ్ కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి కూల్చివేతను హైడ్రాకు ఆపాదిస్తున్నారని, మూసీకి సంబంధించిన ఏ సర్వేలోనూ హైడ్రా పాలుపంచుకోలేదని చెప్పారు. మూసీ నదిలో శనివారం భారీ కూల్చివేతలకు హైడ్రా ప్లాన్ చేస్తున్నట్లుగా కొన్ని సోషల్ మీడియా చానెళ్లు స్వార్థ ప్రయోజనాలే ఎజెండాగా అనేక తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. హైడ్రా ఎవరికీ ఎలాంటి నోటీసులూ ఇవ్వలేదని స్పష్టం చేశారు.



ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రుల సహాయ నిధికి రూ.5,70,000 చొప్పున విరాళం అందించిన ఇరు రాష్ట్రాల మాజీ న్యాయమూర్తులు

సాక్షి హైదరాబాద్

శనివారం । 28 । సెప్టెంబర్ । 2024



90 డేస్..స్పెషల్ డ్రైవ్

భూగర్భ జలాల పెంపు, డ్రైనేజీ సమస్యల నివారణే లక్ష్యంగా అక్టోబర్ 2 నుంచి 90 రోజుల పాటు నగరంలో జలమండలి స్పెషల్ డ్రైవ్ నిర్వహించనుంది. -10లో



సెలయేటికి..చలో..

వర్షాకాలంలో జలపాతాలను సందర్శించే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో నగరం నుంచి అందుబాటు దూరంలో ఉన్న కొన్ని జలపాతాల విశేషాలు... - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 30.0/23.0

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల ఉరుములు మెరుపులతో కూడిన గాలులతో తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది.





రంగీలా రాస్

దాండియా ఆటలు..అదిరేటి స్టెప్పులు..వినసొంపైన గీతాలతో 'రంగీలా రాస్' అదిరిపోయింది. సోమాజిగూడ విల్లామేరీ ఉమెన్స్ కాలేజీ ఇందుకు వేదికైంది. శుక్రవారం ఇక్కడ దసరా నవరాత్రుల నేపథ్యంలో 'రంగీలా రాస్' పేరుతో మినీ నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులతో దాండియా ఆడుతూ, డీజేకు అనుగుణంగా స్టెప్పులు వేస్తూ సందడి చేశారు. కాగా ఈ ఈవెంట్ ద్వారా సేకరించిన నిధులను ఉస్మాన్‌గంజ్‌లోని బాల్యం అనాథాశ్రమంలోని కొంతమంది విద్యార్థులను దత్తత తీసుకునేందుకు ఉపయోగిస్తామని కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఫిలోమినా, సెక్రటరీ చిన్నమ్మ తెలిపారు. - పంజగుట్ట

డిస్కంలో ఇంజనీర్ల బదిలీలకు రంగం సిద్ధం

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లో ఏళ్లుగా ఒకే చోట పాతుకపోయిన ఇంజనీర్ల బదిలీకి రంగం సిద్ధమైంది. నగర పరిధిలో రెండేళ్లు దాటిన ప్రతి ఒక్కరిని ఒక సర్కిల్ నుంచి మరో సర్కిల్‌కు బదిలీ చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం మార్గదర్శకాలు జారీ చేశారు. అంతేకాదు ఇప్పటి వరకు ఫోకల్ పోస్టుల్లో పని చేసిన వారిని, ఇక నాన్ ఫోకల్ పోస్టుల్లోకి బదిలీ చేయనున్నారు. ఏఈ మొదలు డీఈ వరకు బదిలీ అవుతారు. అన్ని సర్కిళ్లలో 50 శాతం మంది ఉద్యోగులకు స్థాన చలనం కల్పించనున్నారు. కాగా..ఫోకల్ పోస్టులను దక్కించుకునేందుకు పలువురు ఇంజనీర్లు భారీ ప్రయత్నాలు చేస్తున్నారు. తమకు పరిచయం ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కోరుకున్న ప్రాంతంలో పోస్టింగ్ కోసం కొందరు సీఎండీపై ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలిసింది.

స్వచ్ఛతలో అందరి భాగస్వామ్యం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపు



ఇందిరానగర్ బస్తీలో స్థానికులతో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్

బంజారాహిల్స్: స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ భారత్ సాధ్యమవుతుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. స్వచ్ఛతకి భాగీదారి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఖైరతాబాద్‌లోని ఇందిరానగర్ కాలనీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారు. ముందుగా ఇందిరానగర్ కాలనీలో పర్యటించి కాలనీ స్థితిగతులను, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ మన ఇల్లు, పరిసరాలు మన బస్తీ, మన గ్రామం, మన రాష్ట్రం, మన దేశం పరిశుభ్రంగా.. స్వచ్ఛంగా..సురక్షితంగా ఉండాలని అన్నారు. ప్లాస్టిక్‌ను వినియోగించరాదని, పూర్తిగా నిషేధించినప్పుడే భవిష్యత్ బాగుంటుందన్నారు. స్వచ్ఛతపై ఒకరి నుండి ఒకరికి అవగాహన కలగాలని, అందర్నీ జాగృతం చేయాలని కోరారు. ఇందిరా కాలనీ ఇతర బస్తీలకు మార్గదర్శకం కావాలని, అందుకు అందరూ సహకరించాలని గవర్నర్ కోరారు. ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ రాజ్ భవన్‌కు, సెక్రటేరియట్‌కు చాలా దగ్గరగా ఉన్న ఈ కాలనీని అభివృద్ధి పర్చేందుకు గవర్నర్ దత్తత తీసుకున్నారని తెలిపారు. కాలనీ స్వచ్ఛతతో పాటు కాలనీలోని ప్రతి ఇంటిని అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకుముందు గవర్నర్ అందరితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాటా, మాట్లాడుతూ స్వచ్ఛ కార్యక్రమంపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ పి.విజయారెడ్డి, జాయింట్ సెక్రెటరీ భవానీ శంకర్, అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, జోనల్ కమిషనర్ రవి కిరణ్, శానిటేషన్ సిబ్బంది, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

మూసీ టెన్షన్!

సర్వే బృందాలకు అడుగడుగునా నిరసన సెగ

మారుతినగర్‌లో పెట్రోల్ పోసుకున్న నిర్వాసితుడు

- ఉద్రిక్తతల మధ్య కొనసాగుతున్న మార్కింగ్
- నిర్వాసితులకు జీఐఎస్ దెబ్బ
- పాత సర్వే ఆధారంగానే మార్కింగ్
- మార్క్ పడిన గృహాలకే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు?

సాక్షి, సిటీబ్యూరో:

మూసీ పరీవాహకంలో ఉద్రిక్తత కొనసాగుతోంది. ఆపరేషన్ మూసీకి వ్యతిరేకంగా నిరసన గళం తీవ్రమవుతోంది. మూసీ ప్రక్షాళనలో భాగంగా నివాసాల కూల్చివేత కోసం మార్కింగ్ చేసేందుకు వచ్చిన అధికారుల బృందాలకు రెండోరోజు శుక్రవారం తీవ్ర నిరసన ఎదురైంది. బాధితులు అడుగడుగునా అధికారులను అడ్డుకున్నారు. వాగ్వివాదానికి దిగారు. రోడ్లపై బైఠాయించి గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినదించారు. ఇళ్లకు మార్కింగ్ వేయకుండా అధికారులను వెనక్కి పంపించారు. నిర్వాసితులకు కాంగ్రెసేతర పక్షాలు మద్దతు తెలుపుతున్నాయి. చైతన్యపురిలో బాధితుల ఆందోళనలకు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సంఘీభావం ప్రకటించారు. కొత్తపేట మారుతినగర్‌లో ఒక యువకుడు ఒంటి మీద పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యా యత్నానికి దిగాడు. తన భార్య 9 నెలల గర్భిణి అని, తన ఇల్లు ఎలా కూల్చివేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

భారీ పోలీసు బందోబస్తు మధ్య..

మూసీ పరీవాహక ప్రాంతం పరిధిలో భారీ పోలీస్ బందోబస్తు మధ్య సర్వే బృందాలు మార్కింగ్ కొనసాగిస్తున్నాయి. మొదటి విడతగా మూసీ నదీగర్భం (రివర్ బెడ్) పరిధిలోని నిర్మాణాల కూల్చివేతకోసం మార్కింగ్ చేసే ప్రక్రియ గత రెండు రోజులుగా కొనసాగుతోంది. అయితే తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేసుకున్న కుటుంబాలు పునరావాసం కింద డబుల్ బెడ్‌రూమ్ అందిస్తే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నప్పటికి, పక్కా గృహాలు నిర్మించుకున్న వారు మాత్రం కూల్చివేతలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆందోళనకు దిగుతున్నారు. దీంతో మార్కింగ్‌కు ఆటంకాలు తప్పడం లేదు.

నిర్వాసితుల తరలింపు

మూసీ నిర్వాసితులైన 20 కుటుంబాలను డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయానికి తరలించి పునరావాసం కల్పించినట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం హిమాయత్‌నగర్ మండలంలోని శంకర్‌నగర్ కాలనీకి చెందిన 6 కుటుంబాలు, వినాయక వీధిలోని మూడు కుటుంబాలను మలక్‌పేట పిల్లిగుడిసెల సముదాయానికి, నాంపల్లిలోని 11 కుటుంబాలను ఆసిఫ్‌నగర్ జియాగూడ సముదాయానికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.



పునరావాసంపై అయోమయం

మూసీ నిర్వాసితులకు పునరావాసంపై అయోమయం నెలకొంది. అర్హులైన నిర్వాసితులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులను గుర్తిస్తామని స్పష్టం చేసినప్పటికీ గతంలో జీఐఎస్ సర్వే ద్వారా గుర్తించిన గృహాలపైనే మార్కింగ్ వేస్తూ ఆ కుటుంబాల వివరాలు మాత్రమే సేకరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. వాటిలో పక్కాగృహాలకు మార్కింగ్ వేయకపోవడం, ఆ కుటుంబాల వివరాలు సేకరించడం పోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. అధికారులు సైతం స్పష్టత ఇవ్వలేక పోతున్నారు. వాస్తవంగా కాంగ్రెస్ ప్రభుత్వం సరిగ్గా ఆరు నెలల క్రితం మూసీ పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ నదికి రెండువైపులా 2 కి.మీ. పరిధిలో డ్రోన్లను ఉపయోగించి ఎక్కడెక్కడ భవనాలు, ఇతర నిర్మాణాలున్నాయో గుర్తించింది. వాటిని జియో ఇన్ఫర్మేషన్ సిస్టమ్(జీఐఎస్)తో అనుసంధానం చేసింది. ప్రస్తుతం దాని ప్రకారమే రెడ్ మార్కింగ్ వేస్తూ పునరావాసం కోసం వివరాలు సేకరించి ప్రత్యేక యాప్‌లో పొందుపర్చుతున్నారు.

అన్ని గృహాలపై ఆపరేషన్

మూసీ ప్రక్షాళనలో భాగంగా మొదటి విడతగా నదీ గర్భంలోని నివాసాలపై ఆపరేషన్‌కు రంగం సిద్ధమైంది. ఇప్పటికే కూల్చివేత బాధ్యతలను హైడ్రాకు అప్పగించింది. దీంతో నదీగర్భం పరిధిలోని గల ఆర్‌బీ–ఎక్స్(రివర్ బెడ్) మార్కింగ్ పడిన గృహాలతో పాటు దాని వెంట ఉన్న గృహాలు సైతం కూల్చివేయక తప్పని పరిస్థితి ఖాయంగా కనిపిస్తోంది.

వేల సంఖ్యలో నివాసాలు..

మూసీ పరీవాహక పరిధి పొడువునా..నదీ గర్భంలో వేల సంఖ్యలో గృహాలు ఉన్నప్పటికీ వందల సంఖ్యలో మాత్రమే డ్రోన్ సర్వేలో గుర్తించినట్లు తెలుస్తోంది. సర్వే ఆధారంగా ప్రభుత్వం నదీ గర్భంలో సుమారు 2166 నివాసాలు మాత్రమే ఉన్నట్లు పేర్కొంటుంది. అందులో సుమారు 288 భారీ కట్టడాలు ఉన్నాయి. వాస్తవానికి ఒక్కో మండలంలోని పలు ప్రాంతాల్లో వందలాది గృహాలు నదీ గర్భంలో ఉన్నప్పటికీ జీఐఎస్ డేటా ప్రకారమే గృహాలపై రెడ్ మార్కింగ్ వేస్తూ పునరావాసం కోసం వివరాలు సేకరించడం విస్మయానికి గురిచేస్తోంది.



చైతన్యపురి పరిధిలోని మూసీ ఏరియాలో పర్యటించిన ఎంపీ ఈటల రాజేందర్

పోస్టర్లు, బ్యానర్లపై కొరడా !


- మళ్లీ అమల్లోకి నిషేధం
- ఆదాయం కోసం బల్దియా చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: వాల్‌పోస్టర్లు, వాల్‌రైటింగ్‌లపై జీహెచ్‌ఎంసీ తాజాగా నిషేధం విధించింది. ఈ మేరకు కమిషనర్ ఆమ్రపాలి ప్రకటించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంపొందించడం, సుందరీకరణ లక్ష్యంగా అనుమతులు లేని వాల్ పోస్టర్లు, వాల్ రైటింగ్‌లను నిషేధించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా గోడలపై పోస్టర్లు అంటించడం, వాల్ రైటింగ్స్ చేసినట్లైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈమేరకు ఆయా సర్కిళ్ల సంబంధిత డిప్యూటీ కమిషనర్లు తమ పరిధిలోని ప్రింటింగ్ ప్రెస్‌లు, సినిమా థియేటర్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి గోడలపై వాల్ పోస్టర్స్, సినిమా పోస్టర్లు అంటించకుండా, గోడలపై రాయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో డిప్యూటీ కమిషనర్లు అశ్రద్ధ వహించకుండా కఠినంగా వ్యవహరించాలని, అనుమతి లేకుండా వాల్ పోస్టర్లు అంటించిన, వాల్‌రైటింగ్స్ చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని, జరిమానాలు విధించాలని ఆదేశించారు. జరిమానాల వివరాల నివేదిక పంపించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

పాతపాటే ..

జీహెచ్‌ఎంసీలో పోస్టర్లు, వాల్‌రైటింగ్స్ వంటివాటిపై నిషేధం కొత్తది కాదు. పాత జీవోలనే బయటకుతీసి కొత్తగా నిషేధాస్త్రం విధించారు. గతంలోనూ కొంతకాలం కఠినంగా వ్యవహరించారు. మంత్రులు, ఇతరత్రా ప్రజాప్రతినిధులకు సైతం పెనాల్టీలు విధించారు. ఈ అంశం ఈవీడీఎం పరిధిలో ఉండగా, ఏ4 కాగితంపై 'టు లెట్' అనే రాతలు కనిపించినా ఈచలానాలు విధించారు. ఏ రాజకీయ పార్టీల సమావేశాలు జరిగిన చలానాల మోత మోగేది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ–చలానాల మోత తగ్గింది. తాజాగా, పాత అస్త్రాన్ని తీసి నిషేధం కొరడా ఝళిపించారు.జీహెచ్‌ఎంసీ ఆదాయం పెంచుకునేందుకే మళ్లీ ఈ అస్త్రం అనే వ్యాఖ్యానాలు వినపడుతున్నాయి.

పుష్పక్ బస్సు ప్రయాణికులకు 10 శాతం రాయితీ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించే పుష్పక్ బస్సు ప్రయాణికులకు 10 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ఆర్టీసీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులకు మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుంది. ముగ్గురు, నలుగురు కలిసి ఒక గ్రూపుగా ప్రయాణం చేస్తే చార్జీలపైన 20 శాతం రాయితీ ఇవ్వనున్నారు.

తెలంగాణ ఉద్యమకారులకు అండగా ఉంటాం: మంత్రి పొన్నం

రాంగోపాల్‌పేట్: తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పాటైన ప్రజాపాలన ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారులందరికీ న్యాయం జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 6వ వార్షికోత్సవ కార్యక్రమంలో సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నాటి తెలంగాణ ఉద్యమంలో సకల జనులు తమకు తోచిన విధంగా ఉద్యమంలో భాగస్వాములు అయ్యారని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉండి కూడా తాము ఉద్యమంలో కీలకపాత్ర పోషించామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఉద్యమకారుల ఆకాంక్షలను గౌరవిస్తూ రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అన్ని రకాలుగా న్యాయం చేస్తుందనే విశ్వాసం కలుగచేస్తున్నానని అన్నారు. ఉద్యమకారుల గుర్తింపుతో పాటు, 250 గజాల స్థలం, అమరవీరుల కుటుంబాలకు ఎలా సహాయం చేయాలనే అంశంపై చర్చించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళదామని ఆయన అన్నారు. ఈ ప్రక్రియను ఏడాదిలోపు అమలు చేయిస్తామని అన్నారు. అంతకు ముందు కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండరాం, ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్, వెన్నెల గద్దర్, సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, యాదవరెడ్డి, ఐలయ్య, ప్రభుగుప్తా, జ్యోతిరెడ్డి, సదానంద లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం తదితరులు



హెచ్‌ఎండీఏ దిద్దు'బాట'

ఎన్‌ఓసీలపై సమీక్ష

- గతంలో ఇచ్చిన అనుమతులపైన ఆరా
- చెరువులు, కుంటల్లో నిర్మాణాలు ఉంటే మార్కింగ్
- కొత్తగా ఇచ్చిన అనుమతులు రద్దు
- లేక్ ప్రొటెక్షన్ కమిటీ మార్గదర్శకాల మేరకు చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లు, లేఅవుట్లు తదితర నిర్మాణాల కోసం గతంలో ఇచ్చిన అనుమతులపైన దిద్దుబాటుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు ఇచ్చిన అనుమతుల్లో అక్రమమైనవి, సక్రమమైనవి తేల్చేందుకు వివిధ విభాగాల నుంచి తమకు అందిన ఎన్‌ఓసీలపైన అధికారులు దృష్టి సారించారు. ఇరిగేషన్, రెవెన్యూ, అటవీ తదితర ప్రభుత్వ విభాగాలు అందజేసిన నిరభ్యంతరపత్రాల ఆధారంగా హెచ్‌ఎండీఏ ఇచ్చిన అనుమతుల నిగ్గు తేల్చనున్నారు. ఒకవేళ తప్పుడు అనుమతులు ఇచ్చినట్లుగా తేలితే ఆ లేఅవుట్‌లలో ఎలాంటి నిర్మాణాలను చేపట్టకుండా ఆంక్షలను విధిస్తారు. అలాగే అనుమతులను కూడా రద్దు చేస్తారు. ఇప్పటికే నిర్మాణాలను చేపట్టి ఉంటే ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధులను నిర్ధారించి ఆ మేరకు మార్కింగ్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న చెరువులు, కుంటల పరిరక్షణ కోసం ప్రభుత్వం వివిధ విభాగాలతో ఏర్పాటు చేసిన లేక్ ప్రొటెక్షన్ కమిటీ (ఎల్‌పీసీ)హైడ్రా ఆధ్వర్యంలో పనిచేయనుంది. మొత్తం 17 విభాగాలకు చెందిన అధికారులతో ఇది పని చేస్తుంది. చెరువులు, కుంటలు, నీటివనరుల సంరక్షణ కోసం తీసుకోవలసిన చర్యలపైన కూడా ఈ కమిటీ నిర్ణయం తీసుకుంటుంది. ప్రస్తుతానికి హెచ్‌ఎండీఏ కమిషనర్ ఈ కమిటీకి సారథ్యం వహిస్తారు. లేక్ ప్రొటెక్షన్ కమిటీ మార్గదృకాల మేరకు హెచ్‌ఎండీఏ ఇప్పటి వరకు ఇచ్చిన నిర్మాణ అనుమతులపైన సమీక్ష చేపట్టనుంది.

మ్యాపులతో మాయాజాలం...

చెరువులు, కుంటలు, పార్కులు ఉన్న చోట నిర్మాణాలకు అనుమతులను ఇచ్చేందుకు అప్పట్లో కొందరు అధికారులు మాయాజాలం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నీటిపారుదల, రెవెన్యూ,, తదితర విభాగాలు ఇచ్చే ఎన్‌ఓసీలపైన సమన్వయం లేకుండాపోయింది. ఎవరికి వారు అడ్డగోలుగా ఎన్‌ఓసీలు ఇచ్చారు. వీటి ఆధారంగానే కొన్ని చోట్ల చెరువులు, కుంటలు ఉన్న ప్రాంతాల్లో కూడా హెచ్‌ఎండీఏ అధికారులు అనుమతులను ఇచ్చారు. కొన్ని చోట్ల మాస్టర్‌ప్లాన్‌లో సదరు స్థలం బఫర్‌జోన్‌లో ఉన్నప్పటికీ గూగుల్‌మ్యాపుల ఆధారంగా అనుమతులను ఇచ్చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. హెచ్‌ఎండీఏ రూపొందించిన మాస్టర్‌ప్లాన్ మాత్రమే ప్రామాణికమైందని ఒకవైపు చెబుతూనే మరోవైపు అందుకు విరుద్ధంగా పాత మ్యాపులతో అనుమతులను ఇవ్వడం గమనార్హం. ఈ క్రమంలో కొందరు ప్లానింగ్ అధికారులే బడా నిర్మాణ సంస్థలకు అప్పట్లో కన్సల్టెంట్లుగా, లైసెన్సింగ్ అధికారులుగా వ్యవహరించారనే ఆరోపణలు కూడా బలంగా ఉన్నాయి. పటాన్‌చెరు, ఇస్నాపూర్, దుండిగల్, ఘట్కేసర్, శంషాబాద్, మేడ్చల్, శంకర్‌పల్లి, ఇబ్రహీంపట్నం, తుర్కయంజాల్ తదితర ప్రాంతాల్లో లేక్ వ్యూప్రాజెక్టుల పేరిట వెలిసిన పలు అపార్ట్‌మెంట్లకు ఇలాంటి అనుమతులు లభించినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. చెరువులు, కుంటల పరిధిలో కొన్ని నిర్మాణాలు ఉన్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు గుర్తించినప్పటికీ రకరకాల ఒత్తిళ్ల కారణంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం హైడ్రా రంగంలోకి దిగడంతో ప్రక్షాళన పర్వం మొదలైంది. హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న సుమారు 3550కి పైగా చెరువుల పరిరక్షణలో భాగంగా ఎక్కడ ఎలాంటి అక్రమ నిర్మాణాలు, అనుమతులు ఉన్నట్లు తేలినా చర్యలు తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు మొదట కొత్తగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా తాము ఇచ్చిన అనుమతులను నిలిపివేస్తారు. ఇప్పటికే నిర్మాణాలు మొదలై ఉంటే తొలగించవలసిన కట్టడాలకు మార్కింగ్ చేస్తారు. కొన్ని ప్రాంతాల్లో చెరువులు, కుంటలు ఉన్న చోట నిర్మాణ అనుమతుల విషయంలో కొందరు అధికారులు అప్పట్లో రాజకీయ ఒత్తిళ్ల కారణంగా తలొగ్గితే, మరి కొందరు నిర్మాణ సంస్థల ఆఫర్‌ల కోసం అక్రమాలకు పాల్పడ్డట్లు ఆరోపణలు ఉన్నాయి.

వందల్లో నిర్మాణాలు...

ఇలా అడ్డగోలుగా ఇచ్చిన ఎన్‌ఓసీలు ఆధారంగా గ్రేటర్‌లో వందల సంఖ్యలో నిర్మాణాలు చేపట్టారు. కొన్ని చోట్ల బఫర్‌జోన్‌లు, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంటే మరికొన్ని ప్రాంతాల్లో చెరువులను మాయం చేశారు. కొత్తగా ఏర్పాటైన లేక్ ప్రొటెక్షన్ కమిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా హెచ్‌ఎండీఏ అధికారులు కచ్చితమైన సమీక్షలు నిర్వహిస్తే వందల కొద్దీ అక్రమ అనుమతుల గుట్టు రట్టయ్యే అవకాశం ఉంది. చిరకు కొన్ని చోట్ల పార్కుల కోసం కేటాయించిన స్థలాలను కూడా వదిలిపెట్టకుండా కబ్జారాయుళ్లు ఆక్రమించుకొని భవనాలను నిర్మించారు.

అన్ని విభాగాల్లోనూ కొందరు అధికారులు నిర్మాణ సంస్థలు, బిల్డర్లతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా ఎన్‌ఓసీలు, అనుమతులను ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో చేపట్టిన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వరాదని అప్పట్లో పలు స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసినప్పటికీ అవి బుట్టదాఖలయ్యాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కొత్త ఫైళ్లపైన ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

ప్రైవేట్ బస్సులలో ప్యానిక్ బటన్లు

- అక్టోబర్ 1 నుంచి వాహనాల తనిఖీలు
- ఫ్లై ఓవర్లపైకి సరుకు రవాణా వాహనాలకు నో ఎంట్రీ
- సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి వెల్లడి

సీసీటీవీ, డ్యాష్ బోర్డ్ కెమెరాలు తప్పనిసరి



సాక్షి, సిటీబ్యూరో: ప్రైవేట్ బస్సులలో ప్యానిక్ బటన్లు, సీసీటీవీ, డ్యాష్ బోర్డ్ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి సూచించారు. శుక్రవారం సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో ప్రైవేట్ బస్సు ట్రావెల్ ఏజెన్సీలతో సైబరాబాద్, రాచకొండ ట్రాఫిక్ పోలీసులు, ఇతర విభాగం అధికారులతో కో–ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్సు డ్రైవర్లు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారి లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు తమ డ్రైవర్ల నైపుణ్యాలు, సర్వీస్ నాణ్యతలను క్రమం తప్పకుండా మెరుగుపర్చుకోవాలని, ఈ మేరకు ప్రయాణికుల నుంచి అభిప్రాయాన్ని సేకరించాలని సూచించారు. రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఇల్లంబర్తి మాట్లాడుతూ.. అక్టోబర్ 1 నుంచి బస్సుల ఫిట్‌నెస్‌లను తనిఖీలు చేపడతామన్నారు. వాహనాల్లో గ్యాస్ స్టవ్‌లు, వంట సామగ్రి వంటివి నిషేధించాలని బస్సు ఆపరేటర్లకు సూచించారు. బస్సు యజమానులు డ్రైవర్లు, క్లీనర్లను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. మహిళా ప్రయాణికుల భద్రతను పెంపొందించేందుకు బోర్డులో మహిళా సహాయకురాలిని నియమించుకోవాలన్నారు. అత్యవసర సేవల ఫోన్ నంబర్లను ప్రదర్శించాలని సూచించారు. సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ డీ జోయల్ డేవిస్ మాట్లాడుతూ.. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉదయం 7:30 నుంచి రాత్రి 10:30 వరకు అంతర్రాష్ట్ర ప్యాసింజర్ బస్సులకు అనుమతి లేదని తెలిపారు. పటాన్‌చెరు నుంచి బీహెచ్‌ఈఎల్ జంక్షన్ వరకు ఇంటర్‌సిటీ ప్రైవేట్ బస్‌లతో పాటు టీజీఆర్టీసీ, ఇతర ఆర్టీసీలకు చెందిన ప్రజా రవాణా వాహనాలకు మినహాయింపు ఉంటుందన్నారు. పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే, సైబర్ టవర్స్ ఫ్లైఓవర్, ఫోర్ మాల్ ఫ్లై ఓవర్, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జ్ వంటి ఫ్లై ఓవర్లపై అన్ని రకాల సరకు రవాణా వాహనాలు, భారీ, నెమ్మదిగా కదిలే వాహనాలకు అనుమతి లేదని తెలిపారు. యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ న్యాబ్) ఎస్పీ సాయి చైతన్య మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు, ఇతరత్రా నిషేధిత పార్సిళ్లను ప్రైవేట్ బస్సులలో రవాణా చేయకూడదన్నారు. ప్రయాణికుల లగేజీలను స్కానర్లతో తనిఖీ చేయాలని, అనుమానాస్పద కదలికలపై పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో రాచకొండ ట్రాఫిక్ డీసీపీ వీ శ్రీనివాసులు, అదనపు డీసీపీలు రవిచందన్ రెడ్డి, వీరన్న, ఏసీపీలు వెంకటయ్య, శ్రీనివాస్, టీజీఆర్టీసీ ఈడీ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ముందు వేషం.. ఆపై అవతారం

సిటీలో వ్యవస్థీకృతంగా సాగుతున్న నకిలీ హిజ్రాల దందా

- తొలుత పురుషులకు మహిళల వేషం వేయించి వ్యవహారం
- రోజంతా వసూళ్లు చేసినందుకు నిర్ణీత మొత్తం చెల్లింపు
- ఆపై వారికి ఆపరేషన్లు చేయించి నపుంసకులుగా మార్పు
- ఏడుగురిని అరెస్టు చేసిన నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్



సాక్షి, సిటీబ్యూరో: కొత్తగా నిర్మించిన ఇల్లు, ప్రారంభించిన దుకాణం, శుభకార్యం జరిగే చోట్లకు వచ్చిన హిజ్రాలు దూషిస్తే చెడు జరుగుతుందనే సెంటిమెంట్ చాలా మందికి ఉంటోంది. దీనిని క్యాష్ చేసుకునేందుకు అనేక మంది నకిలీ ట్రాన్స్‌జెండర్లు రంగంలోకి దిగి బెదిరింపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ దందా వ్యవస్థీకృతంగా సాగుతున్నట్లు ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. శుక్రవారం కార్ఖానా ఠాణా పరిధిలో వరుస దాడులు చేసిన అధికారులు ప్రధాన నిర్వాహకురాలైన నకిలీ హిజ్రా, ముగ్గురు సహాయకులతో పాటు నలుగురు హిజ్రా వేషం వేసుకున్న పురుషులను అరెస్టు చేశారు. ఈ మేరకు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర వివరాలు వెల్లడించారు. ఇటీవల పెరిగిపోయిన నకిలీ హిజ్రాల వేధింపుల నేపథ్యంలో నగర వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు.

లాభదాయకంగా ఉండటంతో..

ఎవరైతే పుట్టుకతో నపుంసకులుగా ఉంటారో వారిని మాత్రమే హిజ్రాలుగా పరిగణించాల్సి ఉంది. అయితే నగర వ్యాప్తంగా కూడళ్లతో పాటు దుకాణాలు, వాహనచోదకులు, పాదచారులను బెదిరించి, వారి వెంటపడి డబ్బు వసూలు చేసే నకిలీ హిజ్రాలు అనేక మందిని ఆకర్షిస్తున్నారు. ఈ దందా లాభదాయకంగా ఉందని భావించే తెలుగు రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. శివార్లలో తిష్టవేస్తూ తొలినాళ్లల్లో హిజ్రాల వేషం వేసుకుని వసూళ్లు ప్రారంభిస్తున్నారు. ఆపై నిర్ణీత మొత్తం తమ వద్దకు చేరిన తర్వాత ముంబై, పుణే సహా మహారాష్ట్రలోని వివిధ నగరాలకు వెళ్లి శస్త్రచికిత్సలు చేయించుకోవడం ద్వారా నకిలీ హిజ్రాలుగా మారుతున్నారు. ఆపై మరికొంత మందినీ తమతో చేర్చుకుని ముందు వేషం, ఆ తర్వాత అవతారం ఎత్తించి దందా కొనసాగిస్తున్నారు.

ఒక్కడు వచ్చి ఆరుగురిని 'చేరదీసి'..

శ్రీకాకుళం జిల్లా, ఆముదాలవలసకు చెందిన సురద కుమార్ కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చి యాప్రాల్‌లో స్థిరపడ్డాడు. తొలినాళ్లల్లో హిజ్రా వేషం వేసుకుని, ఆపై శస్త్రచికిత్స చేయించుకుని చాందినీగా మారి దందా నడిపాడు. కొన్నాళ్లకు అనంతపురం జిల్లాకు నల్లన్నగారి రమేష్, ఎత్తప్పగారి మల్లేష్‌లను ఆకర్షించి అదే పంథాలో జయశ్రీ,, మనీషాగా మార్చాడు. చాందినీ సహాయకులుగా మారిన వీరు తమ జిల్లాకే చెందిన కె.సురేష్, ఎస్‌కే బాషా, ఎస్‌కే షఫీ, ఎష్‌కే ఇషాక్‌లను నగరానికి రప్పించి ఆశ్రయం కల్పించారు. ఈ నలుగురితోనూ హిజ్రా వేషం వేయించిన చాందినీ వీరికి చిత్ర, ముంతాజ్, ఆషు, సమీర అనే పేర్లు పెట్టాడు. చాందినీ, జయశ్రీ, మనీషా వీరికి ఆశ్రయం ఇవ్వడంతో పాటు ఆహారం, మద్యం తదితరాలు అందిస్తూ వసూళ్లు చేయిస్తున్నారు. అలా వచ్చిన డబ్బు తీసుకునే వీరు రోజుకు ఒక్కొక్కరికీ రూ.500 చొప్పున చెల్లిస్తున్నారు. కొన్నాళ్లకు వీరికీ శస్త్రచికిత్సలు చేయించి నకిలీ హిజ్రాలుగా మార్చేందుకు పథకం వేశారు.

సీపీ ఆదేశాలతో రంగంలోకి..

రాజధానిలోని రోడ్ల పైన, చౌరస్తాల్లోనూ, దుకాణాల వద్ద ఈ నకిలీ హిజ్రాల ఆగడాలపై వరుస ఫిర్యాదులు రావడంతో కొత్వాల్ సీవీ ఆనంద్ సీరియస్‌గా తీసుకున్నారు. నగర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టాల్సిందిగా టాస్క్‌ఫోర్స్ పోలీసులను ఆదేశించారు. నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.సైదులు నేతృత్వంలో ఎస్సైలు శ్రీనివాసులు దాసు, పి.గగన్‌దీప్ కార్ఖానా ప్రాంతంలో శుక్రవారం వరుస దాడులు చేశారు. ఫలితంగా చాందినీతో పాటు ఇద్దరు సహాయకులు, హిజ్రా వేషం వేసిన వాళ్లు చిక్కారు. తదుపరి చర్యల నిమిత్తం వీరిని స్థానిక పోలీసులకు అప్పగించారు. నగరంలో ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు 100కు లేదా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసి సహాయం పొందాలని అధికారులు కోరుతున్నారు.

రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం నగరంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో నిర్ణీత సమయాల్లో, నిర్ణీత మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు అమలులో ఉండనున్నాయి. ఈ మేరకు ట్రాఫిక్ చీఫ్ పి.విశ్వప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు బొల్లారం చెక్‌పోస్టు–స్వీకార్ ఉపకార్ మధ్య, ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు తిరిగి సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు బేగంపేట–జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు మధ్య ఇవి అమలులో ఉంటాయి. సందర్భాన్ని బట్టి వాహనాలను పూర్తిగా ఆపేయడమో, దారి మళ్లించడమో చేస్తారు. ఉదయం 11 నుంచి 12 వరకు, సాయంత్రం 5.30 నుంచి 6.30 వరకు ప్లాజా జంక్షన్, టివోలీ, సికింద్రాబాద్ క్లబ్, తిరుమలగిరి చౌరస్తా, లోతుకుంట, అల్వాల్, బొల్లారం చెక్‌పోస్టు, హకీంపేట వై జంక్షన్ మధ్య తిరిగే ఆర్టీసీ బస్సులనూ ప్రత్యామ్నాయ మార్గాల్లో పంపనున్నారు. సహాయసహకారాలు అవసరమైన వారు 9010203626 నెంబర్‌కు కాల్ చేసి లేదా నగర ట్రాఫిక్ పోలీసుల అధికారిక సోషల్‌మీడియా హ్యాండిల్స్ ద్వారా సంప్రదించాలని విశ్వప్రసాద్ కోరారు.

పీపుల్స్ ప్లాజాలో 'సరస్' ప్రారంభం

వచ్చే నెల 2 వరకు కొనసాగనున్న ప్రదర్శన



సాక్షి, సిటీబ్యూరో: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న 'సరస్ ఫెయిర్ 2024' శుక్రవారం పీవీ నర్సింహారావు మార్గ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ప్రారంభమైంది. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క ఈ సందర్భంగా స్టాల్స్‌ను సందర్శించారు. ట్రాన్స్‌జెండర్ ప్రేమ్ లీలా ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించిన మంత్రులు బ్యాగ్స్ కొనుగోలు చేశారు. ఈ ప్రదర్శన బుధవారం వరకు కొనసాగనుంది.

ఏసీబీ వలలో వీఎం హోమ్ ప్రిన్సిపాల్

హుడాకాంప్లెక్స్: ఏసీబీ వలకు మరో అవినీతి చేప చిక్కింది. ఇటీవల జిల్లా అదనపు కలెక్టర్ సహా మరో ఉద్యోగి ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. తాజాగా సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభుదాస్ హోమ్‌కు నిత్యావసరాలు సరఫరా చేసే ఫుడ్ కాంట్రాక్టర్ నుంచి రూ.29 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. సరఫరా చేసిన వస్తువులకు మించి బిల్లులు వేయడంతో పాటు, కాంట్రాక్టర్ నుంచి అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేయడంతో అతను ఏసీబీని ఆశ్రయించారు. దీంతో వలపన్నిన ఏసీబీ అధికారులు శుక్రవారం అతడిని అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు.

ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్ విద్యార్థిపై కేసు నమోదు

దాడి చేశాడని సంగీత దర్శకుడు ఆర్పీ కుమారుడి ఫిర్యాదు

గచ్చిబౌలి: ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్ విద్యార్థుల గొడవ రాయదుర్గం ఠాణాకు చేరింది. ర్యాగింగ్‌పై స్కూల్ యాజమాన్యానికి ఫిర్యాదు చేసిన అంశం గొడవకు దారి తీసింది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వెంకన్న కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయక్ కుమారుడు వైష్ణవ్ శంకర్‌పల్లి మండలం, దొంతన్‌పల్లిలోని ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్‌లో బీబీఏ మూడో సంవత్సరం చదువుతున్నాడు. అదే స్కూల్ శ్యామ్ అనే విద్యార్థి బీబీఏ నాల్గో సంవత్సరం చదువుతున్నాడు. కొద్ది రోజుల క్రితం శ్యామ్ తనను ర్యాగింగ్ చేస్తున్నాడని వైష్ణవ్ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన శ్యామ్‌ను మందలించి కౌన్సెలింగ్ చేశారు. గురువారం సాయంత్రం ఇక్ఫాయ్ కాలేజీ బస్సు మణికొండ సమీపంలోకి రాగానే శ్యామ్ వైష్ణవ్‌పై దాడి చేశాడు. అంతటితో ఆగకుండా చెవి కొరకడంతో రక్తగాయాలయ్యాయి. గురువారం రాత్రి ఆర్‌పీ పట్నాయక్ రాయదుర్గం పీఎస్‌కు వచ్చి కుమారుడు వైష్ణవ్‌తో ఫిర్యాదు చేయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య



వీరేష్ (ఫైల్)

కుషాయిగూడ: ఫైనాన్సియర్ల వేధింపులు తాళలేక ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జడ్చర్లకు చెందిన వీరేష్ (30) బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చి చర్లపల్లిలో ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య లలిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొద్ది రోజులుగా ఆటో సక్రమంగా నడవకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. శుక్రవారం ఉదయం ఫైనాన్స్ వ్యాపారి ఇంటికి వచ్చి డబ్బుల కోసం గొడవ చేయడంతో మనస్తాపానికి లోనైన వీరేష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన కుటుంబ సభ్యులు అతడిని ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించగా పరీక్షించి వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భవనంపై నుంచి దూకి మహిళ ఆత్మహత్య



సాయి సింధూర మృతదేహం

మియాపూర్: తొమ్మిది అంతస్తుల భవనంపై నుంచి దూకి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ దుర్గా రామ లింగ ప్రసాద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మియాపూర్ మయూరినగర్ కాలనీ, దివ్యశ్రీ శక్తి అపార్ట్‌మెంట్‌లో భర్త నెహ్రూ, కుమారుడితో కలిసి ఉంటున్న సాయి సింధూర(29) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుంది. శుక్రవారం మధ్యాహ్నం అపార్ట్‌మెంట్ తొమ్మిదో అంతస్తు నుంచి కిందికి దూకడంతో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సాయి సింధూర మన స్తానికిలోనై ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. కాగా ప్రస్తుతం ఆమె ఆరు మాసాల గర్భవతి అని తెలిసింది. మృతురాలి తండ్రి సూర్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

90 డేస్..స్పెషల్ డ్రైవ్

- సీవరేజీ క్లీనింగ్, ఇంకుడు గుంతలపై చర్యలు
- ఓవర్ ఫ్లోకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ
- గాంధీ జయంతి నుంచి ప్రారంభం



మాట్లాడుతున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

సాక్షి,సిటీ బ్యూరో: సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీతో పాటు, భూగర్భ జలాలు పెంచాలనే సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు అక్టోబర్ 2 నుంచి డిసెంబర్ వరకు 90 రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఖైరతాబాద్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూ వచ్చే సీవరేజీ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను తగ్గించుకోవడంతో పాటు దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను గుర్తించి, శాశ్వత పరిష్కారం చూపాన్నదే స్పెషల్ డ్రైవ్ లక్ష్యమన్నారు. రోజూ అధికశాతం ఫిర్యాదులు సీవరేజీ సమస్యలపైనే వస్తున్నాయని.. వాటికి శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు. 3 నెలల పనితీరు ఎంసీసీ ఫిర్యాదులపై ప్రభావం చూపిస్తుందని వివరించారు. అధికారుల నుంచి క్షేత్ర స్థాయి వరకు సమర్థంగా పనిచేస్తే 30 నుంచి 40 శాతం ఫిర్యాదులను తగ్గించవచ్చునన్నారు.

ఇంకుడు గుంతలు తప్పనిసరి

భవిష్యత్తులో వాటర్ ట్యాంకర్ల డిమాండ్ తగ్గించాలన్న లక్ష్యంతో ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు తప్పని సరి చేసినట్లు ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. గత ఏడాది నగరంలో భూగర్భ జలాలు క్షీణించడం వల్ల ట్యాంకర్లకు డిమాండ్ ఏర్పడిందని గుర్తు చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునావృతం కాకుండా ఉండేందుకు ప్రజలంతా తమ ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు.

- ఈడీ మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ నగర శుభ్రత మురుగునీటి నిర్వహణపైనే ఆధారపడి ఉంటుందన్నారు. జలమండలి ఎంత పెద్ద ప్రాజెక్టులు చేపట్టినా.. క్షేత్ర స్థాయిలో నిత్యం చేసే తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణనే ప్రజలంతా గమనిస్తారన్నారు. దానిపైనే మన పనితీరు అంచనా వేస్తారన్నారు. అనంతరం సీవరేజీపై ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రత్యేక అధికారి జాల సత్యనారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

బురిడీ బాబా ఆటకట్టు!

- నగరంలో తిష్టవేసిన నారాయణ్‌పేట్ వాసి
- భార్యాభర్తల్ని విడగొట్టి వారి కుమార్తెకు ఎర
- మోసంతో ఆమెను రెండో పెళ్లి చేసుకున్న వైనం
- ప్రభుత్వం నుంచి వచ్చిన పరిహారం సైతం స్వాహా
- నిందితుడి అరెస్ట్



సాక్షి, సిటీబ్యూరో: సామాన్యులకు మాయమాటలు చెబుతూ, మంత్రాలు–చేతబడులకు విరుగుడు పేరుతో మోసాలకు పాల్పడుతున్న నకిలీ బాబాను సౌత్–ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతడి నుంచి బ్లాక్ మేజిక్ చేయడానికి వినియోగించే చిత్రపటాలు, తాయత్తులు, తాళ్లు స్వాధీనం చేసుకున్నట్లు అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా, నారాయణ్‌పేట్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇలియాస్ అహ్మద్‌కు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. 2012లో నగరానికి వలస వచ్చిన ఇలియాస్ అహ్మద్ బాబాగా అవతారం ఎత్తాడు. ఈ నేపథ్యంలో బేగంబజార్ ప్రాంతానికి చెందిన ఓ జంటతో అతడికి పరిచయం ఏర్పడింది. వారికి మాయమాటలు చెప్పిన ఇలియాస్ భార్యభర్తల్ని విడగొట్టాడు. ఆ మహిళను తన భక్తురాలిగా మార్చుకుని ఆమె నుంచి భారీ మొత్తం వసూలు చేశాడు. ఆమె కుమార్తెపై కన్నేసిన ఈ బురిడీ బాబా పూజల పేరుతో లోబరుచుకున్నాడు. తల్లితో పాటు తన కుటుంబానికీ విషయం తెలియకుండా సదరు యువతిని రెండో వివాహం చేసుకున్నాడు. అయినా ఆమెను తల్లి వద్దే ఉంచాడు. అనారోగ్య కారణాలతో ఆ యువతి కొన్ని నెలల క్రితం మృతి చెందింది. ప్రభుత్వం అందించిన పరిహారం ఆమె బ్యాంకు ఖాతాలో జమకావడంతో ఇలియాస్ ఆ మొత్తాన్ని తన ఖాతాలోకి బదిలీ చేసుకున్నాడు. కుమార్తె బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయం కావడంతో ఆరా తీసిన మహిళ అసలు విషయం గుర్తించి నిలదీద్దామని ప్రయత్నిస్తే ఇలియాస్ తన మకాం మార్చేశాడు. అనేక చోట్ల తిరిగి ఇతగాడు రెండు నెలల క్రితం బండ్లగూడలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని మకాం పెట్టాడు. మళ్లీ మాయలు, మంత్రాల పేరుతో దందా మొదలెట్టాడు. ఇతడి వ్యవహారంపై సమాచారం అందుకున్న సౌత్–ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం రంగంలోకి దిగింది. ఇన్‌స్పెక్టర్ కేఎస్ ప్రసాద్‌వర్మ నేతృత్వంలో ఎస్సైలు ఎం.మధు, కవియుద్దీన్, పి.సాయిరాం శుక్రవారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి ఇంటి నుంచి అనుమానాస్పద సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితుడిని బండ్లగూడ పోలీసులకు అప్పగించారు.

సిటీలో క్రెడిట్ కార్డు.. బిల్లు బరేలీలో

- వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించిన బాధితుడు
- రూ.50 వేలు నష్టపరిహారం, రూ.10 వేలు లీగల్ ఎయిడ్ నిధికి ఇవ్వండి
- ఐసీఐసీఐ బ్యాంక్‌కు రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఆదేశం

సిటీ కోర్టులు: తనకు తెలియకుండానే ఐసీఐసీఐ క్రెడిట్ కార్డు నుంచి ఐదు లావాదేవీలు జరిగినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చిందని, రూ.1.91 లక్షలు బిల్లును జారీ చేశారని, ఇందుకు ఐసీఐసీఐ బ్యాంక్ సేవా లోపమే కారణమని ఓ వ్యక్తి హైదరాబాద్ వినియోగదారుల కమిషన్–3ను ఆశ్రయించాడు. దీనిపై విచారణ చేపట్టిన కమిషన్ బాధితుడికి న్యాయం జరిగేలా తీర్పు ఇచ్చింది. అయితే తనకు సరైన న్యాయం జరగలేదని బాధితుడు రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌కు అప్పీల్ చేసుకోగా విచారణ చేపట్టిన కమిషన్ ఇన్‌చార్జి చైర్మన్ మీనా రామనాథన్, మెంబర్ వీవీ శేషుబాబుతో కూడిన బెంచ్ బాధితుడికి రూ.50 వేల నష్టపరిహారం మరో రూ.10 వేలు లీగల్ ఎయిడ్ నిధికి జమ చేయాలని ఐసీఐసీఐ బ్యాంక్‌ను ఆదేశిస్తూ తీర్పు ఇచ్చింది. వివరాల్లోకి వెళితే..సికింద్రాబాద్‌కు చెందిన సమీర్ పటేల్ ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డును కలిగి ఉన్నాడు. 2022 జనవరి 16న అతడి ఫోన్‌కు తన క్రెడిట్ కార్డు నుంచి ఐదు లావాదేవీలు జరిగాయని మెసేజ్ వచ్చింది. సదరు ఐదు లావాదేవీలు కూడా ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ సిటీలో జరిగినట్లు ఉంది. అయితే ఆ సమయంలో తాను హైదరాబాద్‌లో ఉన్నానని, క్రెడిట్ కార్డు కూడా తన వద్దే ఉన్నా రూ. 1.91 లక్షలు బిల్లు జారీ చేశారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసిన అతను బ్యాంక్ అధికారులను సంప్రదించి తన కార్డు వివరాలు కావాలని కోరాడు. తనకు జరిగిన అన్యాయం గురించి చెప్పినా వారు పట్టించుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై బ్యాంక్ అధికారులు బదులు ఇస్తూ ఫిర్యాదుదారుడి క్రెడిట్ కార్డును పేమెంట్ గేట్‌వే, సామ్‌సాంగ్ పేకి లింక్ చేశారని, అంతేకాకుండా లావాదేవీలు నిర్వహించడానికి భౌతిక క్రెడిట్ కార్డు అవసరం లేదని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన కమిషన్ ఫిర్యాదుదారుడికి సరైన సేవలు అందించనందున ఐసీఐసీఐ బ్యాంకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ అప్పీల్‌ను అనుమతిస్తూ జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పు మేరకు బాధితుడికి 30 రోజుల్లో పరిహారం అందించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఆ రెండు నగరాలను చూసి ఎంతో నేర్చుకోవాలి

కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి



అస్సాం సీఎం హిమంత బిశ్వా శర్మతో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

బంజారాహిల్స్: అస్సాం రాష్ట్రంలోని గౌహటి నగరంలో రహదారులతో పాటు ఫుట్‌పాత్‌లు, పరిసరాలన్నీ పారిశుద్ధ్యపరంగా ఎంతో పరిశుభ్రంగా ఉంటాయని, అక్కడ మున్సిపాలిటీ పనితీరుకు రహదారులు, ఫుట్‌పాత్‌లు అద్దంపడతాయని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ స్టడీటూర్‌లో భాగంగా గౌహటి, షిల్లాంగ్ నగరాల్లో పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు వచ్చారు. శుక్రవారం ఆమె ఆ నగరాల ప్రత్యేకతలు, అక్కడి పారిశుద్ధ్యంపై మాట్లాడుతూ గౌహటి నగరంలో ఇంటింటికీ చెత్త సేకరణ ఉచితంగా జరుగుతుందన్నారు. అక్కడ 60 వార్డులు ఉంటాయని, ప్రతి 10 వార్డులకు ఒక ఎన్‌జీఓ చెత్త సేకరణ బాధ్యత తీసుకుంటుందన్నారు. టెండర్ ప్రక్రియ ద్వారా ఈ ఎన్‌జీఓలకు చెత్త సేకరణ బాధ్యతలు ఇస్తారని, వీరు చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించిన తర్వాత అందులో వచ్చిన మట్టిని మొక్కలకు, నీటిని పిచికారికి, ఇతర వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి రోడ్లు వేస్తారన్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురికావని, పాదచారులు స్వేచ్ఛగా నడుస్తారన్నారు. ఈ నగరాన్ని చూసి జీహెచ్‌ఎంసీ నేర్చుకోవాల్సింది చాలా ఉందని అభిప్రాయపడ్డారు. షిల్లాంగ్ నగరంలో కూడా పారిశుద్ధ్య సమస్య ఏమాత్రం ఉండదని, నగరమంతా పరిశుభ్రంగా ఉంటుందని, ఫుట్‌పాత్‌లపై ఏ ఒక్క వ్యాపారి ఉండడని తమ పర్యటనలో తేలిందన్నారు. ఈ నగరంలో మాత్రం చెత్త సేకరణకు డబ్బులు వసూలు చేస్తారని, ఆ మేరకు పరిశుభ్రత విషయంలోనూ పెద్దపీట వేస్తారన్నారు.

శ్రీసాయి సరస్వతీ విద్యానికేతన్ హైస్కూల్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న శిరీష భవానీశంకర్

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయి సరస్వతీ విద్యానికేతన్ హైస్కూల్‌కు బెస్ట్ ప్రమోటింగ్ ఎక్స్‌పీరిమెంటల్ అవార్డు లభించింది. ఎల్డ్రోక్ ఇండియా కె–12 ఎక్స్‌పో ఆధ్వర్యంలో ఈనెల 25–26 తేదీల్లో బెంగుళూరులో ప్రమోటింగ్ ఎక్స్‌పీరిమెంటల్ అవార్డ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో నగరానికి చెందిన అనేక ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పాల్గొన్నాయి. కాగా ఈ కార్యక్రమంలో శ్రీసాయి సరస్వతీ విద్యానికేతన్‌కు అవార్డు లభించగా, స్కూల్ చైర్మన్ శిరీష భవానీశంకర్ నిర్వాహకుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో శిరీష భవానీశంకర్ మాట్లాడుతూ ఉన్నత విద్యతో పాటుగా విద్యార్థులు పాఠ్యాంశాలను త్వరగా అర్థం చేసుకునే విధంగా నూతన విధానాలను ఏర్పాటు చేసి వాటిని అవలంబిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఉషా మీనాక్షి, ఇతర టీచర్లు పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన ప్రియ



వెంగళరావునగర్: జిల్లాస్థాయిలో జరిగిన కరాటే పోటీల్లో మధురానగర్‌లోని శ్రీనిధి స్కూల్ పదో తరగతి విద్యార్థిని ఎస్.ప్రియ సత్తా చాటి కాంస్య పతకాన్ని సాధించింది. హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (హెచ్‌డీఎస్‌డీఎఫ్) ఆధ్వర్యంలో ఇంటర్ స్కూల్ కరాటే కాంపిటీషన్ 2024–25 పోటీలు గురువారం ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించారు. అండర్–17 విభాగంలో జరిగిన క్రీడా పోటీల్లో వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌కాలనీలోని శ్రీనిధి హైస్కూల్ విద్యార్థిని ప్రియ ఈ పతకాన్ని కైవసం చేసుకుంది. ఆమెకు నిర్వాహకులు కాంస్య పతకం, షీల్డ్, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రియను స్కూల్ డైరెక్టర్ కొల్లి లక్ష్మణ్‌రావు, ప్రిన్సిపాల్ గీత, వైస్ ప్రిన్సిపాల్స్ విమల, రాజేశ్వరి, టీచర్లు రావత్, సీమ, శ్రీనివాస్, రవి, మధు, పూర్ణిమ, లక్ష్మి, కరాటే టీచర్ రాజ తదితరులు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని తెలియజేశారు.

నేషనల్ మెమరీ చాంపియన్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక



నేషనల్ మెమరీ చాంపియన్‌షిప్‌కి ఎన్నికైన హైదర్‌నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

శ్రీనగర్‌కాలనీ: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇండియన్ నేషనల్ మెమరీ చాంపియన్‌షిప్‌కు ఎంపిక కావడం వారిలోని ఉన్నత ప్రతిభకు తార్కాణమని ఇండియన్ మెమరీ స్పోర్ట్స్ కౌన్సిల్ చాంపియన్‌షిప్ చీఫ్ ఇంచార్జ్ డాక్టర్ పి.శ్రీనివాసకుమార్ అన్నారు. శుక్రవారం అమీర్‌పేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదర్‌నగర్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఐదుగురు విద్యార్థులు అక్టోబర్ 20న హైదరాబాద్ బేగంపేటలో జరుగనున్న ఇండియన్ మెమరీ చాంపియన్‌షిప్‌కు ఎన్నికయ్యారని, వారికి పలు కఠిన పరీక్షలు నిర్వహించానని, వారు వారిలోని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. మెమరీ పోటీలకు ప్రభుత్వ స్కూల్ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ప్రిన్సిపాల్ కె.సాయికుమార్‌ని అభినందించారు. అంతేకాకుండా అక్వా ఫౌండేషన్ చదువుతున్న ఐదుగురు విద్యార్థులు సైతం అర్హత సాధించారని తెలిపారు.

బోరబండలో బాబా ఫసియుద్దీన్ బస్తీబాట



స్వరాజ్‌నగర్‌లో పర్యటిస్తున్న బాబా ఫసియుద్దీన్, అధికారులు

రహమత్‌నగర్ (బోరబండ): జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ శుక్రవారం డివిజన్‌లో బస్తీబాట చేపట్టారు. ఈ సందర్భంగా స్వరాజ్‌నగర్ బస్తీలో ఆయన పర్యటించి అక్కడి సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇకపై బస్తీ సమస్యల సాధన కోసం ప్రతిబస్తీలో పర్యటించడం జరుగుతుందన్నారు. బస్తీ సమస్యలపై ఇప్పటికే జీహెచ్‌ఎంసీ అధికారులతో నివేదికలు రుపొందించడం జరిగిందని చెప్పారు. త్వరలోనే నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించనున్నట్లు బాబా తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ భరత్, టీజీసీపీడీసీఎల్ ఏఈ సాయితేజా, డివిజన్ కాంగ్రెస్ నాయకులు నరసింహ, మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



మందులను అందిస్తున్న గౌతంరావు

శ్రీనగర్‌కాలనీ: స్థానిక బస్తీ, కాలనీవాసులు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతంరావు అన్నారు. శుక్రవారం ఎర్రగడ్డ డివిజన్ ఓల్డ్ సుల్తాన్‌నగర్‌లోని కమ్యూనిటీహాల్‌లో సరిత కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానికులకు డాక్టర్లు పరీక్షలు నిర్వహించి తగు మందులను అందించి పలు సలహాలు అందించి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జూబ్లీహిల్స్ ఇంచార్జ్ లంకల దీపక్‌రెడ్డి, సరిత కృష్ణ ఫౌండేషన్ చైర్మన్ సరిత, బీజేపీ నేతలు కుంబాల గంగరాజు, ప్రేమ్‌కుమార్, అట్లూరి రామకృష్ణ, ఈ.రాజేష్, ప్రసన్న పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో అధికారుల పర్యటన

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని ఇందిరానగర్ బస్తీలో గురువారం రాత్రి జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 వీధిదీపాల ఏఈ సుష్మతో పాటు సంబంధిత సిబ్బంది పర్యటించారు. బస్తీలో వీధిదీపాలు వెలగడం లేదని స్థానికుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయని, సమస్యను పరిష్కరించాలంటూ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయగా, కార్పొరేటర్‌తో పాటు అధికారులు ఇక్కడ పర్యటించి వెలగని వీధిదీపాలను పరిశీలించారు. బస్తీలో 160 వరకు వీధిదీపాలు ఉన్నాయని, 80 శాతం వెలుగుకు నోచుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. వెంటనే మరమ్మతులు చేయిస్తామని, రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని ఏఈ హామీనిచ్చారు.



ఇందిరానగర్‌లో పర్యటిస్తున్న జీహెచ్‌ఎంసీ స్ట్రీట్‌లైట్స్ ఏఈ సుష్మ

సారొస్తున్నారని పనులు చకచకా..!

- ఇందిరానగర్‌ను జల్లెడపట్టిన వివిధ విభాగాల అధికారులు
- గవర్నర్ దత్తత నేపథ్యంలో బస్తీలో పర్యటించిన అధికారులు
- చెత్తకుప్పల తరలింపు, మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు
- ఇంటింటికి తిరిగిన చెత్త ఆటోలు



నీటి నాణ్యతను పరిశీలిస్తున్న జలమండలి అధికారులు



ఇంటింటికి చెత్త సేకరిస్తున్న శాట్ ఆటోను స్కాన్ చేస్తున్న శానిటేషన్ సిబ్బంది



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్



వీధి కుక్కలను పట్టుకునేందుకు బస్తీలో తిరుగుతున్న వెటర్నరీ విభాగం సిబ్బంది

బంజారాహిల్స్: ఖైరతాబాద్ డివిజన్‌లోని ఇందిరానగర్ బస్తీని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దత్తత తీసుకుంటున్నారని తెలియగానే ప్రభుత్వ యంత్రాంగంలోని అన్ని విభాగాలు అలర్ట్ అయ్యాయి. ఎన్నిమార్లు తాము ఫోన్లు చేసినా ఒక్క సమస్య కూడా పరిష్కరించని అధికారులు శుక్రవారం తెల్లవారుజాము నుంచే అన్ని విభాగాల అధికారులు బస్తీలో తిరుగుతూ పనులు చేస్తుంటే బస్తీవాసులు ఆశ్చర్యపోయారు. శుక్రవారం బస్తీలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటించి స్థానికుల సమస్యల తెలుసుకునే కార్యక్రమం ఉండటంతో జీహెచ్‌ఎంసీ, జలమండలి, వీధి దీపాలు, శానిటేషన్, వెటర్నరీ విభాగం అధికారులు బస్తీలో పర్యటించారు. ఇంటింటికి చెత్త ఆటోలను తీసుకెళ్ళారు. బస్తీలో దెబ్బతిన్న మ్యాన్‌హోళ్ళకు మరమ్మతులు చేశారు. కలుషిత నీరు వస్తుందని చెప్పినా పట్టించుకోని అధికారులు ఇంటింటికి తిరిగి క్లోరిన్ మాత్రలు పంపిణీ చేశారు.

బస్తీ మొత్తాన్ని శుభ్రం చేసి మురుగు నిల్వకుండా చర్యలు తీసుకున్నారు. అన్ని సందుల్లో బ్లీచింగ్ చేశారు. పక్కనే ఉన్న పార్కులో ఈ మధ్య వీధి కుక్కలు ఓ వ్యక్తిని కరిచి తీవ్రంగా గాయపరిచినా పట్టించుకోని అధికారులు గవర్నర్ వస్తున్నాడని తెలియడంతో బృందాలుగా వచ్చి బస్తీలో ఉన్న వీధి కుక్కలను పట్టుకెళ్లారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

వెంకటేశ్వరకాలనీ: స్వాతంత్య్ర సమరయోధుడు, తెలంగాణ పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డితో పాటు నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన కార్యకర్తలు, నేతలు కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన చేసిన పోరాటాన్ని గుర్తుచేసుకున్నారు.

హిందూ శ్మశానవాటికను శుభ్రపర్చండి



డీఎంసీకి ఫిర్యాదు చేస్తున్న వెంకటేష్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్‌లోని ఫిలింనగర్ హకీంపేట దగ్గర ఉన్న హిందూ శ్మశానవాటికలో చెత్తాచెదారంతో పాటు పిచ్చిమొక్కలు బాగా పెరిగాయని దీంతో అపరిశుభ్రత సమస్యగా మారిందని, వెంటనే శ్మశానవాటికను బాగుచేయాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ శుక్రవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 డీసీ ప్రశాంతిని కలిసి ఫిర్యాదు చేశారు. స్పందించిన డీసీ వెంటనే శ్మశానవాటికను పరిశుభ్రం చేస్తామని, సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

ఆన్‌లైన్ మార్కెటింగ్ పేరుతో మోసం

వెంగళరావునగర్ : ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ పేరుతో మహిళ వద్ద నగదు కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జవహర్‌నగర్‌కు చెందిన స్రవంతి అనే మహిళ మార్చి నెలలో తన భర్తకు వచ్చిన వాట్సప్ సందేశం ద్వారా పార్ట్‌టైం ఉద్యోగం కోసం వెతికింది. ఈజో మార్కెటింగ్ పేరుతో ఆమెకు లింక్ వచ్చింది. హోటల్స్‌కు రేటింగ్‌తో పాటు కొన్ని టాస్క్‌లను అందించారు. వారి నిబంధనల ప్రకారం అందులో జాయిన్ అయితే అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. దీంతో ఆమె వారు అడిగిన విధంగా తొలుత రూ.9 వేలు, తర్వాత రూ.38 వేలు తన అకౌంట్ నుంచి ట్రాన్స్‌ఫర్ చేసింది. అయితే వారి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో తొలుత సైబరాబాద్ పోలీసులకు చేసి అనంతరం ఆమె మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

శ్రీనగర్‌కాలనీ: మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఈవెంట్ ఎక్స్‌పో సిల్క్, కాటన్ వస్త్రాల్లో వందశాతం నాణ్యతకు వేదికగా నిలుస్తుందని మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ వీవర్స్ సర్వీస్ సెంటర్ హెడ్ ఆఫ్ ఆఫీస్ డాక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం శ్రీనగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో అక్టోబర్ 1 నుంచి 15 వరకూ అమీర్‌పేట కమ్మ సంఘంలో నిర్వహించనున్న స్పెషల్ ఈవెంట్ ఎక్స్‌పోకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకొని చేనేత రంగంలో పద్మశ్రీలతో పాటు అనేక అవార్డులు, రివార్డులు అందుకున్న నిష్ణాతులైన చేనేతకారుల ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందించేందుకు తాము ఈ ఎక్స్‌పోను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఎక్స్‌పోను రాష్ట్ర టెక్స్‌టైల్స్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారని తెలిపారు. దేశంలో ప్రముఖ రాష్ట్రాలకు చెందిన నాణ్యమైన చెందేరి, కోల్‌కటా, నారాయణపేట్,పటోల, ఉప్పాడ, మంగళగిరి, వెంకటగిరి, కాంత, బెనారస్, గద్వాల్, గుజరాత్, టసర్, పోచంపల్లి, ఇక్కత్‌తో లాంటి వస్త్రాలను వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.

జుట్టురాలే సమస్యకు ట్రీట్మెంట్‌తో పరిష్కారం

ఎక్సోజోమ్ ఆధారిత క్సోజెన్ చికిత్సను ఆవిష్కరించిన డాక్టర్ బాత్రాస్



సాక్షి, సిటీబ్యూరో: ఓ సర్వే ప్రకారం హైదరాబాద్‌లో జుట్టు రాలే సమస్య 2002లో 23 వేలుగా ఉన్న సూచిక 2022లో 83 వేల సూచీకి ఎగబాకిందని ది ట్రైకోలాజికల్ సొసైటీ ఆఫ్ లండన్ మొదటి భారతీయ అధ్యక్షులు, డాక్టర్ బాత్రాస్ ఎండీ డా.అక్షయ్ బాత్రా తెలిపారు. వంశపారపర్యంగా సంక్రమించే జుట్టురాలే సమస్యకు పరిష్కారంగా డాక్టర్ బాత్రాస్ ఆధ్వర్యంలో అత్యాధునిక ఎక్సోజోమ్ ఆధారిత క్సోజెన్ ట్రీట్మెంట్‌ను నగరంలోని హోటల్ తాజ్ డెక్కన్ వేదికగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా.అక్షయ్ బాత్రా మాట్లాడుతూ నగరంతో పాటు దేశంలో జుట్టు రాలే సమస్య మగవారిలో 50 శాతం, మహిళల్లో 22 శాతంగా ఉందని తెలిపారు. ఈ చికిత్సలో వినియోగించే గ్రోత్ ఫ్యాక్టర్లు రిచ్ ఎక్సోజోమ్‌ల విడుదలకు ప్రేరేపిస్తాయని అన్నారు. ఇవి ఫోలికల్ స్టెమ్‌సెల్స్‌ను ప్రేరేపించి జుట్టు పెరిగేలా చేస్తుందని వివరించారు. ఈ ట్రీట్మెంట్‌లో భాగంగా మొదటి 4 సెషన్స్‌లో ఫలితాలు కనిపిస్తాయని, 15 నుంచి 20 సెషన్స్‌లో పూర్తి స్థాయిలో జుట్టు పెరుగుదల ఉంటుందని అన్నారు. సహజ చికిత్సలతో సైన్స్‌ను సమ్మిళితం చేసిన తమ పరిశోధనలు అద్భుత ఫలితాలను అందిస్తున్నాయని, భారత్‌తో పాటు యూకే, యూఏఈ వంటి 5 దేశాల్లో దా దాపు 2వందలకు పైగా క్లినిక్స్‌లో తమ సేవలు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా.డేనియల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూంలను పరిశీలించిన అధికారులు

- డబుల్ బెడ్ రూం నివాసాల్లో మూసీ బాధితులకు నివాసాలు
- 2బీహెచ్‌కే వద్ద స్థానికుల ఆందోళన

రహమత్‌నగర్: తమ బస్తీవాసులకు కేటాయించకుండా మూసీ నది పరీవాహక ప్రాంతాల బాధితులకు డబుల్‌బెడ్ రూంలు కేటాయించాలని ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని అడ్డుకుంటామని రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్ కమలానగర్ –2బీహెచ్‌కే డిగినిటీ హౌజింగ్ కాలనీ వాసులు ప్రకటించారు. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి డబుల్ బెడ్‌రూం నివాసాల వద్ద ఆందోళనకు దిగారు. గత రెండు, మూడు రోజులుగా హైడ్రా మూసీ నది పరీవాహక ప్రాంతాల్లోని నివాసాలకు కూల్చివేస్తుంది. ఈ క్రమంలోనే వారికి పునారవాసం ఏర్పాటులో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం కమలానగర్ డబుల్ బెడ్ నివాసాలను ఖైరతాబాద్ మండల రెవెన్యూ స్పెషల్ ఆర్ఐ రెవెన్యూ సిబ్బందితో వచ్చి పరిశీలించారు. ఈ సమాచారం అందుకున్న డబుల్‌బెడ్ రూం నివాసులు పెద్దఎత్తున అక్కడకు చేరుకుని ప్రభుత్వం తీసుకుబోయే నిర్ణయాన్ని వ్యతిరేకించారు. తమ బస్తీలో అందిరికి డబుల్ బెడ్‌రూం నివాసాలు కేటాయించిన తరువాతే హైడ్రా బాధితులకు కేటాయించాలని ఆందోళలకు దిగారు.

ఉద్యమాలకు స్ఫూర్తి ప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజీ



నివాళులర్పిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

లక్డీకాపూల్ : స్వాతంత్య్ర సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యమాలకు స్ఫూర్తి ప్రదాత అని జీహెచ్‌ఎంసీ కమిషనర్ కాటా ఆమ్రపాలి అన్నారు. లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ స్వయం పాలన, ఆత్మగౌరవం కోసం పోరాటం చేసిన తొలి తరం ఉద్యమనేత అని కొనియాడారు, తెలంగాణ అస్తిత్వాన్ని చాటేందుకు ఆయన చేసిన రాజీలేని పోరాటాలు ప్రతి ఒక్కరికి ఆదర్శమన్నారు. తెలంగాణ సాధన ఉద్యమం తొలి దశ నుంచి మలి దశ వరకు పోరాడి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారన్నారు. రాష్ట్ర సాధనకు పదవులను సైతం త్యజించిన త్యాగధనుడు అని, చేనేత రంగ అభివృద్ధికి కృషి చేశారని శ్లాఘించారు. ఆయన స్ఫూర్తిని కొనసాగించేందుకు మనమందరం కృషి చేసినప్పుడే వారికి గొప్ప నివాళులు అర్పించిన వారమవుతామని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు అశోక్ సామ్రాట్, యాదగిరిరావు, చీఫ్ ఎంటమాలజిస్ట్ డా.రాంబాబు, ఓ ఎస్ డి వేణుగోపాల్, పిఆర్‌ఓ విజయలక్ష్మి, ఏఎంసీ లు శారద, రమణ పాల్గొన్నారు.

అభినందనలు



ఖైరతాబాద్: టీపీసీసీ చీఫ్‌గా బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ నియమితులైన సందర్భంగా శుక్రవారం పీసీసీ రాష్ట్ర కార్యదర్శి మధుకర్ యాదవ్, సీనియర్ నాయకులు ఆవుల అనిల్ కుమార్‌లు ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిసి అభినందించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మేమంతా సహకరిస్తామని తెలిపామని మధుకర్ యాదవ్ తెలిపారు.

రహమత్‌నగర్‌లో జంక్షన్ పనులు చేపట్టాలి



శ్రీనివాస్‌కు వినతి ప్రతం అందజేస్తున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: రహమత్‌నగర్ కూడలి జంక్షన్‌లో పనులు త్వరగా చేపట్టి, ట్రాఫిక్ సమస్యలను తొలగించాలని రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి జీహెచ్‌ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఎన్ రెడ్డి మాట్లాడుతూ రహమత్‌నగర్ కూడలిలో ట్రాఫిక్ జాం కావ డం నిత్యకృత్యంగా మారిందన్నారు. ఇదే సమస్యపై తాను పలుమార్లు జీహెచ్‌ఎంసీ అధికారులను కలిసి కోరడం జరిగిందన్నారు. తాను చేసిన విజ్ఞప్తి చీఫ్ సిటీ ప్లానర్ సానుకూలంగా స్పందించారని సీఎన్‌రెడ్డి తెలిపారు.

చెత్తను తొలగించిన విద్యార్థులు



నెక్లెస్ రోడ్డులో చెత్తను తొలగిస్తున్న విద్యార్థులు

పంజగుట్ట: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమాజిగూడలోని రూట్స్ కాలేజీ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు నెక్లెస్ రోడ్డులో చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా వ్యర్థాలు, ప్లాస్టిక్‌ను రోడ్లపై పడెయ్యడం వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నిఖిల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్న పోలీసులు

పంజగుట్ట: పంజగుట్ట కూడలి నుంచి నిమ్స్ ఆసుపత్రి వరకు రోడ్డుకు రెండు వైపులా ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. సుమారు 80 ఆక్రమణల వరకు తొలగించారు. 40 మందిపై 39 (బీ) కింద కేసులు నమోదు చేశారు. ఫుట్‌పాత్‌లు ఉన్నవి పాదచారులు నడిచేందుకని ఎవరైనా ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా అన్నారు. పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బోసు కిరణ్, ఎస్‌ఐలు ఆంజనేయులు, భూమయ్యలు సిబ్బందితో కలిసి ఆక్రమణలు అన్ని తొలగించారు.

వారంలో అమెరికా వెళ్లాల్సి ఉండగా..

- మద్యం మత్తులో ట్రాన్స్‌ఫార్మర్‌ను కారుతో ఢీకొట్టిన యువకుడు
- యువతితో సహా ముగ్గురికి గాయాలు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టడంతో నుజ్జునుజ్జయిన కారు..

బంజారాహిల్స్: మరో వారం రోజుల్లో అమెరికా వెళ్లాల్సిన యువకుడు పీకలదాకా మద్యం సేవించి మత్తులో అదుపుతప్పిన వేగంతో కారు నడుపుతూ ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టగా యువతితో సహా ముగ్గురి యువకులకు గాయాలపాలైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..పెద్దపల్లి జిల్లా మంచిర్యాల మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన రోహిత్ వెంకట్ నిజాంపేటలో ఉంటున్నాడు. వారం రోజుల్లో అమెరికాకు వెళ్లాల్సి ఉండగా తన స్నేహితురాలు (22), స్నేహితులు సీహెచ్. సంతోష్ (22), చిన్మయి మునగాల (22)తో కలిసి గురువారం రాత్రి జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–36లోని డౌన్‌టౌన్ పబ్‌లో విందులో భాగంగా నలుగురూ మద్యం సేవించారు. రాత్రి ఒంటి గంట తరువాత వెంకట్ కారు (ఎస్‌ఓ 9ఎఫ్‌టీ 5111)ను నడుపుతుండగా మిగతా ముగ్గురు స్నేహితులు వెనుక కూర్చొన్నారు. నిజాంపేటకు వెళ్లే క్రమంలో కారు నడుపుతున్న వెంకట్ మద్యం మత్తులో కారును స్పీడ్‌గా నడపడటంతో జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–36లో అదుపు తప్పి ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టాడు. దీంతో కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతిని ఈ ధాటికి ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయింది. కారు నడుపుతున్న వెంకట్‌తో పాటు మిగతా ముగ్గురు స్నేహితులకు గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వీరికి డ్రంకన్ డ్రైవ్ నిర్వహించగా వెంకట్‌కు 240 బీఏసీ (బ్లడ్ ఆల్కహాల్ కౌంట్)గా, మిగతా ముగ్గురికి 220 బీఏసీగా తేలింది. నలుగురూ పీకలదాకా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయ్యింది. ఈ నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
శనివారం । 28 । సెప్టెంబర్ । 2024

అయోధ్యకు విమాన సర్వీసులు ప్రారంభం

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అయోధ్యకు విమాన సర్వీసులు మరోసారి ప్రారంభమయ్యాయి. గతంలో ఉన్న సర్వీసులు 2 నెలల క్రితం బంద్ అయినా తాజాగా ఇండిగో ఎయిర్‌లైన్స్ శుక్రవారం నుంచి మరోసారి తన సర్వీసులను ప్రారంభించింది. వారంలో నాలుగు రోజులు ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. 1.55 గంటలకు సర్వీసు ఇక్కడి నుంచి బయలుదేరుతుంది. అదేవిధంగా కాన్పూర్ సర్వీసును కూడా ఇండిగో ప్రారంభించింది. ఇది కూడా వారంలో నాలుగు రోజుల ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తుంది. శనివారం ప్రయాగ్‌రాజ్ సర్వీసును కూడా ప్రారంభించనున్నారు.

ప్రపంచ శాంతి సదస్సుకు డాక్టర్ సూరెపల్లి రవికుమార్



అబిడ్స్: కొలంబోలో జరిగే హెచ్‌డబ్ల్యూపీఎల్ 10 వార్షిక ప్రపంచ శాంతి సదస్సుకు నవభారత్ నిర్మాణ్ సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, విద్యావేత్త డాక్టర్ సూరెపల్లి రవికుమార్ ఎంపికయ్యారు. ఈ నెల 28న కొలంబోలో ప్రపంచ శాంతి సదస్సు నిర్వహించనున్నారు. సదస్సులో తెలంగాణ తరఫున పాల్గొనే రవికుమార్ ప్రపంచ శాంతిపై తన ఉపన్యాసాన్ని ఇవ్వనున్నారు. శాంతితో ఏదైనా సాధించవచ్చని, విద్యారంగం అభివృద్ధి చెందినప్పుడే శాంతిసాధన సాధ్యమవుతుందన్నారు. ప్రపంచ దేశాలన్నీ శాంతియుతంగా ఉండే విధంగా తాను పలు సూచనలు చేస్తానని ఆయన వెల్లడించారు. ప్రపంచ సదస్సులో పాల్గొనేందుకు తనకు అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

శ్రీచైతన్య కళాశాలలో ఫుడ్ పాయిజన్

మాదాపూర్: కళాశాలలు రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులకు సరైన భోజన వసతి కల్పించడం లేదని నవ తెలంగాణ విద్యార్థి శక్తి రాష్ట్ర అధ్యక్షుడు ఈ.పవన్‌కుమార్ తెలిపారు. మాదాపూర్‌లోని శ్రీచైతన్య అక్షర కో కళాశాలలో గురువారం రాత్రి ఫుడ్ పాయిజన్ కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురైనట్లు చెప్పారు. కళాశాల ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించి, అనంతరం విలేకరులతో మాట్లాడారు. అనుమతులు లేకుండా కళాశాలలను అక్రమంగా నడుపుతున్నారని, రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 100 మందికి పైగా అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రూ.2 లక్షల జరిమానా..

విద్యార్థులకు భోజన వసతి ఏర్పాటు చేస్తున్న కిచెన్, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో జీహెచ్‌ఎంసీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీచైతన్య కళాశాలకు రూ.2 లక్షల జరిమానా విధించారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమ్లేష్ పటేల్

నందిగామ: సమాజంలోని ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని, ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు, హార్ట్‌ఫుల్‌నెస్ గ్లోబల్ గైడ్ కమ్లేష్ పటేల్(దాజీ) అన్నారు. కన్హా శాంతి వనంలో కమ్లేష్ పటేల్ 69వ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీలంక దేశానికి చెందిన అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య అదనపు సెక్రెటరీ జనరల్, దలైలామా ప్రతినిధి దమింద పోరగే హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు దేశాలు, రాష్ట్రాలకు చెందిన వేలాది మంది అభ్యాసీల సమక్షంలో సామూహిక ధ్యానం చేశారు. ధ్యానం, ధ్యానంతో ప్రయోజనం గురించి వివరించారు. అనంతరం బుద్ధ గయ నుంచి తీసుకొచ్చిన మహాబోధి మొక్కను కన్హా శాంతి వనంలో నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పలు దేశాల నుంచి వచ్చిన అభ్యాసీలు, బౌద్ధ ప్రముఖులు పాల్గొన్నారు.

లులు మాల్ ప్రథమ వార్షికోత్సవం



లులు మాల్ ప్రథమ వార్షికోత్సవంలో రీజినల్ డైరెక్టర్ అబ్దుల్ ఖదీర్ తదితరులు

కూకట్‌పల్లి: లులు మాల్ ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లులు గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అష్రాఫ్ ఆలీ మాట్లాడుతూ హైదరాబాద్ లులు మాల్‌ను ఉత్తమ షాపింగ్‌గా మార్చిన వినియోగదారులకు ధన్యవాదాలు అన్నారు. రీజినల్ డైరెక్టర్ అబ్దుల్ ఖదీర్ మాట్లాడుతూ ఏడాది కాలంలో సాధించిన అభివృద్ధికి ఎంతో గర్వంగా ఉందన్నారు. మరింత కృషితో ఇదే పురోగతిని రాబోయే కాలంలో కొనసాగించే ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. లులు మాల్‌ను 10 మిలియన్లకు పైగా ఖాతాదారులు ఎంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. లక్షకుపైగా విస్తృత శ్రేణి ఉత్పత్తులు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉత్తమ ఫుడ్ కోర్టు అవార్డు, ఉత్తమ ఫుడ్ కానాయిజర్ అవార్డు, ఉత్తమ హైపర్ మార్కెట్ పురస్కారాలను లులుమాల్ అందుకున్నట్లు తెలిపారు. లులు హైపర్‌మార్కెట్ 5 స్టార్ రేటింగ్ సర్టిఫికెట్ పొందినట్లు వివరించారు. ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా లులు మాల్ వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 31 వరకు ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నామన్నారు.

మరింత ‘వండర్’లా..

వండర్‌లా ఎండీ అరుణ్ చిట్టిలప్పిల్లి

రాబోయే కొన్ని సంవత్సరాల్లో అమ్యూజ్‌మెంట్ పార్క్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతుందని, నగరంలోని తమ పార్క్‌ను మరింతగా విస్తరిస్తామని వండర్‌లా హాలిడేస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ చిట్టిలప్పిల్లి అన్నారు. దేశంలోని థీమ్ పార్క్ రంగంలో అగ్రగామిగా ఉన్న వండర్‌లా సారథ్య బాధ్యతలు అరుణ్ చేపట్టి 20 సంవత్సరాలైన నేపథ్యంలో ప్రస్తుతం నగరంలో ఉన్న ఆయన సాక్షితో ప్రత్యేకంగా తన అనుభవాలు పంచుకున్నారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..
– సాక్షి, సిటీబ్యూరో



అరుణ్ చిట్టిలపిల్లి

మా తండ్రి విగార్డ్ బ్రాండ్ స్థాపకులు కొచౌసెఫ్ చిట్టిలపిల్లి స్థాపించిన విగా ల్యాండ్ అమ్యూజ్‌మెంట్ పార్క్ పగ్గాలను నేను చేపట్టాక బెంగళూర్ పార్క్‌తో వండర్‌లాగా మారింది. కొచ్చిలో రూ.25 కోట్లతో తొలి పార్క్‌ను 16ఎకరాల విస్తీర్ణంలో ప్రారంభించినప్పుడు అమ్యూజ్‌మెంట్ పార్క్ అంటే ఏమిటో ప్రభుత్వాలతో పాటు ప్రజలకు అర్థం కాలేదు. ఎంట్రీ టిక్కెట్‌కు కేవలం రూ.200 కూడా అప్పుడు చాలా ఎక్కువని భావించారు. ఎందుకంటే ఆ సమయంలో థియేటర్‌లో సినిమా టిక్కెట్ ధర రూ.25లోపే ఉండేది మరి..

ఒడిదుడుకులున్నా.. విజయాల వైపు..

2008లో ఆర్థిక సమస్యలు ఎదుర్కొన్నాం. అలాగే కొన్ని పార్క్స్‌లో జరిగిన ప్రమాదాల వల్ల జనాల్లో ఏర్పడిన యాంటీ సెంటిమెంట్స్.. ఇవన్నీ తప్పలేదు. ఆ తర్వాత మేం ఎదుర్కొన్న పెను సంక్షోభం కరోనా.. అయితే ఆ తర్వాత దేశీయ పర్యాటక రంగం ఊపందుకుంది. అలాగే మా వండర్‌లా ఆదాయం కూడా బాగా పుంజుకుంది. హైదరాబాద్‌లో కూడా కరోనా తర్వాత మా పార్క్‌కు వచ్చే సందర్శకుల సంఖ్యలో గణనీయమైన పురోగతి కనిపించింది.

విభజన జరిగినా వెనుకడుగు వేయలేదు

మేము నిజానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు హైదరాబాద్‌లో ప్లాన్ చేశాం. ఆ తర్వాత రాష్ట్ర విభజన జరిగినా మేము వెనుకంజ వేయలేదు. ఎందుకంటే హైదరాబాద్ చాలా పెద్ద మార్కెట్ అని మాకు తెలుసు. అంతేగాకుండా అప్పటి తెలంగాణ ప్రభుత్వం మాకు అందించిన సహకారం, కేటీఆర్ అందించిన మద్దతు కూడా కీలకం అని చెప్పొచ్చు.

ఇంకా 10శాతం దాటలేదు

యూరప్ దేశాలతో పోలిస్తే.. ఇప్పటికీ, మన దేశంలో ఈ రంగం ఇంకా ప్రారంభ దశలోనే ఉందనాలి. ఇలాంటి వెంచర్ల కోసం మూలధనం భూమి ఖర్చు చాలా ఎక్కువగా ఉంటుంది. మా వ్యాపారానికి ప్రధాన సమస్య భూమి. చాలా పెద్ద విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలి.. కాబట్టి ఇంకా ఈ పరిశ్రమలో కొత్త వెంచర్లు నిజానికి ఊపందుకోలేదు. కేవలం 30 కోట్ల జనాభా ఉన్న అమెరికాలో దాదాపు 1500 పార్క్స్ ఉంటే 150 కోట్లు ఉన్న ఇక్కడ 150 కూడా లేవు. అంటే పది శాతం మాత్రమే. కాబట్టి ఇక్కడ పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి. అయితే దానికి భూమి లభ్యతతో పాటు మౌలికవసతుల అభివృద్ధి కూడా ప్రధానమే.

దూసుకుపోతున్న హైదరాబాద్ పార్క్..

మాకు బెంగళూర్ తర్వాత వ్యాపారపరంగా హైదరాబాద్ పార్క్ రెండవ టాప్ పార్క్‌గా మారింది. కొచ్చిని కూడా దాటేసిందని చెప్పాలి. గత ఏడాది ఇక్కడి వండర్‌లా.. అత్యధిక ఆదాయం దాదాపు రూ.150 కోట్లు ఆర్జించింది. అదేవిధంగా ఈ ఏడాది త్రైమాసికంలో సైతం రికార్డ్ స్థాయిలో ఆదాయం అందించింది. ఈ ఆదరణను దృష్టిలో పెట్టుకుని ఇక్కడ మరిన్ని విశేషాలు జోడించడంతో పాటు 150 రూమ్స్‌తో రిసార్ట్స్ కూడా జత చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. మా సందర్శకుల్లో 75శాతం మంది హైదరాబాద్ నుంచి మిగిలిన వారు తెలుగు ప్రాంతాల నుంచి వస్తున్నారు.

2030 వరకు మరిన్ని పార్క్‌లు

కొచ్చి, బెంగళూరు, హైదరాబాద్‌తో పాటు తాజాగా భువనేశ్వర్‌లో మరోపార్క్‌ను ఏర్పాటు చేశాం. వచ్చే ఏడాది చెన్నైలో మరొకటి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఈ తరహా పార్కుల ఏర్పాటుకు పలు రాష్ట్రాల నుంచి ఆహ్వానాలు కూడా అందుతున్నాయి. అలాగే అయోధ్యలో పార్క్ ఏర్పాటు చేసేందుకు ఆహ్వానం ఉంది. గ్రేటర్ నోయిడాను కూడా పరిశీలిస్తున్నాం. ఇంకా గుజరాత్, మధ్యప్రదేశ్‌లోని ఇండోర్, మహారాష్ట్రలోని ముంబై-పూణే, గోవా సైతం మా దృష్టిలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కూడా ఆహ్వానం ఉంది. వచ్చే 2030 వరకు కనీసం 8-10 పార్క్‌లు నెలకొల్పాలని ఆశిస్తున్నాం.

ప్రభుత్వాల సహకారం కీలకం..

భువనేశ్వర్ వంటి అభివృద్ధి చెందుతున్న నగరంలో ఏర్పాటు చేయడానికి అక్కడి ప్రభుత్వం అనేక రకాలుగా మాకు అందించిన చేయూత ప్రధాన కారణం. అప్పటి తెలంగాణ ప్రభుత్వం కూడా మాకు అన్ని రకాలుగా సహకరించింది. 2013లో హైదరాబాద్ పార్క్ కోసం ల్యాండ్ కొనుగోలుచేసి 2016లో నిర్మాణం పూర్తి చేశామంటే ఆ సహకారమే కారణం.

హైదరాబాద్‌లో అందుబాటులోకి బిగ్ రైడ్

వైవిధ్యభరిత ఈవెంట్స్‌పై దృష్టి సారిస్తున్నాం. అమ్యూజ్‌మెంట్ పార్క్‌లో ఉండాల్సిన క్రీడా వినోదంతో పాటు సంగీతం, నృత్యం వంటి ఇతర వినోద సాధనాలు కూడా ఇందులో భాగం కావాలి. మా ప్రధాన ప్రేక్షకులు పిల్లలు, టీనేజర్స్. ఈ తరహా వినూత్న ఉత్పత్తుల కోసం తరచూ అమెరికా, ఐర్లాండ్.. వంటి దేశాలు పర్యటిస్తుంటాను. అదే క్రమంలో ఇటలీ నుంచి ఒక బిగ్ రైడ్ హైదరాబాద్‌లో కొత్తగా అందుబాటులోకి తెచ్చాం. మా రీసెర్చ్ వింగ్‌తో కొన్ని డిజైన్ చేయిస్తున్నాం.

నగరంలో నేడు

- యువకళావాహిని ఆధ్వర్యంలో అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకల ముగింపు సందర్భంగా సినీ విజ్ఞాన విశారద ఎస్.వీ.రామారావు రచించిన అక్కినేని ఆణిముత్యాలు గ్రంథావిష్కరణ సాయంత్రం 5.30 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరుగుతుంది.
- వరల్డ్ హార్ట్ డే సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నం.10లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హార్ట్ ఇనిస్టిట్యూట్‌లో ఉదయం 11 గంటలకు ప్రత్యేక కార్యక్రమం జరుగుతుంది.
- బ్రిటన్ వైద్య బృందానికి ఆత్మీయ వీడ్కోలు ప్రత్యేక సమావేశం నిమ్స్‌లోని లెర్నింగ్ సెంటర్‌లో ఉదయం 11 గంటలకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో హైదరాబాద్ వెగన్ ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్ రాహేజా మైండ్‌స్పేస్‌లోని ది వెస్టిన్ హోటల్‌లో సైబర్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్ ఉదయం 9 గంటలకు జరుగుతుంది. కార్యక్రమానికి ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు హాజరవుతారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

30న కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతుదీక్ష

బీజేపీ ప్రతిపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



ధర్నాచౌక్‌లో దీక్షాస్థలాన్ని పరిశీలిస్తున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తదితరులు

కవాడిగూడ: ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలందరినీ మోసం చేసిందని, రైతులకు 30 నుంచి 40 శాతం మాత్రమే రుణమాఫీ చేసి రైతు భరోసాను ఎగొట్టిందని బీజేపీ ప్రతిపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. పూర్తి స్థాయిలో రైతు రుణమాఫీ చేసినట్లు ప్రకటించుకొని రైతులతో పాలాభిషేకాలు చేయించుకొని, రుణమాఫీ చేసినట్లు అబద్ధాలు ప్రచారం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, రైతు రుణమాఫీ, రైతు భరోసా తదితర అంశాలపై 30వ తేదీన ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 24గంటల రైతుదీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరాపార్కు ధర్నాచౌక్ స్థలాన్ని శుక్రవారం ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు అంజయ్యయాదవ్, జగన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి పరిశీలించారు.

కవలల ప్రాణం నిలిపిన వైద్యులు

చందానగర్: ఆరు నెలల కవల పసికందులకు మదీనాగూడలోని పారమిత ఆస్పత్రి వైద్యులు 90 రోజుల పాటు ఐసీయూలో వైద్యం అందించి ప్రాణాలు కాపాడారు. పారమిత ఆస్పత్రి డాక్టర్ జగన్మోహన్ వరకాల శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన జుఫికర్ చౌదరి భార్య మిమునా ఫాతిమా గర్భిణిగా ఉన్న సమయంలో కవల పిల్లలు అని నిర్ధారణ అయ్యింది. నెలలు నిండే కొద్దీ బరువు పెరుగుతుండటంతో గర్భ సంచి సమస్య తలెత్తింది. అప్పటికీ ఆర్నెళ్లు.. వైద్యులు ఆమెకు డెలివరీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కవల బిడ్డలు ఒక్కొక్కరు కేవలం 620 గ్రాములతో మగబిడ్డలు జన్మించారు. మెరుగైన వైద్యం కోసం మదీనాగూడ పారమిత ఆస్పత్రికి వచ్చారు. వైద్యులు పసిబిడ్డలను ఐసీయూలో ఉంచి వైద్యం అందించారు. 90 రోజుల పాటు అత్యుత్తమ యంత్ర పరికరాలతో వైద్యం అందించి ప్రాణాలు కాపాడినట్లు చెప్పారు. వైద్యులు జగన్ మోహన్ వరకలా, సి.రుకేష్, సాయి ప్రణీత్, రాజశేఖర్, లావణ్య, ఫర్హా, శ్రావణి, అపర్ణ, వైద్య బృందం పాల్గొన్నారు.

సంక్షోభంలో విద్యారంగం

- తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలి
- స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి





మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

కవాడిగూడ: విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద శుక్రవారం విద్యార్థి గర్జన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చావ రవి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి.నాగరాజు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 8 నెలలు గడిచినా విద్యారంగ సమస్యలను పరిష్కరించలేదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1864 ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే కుట్ర చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో అధ్యాపకుల కొరతతో తెలంగాణ విద్యారంగం సంక్షోభంలో ఉందన్నారు. కార్పొరేట్, ప్రైవేటు ఫీజుల నియంత్రణ కోసం చట్టం చేస్తామన్న హామీ అమలు కాలేదన్నారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్, మెస్‌చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ విజయ్‌కుమార్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఏ.వెంకటేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజినీకాంత్, శ్రీకాంత్ వర్మ, సంతోష్, శంకర్, ప్రశాంత్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు అశోక్‌రెడ్డి, కిరణ్, మమత, శంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చలో సెక్రటేరియట్‌కు పిలుపు..

విద్యార్థి గర్జన అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు చలో సెక్రటేరియట్‌కు పిలుపునిచ్చారు. దీంతో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు, విద్యార్థులు పరుగులు తీయడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఆ సమయంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, పోలీసులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. అనంతరం వారిని దోమలగూడ పోలీసులు వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

రాష్ట్రస్థాయి రాజ్య పురస్కార్ ర్యాలీ



సాక్షి, సిటీబ్యూరో: దక్షిణమధ్య రైల్వే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో గైడ్స్, రేంజర్స్ అండ్ రోవర్స్ రాష్ట్రస్థాయి రాజ్య పురస్కార్ ర్యాలీని శుక్రవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో నిర్వహించారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. మన రాష్ట్రంలో రాజ్య పురస్కార్ స్కౌట్, గైడ్, రోవర్, రేంజర్ ర్యాలీ నిర్వహించడం ఇదే మొదటిసారి. నిర్ణీత సిలబస్‌తో పాటు 5 నైపుణ్య పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, ఒక సంవత్సరం రాజ్య పురస్కార్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు సర్టిఫికెట్లు అందజేయడం ద్వారా ప్రతి సంవత్సరం రాజ్య పురస్కార ర్యాలీ నిర్వహిస్తారు. కార్యక్రమంలో అర్హత సాధించిన స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు అరుణ్ కుమార్ జైన్ రాజ్య పురస్కార సర్టిఫికెట్లను అందజేశారు. అవార్డు గ్రహీతలను ఆయన అభినందిస్తూ, రాజ్య పురస్కార స్థాయికి చేరుకోవడం గొప్ప విజయమని చెప్పారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ పట్ల వారికున్న నిబద్ధత, అంకితభావానికి ఇది నిదర్శనమన్నారు.

దేశంలో మొదటి ఇంటెలిజెంట్ సీయూవీ

- గోల్కొండ రిసార్ట్స్ వేదికగా ఆవిష్కరించిన ఎంజీ మోటార్స్
- రాంగ్రూప్ ఆధ్వర్యంలో ప్రారంభించిన బిజూ బాలేంద్రం
- వచ్చేనెల 3 నుంచి బుకింగ్స్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్స్ ఇండియా ఆధ్వర్యంలోని సరికొత్త ఎలక్ట్రిక్ సీయూవీ మోడల్‌ను దేశంలో మొదటిసారిగా నగరంలోని గోల్కొండ రిసార్ట్స్ వేదికగా ఆవిష్కరించారు. రాంగ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా విండ్సర్‌ను ఎండీ బిజూ బాలేంద్రం ఈ సరికొత్త కార్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్తి పరిమాణంలో ఉండే ఎలక్ట్రిక్ ఇంటెలిజెంట్ సీయూవీని ఒక మాన్యువల్ ఇంజిన్ ఆధారిత కాంపాక్ట్ ఎస్‌యూవీ ధరలో అందిస్తున్నామని తెలిపారు. ఈ ఓనర్‌షిప్ ప్రోగ్రామ్ ద్వారా బ్యాటరీ ముందస్తు ఖర్చును తొలగించబడిందని, కస్టమర్లు దాని వినియోగానికి మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. కస్టమర్లు ప్రతీ కిలోమీటర్ డ్రైవ్ చేసినందుకు గాను స్వల్ప మొత్తాన్ని చెల్లిస్తారని, ఇది సాంప్రదాయ వాహనాల ఇంధన ఖర్చుతో పోలిస్తే 40శాతం తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. సంస్థ డైరెక్టర్ పార్థ్ జిందాల్ మాట్లాడుతూ.. ఎంజీ విండర్స్, జేఎస్ డబ్ల్యూ ఎంజీ ఇండియా వెనుక ఉన్న దార్శనికతను సాకారం చేస్తుందని, విండర్స్ ఈ జేవీ(జాయింట్ వెంచర్) నుంచి వచ్చిన మొదటి కారు అని తెలిపారు. కార్యక్రమంలో జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్స్ ఇండియా సీఈఓ రాజీవ్ చాబా పాల్గొన్నారు.

ప్యారానగర్‌లో బయోగ్యాస్

- ఆర్నెళ్లలో ఉత్పత్తి ప్లాంట్.. విద్యుత్ ప్లాంట్ సైతం
- జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తగ్గనున్న చెత్తభారం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ శివార్లలోని ప్యారానగర్‌లో చెత్త నుంచి విద్యుత్‌తో పాటు బయోగ్యాస్ ఉత్పత్తి చేసే ప్లాంట్లు దాదాపు ఆర్నెళ్లలో ఏర్పాటు కానున్నాయి. సంగారెడ్డి జిల్లా పరిధిలోకి వచ్చే ప్యారానగర్‌లోని 152 ఎకరాల స్థలంలో ఆధునిక సాంకేతికతతో కూడిన యూరోపియన్ టెక్నాలజీతో ఈ ప్లాంట్ల ఏర్పాటుకు ఇప్పటికే అనుమతులు లభించినట్లు జీహెచ్‌ఎంసీ పేర్కొంది. 15 మెగావాట్ల సామర్థ్యంతో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్, 270 టన్నుల బయోగ్యాస్ ఉత్పత్తి కేంద్రాలను జవహర్‌నగర్ డంపింగ్‌యార్డును నిర్వహిస్తున్న రాంకీ సంస్థ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది.

ఆధునిక సాంకేతికతతో..

సమీప ప్రాంతాల నుంచి వెలువడే చెత్త బయటకు కనిపించకుండా పూర్తిగా మూసిఉండే ట్రక్కుల ద్వారా రవాణా చేసి అండర్ గ్రౌండ్ బంకర్‌లో వేస్తారు. చెత్త అక్కడ తడి- పొడిగా వేరయ్యాక పొడి చెత్త నుంచి విద్యుత్‌ను, తడి చెత్త నుంచి బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తారని తెలిపింది. ఈ విధానంతో చెత్తను బహిరంగంగా ఉంచడం, బహిరంగంగా శుద్ధి చేయడం జరగవని, దాంతో ఎటువంటి దుర్వాసనలు గానీ, వ్యర్థ జలాలు గానీ విడుదల కావని జీహెచ్‌ఎంసీ పేర్కొంది. పూర్తిగా మూసిఉండే షెడ్డులోనే పూర్తి ప్రక్రియ జరుగుతుందని, గాలి కూడా బయోఫిల్టర్ల ద్వారా శుద్ధి చేసి పునర్వినియోగించడం వల్ల ఎటువంటి దుర్వాసన రాదని, డ్రై డైజెసన్ టెక్నాలజీ ద్వారా తడి చెత్త నుంచి బయోగ్యాస్ తయారు చేయడం వల్ల లీచెట్ సమస్య కూడా ఉండదని పేర్కొంది.



ప్లాంట్ మోడల్

జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు భారం తగ్గేందుకు..

జవహర్‌నగర్ చెత్తశుద్ధి కేంద్రంపై భారం తగ్గించేందుకు జీహెచ్‌ఎంసీ ఎంతో కాలంగా ప్రయత్నిస్తోంది. నగరం నుంచి నిత్యం వెలువడే చెత్త దాదాపు 7,500 మెట్రిక్ టన్నులతో పాటు పరిసరాల్లోని 17 మున్సిపాలిటీల చెత్త సైతం ప్రస్తుతం అక్కడికే చేరుతోంది. జవహర్‌నగర్‌పై పడుతున్న ఈ భారాన్ని తగ్గించే చర్యల్లో భాగంగా ప్రభుత్వం జీహెచ్‌ఎంసీకి కేటాయించిన ప్యారానగర్ స్థలంలో ఈ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లోని స్థలాల్ని సైతం జీహెచ్‌ఎంసీకి కేటాయించేందుకు పొరుగు జిల్లాల కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కమిషనర్ ఆమ్రపాలి ఆయా జిల్లాల కలెక్టర్లను కోరారు.

భద్రతే ప్రామాణికం.. తనిఖీలే కీలకం



సాక్షి, సిటీబ్యూరో: ప్రణాళికాబద్ధంగా తనిఖీలు నిర్వహించడం, నిరంతరం సమర్థవంతమైన చర్యలు చేపట్టడం ద్వారానే పారిశ్రామిక భద్రత పటిష్టంగా మారుతుందని కార్మిక, ఉపాధి, శిక్షణ పరిశ్రమల శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల శాఖ, జాతీయ భద్రత మండలి– తెలంగాణ చాప్టర్ సహకారంతో ‘నిర్దిష్ట పరికరాలు, నిర్మాణ స్థిరత్వం భద్రతకు హామీ ఇవ్వడంలో సమర్థుల పాత్ర’ అనే అంశంపై రెడ్‌హిల్స్‌లోని సురానా ఆడిటోరియంలో శుక్రవారం ఓ వర్క్‌షాప్ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సంజయ్‌కుమార్ మాట్లాడుతూ తనిఖీల సమయంలో ఏదైనా ఆందోళనకరమైన పరిస్థితి ఉంటే వెంటనే డైరెక్టర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కర్మాగారాల తనిఖీల ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఫ్యాక్టరీల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించి, దీనిపై వారికి అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. తెలంగాణ పరిశ్రమల శాఖ డైరెక్టర్, నేషనల్ సేఫ్టీ కౌన్సిల్, తెలంగాణ చాప్టర్ చైర్మన్ బి.రాజగోపాలరావు మాట్లాడుతూ తనిఖీలకు సంబంధించి చట్టపరమైన విధివిధానాల గురించి వివరించారు. వర్క్‌షాప్‌లో పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు .

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, శనివారం, 28 సెప్టెంబర్ 2024

చిన్ని చిన్ని ఆశ అంటూ పాతికేళ్ల క్రితం ఓ సినిమాలో హీరోయిన్ నీళ్లలో తడుస్తూ పరవశించి పాడినా, జల.. జల.. జలపాతం.. నువ్వు అంటూ ఇటీవల ఓ సినిమాలో హీరో కీర్తించినా.. ప్రకృతి అందాల్లో జలధారల ప్రత్యేకతే వేరు. అలాంటి నిలువెత్తు నీటి సౌందర్యాన్ని ఆస్వాదించాలంటే వాటర్ ఫాల్స్‌ని మించిన మార్గం లేదు. ఆ తెల్లని నీళ్ల సిరుల్ని కళ్లకు హత్తుకోవాలంటే.. మాన్‌సూన్‌ని మించిన సీజన్ లేదు. మిగిలిన అన్ని కాలాల్లోనూ పాడి పాడిగా సాదాసీదాగా కనిపించే ప్రాంతాలు.. వర్షాకాలంలో మాత్రం హర్షామోదాల కేరింతల నిలయాలుగా మారిపోతాయి. ఈ సీజన్‌లో నప్పే ట్రిప్స్‌గా జలధారల దారి పట్టేవారి కోసం మన నగరం నుంచి అందుబాటు దూరంలో ఉన్న కొన్ని జలపాతాల విశేషాలివి.. - సాక్షి, సిటీబ్యూరో

బొగత.. మన ఘనత..

తెలంగాణ వాసులు సగర్వంగా చెప్పుకునే అద్భుత అందాల ఘనతగా బొగత జలపాతాన్ని చెప్పుకోవచ్చు. భద్రాచలం నుంచి 120 కిమీ దూరంలో నగరం నుంచి 329 కిమీ దూరంలో ఉందీ వాటర్ ఫాల్స్. ఖమ్మం జిల్లాలో, రాష్ట్రంలో రెండో అతిపెద్ద జలపాతం ఇదే. తెలంగాణ నయాగరగా పేరుగాంచి మాన్‌సూన్‌లో అత్యంత రద్దీగా ఉండే ప్రదేశం. ఇక్కడకు చేరుకోడానికి సందర్శకులు కొంత దూరం ట్రెక్కింగ్ చేయాల్సి ఉంటుంది.



నార్సింగిలో మాంగళ్య 21వ స్టోర్

నూతన స్టోర్ ప్రారంభించిన సంయుక్త మీనన్

మణికొండ: నగర శివారు నార్సింగి మున్సిపాలిటీలో సినీనటి సంయుక్త మీనన్ శుక్రవారం సందడి చేశారు. మాంగళ్య షాపింగ్ మాల్ 21వ స్టోర్‌ను ఆమె ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల్లో అధునాతన కలెక్షన్స్‌తో నిత్య నూతన వెరైటీలతో అతిపెద్ద షాపింగ్ మాల్‌గా మాంగళ్య అవతరించిందని సంయుక్త అన్నారు. ఈ ప్రాంత వాసులు దసరా షాపింగ్‌ను మాంగళ్యలో చేయాలని ఆకాంక్షించారు. అనంతరం మాల్ డైరెక్టర్లు పీఎస్ మూర్తి, కాసం నమశ్శివాయ, మల్లికార్జున్, కేదారినాథ్, శివప్రసాద్, పి.అరుణ్ కుమార్ మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో 12 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతున్నామని అన్నారు. ఇప్పటి వరకూ 21 స్టోర్‌లను ప్రారంభించామని, 29న మణికొండలో మరో స్టోర్ ప్రారంభిస్తున్నామని, త్వరలో కర్ణాటకలోనూ విస్తరిస్తున్నామని, తక్కువ ధరలకే నాణ్యమైన అన్ని రకాల వస్త్రాలనూ అందిస్తున్నామన్నారు.

ఉత్సాహంగా కేక్ మిక్సింగ్

బంజారాహిల్స్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని రెండు నెలల ముందే నిర్వహించే కేక్ మిక్సింగ్ నగరంలో షురూ అయ్యింది. జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో శుక్రవారం ఈ వేడుక జరిగింది. హోటల్ ఎగ్జిక్యూటివ్ చెఫ్ రామకృష్ణ నేతృత్వంలో సంస్థ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో క్రిస్మస్ క్యాప్స్ ధరించి కేక్‌మిక్సింగ్ చేశారు. 14 రకాల డ్రై ఫ్రూట్స్‌తో పాటు విభిన్న రకాల వైన్ మిశ్రమాలను ఈ మిక్సింగ్‌లో వాడతామని తెలిపారు. 45 రోజుల తర్వాత ఈ మిశ్రమంతో రుచికరమైన కేక్‌ను తయారు చేస్తామని తెలిపారు. మేనేజర్ ఉదయ్, వెంకట్, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.





వండర్‌లాలో అత్యాధునిక రైడ్స్

ప్రారంభోత్సవంలో ప్రముఖ నటుడు నాగచైతన్య

తుక్కుగూడ: దేశంలోనే అతిపెద్ద అమ్యూజ్మెంట్ వినోద కేంద్రం వండర్‌లా అని ప్రముఖ సినీ నటుడు నాగ చైతన్య పేర్కొన్నారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల వండర్‌లాలో ఏర్పాటు చేసిన జి-ఫాల్ ను ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చిట్టిలపిల్లి అరుణ్‌తో కలిసి ప్రారంభించారు. అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రైడ్స్‌ను ప్రారంభించడం సంతోషమన్నారు. గ్లోబల్ పార్కులతో సమానంగా దేశానికి ప్రపంచ స్థాయి రైడ్‌లను వండర్‌లా తీసుకురావడం థ్రిల్లింగ్ ఇస్తుందన్నారు. వినోదం, సాహసాలతో ప్రపంచ స్థాయి సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించి ప్రజలను అలరిస్తుందన్నారు. పర్యాటకులకు మరింత వినోదం అందించే ఉద్దేశంతో కొత్త ఆకర్షణతో రెండు రైడ్స్ ఏర్పాటు చేశామని అరుణ్ అన్నారు. ఇందులో జి-ఫాల్ ఒక ఎత్తయిన ఫ్రీ-ఫాల్ రైడ్ అన్నారు. ఇది 40 మీటర్ల ఎత్తులో వృత్తాకారంలో 12 మంది కూర్చునే విధంగా ఉంటుందన్నారు. రెండోది అత్యాధునిక మెటావర్స్ 3డీ థియేటర్ అన్నారు. ఇందులో 5 నిమిషాల సెషన్‌కు 30 మందికి వసతిని ఏర్పాటు చేశామన్నారు. ఆసియాలోని అగ్రగేణి అమ్యూజ్మెంట్ పార్క్‌లో అగ్రగేణి ర్యాంక్ సాధించామన్నారు. సీఓఓ ధీరన్ చౌదరి, పార్క్ హెడ్ మధుసూదన్ పాల్గొన్నారు.

నేడు ఎన్‌టీఆర్‌తో 'కపిల్ షో'

సాక్షి, సిటీబ్యూరో: అగ్రగామి టాలీవుడ్ స్టార్ జూనియర్ ఎన్‌టీఆర్ ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ పై అభిమానుల్ని పలకరించనున్నారు. నెట్‌ఫ్లిక్స్ అందిస్తున్న ది గ్రేట్ ఇండియన్ కపిల్ షో శనివారం రాత్రి 8 గంటలకు ప్రసారం కానుంది. ఈ షో లో ఆర్ఆర్ఆర్ చిత్రంలో చిరుతతో ఫైట్ సహా పలు విచిత్ర సన్నివేశాల నేపథ్యాలను ఎన్‌టీఆర్ పంచుకోనున్నారు. ఈ షోలో ఆయనతో పాటు దేవర చిత్రంలోని ప్రధాన నటీనటులు జాహ్నవీ కపూర్, సైఫ్ అలీఖాన్‌లు పాల్గొననున్నట్లు నెట్‌ఫ్లిక్స్ ప్రతినిధులు తెలిపారు.





రాయకల్.. జలరాశుల్..

పోతపోసిన ప్రకృతి అందాల నిలయం రాయకల్ జలపాతం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని రాయకల్ నుంచి 3 కిలోమీటర్ల దూరంలో పెద్దగట్లు, రాయకల్ జలపాతం ఉంటాయి. మార్గమధ్యంలో పచ్చని ప్రకృతిని ఆస్వాదిస్తూ ప్రయాణించొచ్చు. కొండమీది నుంచి రాసులు పోస్తున్నట్టు కిందకు దుమికే నీటి ధారలు రాయకల్ జలపాత దృశ్యం కనువిందు చేస్తుంది.

కొండ కోనల్లో జలపాతాల గలగలలు

సెలయేటికి.. చలో..

నగర శివారు పర్వతాల్లో.. ప్రకృతి పరవళ్లు..

వాటర్ ఫాల్స్.. ఈ పేరు చెప్పగానే ప్రకృతి ప్రేమికులు ఎవరైనా వాటి అందాలను ఆస్వాదించేందుకు ఉవ్విళ్లూరుతారు.. చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకూ ఆ జలపాతం కింద తడిసి ముద్దవ్వాలనుకుంటారు. నగరం నుంచి దాదాపు 50 కిలోమీటర్ల దూరంలో పలు జలపాతాలు నగర వాసులను ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో కొండ కోనల్లో ప్రకృతి ఒడిలో గంగ పరవళ్లు.. సెలయేటి గలగలలు చెవులకు వినసొంపుగా వినిపిస్తాయి. భువనగిరికి దగ్గర్లో ఓ జలపాతం ఉంటుంది. చుట్టూ పచ్చదనం రాతి గుట్టలు ప్రకృతి ప్రేమికులకు కొత్త అనుభూతిని ఆస్వాదించే అవకాశాన్ని అందిస్తుంది.

ఎత్తిపోతల.. జలకళ..

సిటీకి 163.4 కిలోమీటర్ల దూరంలో చంద్రవంక నది సమీపంలో ఈ జలపాతం సందర్శకులను ఆకట్టుకుంటుంది. సమీపంలోని మొసళ్ల పెంపక కేంద్రం కూడా సందర్శనీయమే. నాగార్జున సాగర్ డ్యామ్ వైపు ఎన్‌హెచ్ 56 నుంచి డ్రైవింగ్ చేయడం ద్వారా జలపాతాన్ని, డ్యామ్‌ను చూడవచ్చు.

భీముని పాదం.. ఆనందానికి ఆ'మోదం'

దట్టమైన అటవీ ప్రాంతం, చుట్టూఎత్తయిన కొండలు, పక్షుల కిలకిలలు. సాయంత్రం వేళ అడవి జంతువుల అరుపులు, వర్షా కాలంలో ఎత్తయిన గుట్ట మీది నుంచి పాదం మధ్యలో జాలువారే నీటి సిరులు.. ఆస్వాదించాలంటే భీమునిపాదం జలపాతం దగ్గరికి పోవాల్సిందే. మానుకోట జిల్లాలో ఏకైక పర్యాటక ప్రాంతంగా దీన్ని చెప్పుకుంటారు.



మల్లెల తీర్థం.. అరణ్య మార్గం..

నగరానికి దాదాపు 185 కిమీ దూరంలో నల్లమల అరణ్యంలో ఉంది. ఈ జలపాతానికి చేరుకోడానికి, అడవి గుండా ట్రెక్కింగ్ చేయాల్సి ఉంటుంది. ఇది కొంతమేర సాహసోపేతమైన ప్రయాణం అనే చెప్పాలి.



వైజాగ్ వారి ఆతిథ్యం.. అందం 'చందం'

నల్లగొండ నుంచి 65 కిలోమీటర్ల దూరంలో వైజాగ్ కాలనీ ఉంది. దేవరకొండ నియోజకవర్గంలోని చందంపేట మండలంలో కృష్ణానది బ్యాక్ వాటర్ ఆనుకుని ఉన్న కుగ్రామం ఇది. ఇక్కడి వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. నలువైపులా నల్లమల అడవులు, గుట్టలతో కప్పి ఉంటుంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు కడుతున్నప్పుడు వైజాగ్‌కు చెందిన కొన్ని కుటుంబాలు స్థిరపడడంతో దీనికి వైజాగ్ కాలనీగా పేరొచ్చింది. వీకెండ్‌లో టూరిస్టుల కోసం కాలనీ వాసులే వసతి ఏర్పాట్లు చేస్తుంటారు. బోటింగ్ సౌకర్యం కూడా ఉంది. కృష్ణానదిలో పట్టిన తాజా చేపల వంటకాలు ఇక్కడ ఫేమస్.



రాజేంద్రనగర్.. వాటర్ ఫాల్స్..

నగరానికి కేవలం 13.9 కిమీ దూరంలో ఈ సుందరమైన జలపాతం శీఘ్ర విహారానికి అనువైనది. సందర్శకులు ఒక చిన్న రైడ్ ద్వారా ఈ ప్రదేశానికి చేరుకోవచ్చు.

జలజల.. కుంటాల..

తెలంగాణలోనే ఎత్తైన జలపాతం. నగరం నుంచి 564.9 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ జలపాతం ఆదిలాబాద్‌లో ఉంది. దాదాపు 200 అడుగుల ఎత్తు నుంచి కిందికి దూకుతూ వీక్షకులకు అద్భుతమైన అనుభూతిని అందిస్తుంది.



ఏడు బావుల.. వింతలా..

బయ్యారం, గంగారం సరిహద్దుల్లో మిర్యాలపెంట సమీపంలో ఏడుబావుల జలపాతాలున్నాయి. పాండవుల గుట్టపై సహజసిద్ధంగా ఏర్పడ్డాయి. జలపాతం నుంచి కిందికి పడే నీళ్లు కొద్ది దూరం ప్రవహించి తరువాత అదృశ్యమవడం. దాదాపు 50 అడుగుల ఎత్తు నుంచి పాలధారలా నీళ్లు పడుతూ కనువిందు చేస్తుంది.

పచ్చని నెచ్చెలి.. చెచ్చెర..

ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఎన్నో జలపాతాలున్నా ఎక్కువ మందికి పరిచయం లేని జలపాతం చెచ్చెర. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని కొరగామ్ సమీపంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉందీ జలపాతం. ఎత్తయిన కొండల మధ్యలో 200 అడుగుల ఎత్తు నుంచి కిందికి దూకే జలపాతాన్ని చూడటం కనువిందే. ఇక్కడి ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబాట్లు ఆకట్టుకుంటాయి.



ఫ్యాషన్ ఐకాన్.. సుధారెడ్డి

- కేన్స్ రెడ్ కార్పెట్‌పై నడిచాను
- యూనిసెఫ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నాను
- ఫౌండేషన్‌తో దేశ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు
- 29న బ్రెస్ట్ క్యాన్సర్‌పై అతిపెద్ద రన్

వ్యాపారవేత్త, ఫ్యాషన్ సెలబ్రిటీ సుధారెడ్డితో చిట్‌చాట్

సుధారెడ్డి.. ఆమె ఒక ఫ్యాషన్ ఐకాన్. దేశంలోనే కాదు, అంతర్జాతీయ స్థాయితో ప్రముఖ ఫ్యాషన్ వేదికలపై తన సౌందర్యంతో పాటు భారతీయ సాంస్కృతిక వైభవాన్ని మరింత ఉన్నతంగా ప్రదర్శించిన మహిళ. భారత్ తరపున గ్లోబల్ ఈవెంట్ మెట్‌గాలా మొదలు కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ రెడ్ కార్పెట్ పై నడిచిన అతి కొద్ది మందిలో తానొకరు. అంతేకాకుండా సుధారెడ్డి ఫౌండేషన్ ప్రారంభించి నిరుపేదల ఆకలి నుంచి మహమ్మారి క్యాన్సర్ వ్యాధి బాధితుల వరకూ సహకారం అందించడానికి కృషి చేస్తున్నారు. యూనిసెఫ్ వంటి అంతర్జాతీయ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వంద మంది ఛైర్‌లలో ఆమె కూడా ఒకరు. యూఎన్ జనరల్ అసెంబ్లీ నుంచి ఫ్యాషన్ 4 డెవలప్‌మెంట్ ఫిలాంత్రోఫిక్ అవార్డు పొందిన మొదటి భారతీయురాలు. ఆమె ప్రయాణం మహిళా సాధికారతకు స్ఫూర్తిదాయకం. ఈ నేపథ్యంలో ఆమె జీవిత ప్రయాణం గురించి సాక్షితో ముచ్చటించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే.. - సాక్షి, సిటీబ్యూరో

హైదరాబాద్ టూ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్.. ఫ్యాషన్, సేవ, వ్యాపారం, ఎన్‌జీఓ ఇలా అనేక రంగాల్లో ఆమె తన ప్రతిభను చాటుకుంటున్నారు. 'ఇన్ని రంగాలను ఎలా మేనేజ్ చేస్తున్నావని చాలా మంది అడుగుతుంటారు. కానీ, నేను చేసే పనిని ఆస్వాదిస్తాను. అది బిజినెస్ ఐనా, సేవ ఐనా ఇంకేదైనా. చేసే పనిని ఇష్టపడేవారికి బిజీ అనే పదం తెలియదు. మెట్ గాలా, పారిస్ హాట్ కోచర్ వీక్, పారిస్ ఫ్యాషన్ వీక్, కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ వంటి వేదికలపై నడవడం నేనేమీ ప్రత్యేకంగా ఫీల్ అవ్వను. అదే మన దేశ విశిష్టత. విదేశాల్లో భారత్‌ను ఎంత గౌరవంగా చూస్తారో చాలామందికి తెలియదు. అలాంటి వేదికలపై దేశ గత వైభవాన్ని కొనసాగించేలా నావంతు ప్రయత్నం చేస్తాను. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ నీతూ లుల్లా ఆధ్వర్యంలో నా దుస్తులు, అలంకరణలను రూపొందించుకుంటాను. మనకు నచ్చినట్టుగా ఉండటమే సౌందర్యం అని భావిస్తాను. ఒక విద్యార్థిగా, భార్యగా, తల్లిగా, ఫ్యాషన్ ఔత్సాహికురాలిగా, సేవకురాలిగా ప్రతి ప్రయాణాన్నీ అమితంగా ఆస్వాదించాను.



అన్నార్థులకే మొదటి ప్రాధాన్యత..

నా కుటుంబంతో గడిపే సమయం నేనెంతగానో ఆస్వాదిస్తాను. నా చుట్టూ ఉన్న మనుషులు నా ఎక్స్టెండెడ్ ఫ్యామిలీగానే భావిస్తాను. సమాజానికి ఏదైనా చేయాలనే సుధారెడ్డి ఫౌండేషన్ స్థాపించాను. నా భర్త కృష్ణారెడ్డి ఎమ్‌ఈఐఎల్ ఫౌండేషన్‌తో పాటు నా సంస్థ తరపున సేవా కార్యక్రమాలు చేస్తున్నాను. మేము ఏనాడూ ఫండ్ రైజింగ్ చేయలేదు. ప్రకృతి అందించే సహజ వనరుల్లో ఆహారం ఒకటి. అందుకే పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టాను. నగరంలోని మా ఇంటి ముందు ప్రతి రోజూ మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకూ ఆహారం అందిస్తున్నాం. ఇంట్లో తినే ఆహారమే ఇక్కడ వడ్డిస్తాం. నేను విదేశాల్లో ఉన్నాసరే.. ఆహారం పంపిణీ అయ్యాకే నేను లంచ్ చేస్తాను. ఎవరినైనా లంచ్‌కు పిలిచినా 2 గంటల తర్వాతే ఆహ్వానిస్తాను. అంతర్జాతీయ సేవా సంస్థ యూనిసెఫ్ వరల్డ్ ఫోరంలో భారత్ తరపున బ్రాండ్ అంబాసిడర్‌గా సేవా కార్యక్రమాలు చేస్తున్నాను. భారత్‌లో 14 నుంచి 19 ఏళ్ల వయసు చిన్నారులు బాలకార్మికులుగా, బాల నేరస్తులుగా మారుతున్నారు. యూనిసెఫ్ అడాలసిస్ ఎంపవర్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా వారికి డెవలప్మెంట్ స్కిల్స్‌లో శిక్షణ అందించి మేమే ఉద్యోగాలను అందిస్తున్నాం. ఈ ప్రాజెక్ట్‌ను గుజరాత్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లో విజయవంతంగా నిర్వహిస్తున్నాం. సుధారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించడానికి అతిపెద్ద రన్ నిర్వహిస్తున్నాం.



'దాండియా నైట్స్' 8వ సీజన్ ఏర్పాట్లు

రాయదుర్గం: నగర శివారులో 'సెలబ్రిటీ దాండియా నైట్స్' 8వ సీజన్‌కు భారీ ఏర్పాట్లు చేశారు. అక్టోబర్ 2 నుంచి 12 వరకూ దసరా వేడుకలను నిర్వహిస్తారు. గచ్చిబౌలిలోని ఫ్లిప్ సైడ్ అడ్వెంచర్ పార్కులో 4వేల మందితో నిర్వహించేందుకు హైదరాబాద్ మోడల్స్, రాఘవి మీడియా ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్ శుక్రవారం గచ్చిబౌలిలోని అడ్వెంచర్ పార్కులో ఆవిష్కరించారు. నటి కీర్తిభట్, హైదరాబాద్ మోడల్స్ వ్యవస్థాపకుడు వంశీపల్లె, రాఘవి మీడియా మేనేజింగ్ డైరెక్టర్ మధు, నటి సుజనాజొన్నల, బిగ్‌బాస్ ఫేమ్ డీజే ఫ్లోజా చౌదరి, డ్యాన్స్ మాస్టర్ రాజేష్ పాల్గొని పోస్టర్ ఆవిష్కరించారు. దాండియానైట్స్‌లో లైవ్ మ్యూజిక్, డీజే అండ్ ధోల్, అథెంటిక్ ఫుడ్ కౌంటర్లు, సింగర్స్, సెలబ్రిటీ విజిట్స్, స్పోర్ట్స్ ఎరీనా వంటి అనేక ఆకర్షణలు ఉంటాయన్నారు.

నోరు తెరిస్తే అబద్ధాలే కల్తీ.. బాబు సృష్టే

సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగిన వైఎస్ జగన్



"రాజకీయ దురుద్దేశంతో, పచ్చి అబద్ధాలతో తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసి చంద్రబాబునాయుడే తప్పు చేశాడు. దీనిపై విచారణకు ఆయనే సిట్ వేస్తాడు. ఆయన చెప్పు చేతుల్లో ఉన్న అధికారులతో సిట్ అంటాడు. ఇదెక్కడి ధర్మం? ఇదెక్కడి పద్ధతి? చంద్రబాబు ఈ మాదిరిగా హిందూ ధర్మం మీద దుష్ప్రచారం చేస్తూ రాజకీయం చేయడం ధర్మమేనా? ఆలోచించండి"

"నేను తిరుపతికి వెళ్లకూడదట..! దేవుడిని దర్శించుకోకూడదట..! కారణం నా మతం అంటున్నారు. నాలుగు గోడల మధ్య నేను బైబిల్ చదువుతా. తప్పేముంది? బయటకు వెళ్తే హిందూ సంప్రదాయాలను అనుసరిస్తా, గౌరవిస్తా. ఇస్లాంను అనుసరిస్తా, గౌరవిస్తా. సిక్కిజమ్‌ను అనుసరిస్తా, గౌరవిస్తా. నా మతం ఏమిటని అడుగుతున్నారు.. నా మతం.. మానవత్వం. డిక్లరేషన్‌లో రాసుకుంటారేమో రాసుకోండి"

"రాజ్యాంగం పీఠికలో ఏం చెప్పారు? ఇండియా ఈజ్ ఏ సావరిన్, సోషలిస్ట్, సెక్యులర్, డెమొక్రటిక్ రిపబ్లిక్ (భారత్ సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యం) సెక్యులర్ అంటే అర్థం తెలుసా? నీ మతం చెప్పకపోతే గుడిలోకి రావొద్దు అంటున్నావ్! ఇది సెక్యులర్ దేశం అంటున్నాం. సీఎంగా పని చేసిన వ్యక్తి పరిస్థితే ఇలా ఉంటే ఇక దళితులను గుడిలోకి పోనిస్తారా? రానిస్తారా?"

"మతం పేరుతో రాజకీయం చేయడం ఎంత దౌర్భాగ్యం? బీజేపీ నేతలు హిందుత్వానికి ప్రతినిధులుగా చెప్పుకుంటారు. మరి మీ కళ్లెదుటే మీ ఎన్డీఏ కూటమిలో భాగంగా ఉన్న వ్యక్తే శ్రీ వెంకటేశ్వరస్వామి విశిష్టతను, తిరుపతి లడ్డూ పేరు ప్రఖ్యాతులను, స్వామి వారి వైభవాన్ని దెబ్బతీసేలా సీఎం స్థాయిలో అబద్ధాలు చెబుతున్నారు. జంతువుల కొవ్వు వాడకపోయినా.. వాడి లడ్డూలు తయారు చేసినట్లుగా అబద్ధాలతో దుష్ప్రచారం చేసి వెంకటేశ్వరస్వామివారిని అపవిత్రం చేసిన చంద్రబాబును ఎందుకు మందలించడం లేదు? ఎందుకు వెనకేసుకొస్తున్నారు? అంటే మీవాళ్లు ఏం చేసినా ఫరవాలేదు. మిగిలిన వారు ఏం చేసినా తప్పే! ఇదెక్కడి హిందుత్వం? హిందుత్వానికి మీరు టార్చ్ బేరర్స్ అంటారు. అందరూ ఆలోచించండి"

- వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూల తయారీలో కల్తీ నెయ్యిని అసలు వాడనేలేదని టీటీడీ ఈవో అత్యంత స్పష్టంగా చెప్పినా సీఎం చంద్రబాబు రాజకీయం చేస్తూనే ఉన్నారని.. ఆయన చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని ఒక్కొక్కటిగా రుజువు అవుతూ కనిపిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. ఆ నాలుగు నెయ్యి ట్యాంకర్లను రిజెక్ట్ చేసి సరఫరాదారులకు షోకాజ్ నోటీస్ ఇచ్చామని.. వాటిలో వనస్పతి ఆయిల్ కలిపినట్లు తేలిందని చాలా క్రిస్టల్ క్లియర్‌గా జూలై 23న, సెప్టెంబర్ 20న ఈవో రెండుసార్లు ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పినా నీ నీచ రాజకీయం కోసం లడ్డూల తయారీలో జంతువుల కొవ్వు కలిసిందంటూ స్వామివారిని అపవిత్రం చేశావ్ అంటూ చంద్రబాబుపై నిప్పులు చెరిగారు. రిజెక్ట్ చేసిన ట్యాంకర్లలోని కల్తీ నెయ్యిని అసలు వాడలేదని ప్రభుత్వానికిచ్చిన నివేదికలోనూ చాలా స్పష్టంగా ఉందన్నారు. వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర తీశారని చంద్రబాబుపై ధ్వజమెత్తారు.

తప్పు చేయలేని విధంగా రొబస్ట్ విధానం..

"తిరుమలకు సరఫరా చేసే నెయ్యికి సంబంధించి రొబస్ట్ (పకడ్బందీ) విధానం ఉంటుంది. నెయ్యి సరఫరాదారులు ప్రతి ట్యాంకర్‌కు ఎన్ఏబీఎల్ (నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ క్యాలిబ్రేషన్ ల్యాబరేటరీస్) సర్టిఫై చేసిన క్వాలిటీ సర్టిఫికెట్ తేవాలి. అలా వచ్చిన నెయ్యిని కూడా ప్రతి ట్యాంకర్ నుంచి శాంపిల్ తీసి మూడు టెస్టులు చేస్తారు. అవన్నీ పాస్ అయితేనే ట్యాంకర్‌ను ముందుకు పంపుతారు. ఒక్క టెస్టు ఫెయిల్ అయినా ట్యాంకర్‌ను తిరిగి వెనక్కి పంపిస్తారు. 2014–19 మధ్య చంద్రబాబు హయాంలో 14 నుంచి 15 ట్యాంకర్లు అలా వెనక్కి వెళ్లాయి. మా ప్రభుత్వ హయాంలో కూడా 18 ట్యాంకర్లు వెనక్కు పంపారు. అంటే ఎవరూ తప్పు చేయలేని విధంగా అక్కడ రొబస్ట్ విధానం ఉంది. ఏ సరుకులైనా సరే క్వాలిటీ టెస్టులో ఫెయిల్ అయితే వెనక్కు పంపిస్తారు" అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. 'తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామిని ఎవరైతే అబద్ధాలతో అవమానించి అగౌరవపర్చాడో.. లడ్డూపై దుష్ప్రచారం చేశాడో.. ఆధారాలతో సహా కనిపిస్తున్న ఈ సత్యం బయటకు రావాలి. చంద్రబాబునాయుడు చేసిన ఈ పాపం కడగబడాలి. అది రాష్ట్ర ప్రజల మీదకు రావొద్దు. పాపం చేసిన చంద్రబాబు మీదే కట్టడి కావాలి. దాని కోసమే టాపిక్ డైవర్ట్ కాకూడదన్న ఉద్దేశంతో వెంకటేశ్వరస్వామిని ప్రేమించే వ్యక్తిగా, గౌరవించే వ్యక్తిగా నా పర్యటనను వాయిదా వేసుకున్నా' అని పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు చేస్తున్న దుష్ప్రచారాన్ని సాక్ష్యాధారాలతో కడిగి పారేశారు. వైఎస్ జగన్ ఏమన్నారంటే..

వాడని నెయ్యి.. తయారుకాని లడ్డూ..

ఇప్పుడు కూడా అదే జరిగింది. టీటీడీ ట్రస్ట్ బోర్డు అనుమతించిన బిడ్డర్లు జూన్ 12 నుంచి సరఫరా మొదలుపెట్టారు. అంటే అప్పటికే చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడింది. ఆ తర్వాతే నెయ్యి సరఫరా మొదలైంది. జూన్ 12, జూన్ 21, జూన్ 25, జూలై 4న వచ్చిన ట్యాంకర్లన్నీ టెస్టుల్లో పాస్ అయి ముందుకు కదిలాయి. వాటిని లడ్డూల తయారీలో వాడారు. ఆ తర్వాత జూలై 6న రెండు ట్యాంకర్లు, జూలై 12న మరో రెండు ట్యాంకర్లలో వచ్చిన నెయ్యి టీటీడీ టెస్టుల్లో ఫెయిల్ కావడంతో వెనక్కు పంపడానికి సిద్ధం చేశారు. సాధారణంగా మరోసారి ఆ శాంపిళ్లను పరీక్షించేందుకు మైసూర్‌లోని సీఎఫ్‌టీఆర్ఐ (సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)కు పంపిస్తారు. కానీ ఇక్కడ మాత్రం గుజరాత్‌లోని ఎన్డీడీబీ (నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్)కి పంపారు. ఇది టీటీడీ చరిత్రలో తొలిసారి. టీటీడీ పంపించిన శాంపిల్స్‌పై ఎన్డీడీబీ జూలై 23న రిపోర్ట్ పంపింది. నెయ్యిలో కల్తీ ఉందన్న విషయం చెప్పారు. దాంతో ఆ ట్యాంకర్లను వెనక్కు పంపించారు. అలా 4 ట్యాంకర్లను వెనక్కు పంపడంతో పాటు ఆ కంపెనీకి షోకాజ్ నోటీస్ కూడా ఇచ్చారు. మరి ఆ నాలుగు ట్యాంకర్ల నెయ్యి వాడకపోయినా.. ఆ నెయ్యిని వాడారని రెండు నెలల తర్వాత సెప్టెంబరు 18న చంద్రబాబు ఉద్దేశపూర్వకంగా ఎందుకు అన్నారు? (చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక నియమించిన టీటీడీ ఈవో నెయ్యి నాణ్యత గురించి జూలై 23న ఏమన్నారో వీడియోను ప్రదర్శించారు). ఆ నాలుగు ట్యాంకర్లను రిజెక్ట్ చేశాం. షోకాజ్ నోటీస్ ఇచ్చామని, వాటిలో వనస్పతి ఆయిల్ కలిపినట్లు తేలిందని చాలా క్రిస్టల్ క్లియర్‌గా ఈవో చెప్పినా రెండు నెలల తర్వాత చంద్రబాబు సెప్టెంబరు 18న ఏ రకంగా అబద్ధాలు మాట్లాడారో చూడండి (ఆ వీడియో కూడా ప్రదర్శించి చూపారు). అన్నీ తెలిసినా.. నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వాడారని.. లడ్డూలు తయారు చేశారని.. వాటిని భక్తులు తిన్నారని చంద్రబాబు అబద్ధాలు చెప్పారు.

టీడీపీ ఆఫీస్‌లో కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్..

చంద్రబాబు సెప్టెంబరు 18న ఆరోపణలు చేస్తే ఆ మర్నాడే.. అంటే సెప్టెంబరు 19న తెలుగుదేశం పార్టీ ఆఫీస్‌లో ఎన్డీడీబీ రిపోర్ట్‌ను రిలీజ్ చేశారు. నిజానికి అది కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్. అయినా దాన్ని టీడీపీ ఆఫీస్‌లో రిలీజ్ చేశారు. ఆ వెంటనే మర్నాడు అంటే సెప్టెంబరు 20 టీటీడీ ఈవో మళ్లీ ఏం మాట్లాడారో చూద్దాం.. (ఆ వీడియోను ప్రదర్శించారు). ట్యాంకర్లలో వచ్చిన నెయ్యిలో నాణ్యత లేదని తేలినందువల్ల ఆ నెయ్యిని వెనక్కి పంపామని, వాడలేదని చెప్పారు. అంతే కాకుండా సెప్టెంబరు 22న ఈవో స్వయంగా సంతకం చేసి ప్రభుత్వానికి ఒక నివేదిక కూడా ఇచ్చారు (అందులోని అంశాలు చదివి వినిపించారు). కల్తీ నెయ్యితో వచ్చిన ట్యాంకర్లను వెనక్కు పంపాం.. ఆ కంపెనీకి షోకాజ్ నోటీస్ కూడా ఇచ్చాం.. ఎన్డీడీబీ రిపోర్టు చాలా గోప్యమని అందులో ప్రస్తావించారు. మరి దాన్ని అంతకు ముందే తెలుగుదేశం పార్టీ ఆఫీస్‌లో రిలీజ్ చేశారు.

అది అపవిత్రత కాదా?

మళ్లీ సెప్టెంబరు 22న మీడియాతో మాట్లాడిన చంద్రబాబు అవే పచ్చి అబద్ధాలు వల్లించారు. కల్తీ నెయ్యి వాడారని చెప్పారు. స్వామివారి ప్రసాదం విశిష్టతను, తిరుమలప్రతిష్టను, శ్రీవారి ప్రసాదం పేరు ప్రఖ్యాతులను రాజకీయ లబ్ధి కోసం ఇలా అబద్ధాలతో తగ్గించడం, కుట్ర పూరితంగా వ్యవహరించడం అపవిత్రత కాదా?

ఎన్డీడీబీ రిపోర్ట్ కచ్చితమైనది కాదు..

పోనీ.. ఆ ఎన్డీడీబీ రిపోర్టు అయినా కచ్చితమైందా? అని చూస్తే ఆ రిపోర్టులో వాళ్లే డిస్‌క్లెయిమర్ రాశారు. 'నెయ్యిలో ఉండాల్సిన స్టాండర్డ్ వాల్యూ కన్నా శాంపిల్స్‌లోని స్టాండర్డ్ వాల్యూస్‌లో డీవియేషన్స్ ఉన్నాయి. అయినా ఈ పరిస్థితుల్లో ఒక ఫాల్స్ పాజిటివ్ ఫలితం కూడా రావొచ్చు. (ఆ పరిస్థితులు ఏమిటంటే అని వివరిస్తూ పాల సేకరణ, ఆవులు, వాటికి అందించే దాణా గురించి ప్రస్తావించారు). అలాగే ఆవులకు సరైన ఆహారం లేనప్పుడు, అవి సరిగ్గా తినకుండా బలహీనంగా ఉన్నప్పుడు తీసిన పాల నుంచి కూడా ఇలాంటి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు.

పచ్చి అబద్ధాలు. అపవిత్రం కాదా?

ఇవన్నీ తెలిసినా చంద్రబాబు కావాలని అబద్ధాలాడుతున్నారు. ప్రసాదం స్వీకరించే ప్రతి ఒక్కరిలో అనుమానపు బీజాలు రేకెత్తించడం దుర్మార్గం కాదా? నీ రాజకీయ స్వార్థం కోసం వెంకటేశ్వరస్వామి ప్రతిష్టను దిగజారుస్తున్నావు చంద్రబాబూ! స్వామి ప్రసాదానికి సంబంధించిన విశిష్టతను దిగజారుస్తున్నావ్. జరగనిది జరిగినట్లుగా.. జంతువుల కొవ్వుతో ప్రసాదం తయారు చేసినట్లుగా అబద్ధాలను ప్రచారం చేస్తున్నావు. ఇది ధర్మమేనా?

మీ హయాంలో ఎందుకు వాడలేదు?

నందిని బ్రాండ్ ఎందుకు వాడడం లేదని అంటున్నారు. మరి గతంలో చంద్రబాబు పాలన సమయంలో 2015 నుంచి 2018 అక్టోబరు వరకు కేఎంఎఫ్‌కు చెందిన నందిని బ్రాండ్ నెయ్యి ఎందుకు లేదు? అప్పుడు కూడా టెండర్లు పిల్చారు కదా?

అప్పుడు ఇంత కంటే తక్కువ ధరకే..

రూ.320కి కిలో నెయ్యి ఎలా వస్తుందని చంద్రబాబు అంటారు. మరి చంద్రబాబు 2014–19 మధ్య నెయ్యిని ఏ ధరకు సేకరించారు? ఇప్పుడు కూడా అదే క్వాలిటీ నెయ్యి కదా? దశాబ్దాలుగా అదే క్వాలిటీ. అదే నెయ్యి. చంద్రబాబు హయాంలో 2015లో కిలో నెయ్యి రూ.276కి కొన్నారు. అదే 2019 జనవరిలో కిలో ఆవు నెయ్యిని రూ.324కు కొన్నారు. మరి ఇక్కడ రూ.320కి కొంటే తప్పేం జరిగింది?

దశాబ్దాల ఆనవాయితీ..

తిరుమలలో లడ్డూల తయారీ కోసం నెయ్యి కొనుగోలు కార్యక్రమం దశాబ్దాలుగా జరుగుతోంది. ఆర్నెళ్లకు ఒకసారి ఈ-టెండర్ పిలుస్తారు. అర్హులు బిడ్ వేస్తారు. ఎల్-1 గా వచ్చిన వారికి టెండర్ ఖరారు చేస్తారు. ఇందులో ప్రభుత్వ ప్రమేయం ఉండదు. ఎల్-1గా వచ్చిన వారికి కూడా పూర్తి టెండర్ ఖరారు చేయరు. 65 శాతం వారికిచ్చి మిగతా వారిని కూడా రేటు తగ్గించాలని సూచించి వారికి టెండర్ ఇస్తారు. నా చిన్నప్పటి నుంచి చూస్తున్నా. తిరుపతి లడ్డూకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఆ టేస్ట్ మరెక్కడా ఉండదు. తాము సూచించిన ప్రముఖులను టీటీడీ బోర్డులో సభ్యులుగా నియమించాలని కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల సీఎంలు కూడా రికమెండ్ చేస్తారు. అలాంటి ప్రముఖులతో బోర్డు ఏర్పాటవుతుంది. వారంతా దేవుడికి ఇంకా సేవ చేయాలని, భక్తులకు మంచి చేయాలని నిర్ణయాలు తీసుకుంటారు.

డైవర్షన్ పాలిటిక్స్..

తన 100 రోజుల పాలన గురించి ప్రజల దృష్టి మళ్లించేందుకు లడ్డూల టాపిక్ తెచ్చారు. గుడి పవిత్రత దెబ్బతీస్తూ అడ్డంగా దొరికిపోయే సరికి లడ్డూల టాపిక్‌ను డైవర్ట్ చేసేందుకు కొత్తగా డిక్లరేషన్ అంశాన్ని తెచ్చి రాజకీయం చేస్తున్నారు. తిరుమల పవిత్రత, స్వామివారి ప్రసాదం విశిష్టత, దేవస్థానం పేరు ప్రఖ్యాతులను రాజకీయ దుర్బుద్ధితో రచ్చకీడ్చి రాద్ధాంతం చేశారు. జంతువుల కొవ్వుతో లడ్డూలు తయారైనట్టుగా.. ఒక జరగని విషయాన్ని జరిగినట్లుగా.. ఆ కల్తీ ప్రసాదాన్ని భక్తులు తిన్నట్లుగా.. సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి అబద్ధాలాడుతూ, అసత్యాలు పలుకుతూ స్వామి వారి పేరు ప్రఖ్యాతులను, తిరుపతి లడ్డూ విశిష్టతను దగ్గరుండి అపవిత్రం చేసే కార్యక్రమాన్ని సాక్షాత్తూ ఒక ముఖ్యమంత్రే చేస్తుంటే ఇంత కంటే దారుణం, అధర్మం ఎక్కడైనా ఉంటుందా? ఒక్కసారి ఆలోచించండి. చంద్రబాబు ఏ రకంగా అబద్ధాలు చెప్పి రెక్కలు కట్టాడనేది ఆధారాలతో చూపిస్తా. దీన్ని రాష్ట్ర ప్రజలే కాదు.. దేశ ప్రజలంతా గమనించాలని విజ్ఞప్తి చేస్తున్నా.

ఇది రాక్షస రాజ్యం కాదా?

"రాష్ట్రంలో గతంలో ఎన్నడూ చూడని రాక్షస రాజ్యం నడుస్తోంది.. దేవుడిని దర్శించుకునే కార్యక్రమాన్ని కూడా అడ్డుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, కార్యకర్తలకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. నా రాజకీయ జీవితంలో ఇలాంటి రాక్షస రాజ్యాన్ని రాష్ట్రంలోనే కాదు.. దేశంలో కూడా చూడలేదు" అని మాజీ సీఎం వైఎస్ జగన్ మండిపడ్డారు. (తిరుమల వెళ్లకుండా వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పోలీసులు ఇచ్చిన నోటీసులను ఈ సందర్భంగా ఆయన చదివి వినిపించారు). 'జగన్ అనే వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి. ఆయన దేవుడిని దర్శించుకునేందుకు తిరుమల వెళ్తుంటే.. మీకు పర్మిషన్ లేదు.. మీరు వెళ్తే అరెస్టు చేస్తామని నోటీసులు ఇస్తున్నారు. దీనిపై అందరూ ఒక్కసారి ఆలోచన చేయండి' అని విజ్ఞప్తి చేశారు. 'ఏ ప్రపంచంలో ఉన్నాం? ఇది రాక్షస రాజ్యం కాదా? ఒకవైపు నన్ను వెళ్లనివ్వకుండా చేసి వైఎస్సార్‌సీపీ శ్రేణులు వెళ్లకుండా నోటీసులు ఇస్తున్నారు. మరోవైపు చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి బీజేపీ శ్రేణులను రప్పిస్తున్నారు. ఇది ఆ పార్టీ నాయకత్వానికి తెలుసో? లేదో? వేల మంది పోలీసులను మోహరించారు. టాపిక్ డైవర్షన్ కోసం ఎందుకింద ఆరాటం?' అని సీఎం చంద్రబాబును నిలదీశారు.

ప్రతి గుడిలో పూజలు చేయండి..

నేను గుడికి వెళ్లలేకపోయినా ఫరవాలేదు. కానీ చంద్రబాబు చేసిన పాపానికి ప్రాయశ్చిత్తంగా మన పార్టీ తరఫున మీ ఊళ్లలో పూజలు చేయండి. తప్పు చేసింది మేం కాదు.. చంద్రబాబు అని వేడుకోండి. ఆ కోపాన్ని ప్రజలపై కాకుండా చంద్రబాబుపై చూపమని వేడుకోమని కోరుతున్నా. వైఎస్సార్‌సీపీ అభిమానులే కాదు.. రాష్ట్ర శ్రేయస్సు కాంక్షించే ప్రతి ఒక్కరినీ కోరుతున్నా. చంద్రబాబు చేసిన పాపం వల్ల వెంకటేశ్వరస్వామికి కోపం వచ్చి రాష్ట్రం మీద చూపకుండా, కోపం కేవలం చంద్రబాబుమీదే చూపించే విధంగా పూజలు చేయండి. ఎందుకంటే జరిగింది ఘోర అపచారం. వెంకటేశ్వరస్వామిని పలుచన చేస్తూ, ఆయన ప్రసాదాన్ని లోకువ చేస్తూ.. జరగనిది జరిగినట్లుగా.. జంతువుల కొవ్వు వాడనిది వాడినట్లుగా, ఆ లడ్డూలు పంపిణీ చేసినట్లుగా.. పచ్చి అబద్ధాలాడుతూ ఇంత ఘోరం చేసిన వ్యక్తి చంద్రబాబు. ఆ పాపం కడగబడాలి. అందుకే అందరినీ కోరుతున్నా. పూజలు చేయమని వేడుకుంటున్నా.

నా డిక్లరేషన్ కోరడం ఏమిటి?

"చంద్రబాబు పాపాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్న నేపథ్యంలో ప్రజలంతా ఆయన్ను వేలెత్తి చూపుతుండటంతో టాపిక్ డైవర్షన్ కోసమే డిక్లరేషన్ అంటున్నాడు. జగన్ ఇవాళ ఏమైనా కొత్తనా? రాజశేఖర్‌రెడ్డిగారు కొత్తనా? ఆయన ఏమిటో తెలియదా? నా మతం ఏమిటో రాష్ట్రంలో, దేశంలో తెలియదా? నా కులం ఏమిటో తెలియదా? రాజశేఖర్‌రెడ్డిగారు సీఎంగా 5 ఏళ్లు వరుసగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. నేనూ గతంలో చాలాసార్లు వెళ్లాను కదా! సీఎం కాక ముందు కూడా వెళ్లాను కదా! అంతెందుకు.. నా పాదయాత్ర మొదలుపెట్టే ముందు కూడా స్వామివారిని దర్శించుకున్నా. 3,648 కిలో మీటర్ల పాదయాత్రకు ముందు, ముగిసిన తర్వాత తిరుమల శ్రీవారిని దర్శించుకున్నా. తిరుపతి నుంచి కాలి నడకన కొండ ఎక్కా. స్వామివారిని దర్శించుకున్న తర్వాతే ఇంటికి వెళ్లా. అప్పుడు ఉన్నది చంద్రబాబు ప్రభుత్వం. నేను ప్రతిపక్ష నాయకుడిని. రెండుసార్లు స్వామివారిని దర్శించుకున్నాను కదా? ఆ తర్వాత సీఎంగా వరసగా 5 ఏళ్లు స్వామివారికి భక్తి శ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా బ్రహ్మోత్సవాల్లో పట్టువస్త్రాలు సమర్పించాను కదా? ఎన్నోసార్లు స్వామి వారిని దర్శించుకున్నా. తొలిసారి ఎవరైనా వెళ్తుంటే అడగొచ్చు. కానీ 10, 11 సార్లు వెళ్లిన తరువాత.. ఈరోజు నేను తిరుపతి వెళ్తానంటే అడ్డుకుంటూ నోటీసులు ఇవ్వడం ఏమిటి?. డిక్లరేషన్ అడగడం ఏమిటి? మా ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లకు నోటీసులు పంపడం ఏమిటి?" అని సూటిగా ప్రశ్నించారు.

ఎస్సీ వర్గీకరణపై 30 నుంచి వినతుల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్రంలో కులసంఘాలు, వ్యక్తులు, సమూహాల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించాలని వర్గీకరణ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈనెల 30 నుంచి ప్రభుత్వ పనిదినాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కమిటీ విజ్ఞాపనలు స్వీకరించనుంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వినతులను స్వీకరిస్తారు. ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అధ్యయనం చేసేందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం వర్గీకరణ కమిటీని ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. ఆన్‌లైన్‌లో వినతులు సమర్పించాలనుకున్న వారు commr.scsubclassification@gmail.comకు పంపించాలని ఎస్సీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగతంగా వినతులు సమర్పించాలనుకున్న వారు మాసాబ్ ట్యాంక్‌లోని దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్‌లో ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ కె.కిషన్ లేదా సహాయ డైరెక్టర్ ఎస్.సుబ్బలక్ష్మికి అందజేయాలని సూచించారు.



సాక్షి, హైదరాబాద్: జబ్బు చేసిందని డాక్టర్ దగ్గరికి వెళితే మందులు ఇవ్వడంతో పాటు బలానికి టానిక్ కూడా ఇస్తారు. అలాగే పీకల్లోతు ఇబ్బందుల్లో ఉన్న రియల్టీ రంగానికి ప్రోత్సాహకరం అనే టానిక్ అవసరం ఏర్పడింది. హైడ్రా వ్యవహారంతో మార్కెట్‌లో భయాలు నెలకొన్నాయి. పెట్టుబడిదారులు, కొనుగోలుదారులు ఒప్పందాలను రద్దు చేసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితులలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి.

- వ్యవసాయం తర్వాత అత్యధిక ఉపాధి కల్పించేది నిర్మాణ రంగమే. కానీ, ఆశించిన మేర విక్రయాలు లేకపోవడంతో ఏడాది కాలంగా రియల్టీ రంగం కుదేలవుతోంది. హైడ్రా తీరుతో మార్కెట్‌లో నెలకొన్న భయాందోళనలను తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అందుకే గృహ కొనుగోలుదారుల్లో ఉత్సాహం నెలకొల్పేందుకు స్టాంప్ డ్యూటీ తగ్గించాలి.
- కనీసం 6 నెలల పాటు భవన నిర్మాణ అనుమతుల రుసుములను రాయితీలను అందించాలి. లేదా ఫీజుల చెల్లింపులలో వాయిదా పద్ధతికి అనుమతి ఇవ్వాలి.
- హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతినకుండా ప్రభుత్వం వ్యవహరించాలి. వచ్చే 2–3 ఏళ్లలో హైదరాబాద్ అభివృద్ధి ఎలా ఉండబోతోంది వివరించాలి. నగరంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్ట్‌ల గురించి స్పష్టత ఇవ్వాలి. ఉద్యోగ అవకాశాలు, ప్రాంతాల వారీగా కీలక ప్రాజెక్ట్‌ల గురించి వివరించి మార్కెట్‌లో సెంటిమెంట్‌ను తిరిగి తీసుకురావాలి
- చెరువులు, నాలాల్లోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని నిర్మాణాలను మాత్రమే హైడ్రా కూల్చివేతలు ఉంటాయని, ఇప్పటికే అనుమతులు వచ్చిన ప్రాజెక్ట్‌ల జోలికి వెళ్లమనే సంకేతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

సమగ్ర ప్లాన్: ఆస్ట్రేలియా, ఇటలీ, రష్యా వంటి దేశాలలో సహజ వనరులకు ఏమాత్రం భంగం కలిగించకుండా చూస్తారు. అందుకే ఆయా దేశాలలో ఎంత దూరం ప్రయాణించినా సరే ఒకే రకమైన రహదారులు, చెట్లతో ఆహ్లాదకరంగా, ప్రశాంత వాతావరణం కనిపిస్తుంటుంది. అదే మన దగ్గర ఏరియాను బట్టి రోడ్ల విస్తీర్ణం, మౌలిక వసతులు మారిపోతుంటాయి. ఉదాహరణకు.. మన దగ్గర ప్రాజెక్ట్‌లో 10 శాతం ఓపెన్ స్పేస్ వదలాలి అనే నిబంధన ఉంది. కానీ, చాలా మంది డెవలపర్లు వాళ్లకు ఇష్టం వచ్చిన ప్రాంతంలో ఓపెన్ స్పేస్‌కు కేటాయిస్తుంటారు. కానీ, విదేశాలలో అలా కాదు ఓపెన్ స్పేస్ ఎక్కడ వదలాలి? బయటే కాదు ప్రాజెక్ట్‌లోని అంతర్గత రోడ్లు కూడా ఎలా ఉండాలి? వంటి ప్రతీ అంశం మాస్టర్ ప్లాన్ ప్రకారమే ఉండేలా పటిష్ట చర్యలు తీసుకుంటారు. టోపోగ్రఫీని అధ్యయనం చేసిన తర్వాతే సమగ్ర మాస్టర్ ప్లాన్‌కు రూపమివ్వాలి. భూమి నైసర్గిక స్వరూపాన్ని బట్టి నివాస, వాణిజ్య, వినోదం ఇలా అన్ని రకాల జోన్లకు ప్రాధాన్యత ఇవ్వాలి. సహజ వనరులు, జీవ వైవిధ్యం అన్నింటికీ చోటు కల్పించాలి. భవిష్యత్తు రద్దీని అంచనా వేసి అందుకు తగ్గట్లు మౌలిక వసతులకు ఏర్పాట్లు చేయాలి.

రియల్టీనే థర్మామీటర్



రాష్ట్ర ఆరోగ్యకర వృద్ధికి రియల్ ఎస్టేట్ థర్మామీటర్ లాంటిది. పరిశ్రమ బాగుంటేనే అభివృద్ధితో పాటు ప్రభుత్వానికి పన్నులు, రుసుముల రూపంలో ఆదాయం సమకూరుతుంది.

– డాక్టర్ కిరణ్, సీఈఓ, సుచిరిండియా

కాళేశ్వరం ఎవరి మానస పుత్రిక?

- గజ్వేల్ ఈఎన్సీ హరిరామ్‌పై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నల వర్షం
- మూడు గంటలకు పైగా క్రాస్ ఎగ్జామినేషన్

సాక్షి, హైదరాబాద్: 'కాళేశ్వరం ప్రాజెక్టు ఎవరి మానస పుత్రిక (బ్రెయిన్ చైల్డ్)? ప్రాజెక్టు డీపీఆర్‌ను మీరెందుకు కేంద్ర జల సంఘానికి సమర్పించారు? రామగుండం సీఈకిఎందుకు ఆ బాధ్యతలు అప్పగించలేదు? డీపీఆర్ సమర్పించాలని ప్రభుత్వం నుంచి మీకు ఎలాంటి ఉత్తర్వులు లేకున్నా మీరెందుకు సమర్పించారు? కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ (కేఐపీఎల్)కు మేనేజింగ్ డైరెక్టర్‌గా ప్రభుత్వం మిమ్మల్నే ఎందుకు ఎంపిక చేసింది ?'అంటూ కాళేశ్వరం ప్రాజెక్టు గజ్వేల్ ఈఎన్సీ బి.హరిరామ్‌పై జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌లపై విచారణలో భాగంగా కమిషన్ శుక్రవారం హరిరామ్‌ను మూడు గంటలకు పైగా క్రాస్ ఎగ్జామిన్ చేసింది. మొత్తం 92 ప్రశ్నలను సంధించింది.

ఆచితూచి జవాబులు

కమిషన్ ప్రశ్నలకు హరిరామ్ ఆచితూచి సమాధానాలిచ్చారు. నాటి నీటిపారుదల శాఖ ఈఎన్సీ సి.మురళీధర్ ఆదేశాలతోనే 2017 ఫిబ్రవరిలో తాను సీడబ్ల్యూసీకి డీపీఆర్‌ను సమర్పించినట్టు చెప్పారు. ఎవరి ఆదేశాలతో ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారోతనకు తెలియదన్నారు. కాళేశ్వరం కార్పొరేషన్ ఎండీగా తన పేరును ఈఎన్సీ సిఫారసు చేయగా, ప్రభుత్వం నియమించిందన్నారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు హైదరాబాద్ సీఈగా వ్యవహరించడంతోనే ఆ బాధ్యత తనకు అప్పగించారన్నారు. రుణాలు తీసుకోవడానికే కార్పొరేషన్ ఏర్పాటైందన్నారు. సీఈఓ ఎవరు అని కమిషన్ ప్రశ్నించగా, ప్రభుత్వం నియమించలేదన్నారు. కార్పొరేషన్‌లో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును చేర్చాలని నాటి ఈఎన్సీ సూచించగా, ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు.

11 బ్యాంకుల కన్సార్టియం నుంచి రుణాలు

నాటి ఆంధ్రాబ్యాంకు నేతృత్వంలో 11 బ్యాంకులతో ఏర్పాటు చేసిన కన్సార్టియం కాళేశ్వరం కార్పొరేషన్‌కు రుణాలను మంజూరు చేసిందని హరిరామ్ తెలిపారు. రుణాలకు రాష్ట్ర ప్రభుత్వం పూచీకత్తు ఇచ్చిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం సేకరించిన భూములతో పాటు పంప్‌హౌస్‌లు, సొరంగాలు, బరాజ్‌లు వంటి ఆస్తులను బ్యాంకులకు తనఖా పెట్టినట్టు చెప్పారు. కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారా రూ.74,781 కోట్ల రుణాలు తీసుకోగా, వడ్డీలు కలిపి రూ.87,449 కోట్లకు పెరిగాయన్నారు. బ్యాంకులు రూ.62,825 కోట్లను విడుదల చేశాయన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా కార్పొరేషన్ ద్వారా బిల్లుల చెల్లింపులు ఏమైనా చేశారా? అని కమిషన్ ప్రశ్నించగా, సమాధానం ఇవ్వడానికి హరిరామ్ కొంత ఇబ్బందిపడ్డారు. సంబంధిత సీఈలు/ఈఎన్సీల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు బిల్లులు చెల్లించినట్టు చెప్పారు. డెడ్ స్టోరేజీ నుంచి నీళ్లను తరలించడానికి వీలుగా వెనుక భాగంలో హెడ్ రెగ్యులేటర్లను నియమించడంతోనే బరాజ్‌లు దెబ్బతిన్నాయా? బరాజ్‌లను నీటి నిల్వ రిజర్వాయర్లుగా ఉపయోగించబోతున్నారని మీకు అప్పుడు తెలుసా? మేడిగడ్డ బరాజ్‌లోని 7వ బ్లాక్ కుంగిపోవడానికి కారకులు ఎవరు? అని కమిషన్ ప్రశ్నించగా, తనకు తెలియదని హరిరామ్ సమాధానమిచ్చారు. కొందరు వ్యక్తులను రక్షించడానికి మీరు కమిషన్ ముందు ఈ సాక్ష్యాలు ఉంచారా? అని ప్రశ్నించగా, లేదని బదులిచ్చారు.

తిరుమలలో సంకరజాతి గోవు నెయ్యి వాడకం

- 5 రోజులుగా మహాపరాధం.. ఆనంద నిలయంలో ఆ నెయ్యితోనే నైవేద్యాలు
- యుగతులసి ఫౌండేషన్ చైర్మన్, టీటీడీ మాజీ పాలకమండలి సభ్యుడు కె.శివకుమార్ ఆవేదన
- నందిని పేరిట పాల ఉత్పత్తులు విక్రయించే కేఎంఎఫ్ వద్ద ఒక్క దేశీ గోవు కూడా లేదని వెల్లడి
- దీనిపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందించాలని సూచన



పంజగుట్ట: తిరుమలలో గత ఐదు రోజులుగా మహాపరాధం జరుగుతోందని యుగతులసి ఫౌండేషన్ చైర్మన్, టీటీడీ మాజీ పాలకమండలి సభ్యుడు కె.శివకుమార్ ఆరోపించారు. ఆనంద నిలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి నైవేద్యాలకు దేశీ గోవు నెయ్యికి బదులు సంకరజాతి గోవు నెయ్యి వాడుతున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కర్ణాటకకు చెందిన నందిని బ్రాండ్ నెయ్యిని దిగుమతి చేసుకుంటోందని చెప్పారు. తిరుమలకు సరఫరా చేసే ఆ నెయ్యి కంటైనర్‌ను కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య జెండా ఊపి ప్రారంభించారన్నారు. అయితే నందిని బ్రాండ్‌తో పాల ఉత్పత్తులను విక్రయించే కర్ణాటక సహకార పాల ఉత్పత్తిదారుల ఫెడరేషన్ లిమిటెడ్ (కేఎంఎఫ్) వద్ద ఒక్క దేశీ గోవు కూడా లేదని... ఆ సంస్థ వద్ద ఉన్నవన్నీ సంకర జాతి గోవులేనన్నారు. నైవేద్యాలకు ఆ నెయ్యిని వాడటం మహాపరాధమని శివకుమార్ పేర్కొన్నారు.

గతంలో రాజస్తాన్ నుంచి స్వచ్ఛమైన ఆవు నెయ్యి తెప్పించాం..

2021లో తాము టీటీడీ పాలకమండలిలో ఉన్నప్పుడు రాజస్తాన్ నుంచి స్వచ్ఛమైన ఆవు నెయ్యిని కిలో రూ. 2 వేల చొప్పున కొనుగోలు చేసే వారమని శివకుమార్ వివరించారు. కానీ ప్రస్తుత పాలకమండలి ఆ విధానానికి స్వస్తిపలికి సంకరజాతి గోవుల నెయ్యి వాడటం ఎంతవరకు సబబని ఆయన ప్రశ్నించారు. ఒక భక్తుడు గత మూడున్నరేళ్లుగా ఆనంద నిలయంలో స్వామివారి నైవేద్యం కోసం వాడుతున్న ప్రసాదాలకు ప్రతిరోజూ లక్ష రూపాయలు ఇస్తున్నారని.. కలియుగాంతం వరకు ఇస్తానని మాట ఇచ్చారని చెప్పారు. కానీ కొన్ని రోజులుగా ఆ భక్తుడు ఇచ్చే లక్ష రూపాయలను తీసుకోవట్లేదని.. ఆలయ ఈవో, జేఈవోను కలిసి ఎంత వేడుకున్నా తీసుకోకపోవడంతో ఎంతో మనస్తాపానికి గురయ్యారని అన్నారు. దాతలు ముందుకొచ్చినప్పుడు స్వచ్ఛమైన నెయ్యితో నైవేద్యం తయారు చేయొచ్చు కదా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఏపీ సీఎం చంద్రబాబు స్పందించి స్వచ్ఛమైన దేశీ గోవు నెయ్యిని నైవేద్యాలకు వాడేలా టీటీడీని ఆదేశించాలని శివకుమార్ సూచించారు.



సీపీఆర్‌పై శిక్షణ పొందుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సీపీఆర్‌పై అవగాహనతో ప్రాణరక్షణ

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రాంగోపాల్‌పేట (హైదరాబాద్): సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉంటే గుండెపోటు వచ్చిన వారిని కాపాడవచ్చని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. సడన్ కార్డియాక్ వీక్, ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ కిమ్స్ ఆధ్వర్యంలో రాజ్‌భవన్‌లోని 200 మంది సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఆర్‌పై శిక్షణ పొందితే.. అప్పటికప్పుడు గుండెపోటుకు గురైన వారిని కాపాడే ధైర్యం కూడా వస్తుందన్నారు. ఈ సందర్భంగా సీపీఆర్ ఎలా చేయాలో గవర్నర్ ఆసక్తిగా తెలుసుకున్నారు.

డిప్యూటీ సీఎం ఇంట్లో భారీ చోరీ



రోషన్‌కుమార్

బంజారాహిల్స్ (హైదరాబాద్): ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఆయన ఇంట్లో పని చేస్తున్న బిహార్‌కు చెందిన వ్యక్తి, తన స్నేహితుడితో కలిసి దాదాపు రూ.20 లక్షల విలువైన సొత్తు, నగదు ఎత్తుకుపోయాడు. ఈ మేరకు అందిన ఫిర్యాదు నేపథ్యంలో..బంజారాహిల్స్ పోలీసులు అన్ని రాష్ట్రాల రైల్వే పోలీసు (జీఆర్పీ) అధికారులను అప్రమత్తం చేయడంతో.. పశ్చిమబెంగాల్‌లోని ఖరగ్‌పూర్ రైల్వే స్టేషన్‌లో వారిద్దరూ పట్టుబడ్డారు. భట్టి విక్రమార్క ప్రస్తుతం ప్రజా భవన్‌లో నివసిస్తున్నారు. అయితే ఆయనకు బంజారాహిల్స్ రోడ్ నం.14లోని బీఎన్ రెడ్డికాలనీలో విల్లా ఉంది. బిహార్‌కు చెందిన రోషన్‌కుమార్ మండల్ (28) ఆ ఇంట్లో పని చేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఇంటి హాల్‌లో పడుకుంటూ వాచ్‌మన్‌గా, సర్వెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. భట్టి ఇటీవల విదేశీ పర్యటనకు వెళ్లడాన్ని అవకాశంగా తీసుకున్న రోషన్ దొంగతనానికి పథకం వేశాడు. తన స్వస్థలం నుంచి స్నేహితుడైన ఉదయ్ కుమార్ ఠాకూర్‌ను పిలిపించాడు. ఇద్దరూ కలిసి మంగళవారం మధ్యాహ్నం విల్లా పడక గది తాళాలు పగులకొట్టారు. అందులోని బీరువాలో ఉన్న నగదు, బంగారు, వెండి వస్తువులు, విదేశీ కరెన్సీ, బంగారు ఆభరణాలు తస్కరించారు. అదే రోజు రాత్రి సికింద్రాబాద్ నుంచి రైలు మార్గంలో బిహార్‌కు బయలుదేరారు. అయితే అదే ఇంట్లో భట్టి వ్యక్తిగత సహాయకులు కూడా ఉంటుంటారు. గురువారం విల్లాలో రోషన్ కనిపించకపోవడంతో ఇల్లంతా వెతుకుతూ మొదటి అంతస్తుకు వెళ్లారు. అక్కడ ప్రధాన బెడ్‌రూమ్ తాళాలు పగులగొట్టి ఉండటం, చోరీ జరగడాన్ని గుర్తించారు. వెంటనే భట్టి పీఏ భాస్కర శర్మకు సమాచారం అందించారు. వెంటనే విల్లాకు వచ్చిన ఆయన రోషన్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఆయన బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల్లో నమోదైన ఫుటేజీలను పరిశీలించగా రోషన్, ఉదయ్ ఓ బ్యాగ్‌తో వెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. వీళ్లు రైల్లో వెళ్లారని గుర్తించిన పోలీసులు పశ్చిమ బెంగాల్, బిహార్‌ల్లో ఉన్న అన్ని రైల్వేస్టేషన్ల జీఆర్పీ అధికారులకు సమాచారం ఇచ్చారు. నగరం నుంచి తొలుత భువనేశ్వర్ వెళ్లిన నిందితులిద్దరూ అక్కడి నుంచి భువనేశ్వర్–హౌరా జన్ శతాబ్ది ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. ఈ రైలు గురువారం సాయంత్రం ఖరగ్‌పూర్ స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్ నం.7కు చేరుకోగా అందులో తనిఖీలు చేస్తున్న జీఆర్పీ సిబ్బంది బ్యాగ్‌తో ఉన్న రోషన్, ఉదయ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి చోరీ సొత్తు, సొమ్ము స్వాధీనం చేసుకుని నగర పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో శుక్రవారం ఖరగ్‌పూర్ వెళ్లిన ఎస్సై రాంబాబు నేతృత్వంలోని బృందం శనివారం సాయంత్రానికి నిందితుల్ని ఇక్కడకు తీసుకురానుంది.

చైతన్యపథం

జర్మనీ లేదా అమెరికాలో తయారైన కళాకృతులు, వస్త్రాలు మారుమూల మర్రిచెట్టు తండాలో కనిపించడం విశేషం కాకపోవచ్చు.
అయితే మర్రిచెట్టు తండాలో తయారైన కళాకృతులు జర్మనీ, అమెరికాలాంటి ఎన్నో దేశాల్లో కనిపించడం కచ్చితంగా విశేషమే.
'గిరిజన' అనే మాటతో ప్రతిధ్వనించే శబ్దం... కళ.
ఆ కళ ఆటలు, పాటలు, వస్త్రాలు, కళాకృతుల రూపంలో వారి దైనందిన జీవితంలో భాగం అయింది.
ప్రపంచీకరణ ప్రభావంతో 'అత్యాధునికత' అనేది పురా సంస్కృతులు, కళలపై కత్తిలా వేలాడుతుంది.
ఆ కత్తి వేటు పడకుండా తమ సంప్రదాయ కళలను రక్షించుకోవడమే కాదు... 'ఇది మా కళ' అని ప్రపంచానికి సగర్వంగా చాటుతుంది మర్రిచెట్టు తండా...





మర్రిచెట్టు తండా

అమెరికాకు అలంకరణ

నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని మర్రిచెట్టు తండా... ఒక కేక వేస్తే తండా మొత్తం వినిపించేంత చిన్న తండా. వ్యవసాయపనులు, బయటి ఊళ్లల్లోకి వెళ్లి కూలిపనులు చేసుకునేవాళ్లే తండాలో ఎక్కువమంది ఉన్నారు.

వ్యవసాయం అయినా, కూలిపనులు అయినా శ్రమతో కూడుకున్నవి. ఇంటికి వచ్చిన తరువాత తండాలోని మహిళలకు ఆ శ్రమభారాన్ని తగ్గించేవి కళలు. అందులో ప్రధానమైనవి చేతివృత్తుల కళలు. తాతముత్తాతల నుంచి పరంపరగా వస్తూ తమ చేతికి అందిన ఈ కళలు వారికి మానసిక ఆనందం ఇవ్వడమే కాదు నాలుగు డబ్బులు సంపాదించుకునేలా చేస్తున్నాయి.

అద్దాలు, దారాలు, గజ్జెలు, పూసలు వంటి వాటిని ఉపయోగిస్తూ ఇంటికి అవసరమైన అలంకరణ వస్తువులను, గిరిజన సంప్రదాయ దుస్తులను రూపొందిస్తున్నారు. ఈ తండావాసుల హస్తకళలు నాబార్డ్ దృష్టిలో పడడంతో కొత్త ద్వారం తెరుచుకుంది. తండావాసులు తయారు చేసిన కళాకృతులు, దుస్తులను మార్కెటింగ్ చేసేందుకు అవకాశం కల్పిస్తామని నాబార్డ్ ముందుకు వచ్చింది. నాబార్డు నిర్వహించే ఎగ్జిబిషన్‌లలో మర్రిచెట్టు తండావాసుల స్టాల్స్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసేవాళ్లు.

నాబార్డ్ చొరవతో తండాకు మాత్రమే పరిమితమైన కళాకృతులు లోకానికి పరిచయం అయ్యాయి. సంప్రదాయ గిరిజన దుస్తులు, వస్తువులను వ్యాపారులు కొనుగోలు చేసి రాజస్థాన్, హరియాణా, గుజరాత్ వంటి రాష్ట్రాలతో పాటు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. మర్రిచెట్టు తండా మహిళలు తయారు చేస్తున్న పన్నెండు రకాల ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. గిరిజన సంప్రదాయానికి ప్రతీకగా పురుషులు అలంకరణగా ధరించే 'విరేనాపాటో'కు మంచి ఆదరణ ఉంది.

కుటుంబానికి ఆసరాగా...



తండాలో దాదాపు 150మందికి పైగా మహిళలం చేతి అల్లికల ద్వారా సంప్రదాయ వస్త్రాలు, వస్తువులను తయారు చేస్తున్నాం. ఏ కొంచెం తీరిక దొరికినా ఎవరి ఇండ్లలో వాళ్లం వీటిని తయారు చేస్తుంటాం. ఒక్కో వస్తువు తయారు చేసేందుకు వారం రోజులు పడుతుంది. వీటిని అమ్మగా వచ్చే డబ్బుతో కుటుంబానికి ఆసరాగా ఉంటుంది.

– బాణావత్ పద్మ

తమ కుటుంబాలకు చెందిన వారు ఎవరైనా గొప్ప విజయం సాధిస్తే వారిని ఈ 'విరేనాపాటో'తో సత్కరిస్తారు. దీంతోపాటు దర్వాజా తోరణం, చేతి సంచులు, కోత్లో (పైసలు దాచే సంచి), పులియాగాల (తలపై బుట్ట ధరించేది), గండో(మేరమ్మ అమ్మవారి ప్రతీక), దాండియా డ్రెస్, కవ్య (పెళ్లయిన గిరిజన మహిళలు ధరించేవి), దద్ప (ఫ్రిజ్ కవర్లు) మొదలైన వాటిని ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

'మేము తయారు చేస్తున్న వస్తువులతో రాబడి వస్తోందనే సంతోషం కంటే వాటి గురించి ఎక్కడెక్కడి వాళ్లో మెచ్చుకోవడం మరింత సంతోషంగా అనిపిస్తోంది. బట్టలు కుడుతున్నప్పుడో, బుట్టలు చేస్తున్నప్పుడో పని చేస్తున్నట్లుగా ఉండదు. హుషారుగా అనిపిస్తుంది. ఒకప్పుడు ఏ పని లేనప్పుడు ఈ పనులు చేసేవాళ్లం. ఇప్పుడు ఈ పనే మాకు పెద్ద పని అయింది' అంటుంది నేనావత్ చాంది.

'బయట ఊళ్లకు పోయినప్పుడు మాది మర్రిచెట్టు తండా అని గర్వంగా చెప్తా. పనుల కోసం తండా వదిలి ఎక్కడెక్కడికో వెళ్లిన వాళ్లు ఇక్కడే ఉండొచ్చు' అంటూ ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్లిన వాళ్లను అమ్మలాంటి తండాకు తిరిగి రావాలని కోరుకుంటుంది బాణావత్ పద్మ. వారికోసం హస్తకళలు ఎదురుచూస్తున్నాయి.

'ఇప్పుడు మేము చేస్తున్నవే కాదు ఇంకా ఎన్నో ఉన్నాయి' అంటుంది నేనావత్ సుబ్బులు.

విదేశాల నుంచి వస్తున్నారు



మేము తయారు చేసే అల్లికలను చూడడం కోసం మా తండాకు విదేశాల నుండి కూడా ఎంతో మంది వస్తున్నారు. ఇంటి దగ్గర ఉంటూ మా పనులు చేసుకుంటూనే సంప్రదాయ పద్ధతిలో చేతితో అల్లికలు అల్లుతున్నాం. తీజ్ వేడుకల్లో గిరిజనులు ధరించే విరేనాపాటోతో పాటు పులియాగాల(తలపై ధరించేది)వంటి అలంకరణ వస్త్రాలు తయారు చేస్తున్నాం.

– నేనావత్ సుబ్బులు

సబ్సిడీ ఇవ్వాలి



సంప్రదాయ దుస్తులతో పాటు ఇంట్లోకి అవసరమయ్యే అలంకరణ వస్తువులను 30 ఏళ్లుగా తయారు చేస్తున్నాం. వ్యవసాయ పనులకు వెళ్లినా తీరిక వేళల్లో వీటిని తయారు చేస్తాం. మేము తయారు చేసిన వాటిని కొనేందుకు పట్టణాల నుంచి చాలా మంది వస్తుంటారు. కొనడమే కాదు వాటి గురించి అడిగి తెలుసుకుంటారు. అల్లికలకు ఉపయోగించే వస్తువులపై సబ్సిడీ ఇవ్వడంతోపాటు, పట్టణాల్లో స్టాళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సహించాలి.

– నేనావత్ చాంది

గిరిజన కళాకృతులలో ఎన్నో మరుగునపడి పోయాయి. వాటి గురించి తెలిసిన వారు ఎక్కడో ఒకచోట ఉండే ఉంటారు. అలాంటి వారితో మాట్లాడితే తెరమరుగైపోయిన ఎన్నో కళాకృతులు మళ్లీ కొత్త కాంతులతో వెలుగుతాయి.

నేనావత్ చాంది, నేనావత్ సుబ్బులు, బాణావత్ పద్మ... వీరు మాత్రమే కాదు మర్రిచెట్టు తండాలోని 150 మంది మహిళలు చేతివృత్తుల కళాకారులే కాదు చరిత్ర చెప్పే ఉపన్యాసకులు కూడా! 'విరేనాపాటో' నుంచి 'గండో' వరకు వాటి తయారీ గురించి మాత్రమే కాదు వాటి వెనుక చరిత్ర కూడా ఈతరానికి తెలియజేస్తున్నారు. ఇంతకంటే కావాల్సింది ఏముంది!

– చింతకింది గణేశ్,
సాక్షి, నల్లగొండ,

కొత్త దారి

హిమాలయాలు అంటే మంచు అందాలు గుర్తు రావచ్చు.
ఆధ్యాత్మిక సౌరభం వెల్లివిరియవచ్చు.
మరోవైపు చూస్తే... అందమైన హిమాలయ ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలలో పేదరికం ఉంది. నిరక్షరాస్యత ఉంది. నిరుద్యోగం ఉంది. వ్యసనాలు ఉన్నాయి.
చుట్టపు చూపుగా హిమాలయాలకు వెళ్లాలనుకోలేదు మహిమ మెహ్రా.
వారిలో ఒకరిగా బతకాలనుకుంది. వారి బతుకు బండికి కొత్త దారి చూపాలనుకుంది.

స్వచ్ఛందాల మహిమాలయం





పుణె, దుబాయ్‌లలో బోధన రంగంలో దశాబ్దకాలం పనిచేసింది మహిమ మెహ్రా. పుణెలోని 'స్పెక్ట్రమ్' అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, క్యాన్సర్ రోగులు, నిరుపేద ప్రజల కోసం పనిచేసిన మహిమ తన సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకువెళ్లాలనుకుంది. స్కిల్ ట్రైనింగ్, కెరీర్ గైడెన్స్, పర్యావరణ స్పృహకు సంబంధించి శిక్షణా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది.

భిన్నమైన సంస్కృతి, భిన్నమైన వాతావరణం మధ్య పనిచేయాలనే ఆసక్తి మహిమను లద్దాఖ్‌కు తీసుకువెళ్లింది. ఈ హిమాలయ ప్రాంతానికి రావడంతో ఆమె జీవితమే మారిపోయింది.

'ఇది నా జీవితాన్ని మార్చిన ప్రయాణం. ఇక్కడ నేను అవసరమైన వారికి అవసరమైన సహకారం అందిస్తున్నాను' అంటుంది మహిమ.

సేవాకార్యక్రమాలు చేయడానికి పట్టణాలు లేదా పల్లెలను ఎంపిక చేసుకుంటారు. హిమాలయ ప్రాంతం మారుమూలలో నివసిస్తున్న వారిపై తక్కువమంది దృష్టి పడుతుంది. వీరి గురించి తెలుసుకున్న తరువాత మార్పు తీసుకురావాలనే తపన మహిమలో మొదలైంది.



ఆ తపనే వందలాది మంది జీవితాల్లో వెలుగు తీసుకువచ్చింది.

'నగరానికి చెందిన వారు గ్రామీణప్రాంత ప్రజలతో కలిసి పని చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చినప్పుడు ఎన్నో మార్పులు చోటుచేసుకుంటారు. గ్రామీణ ప్రజలు తమలోని సామర్థ్యాన్ని గుర్తించడం ఆ మార్పులో ఒకటి' అంటుంది మహిమ మెహ్రా.

హిమాలయ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలతో పనిచేయాలనుకున్నప్పుడు వారి గురించి లోతుగా తెలుసుకోవాలనుకుంది మహిమ. ఒక ఆన్‌లైన్ సెషన్‌లో మహిమకు పంకీ సూద్ పరిచయం అయ్యాడు. సూద్ ద్వారా హిమాలయ ప్రాంత ప్రజల గురించి మహిమకు కొంత అవగాహన వచ్చింది.

'కులు లోయలోని పిల్లల కోసం మీరు కొన్ని వర్క్‌షాప్‌లు నిర్వహిస్తే బాగుంటుంది' అని సూచించాడు సూద్. వెంటనే అక్కడికి వెళ్లి వర్క్‌షాప్‌లు మొదలు పెట్టింది. ఈ వర్క్‌షాప్‌లకు 30 నుంచి 40 మంది వరకు పిల్లలు వచ్చేవాళ్లు. ఆ తరువాత 'సన్‌షైన్ లెర్నింగ్ సెంటర్'ను మొదలుపెట్టింది. ఈ సెంటర్ కోసం ఉపాధ్యాయుల సహకారం అవసరం కావడంతో ఫేస్‌బుక్ పేజీ ప్రారంభించింది.

వాలంటీర్‌లను ఆహ్వానించింది. మొదట్లో 10 ఆ తరువాత... 15...ఆ తరువాత 50 నుంచి 500 వరకు వాలెంటీర్ల సంఖ్య పెరిగింది. ఇప్పుడు 'సన్‌షైన్ లెర్నింగ్' తరఫున పనిచేయడానికి 24,500 పైగా వాలెంటీర్‌లు ఉన్నారు.

ఈ అనూహ్యమైన స్పందనే 'హిమాలయన్ వాలంటీర్ టూరిజం' ఏర్పాటుకు దారి తీసింది.

హిమాలయ ప్రాంతంలో విద్య, నైపుణ్య అభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ స్పృహ, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అనేవి హిమాలయన్ వాలంటీర్ టూరిజం (హెచ్‌వీటీ) లక్ష్యాలు. హిమాచల్ ప్రదేశ్‌లోని కులు లోయలో 'హెచ్‌వీటీ' మొదటి ప్రాజెక్ట్ మొదలైంది. నాలుగు గ్రామాల నుంచి ఎంతోమంది 'హెచ్‌వీటీ' వర్క్‌షాప్‌లకు హాజరయ్యారు. లెర్నింగ్ యాక్టివిటీస్‌లో భాగం అయ్యారు.

డిగ్రీ చేసిన అమ్మాయిలు 'సన్‌షైన్ లెర్నింగ్ సెంటర్' ద్వారా ఒక సంవత్సరం పాటు శిక్షణ తీసుకొని నామమాత్రం వేతనంతో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఇప్పుడు 'హెచ్‌వీటీ' హిమాలయాలలోని ఎన్నో ప్రాంతాలలో స్వచ్ఛంద సేవాకార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. 50 పాఠశాలలతో కలిసి పనిచేస్తుంది. పది టాయ్ లైబ్రరీలను, 35కి పైగా పుస్తక లైబ్రరీలను ఏర్పాటు చేసింది.

విద్యకు సంబంధించిన వర్క్‌షాప్‌లు మాత్రమే కాకుండా వైద్యశిబిరాలు నిర్వహిస్తోంది. మాదకద్రవ్యాల బారిన పడిన వారిని ఆ వ్యసనం నుంచి బయటికి తీసుకురావడానికి, వృత్తి విద్యకు సంబంధించిన నైపుణ్య అభివృద్ధి శిక్షణ కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాలు హిమాలయ ప్రాంతంలో గణనీయమైన మార్పును తీసుకువచ్చాయి.

అరుణాచల్‌ప్రదేశ్‌లో కూడా ఇలాంటి కార్యక్రమాలే చేపడుతున్నారు. చదువుపైనే కాదు రివర్స్ మైగ్రేషన్, ఆర్థిక స్థిరత్వం, రెవెన్యూ జెనరేషన్ కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోంది.

హిమాలయ ప్రాంతాల్లో పనిచేయాలనే తన ఆలోచన విన్న కొందరు....

'అంత దూరం వెళతావా!' అని ఆశ్చర్యపోయారు.

అలా ఆశ్చర్యపోయిన వారే ఇప్పుడు 'ఇంత మార్పు తీసుకువచ్చావా' అని మహిమ మెహ్రాను అభినందిస్తున్నారు.

* కాస్త చూసుకోండి

గుడ్ వాచ్... బ్యాడ్ వాచ్

బోలెడన్ని డబ్బులు పోసి మనసుకు నచ్చిన స్మార్ట్ ఫోన్, ల్యాప్‌ట్యాప్ వంటి డిజిటల్ వస్తువులు కొనుక్కుంటాం. కానీ, వాటిలో నచ్చినవన్నీ చూసేస్తాం అనుకోవడానికి లేదు. పిల్లల అశ్లీల వీడియోలు చూసినా, వాటిని షేర్ చేసినా, స్టోర్ చేసుకున్నా .. జైలుకెళ్ళాల్సిందే అంటోంది సుప్రీం కోర్టు. అందుకని ఇకపైన నా ఫోన్ నా ఇష్టం అంటే విషయం ఎక్కడకు వరకు వెళుతుందో. ఇంటి కోర్టులోనే డిజిటల్‌లో గుడ్ వాచ్.. బ్యాడ్ వాచ్ గురించి అవగాహన కలిగి ఉండటం ముఖ్యం అంటున్నారు నిపుణులు.



డిజిటల్‌లో అశ్లీల వీడియోలు కుప్పలు తెప్పలుగా చాపకింద నీరులా చేరుతుంటాయి. మీ డివైజ్‌లో పిల్లలకు సంబంధించిన అశ్లీల వీడియోలు, అశ్లీల సమాచారం ఉన్నా, వాటిని ఎవరైనా షేర్ చేసినా ఇక నుంచి క్రిమినల్ నేరంగా పరిగణించబడుతుంది. ఈ విషయాన్ని ఇటీవల భారతదేశంలోని అత్యున్నత న్యాయస్థానం చట్టంగా తీసుకొచ్చి, కొరడా ఝుళిపించింది. నేరాన్ని ప్రేరేపించే చర్యలను కట్టడి చేయడానికి న్యాయశాస్త్రంలో 'ఇంకోట్ క్రైమ్' సిద్ధాంతం ప్రాముఖ్యతను సుప్రీం కోర్టు నొక్కి చెప్పింది.

నేరాన్ని ప్రేరేపించేవే!

పిల్లలకు సంబంధించిన అశ్లీల వీడియోలు, చిత్రాలు, కంటెంట్ ఎవరి దగ్గర ఉన్నా దాని వెనుక గల చెడు ఉద్దేశ్యం ఒకటే. ప్రేరేపిత నేరాలు తదుపరి నేరానికి సిద్ధమయ్యే క్రిమినల్ చర్యలుగా కోర్టు దీనిని నిర్వచించింది. కంటెంట్ అసలు ప్రసారం అయ్యిందా, లేదా అనే దానితో కూడా సంబంధం లేకుండా శిక్షార్హులే అని కోర్టు స్పష్టం చేసింది.

కఠిన శిక్షలు తప్పవు

పిల్లల అశ్లీల వీడియోలు, చిత్రాలు వంటివి తమ డివైజ్‌లో ఏవి స్టోర్ చేసుకున్నా వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు లైంగిక నేరాల నుండి పిల్లలను రక్షించే పోక్సో లోని సెక్షన్ 15 కింద జరిమానా లేదా శిక్ష లేదా రెండూ విధించాలని నిర్ణయించింది. ఉపవిభాగాలు (1), (2), (3)లో చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించిన వివిధ నేరాలకు శిక్షలు, నేరం స్వభావాన్ని బట్టి జరిమానాల నుండి జైలు శిక్ష వరకు ఏ విధంగా ఉంటాయో వివరించింది.

డిజిటల్ అక్షరాస్యత అవసరం

అన్ని వయసుల వారూ ఫోన్‌ని ఉపయోగించే వెసులుబాటు మన దగ్గర ఉంది. కానీ, ఆన్‌లైన్‌లో 'ఏం చూస్తున్నాం. జాగ్రత్తగా ఎలా ఉండాలి' అనే అవగాహన లేదు. పక్కనవాళ్లు చూస్తున్నారు కదా అని మనం కూడా పియర్ క్యూరియాసిటీతో వీడియోలను షేర్ చేసుకొని మరీ చూస్తుంటారు. స్వీయ వినోదం కోసం చెత్తను పోగేసుకుంటూ ఉంటారు. దీనికి కారణం డిజిటల్ అక్షరాస్యత లేకపోవడమే. ఆఫ్‌లైన్‌లో అంటే సమాజంలో ఎలాంటి మర్యాదలు పాటిస్తున్నారో, ఆన్‌లైన్‌లో కూడా అంతే మర్యాదగా ఉండాలనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. పోస్ట్ చేసే కంటెంట్ విషయంలోనూ కంట్రోల్ లేకపోవడం, వెరిఫికేషన్ చెక్ చేసుకకోపోతే సమస్యలు కొని తెచ్చుకున్నట్టే.

వివిధ రకాల శిక్షలు

- పిల్లల పోర్న్‌కు సంబంధించిన డిజిటల్ స్టోరేజ్ స్వాధీనం చేసుకుంటే సెక్షన్ 15 (1) కింద కనీసం రూ. 5,000 నుంచి రూ. 10,000 వరకు జరిమానా ఉంటుంది.
- పిల్లల అశ్లీల విషయాలను వ్యాప్తి చేస్తే సెక్షన్ 15 (2) ప్రకారం మూడేళ్ల వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ ఉంటాయి.
- వాణిజ్య లాభాల కోసం పిల్లల పోర్న్ కంటెంట్‌ను ఉపయోగిస్తే సెక్షన్ 15 (3) కింద మొదటిసారి నేరం చేసిన వారికి మూడు సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాల జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ ఉంటాయి.
- పునరావృతం చేసే నేరాలకు జరిమానాతో పాటు ఐదేళ్ల నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చు.

వయసుల వారీగా అవగాహన

పిల్లలు, యువత డిజిటల్‌లో ఏం చూస్తున్నారు, ఏం చేస్తున్నారో పెద్దలు తప్పక తెలుసుకోవాలి. చట్టపరంగా వచ్చిన మార్పుల గురించీ వారికి అవగాహన కల్పిస్తూ ఉండాలి. పిల్లలు డిజిటల్‌ను వాడుతుంటే వారి వయసును బట్టి పేరెంటల్ కంట్రోల్స్ కీ లను ఉపయోగించాలి. బ్రౌజింగ్, యాప్స్... వంటివన్నీ సేఫ్ మెథడ్స్‌లో ఉంచాలి. సాధారణంగా పిల్లలకు గుడ్‌టచ్-బ్యాడ్ టచ్ ఏ విధంగా చెబుతుంటారో డిజిటల్ పరంగా గుడ్ వాచ్-బ్యాడ్ వాచ్ గురించి కూడా తెలియజేయాలి. పిల్లలు ఏదైనా షేర్ చేస్తుంటే వారు పోస్ట్ చేసే కంటెంట్‌పైన మానిటరింగ్ ఉండాలి. స్కూళ్లలోనూ వయసు పరంగా అవగాహన తరగుతలను నిర్వహించాలి. టీనేజ్ స్థాయి నుంచి వయసుల వారీగా మెంటల్ హెల్త్ ద్వారా కౌన్సెలింగ్స్ ఇస్తూ నివారణోపాయాలు సూచించాలి. ఎవరి దగ్గరైనా చైల్డ్ పోర్న్ ఉన్నా, షేర్ చేస్తున్నా.. వారి గురించి పోలీసులకు లేదంటే https://cybercrime.gov.in లో కంప్లైంట్ చేయచ్చు.



– అనీల్ రాచమల్ల,
సైబర్ సేఫ్టీ నిపుణులు, ఎండ్ నౌ ఫౌండేషన్

బ్యూటిప్స్



- యాపిల్ ముక్కలతో ముఖం పై మర్దనా చేస్తుంటే స్కిన్‌పై ఆయిల్ కంట్రోల్ అయ్యి నిగారింపు వస్తుంది.
- కోడిగుడ్డులోని తెల్ల సొనలో పంచదార, కార్న్ ఫ్లోర్ కలిపి బ్లెండ్ చేసిన మిశ్రమాన్ని ముఖంపై అప్లై చేసి ఆరిన తరువాత ఆ పొరను నెమ్మదిగా తీసేస్తే ముఖంపై గల సన్నటి వెంట్రుకలు తొలగిపోతాయి.
- స్నానం చేసే నీళ్లలో అర కప్పు తేనెని కలుపుకుని స్నానం చేస్తే చర్మం నునుపవుతుంది.
- నిమ్మచెక్కలతో ముఖాన్ని సుతిమెత్తగా మర్దనా చేసి, 20 నిమిషాల తరువాత చన్నీటితో కడిగేస్తే ముఖం తాజాగా ఉంటుంది.
- కోడిగుడ్డు లోని తెల్లసొనను తేనెతో రంగరించిన మిశ్రమాన్ని ముఖానికి పట్టించి 15 నిమిషాలుంచాలి. ఆరిన పొరను నెమ్మదిగా తీసేస్తే ముఖంలో మృతకణాలు నశించి నిగారింపు లభిస్తుంది.





వంటిల్లు

మిల్లెట్స్ ఆరోగ్యానికి మంచివని తెలుసు.
కానీ... రోజూ తినాలంటే కష్టంగా ఉంది.
దోసె రుచి కోసం నాలుక మారాం చేస్తోంది.
మరేం చేద్దాం... జొన్నతో దోసె చేద్దాం.
జొన్నతోనే లంచ్ బాక్స్‌కి కిచిడీ చేద్దాం. ఎంచక్కా తింటూనే బరువు తగ్గుదాం.

వెయిట్ భయపెడుతోందా!

మెనూ మారుద్దాం



జొన్న దోసె

కావలసినవి: జొన్న పిండి – కప్పు; బియ్యప్పిండి – పావు కప్పు; రవ్వ – పావు కప్పు; జీలకర్ర– అర టీ స్పూన్; పచ్చిమిర్చి– 2 (తరగాలి); అల్లం – అంగుళం ముక్క (తురమాలి); ఉప్పు – పావు టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె – టేబుల్ స్పూన్.

తయారీ: • ఒక వెడల్పు పాత్రలో జొన్నపిండి, బియ్యప్పిండి, రవ్వ, జీలకర్ర, పచ్చిమిర్చి, అల్లం, ఉప్పు వేసి కలపాలి. ఇందులో దాదాపుగా మూడు కప్పుల నీటిని పోసి గరిటె జారుడుగా కలుపుకోవాలి. మిశ్రమం గట్టిగా అనిపిస్తే మరికొంత నీటిని చేర్చి కలిపి ఓ అరగంట సేపు నాననివ్వాలి • ఇప్పుడు పెనం వేడి చేసి ఒక గరిటె పిండితో దోసె వేసి, చుట్టూ పావు టీ స్పూన్ నూనె చిలకరించాలి. ఒకవైపు కాలిన తర్వాత తిరగేసి రెండో వైపు కూడా కాల్చితే జొన్న దోసె రెడీ. ఈ దోసెలోకి వేరుశనగపప్పు చట్నీ, సాంబారు, టొమాటో పచ్చడి మంచి కాంబినేషన్.

జొన్న కిచిడీ

కావలసినవి: జొన్నలు – అరకప్పు; పెసరపప్పు – పావు కప్పు; కూరగాయల ముక్కలు – కప్పు (క్యారట్, బీన్స్, బఠాణీలు కలిపి); జీలకర్ర – అర టీ స్పూన్; పసుపు – పావు టీ స్పూన్; ఉప్పు – పావు టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నీరు – 3 కప్పులు; నెయ్యి లేదా నూనె – టేబుల్ స్పూన్.

తయారీ: • జొన్నలను కడిగి మంచి నీటిలో నాలుగు గంటల సేపు నానబెట్టాలి • ప్రెషర్ కుక్కర్‌లో నెయ్యి వేడి చేసి జీలకర్ర వేసి మంట తగ్గించాలి. అవి వేగిన తర్వాత అందులో కూరగాయ ముక్కలు వేసి రెండు నిమిషాల సేపు మగ్గనివ్వాలి. • నానిన జొన్నలను కడిగి నీటిని వంపేసి పక్కన పెట్టుకోవాలి. పెసరపప్పును కడిగి పెట్టుకోవాలి • కూరగాయ ముక్కల పచ్చిదనం పోయిన తర్వాత అందులో జొన్నలు, పెసర పప్పు, పసుపు, ఉప్పు వేసి నీటిని పోసి కలిపి మూత పెట్టాలి • మీడియం మంట మీద ఉడికించాలి. నాలుగు విజిల్స్ వచ్చిన తర్వాత స్టవ్ ఆపేయాలి • ప్రెషర్ తగ్గిన తర్వాత మూత తీసి గరిటెతో కలిపి వేడిగా వడ్డించాలి. ఇందులోకి ఆవకాయ, పెరుగు పచ్చడి బాగుంటాయి.





● నలుపు వెనుక చీకటి

అన్ని డార్క్ సర్కిల్స్ ఒకటి కాదు..

చాలా మంది.. కంటికింద నల్లని వలయాలు కనిపిస్తుంటే ఒత్తిడికి గురవుతున్నామనో నిద్ర సరిగా పోవడం లేదనో అనుకుంటూ ఉంటారు. మార్కెట్లో లభించే క్రీములను రాస్తూ ఉంటారు. కానీ, సరైన పరిష్కారం లభించదు. డార్క్ సర్కిల్స్ ఏర్పడటానికి కారణం అనారోగ్యం అని తెలుసుకుంటే పరిష్కారం కూడా సులువు అవుతుంది.

పాతికేళ్ల ఏంజెల్ మెడిసిన్ విద్యార్థిని. కళ్ల కింద ఏర్పడిన నల్లటి వలయాలు తన శరీరంలో ఏదో తీవ్రమైన సమస్యకు సంకేతమని తెలుసుకొని ఆశ్చర్యపోయింది. ఒక ఈవెంట్‌లో ఏంజెల్‌ను కలిసిన డెర్మటాలజిస్ట్ ఆమె కళ్లకింద నల్లటి వలయాలను చూసి, అలెర్జీల సమస్యలను సూచిస్తున్నాయని చెప్పాడు. అందరిలో ఆ విషయం గురించి ఎక్కువ చర్చించలేక ఇంటికి వెళ్లాక డెర్మటాలజిస్టుకు ఫోన్ చేసింది.



డెర్మటాలజిస్ట్ లారెన్ మాట్లాడుతూ – 'ఈ సమస్యను పెరియార్బిటల్ హైపర్ పిగ్మెంటేషన్ అని కూడా అంటారు. రక్తనాళాలకు సంబంధించిన సమస్య వల్ల కూడా డార్క్ సర్కిల్స్ ఏర్పడతాయ'ని వివరించారు. ఇన్నాళ్లూ నిద్రలేమి వల్ల కలిగే సాధారణ సమస్య ఇది అనుకుంది. డాక్టర్ చెప్పిన విధంగా తన కుటుంబంలో జన్యుపరంగా ఉబ్బసం, ఎగ్జిమా వంటి సమస్యలు ఉన్నాయని తెలుసుకుంది. 'మీకున్న అలెర్జీ ఏంటో కనుక్కొని, దానికి తగిన మందులు తీసుకుంటే నల్లని వలయాల సమస్య దూరం అవుతుంది' అని డాక్టర్ చెప్పడంతో తగిన చికిత్స తీసుకోవడం మొదలుపెట్టింది.

రోగనిరోధక శక్తి తగ్గుదల

కళ్ల కింద వలయాలు మాత్రమే కాదు చర్మం ముడతలు పడటం, ముక్కుకు అడ్డంగా ఉన్న అలెర్జీ మచ్చలు కూడా తగ్గుతుండే రోగ నిరోధక శక్తికి సూచికలు అంటున్నారు వైద్యులు. పోషకాహార నిపుణులు, బ్యూటీషియన్స్ కూడా నల్లటి వలయాలు రావడానికి చాలా కారణాలు ఉన్నాయని వివరిస్తున్నారు. వాటిలో... ● జన్యుపరమైనవి, పోషకాహార లోపాలు, ఆటో ఇమ్యూన్ కండిషన్స్, అలసట, జీర్ణకోశ సమస్యలు, ఏదీ తినాలని లేకపోవడం.. వంటివన్నీ కంటికింద భాగాన్ని నల్లగా చేస్తాయి. రకరకాల అలెర్జీలు, సైనస్ సమస్యల వల్ల కూడా డార్క్ సర్కిల్స్ ఏర్పడతాయి. కారణాన్ని గుర్తించి, వాటికి దూరంగా ఉంటే అవే తగ్గిపోతాయి.

క్రీములకన్నా మేలైనవి..

నల్లటి వలయాలు తగ్గడానికి మార్కెట్‌లో రకరకాల క్రీములు లభిస్తుంటాయి. వీటిని వాడినా మార్పు రాలేదంటే సాధారణ సమస్య కాదని గుర్తించాలి. ● రోగ నిరోధక వ్యవస్థను మెరుగుపరుచుకోవాలి. అందుకు ఆరోగ్యకరమైన ఆహారం, తగినంత ద్రవాహారాలు తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం.. వంటివి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ● ఫేషియల్ ఎక్సర్‌సైజ్‌ల వల్ల చర్మకణాలు చురుకు అవుతాయి. రక్తప్రసరణ మెరుగై చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ● అలోవెరా, తేనె .. వంటి వాటిని అప్లై చేస్తూ సాధారణ చర్మ సమస్యలను నివారించుకోవడానికి ఇంటి వద్దే జాగ్రత్తలు తీసుకోవచ్చు.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

అనర్థాలను నివారించాలంటే..

తీవ్ర అనారోగ్య సమస్యలను గుర్తించడానికి నల్లని వలయాలను ఒక సూచికగా తీసుకోవాలి. ఆస్తమా, బ్రాంకైటిస్, డస్ట్ అలెర్జీల వల్ల నల్లని వలయాలు ఏర్పడుతుంటాయి. చర్మం పొడిబారినా, బి12, ఐరన్ లోపం వల్ల కూడా ఈ సమస్య తలెత్తుతుంది. బరువు పెరగడంతో చర్మం మందం అవడం, బరువు తగ్గినప్పుడు చర్మం పలచబడటం, వయసు పైబడటం వల్ల చర్మంలో వచ్చిన మార్పుల వల్ల కూడా ఈ సమస్య ఉత్పన్నం అవుతుంది. కంటి దగ్గర ఉండే భాగాన్ని అలెర్జీ ఉన్నప్పుడు రుద్దుతూ ఉన్నా, మొబైల్, ల్యాప్‌టాప్.. వంటి స్క్రీన్ టైమ్ ఎక్కువ ఉపయోగించినా, నైట్ షిఫ్ట్స్ వల్ల, సరైన నిద్ర లేకపోవడం వల్ల నల్లటి వలయాలు ఏర్పడతాయి. 6 నుంచి 8 గంటల నిద్ర ఉండాలి. డ్రై స్కిన్ ఉందంటే మాయిశ్చరైజర్ వాడాలి. బరువు పెరుగుతున్నారంటే ఫిట్‌నెస్, పోషకాహారం జాగ్రత్తలు తీసుకోవాలి. అలెర్జీ సమస్యలకు వైద్య చికిత్స తప్పనిసరి.



– డాక్టర్ స్వప్నప్రియ, డెర్మటాలజిస్ట్

ఓపికతో పెంచండి

ఒడిలో పిడుగులు

● పిల్లల్ని పెంచడం ఒక కళ.
● పిల్లల్ని ప్రయోజకులను చేయడం అనేది ఒక బాధ్యత.
● ఆ బాధ్యతను నిర్వర్తించడంలోనే ఉంది అసలైన నైపుణ్యం.
● ఆ నైపుణ్యం లోపించడం వల్లనే పేరెంటింగ్ ఒత్తిడికి గురి చేస్తోంది.
● ఈ తరం యువత పిల్లల్ని పెంచడంలో స్ట్రెస్‌కు లోనవుతోంది.
● నిజానికి... కొంచెం సంయమనం పాటించడం తెలిస్తే చాలు.
● పిల్లల్ని పెంచడంలో ఆనందం అనుభవంలోకి వస్తుంది.

'పిల్లలు పైకి కనిపించేటంత సున్నితమైన వాళ్లు కాదు. వాళ్లను డీల్ చేయడం కత్తిమీద సామే. పిల్లలను అర్థం చేసుకోవడంలో విఫలమవుతున్నామా లేక పిల్లలకు అర్థమయ్యేటట్లు చెప్పడంలో విఫలమవుతున్నామా?' పిల్లలపెంపకంలో కొత్తతరం ఎదుర్కొంటోన్న ప్రధాన సమస్య ఇది. తల్లిదండ్రులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించడంలో నైపుణ్యాన్ని అలవరుచుకోవాలని చెప్పారు హైదరాబాద్‌కు చెందిన ఫ్యామిలీ కౌన్సెలర్ చెరువు వాణీమూర్తి. ఆమె గమనించిన అనేక విషయాలను సాక్షి ఫ్యామిలీతో పంచుకున్నారు.

ప్లానింగ్ ఉంటోంది... కానీ!

ఈ తరం పేరెంట్స్ ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకుంటున్నప్పటి నుంచే పిల్లల పెంపకం గురించి కచ్చితంగా ఉంటున్నారు. మంచి భవిష్యత్తు అందివ్వాలని, చక్కగా పెంచి ప్రయోజకులను చేయాలని కలలు కంటారు. ఎదురు చూసిన బిడ్డ చేతుల్లోకి వస్తుంది. వేదుకలతో బిడ్డను ఈ ప్రపంచంలోకి స్వాగతించిన పేరెంట్స్ కూడా పెంచడంతో తమ బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించలేక స్ట్రెస్‌కు లోనవుతున్నారు.



ఆనందం వర్సెస్ సవాల్!

పిల్లల పెంపకం తల్లిదండ్రులకు గొప్ప ఆనందం. అదే సమయంలో పెద్ద సవాల్ కూడా. అవగాహన లేకపోవడం వల్ల పేరెంటింగ్‌ను మోయలేని బాధ్యతగా భావిస్తున్నారు. పిల్లల విషయంలో తాము శారీరకంగా, మానసికంగా, ఎమోషనల్‌గా ఆరోగ్యంగా ఉన్నామా లేదా అని గమనించుకోలేకపోతున్నారు. పిల్లలకు చిన్నప్పుడే ఎన్నో సంగతులు చెప్పేయాలని వారి వయసుకు మించిన జ్ఞానాన్ని బుర్రలో చొప్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఆ మేరకు గ్రాహక శక్తి పిల్లలకు ఉందా లేదా అనే విషయాన్ని గ్రహించలేకపోతున్నారు.

క్వాలిటీ టైమ్ ఇవ్వాలి!

టీవీ, ఫోన్, సోషల్ మీడియాతో కాలక్షేపం చేయకుండా పిల్లలతో మాట్లాడుతూ, వారితో ఆడుకోవాలి. ప్రతి చిన్న సమస్యకీ పరిష్కారాల కోసం యూ ట్యూబ్‌లో వెతికి, అవి తమకు వర్తించకపోతే సరిగ్గా పెంచలేకపోతున్నామని ఒత్తిడికి లోనవుతుంటారు. పిల్లల పెంపకంలో కొన్ని బాధ్యతలను గ్రాండ్ పేరెంట్స్‌కి కూడా పంచాలి. కొంతమంది... పిల్లలు తమకు మాత్రమే సొంతమని, తమ పిల్లల బాధ్యత పూర్తిగా తమదేనని, ఎవరి సాయమూ తీసుకోకుండా తామే చక్కబెట్టుకోవాలనుకుంటున్నారు. ఆ ధోరణి మార్చుకోవాలి. మరికొంతమందిలో తమకు అన్నీ తెలుసని, ఎవరూ ఏమీ చెప్పాల్సిన అవసరం లేదనే పెడధోరణి కూడా కనిపిస్తోంది. అది కూడా మంచిది కాదు. అన్నీ తెలిసిన వాళ్లు ఎవరూ ఉండరు. తెలుసుకుంటూ ముందుకు సాగాలి.



శ్రీమతి చెరువు వాణీమూర్తి, ఫ్యామిలీ కౌన్సెలర్

లైఫ్@360

పంచుకుంటూ పెంచాలి!

చిన్న చిన్న విషయాలకు కూడా ఎక్కువగా ఆలోచించడం వల్ల ఒత్తిడికి లోనవుతున్నారు. ఇవన్నీ సాధారణమేనని, పెంపకంలో ఇలాంటి ఒత్తిడులు ఉంటాయని ముందుగానే అవగాహన ఉండాలి. తల్లిదండ్రులిద్దరూ పిల్లల బాధ్యతను పంచుకుంటే ఇద్దరూ పెంపకాన్ని ఆస్వాదించవచ్చు. పిల్లలకు ప్రతి దశలోనూ తలిదండ్రుల సపోర్ట్, గైడెన్స్ అవసరమే. ఏ దశలో ఎలాంటి సపోర్ట్ ఇవ్వాలో పేరెంట్స్ తెలుసుకుని, తాము నేర్చుకుంటూ ముందుకు సాగుతుంటే స్ట్రెస్‌కు లోనుకాకుండా పేరెంటింగ్‌ని ఆస్వాదించగలుగుతారు. లెర్నింగ్ మైండ్ ఉంటే ఇది సాధ్యమే.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



కలిసి ప్రయాణించాలి!

పేరెంటింగ్ అంటే పిల్లల పసితనం, బాల్యం, కౌమారం... ప్రతి దశల్లోనూ వారితో కలిసి సాగాల్సిన ప్రయాణం. తలితండ్రులు, పిల్లలు కలిసి చేయాల్సిన ప్రయాణం ఇది. ఈ ప్రయాణాన్ని సులభతరం చేసుకోవాలంటే తల్లిదండ్రులు- పిల్లల మధ్య రిలేషన్ గట్టిగా ఉండాలి. పిల్లలను బేషరతుగా ప్రేమను పంచుతున్నామా, వారి పట్ల కరుణతో ఉంటున్నామా, తమ పరిధులను, అభిరుచులను వారి మీద రుద్దుతున్నామా, ఇతర పిల్లలతో పోలుస్తూ తక్కువ చేయడం లేదా ఎక్కువ చేయడం వంటి పొరపాటు చేస్తున్నామా... అనే ప్రశ్నలు వేసుకోవాలి. పిల్లలు ఏ చిన్న తప్పు చేసినా, వారికి ఏ చిన్న సమస్య ఎదురైనా తాము పెంపకంలో విఫలమవుతున్నామేమోనని అపరాధభావానికి లోనుకావాల్సిన అవసరమే లేదు.



వెల్ ఉల్లి..

ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఆహార పదార్థాలలో వెల్లుల్లి కూడా ఒకటి. దీన్ని తేనెలో నానబెట్టి తింటే చాలా రకాల జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. ఉదయాన్నే తేనె, వెల్లుల్లి కలిపి తింటే పోషక విలువలు శరీరానికి బాగా వంటపడతాయి. ఎందుకంటే వెల్లుల్లి, తేనెలో చాలా రకాల ఔషధ గుణాలు ఉంటాయి. ఇవి వ్యాధులు, వాపుల నుంచి రక్షణనిస్తాయి. తేనెలో వెల్లుల్లిని కలిపి తింటే మెటబాలిజం వృద్ధి చెందుతుంది. దీంతో శరీరంలో నిల్వ ఉన్న చెడు కొవ్వు కరిగిపోతుంది. ఫలితంగా బరువు తగ్గుతారు. వెల్లుల్లి, తేనె రెండింట్లోనూ యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ అనే పదార్థం కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. దీన్ని తేనెతో కలిపి తింటే గుండె రక్తనాళాల్లో పేరుకుపోయిన కొవ్వులు కరిగిపోతాయి. దీంతో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. అంతేకాకుండా, పేగుల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. వెల్లుల్లి తింటే రక్తంలో చక్కెర స్థాయి కంట్రోల్‌లోకి వస్తుంది. దీన్ని తేనెతో కలిపి తింటే రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటాయి.

జలుబు, దగ్గు నుంచి ఉపశమనం

వెల్లుల్లి, తేనెతో కలిపి తింటే గొంతు నొప్పి, దగ్గు, జలుబు నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. వెల్లుల్లిలో ఉండే యాంటీబయాటిక్, యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అంటువ్యాధులను తగ్గించి, శరీరం త్వరగా కోలుకునేలా చేస్తాయి.

ఎలా తినాలి?

ఒకటి, రెండు వెల్లుల్లి రెబ్బలను బాగా నూరి పేస్ట్‌లా చేసుకోవాలి. దీన్ని ఒక చెంచా తేనెతో బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక గిన్నెలో వేసి రాత్రంతా అలాగే ఉంచాలి. మరుసటి రోజు ఉదయాన్నే తినాలి. తర్వాత 15–20 నిమిషాల పాటు ఏమీ తినకూడదు.

మీకు తెలుసా?

మనం శ్వాస తీసుకునే విధంగానే చెట్లు కూడా శ్వాస తీసుకుంటాయి. కానీ మనం ఆక్సిజన్ తీసుకుని కార్బన్ డయాక్సైడ్‌ను విడుదల చేస్తే, చెట్లు కార్బన్ డయాక్సైడ్‌ను తీసుకుని ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. అయితే. ఒక చెట్టు ఎంత ఆక్సిజన్ విడుదల చేస్తుంది అంటే ఖచ్చితంగా చెప్పలేము. ఒక చెట్టు తన జీవితకాలంలో విడుదల చేసే ఆక్సిజన్ పరిమాణం చాలా కారకాలపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా వేర్వేరు రకాల చెట్లు వేర్వేరు పరిమాణాల్లో ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి.



ఒక చెట్టు వయసు పెరిగే కొద్దీ అది విడుదల చేసే ఆక్సిజన్ పరిమాణం కూడా పెరుగుతుంది. పెద్ద చెట్లు చిన్న చెట్ల కంటే ఎక్కువ ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. వెలుతురు, నీరు, మట్టి నాణ్యత వంటి పరిస్థితులు చెట్టు పెరుగుదలను ప్రభావితం చేస్తాయి. దీని వల్ల ఆక్సిజన్ ఉత్పత్తిపై ప్రభావం పడుతుంది. స్పష్టంగా చెప్పాలంటే, 50 సంవత్సరాల వయసు ఉన్న ఒక మామిడి చెట్టు తన జీవితకాలంలో 81 టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహిస్తుంది. 271 టన్నుల ఆక్సిజన్‌ను విడుదల చేస్తుందని అంచనా. మనకు స్వచ్ఛమైన గాలి కావాలంటే చెట్లు ఎంత అవసరమో దీనిని బట్టి అర్థం అవుతోంది కదా...

సినిమా



● విక్రమ్ ● సూర్య

రెండు దశాబ్దాల తర్వాత...

రెండు దశాబ్దాల తర్వాత హీరోలు విక్రమ్, సూర్య కలిసి నటించే అవకాశం కనిపిస్తోంది. తమిళ రచయిత ఎస్‌యు వెంకటేశన్ రాసిన 'వీరయుగ నాయగన్ వేళ్‌పారీ' నవల హక్కులు ప్రముఖ దర్శకుడు శంకర్ వద్ద ఉన్నాయి. ఈ నవల ఆధారంగా ఓ సినిమాను తెరకెక్కించాలనుకుంటున్నారట శంకర్. ఈ సినిమాను ఆయన రెండు భాగాలుగా తీయనున్నారని, ఇందులో విక్రమ్–సూర్య హీరోలుగా నటించనున్నారని కోలీవుడ్ టాక్. 2003లో వచ్చిన 'పితాగమన్' (తెలుగులో 'శివపుత్రుడు') చిత్రం తర్వాత సూర్య, విక్రమ్ కలిసి నటించలేదు. మరి... 21ఏళ్ల తర్వాత శంకర్ సినిమా కోసం వీరిద్దరూ కలిసి మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకుంటారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. మరోవైపు దర్శకుడు శంకర్ ప్రస్తుతం రామ్‌చరణ్ 'గేమ్ చేంజర్'ను రిలీజ్‌కు రెడీ చేస్తున్నారు. అలాగే ఆయన దర్శకత్వంలో కమల్‌హాసన్ హీరోగా నటించిన 'ఇండియన్ 3' విడుదలకు సిద్ధమవుతోంది. ఈ రెండు సినిమాల తర్వాతనే 'వీరయుగ నాయగన్ వేళ్‌పారీ' నవలను సినిమాగా తీసే పనులపై శంకర్ పూర్తి స్థాయి దృష్టి పెట్టాలనుకుంటున్నారని కోలీవుడ్ భోగట్టా.



● సాయిపల్లవి

ఇందు రెబెక్కా వర్గీస్‌గా...

ఇందు రెబెక్కా వర్గీస్‌గా తనను తాను పరిచయం చేసుకున్నారు హీరోయిన్ సాయిపల్లవి. అమరవీరుడు మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవితం ఆధారంగా రూపొందిన బయోగ్రాఫికల్ యాక్షన్ ఫిల్మ్ 'అమరన్'. శివ కార్తికేయన్ హీరోగా నటించిన ఈ బహుబాషా చిత్రానికి రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలోని హీరోయిన్ ఇందు రెబెక్కా వర్గీస్ పాత్రను సాయిపల్లవి పోషిస్తున్నారు. శుక్రవారం సాయిపల్లవి పాత్రకు సంబంధించిన ఇంట్రో వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. శివ్ అరూర్, రాహుల్ సింగ్ రాసిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్' అనే పుస్తకంలోని మేజర్ వరదరాజన్ చాప్టర్ ఆధారంగా 'అమరన్' సినిమాను తెరకెక్కించారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మించిన 'అమరన్' అక్టోబరు 31న రిలీజ్ కానుంది. ఈ సినిమాను శ్రేష్ట్ మూవీస్ పతాకంపై సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి తెలుగులో రిలీజ్ చేస్తున్నారు.




● ప్రభాస్

బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో

కల్కి 2898 ఏడీ

ప్రభాస్ హీరోగా నటించిన మైథలాజికల్ అండ్ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'కి అరుదైన గౌరవం దక్కింది. ఈ ఏడాది అక్టోబరు 2 నుంచి అక్టోబరు 11 వరకు దక్షిణ కొరియాలో 29వ బూసాన్ ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ (బీఐఎఫ్‌ఎఫ్) జరగనుంది. ఈ చిత్రోత్సవాల్లో ప్రదర్శితం కానున్న 279 చిత్రాల్లో 'కల్కి 2898 ఏడీ'కి చోటు లభించింది. అక్టోబరు 8, 9 తేదీల్లో ఈ చిత్రం 'బీఐఎఫ్‌ఎఫ్'లో ప్రదర్శితం కానుంది. ఈ విషయాన్ని 'కల్కి 2898 ఏడీ' నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ 'ఎక్స్' మాధ్యమంలో ధ్రువీకరించింది. ప్రభాస్ హీరోగా అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మించిన ఈ చిత్రం ఈ ఏడాది జూన్ 27న విడుదలై, సూపర్‌హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'కల్కి 2' రానుంది.

నీలో... నాలో...



● శ్రీవిష్ణు, మీరా జాస్మిన్

భవ భూతి, రేవతి ప్రేమలో పడ్డారు. 'నీలో... నాలో కదలాడు భావమీ రాగం... లోలో ఎదలో వినిపించసాగే ఓ తాళం...' అంటూ పాట అందుకున్నారు. భవ భూతిగా శ్రీవిష్ణు, రేవతిగా మీరా జాస్మిన్ నటించిన చిత్రం 'శ్వాగ్'. హసిత్ గోలి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 4న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'నీలో... నాలో కదలాడు భావమీ రాగం...' అంటూ సాగే పాటను శనివారం విడుదల చేశారు. ఈ చిత్రంలో శ్రీవిష్ణు చేసిన నాలుగు పాత్రల్లో భవ భూతి ఒకటి. ఆ పాత్ర సరసనే మీరా జాస్మిన్ కనిపించనున్నారు. ఇక చిత్ర సంగీతదర్శకుడు వివేక్ సాగర్ స్వరపరచిన ఈ పాటకు భువనచంద్ర సాహిత్యం అందించగా రాజేశ్ కృష్ణన్, అంజనా సౌమ్య ఆలపించారు. ''ఈ మెలోడీ ట్రాక్‌లో శ్రీవిష్ణు, మీరా జాస్మిన్‌ల కెమిస్ట్రీ అద్భుతంగా ఉంటుంది. ఈ పాట ప్రేక్షకులను 1980, 90లలోకి తీసుకెళుతుంది'' అని చిత్రబృందం పేర్కొంది. రీతూ వర్మ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో దక్షా నాగర్కర్, శరణ్య ప్రదీప్, సునీల్, రవిబాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు.



● పవిత్ర, రామ్ మిట్టకంటి, కస్వి

ఎమోషనల్ డ్రామా

రామ్ మిట్టకంటి, పవిత్ర, కస్వి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'చిట్టి పొట్టి'. దాసరి భాస్కర్ యాదవ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా చిత్రం అక్టోబరు 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన కేర్ గ్రూప్ చైర్మన్ ఏ.ఎం రెడ్డి మాట్లాడుతూ– ''ప్రతి అంశంలోనూ జాగ్రత్తలు తీసుకుంటూ తీసిన 'చిట్టి పొట్టి' సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''చిట్టి పొట్టి' చిత్రం మీ హృదయాలను తాకుతుంది. కళ్లు చెమర్చకుండా థియేటర్స్ నుంచి ఆడియన్స్ బయటకు రాలేరు. ఈ చిత్రంలో నా చెల్లి పాత్రలో పవిత్ర నటించారు'' అన్నారు రామ్ మిట్టకంటి. ''ఇప్పుడున్న సోషల్ మీడియా ఓ ఆడపిల్ల జీవితంపై ఎలాంటి ప్రభావం చూపిస్తోంది? ఓ క్లిష్ట సందర్భంలో ఒక అన్న తన చెల్లిని ఎలా ప్రొటెక్ట్ చేసుకున్నాడు? అనే అంశం ఆడియన్స్‌కు నచ్చుతుంది'' అని తెలిపారు భాస్కర్ యాదవ్ దాసరి. ఈ కార్యక్రమంలో కస్వి, పవిత్ర, మ్యూజిక్ డైరెక్టర్ శ్రీ వెంకట్ మాట్లాడారు.



అలాంటి సినిమాలను ఆస్కార్‌కు పంపండి

– నిర్మాత గునీత్ మోంగా

''ఆస్కార్ అనేది అమెరికన్ అవార్డు. కాబట్టి అక్కడి డిస్ట్రిబ్యూషన్ సపోర్ట్ ఉన్న భారతీయ సినిమాలను నామినేషన్స్ కోసం పంపితే అవార్డులు వచ్చే అవకాశం ఎక్కువ ఉంటుంది'' అని బాలీవుడ్ నిర్మాత గునీత్ మోంగా అన్నారు. 'పీరియడ్ ఎండ్ ఆఫ్ సెంటెన్స్, ది ఎలిఫెంట్ విస్పరర్స్' చిత్రాలకు నిర్మాతగా 'బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్' విభాగంలో రెండు ఆస్కార్ అవార్డులు అందుకున్నారు గునీత్ మోంగా. కాగా 'ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' (ఎఫ్ఎఫ్ఐ)కి సంబంధించిన జ్యూరీ ఎంపిక చేసిన చిత్రాలు ఆస్కార్ అవార్డు నామినేషన్‌కు వెళుతుంటాయి. కానీ అమెరికన్ డిస్ట్రిబ్యూషన్ సపోర్ట్ కూడా ఉన్న ఇండియన్ సినిమాలను ఉత్తమ విదేశీ చిత్రం విభాగానికి పంపితే ఆస్కార్ నామినేషన్ వచ్చే మార్గం సులువు అవుతుందని గునీత్ అంటున్నారు. ఈ విషయాలపై తాజాగా గునీత్ ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడారు. ''ఆస్కార్ నామినేషన్ కోసం మనం ప్రయత్నం చేయవచ్చు. కానీ అది చాలా కష్టం. మన సినిమా ప్రచారానికి సమయం కేటాయించాలి. డబ్బు ఖర్చు పెట్టాలి. అక్కడి పబ్లిసిటీ మార్కెటర్స్‌ను నియమించుకోవాలి. 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' సమయంలో నేను అక్కడ నెల రోజులకు పైగా ఉన్నాను. అక్కడి వ్యవస్థ చూసి నాకు ఆశ్చర్యం కలిగింది. షార్ట్‌లిస్ట్ అయిన తర్వాతి నుంచి నామినేషన్ దక్కించుకునే ప్రాసెస్ చాలా క్లిష్టతరంగా ఉంటుంది. మనతో పాటుగా ప్రపంచం అంతా ఆస్కార్ అవార్డు కోసం ఖర్చు పెడుతుంది... పోటీ పడుతుంది. మనం కూడా గట్టి పోటీ ఇవ్వాలంటే అక్కడి స్ట్రాంగ్ డిస్ట్రిబ్యూషన్ సపోర్ట్ ఉండాలి. 'పీరియడ్ ఎండ్ ఆఫ్ సెంటెన్స్, ది ఎలిఫెంట్ విస్పరర్స్' చిత్రాలకు నెట్‌ఫ్లిక్స్ సపోర్ట్ ఉంది. ఆస్కార్ నామినేషన్ దక్కించుకున్న షౌనక్ సేన్ డాక్యుమెంటరీ 'ఆల్ దట్ బ్రీత్స్'కు హెచ్‌బీవో వంటి పెద్ద సంస్థ సపోర్ట్‌గా నిలిచింది. 2001లో 'లగాన్' సినిమాకు నామినేషన్ వచ్చిందంటే ఆ సినిమాకు సోనీ వంటి సంస్థ సపోర్ట్ ఉంది. 'ఆర్ఆర్ఆర్' టీమ్ చాలా పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. అందుకే యూఎస్ డిస్ట్రిబ్యూషన్ సపోర్ట్ ఉన్న సినిమాలను ఎఫ్ఎఫ్ఐ ఆస్కార్‌కు పంపితే అవార్డు వచ్చే చాన్సెస్ ఉంటాయి'' అని పేర్కొన్నారు గునీత్ మోంగా. ఇక 2025లో లాస్ ఏంజిల్స్‌లో మార్చిలో జరగనున్న 97వ ఆస్కార్ అవార్డ్స్‌లోని ఉత్తమ విదేశీ చిత్రం విభాగపు నామినేషన్ కోసం ఇండియా నుంచి 'లాపతా లేడీస్' చిత్రాన్ని ఎఫ్ఎఫ్ఐ పంపిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే... గునీత్ మోంగా నిర్మించిన తాజా 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' చిత్రం 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోని ప్రతిష్ఠాత్మకమైన గ్రాండ్ ప్రీ అవార్డు గెల్చుకుంది. కానీ ఆస్కార్ నామినేషన్ ఎంట్రీ బరిలో 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' చిత్రాన్ని ఎఫ్ఎఫ్ఐ పరిశీలించినప్పటికీ ఫైనల్‌గా 'లాపతా లేడీస్' చిత్రాన్ని ఎంపిక చేసింది.



● సతీష్ వేగేశ్న, వంశీ పైడిపల్లి, చింతపల్లి రామారావు

దసరాకి సరైన సినిమా ఇది

– దర్శకుడు వంశీ పైడిపల్లి

నార్నె నితిన్ హీరోగా నటించిన చిత్రం 'శ్రీ శ్రీ శ్రీ రాజావారు'. సతీష్ వేగేశ్న దర్శకత్వంలో చింతపల్లి రామారావు నిర్మించిన ఈ చిత్రం దసరాకి విడుదల కానుంది. ఇందులో సంపద హీరోయిన్. ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేసిన దర్శకుడు వంశీ పైడిపల్లి మాట్లాడుతూ – ''టీజర్ చాలా బాగుంది. ముఖ్యంగా ప్రేమను ఎలక్షన్స్‌తో పోలుస్తూ సాగే డైలాగ్ ఆకట్టుకుంది. టీజర్ చూస్తే సతీష్ వేగేశ్నగారి ఫ్లేవర్‌లోనే మూవీ ఉంటుందని తెలుస్తోంది. మంచి లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. ప్రామిసింగ్ హీరోగా ఎదుగుతున్న నార్నె నితిన్‌కి 'శ్రీ శ్రీ శ్రీ రాజావారు' మరో బ్లాక్ బస్టర్ హిట్ ఇస్తుందని నమ్ముతున్నాను. అలాగే రామారావుగారికి ఈ సినిమా పెద్ద సక్సెస్ ఇవ్వాలని కోరుకుంటున్నాను. దసరా పండగకు ఫ్యామిలీ అంతా కలిసి చూసే పర్ఫెక్ట్ మూవీ ఇది'' అన్నారు. ''మంచి లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సతీష్ వేగేశ్నగారు రూపొందించిన ఈ సినిమా దసరా సంబరాలను రెట్టింపు చేసే విధంగా ఉంటుంది'' అన్నారు చింతపల్లి రామారావు.

సాక్షి బిజినెస్
శనివారం
28-9-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	264	85,572
నిఫ్టీ ▽	37	26,179

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	18,110	▽ 70
డోజోన్స్	42,329	△ 154
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,321	△ 36
డాక్స్	19,474	△ 235
షాంఘై	3,088	△ 87
నికాయ్	39,830	△ 904

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	75,640	▽ 110
బంగారం (99.5 స్వచ్ఛత)	75,337	△ 110
వెండి (కిలో)	91,448	△ 1,074

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భావనకు	81.87	85.55
£	బ్రిటన్ పౌండ్	భావనకు	109.75	114.65
€	యూరో	భావనకు	91.26	95.73
¥	జపాన్ ఎన్ (100)	భావనకు	47.00	69.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భావనకు	55.55	60.40
S$	సింగపూర్ డాలర్	భావనకు	63.06	67.71
SAR	సౌదీ రియాల్	భావనకు	21.42	22.98
UAE D	యూఏఈ దిర్హామ్	భావనకు	21.90	23.68
¥	చైనా యువాన్	భావనకు	11.06	12.88

ఎస్‌యూవీ.. కూపే అవతార్!

కుర్ర'కారు' టాప్‌గేర్‌లో దూసుకెళ్తున్న స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్ (ఎస్‌యూవీ).. ఆటోమొబైల్ కంపెనీలకు కూడా గత కొన్నేళ్లుగా కాసులు కురిపిస్తున్నాయ్. అయితే, కస్టమర్ల మారుతున్న అభిరుచులకు అనుగుణంగా ఈ ఎస్‌యూవీల షేపు, స్టయిల్, డిజైన్‌లో శరవేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. 'ఎస్‌యూవీ కూపే' పేరుతో కొత్త సెగ్మెంట్‌ను క్రియేట్ చేయడం ద్వారా అమ్మకాల గేరు మార్చేందుకు పోటీ పడుతున్నాయి వాహన దిగ్గజాలు.

– సాక్షి, బిజినెస్ డెస్క్



కారు ప్రియుల కోసం కంపెనీల కొత్త మంత్రం | మార్కెట్లోకి ఎస్‌యూవీ కూపే మోడల్స్.. | టాటా కర్వ్, సిట్రాన్ బసాల్ట్ ఎంట్రీ... | అదే బాటలో మహీంద్రా, ఫోక్స్‌వ్యాగన్, రెనో..

దేశంలో అమ్ముడవుతున్న కార్లలో దాదాపు 55 శాతం వాటా ఎస్‌యూవీలదే కావడం వాటి క్రేజ్‌కు నిదర్శనం. అయితే, కొద్ది నెలలుగా డిమాండ్ కాస్త మందగించడంతో సరికొత్త లుక్‌తో ఆకట్టుకునేందుకు వాహన కంపెనీలు వాటికి కొత్తదనాన్ని జోడిస్తున్నాయి. మిడ్‌సైజ్ ఎస్‌యూవీ విభాగంలో ఎస్‌యూవీ కూపేలు ఇప్పుడు నయా ట్రెండ్. టాటా మోటార్స్ 'కర్వ్' ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ కూపేను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఇందులోనే తాజాగా పెట్రోల్, డీజిల్ మోడల్‌ను కూడా తెచ్చింది. ఇక ఫ్రెంచ్ ఆటో దిగ్గజం సిట్రాన్ ఎస్‌యూవీ కూపే 'బసాల్ట్'ను బరిలోకి దించింది. దీని రేటు, డిజైన్ కూడా ఊరించేలా ఉంది. త్వరలోనే మహీంద్రా తన పాపులర్ మోడల్ ఎక్స్‌యూవీ 700లో కూపే మోడల్‌ను విడుదల చేసే సన్నాహాల్లో ఉన్నట్లు టాక్. మహీంద్రా ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ కూపే కూడా క్యూలో ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా మార్కెట్లోకి వచ్చిన టాటా, సిట్రాన్ కూపే ఎస్‌యూవీలకు కస్టమర్ల రెస్పాన్స్ అదిరిపోవడంతో ఇతర కంపెనీలూ ఈ సెగ్మెంట్‌పై ఫోకస్ పెంచాయి. ఫోక్స్‌వ్యాగన్, రెనో సైతం భారత్ మార్కెట్ కోసం కూపే ఎస్‌యూవీలను రెడీ చేస్తున్నాయట! ప్రీమియం లుక్, లగ్జరీ కార్లతో పోలిస్తే చాలా తక్కువ ధరల్లో కూపే మోడల్‌ను కోరుకునే వారిని ఈ ఎస్‌యూవీ కూపేలతో టార్గెట్ చేయాలనేది కార్ల కంపెనీల ప్లాన్.

అమ్మకాల్లో వాటిదే హవా...

ఇప్పుడు ఎక్కడ చూసినా ఎస్‌యూవీల హవాయే నడుస్తోంది. హైఎండ్ లగ్జరీ ఎస్‌యూవీల రేటు భారీగా ఉండటంతో కస్టమర్లకు అదే లుక్కు, ఫీచర్లతో రూ. 10–20 లక్షల ధరలో దొరుకుతున్న కాంపాక్ట్ ఎస్‌యూవీలకు ఫుల్ గిరాకీ ఉంటోంది. ఈ మిడ్‌సైజ్ ఎస్‌యూవీ సెగ్మెంట్లో హ్యుందాయ్ క్రెటా, మారుతీ గ్రాండ్ విటారా, టయోటా హైరైడర్, కియా సెల్టోస్, ఫోక్స్‌వ్యాగన్ టైగున్, హోండా ఎలివేట్, స్కోడా కుషక్, ఎంజీ ఆస్టర్, సిట్రాన్ సీ3 ఎయిర్‌క్రాస్ వంటివి హాట్ కేకుల్లా సేల్ అవుతున్నాయి. మరోపక్క, చిన్నకారు కొనే యోచనలో ఉన్నవారిని సైతం ఊరించే విధంగా రూ. 10 లక్షల స్థాయిలో సబ్‌కాంపాక్ట్ ఎస్‌యూవీలను తీసుకొచ్చి మార్కెట్‌ను విస్తరించాయి కార్ల కంపెనీలు. మారుతీ బ్రెజా, టాటా నెక్సాన్, మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ, కియా సోనెట్, హ్యుందాయ్ వెన్యూ, నిస్సాన్ మాగ్నైట్, రెనో కైగర్, టాటా పంచ్, హ్యుందాయ్ ఎక్స్‌టర్, టయోటా ట్రైసర్ వంటివి సబ్‌కాంపాక్ట్ సెగ్మెంట్లో బాగా అమ్ముడవుతున్న మోడల్స్. గత రెండు మూడేళ్లుగా ఈ రెండు విభాగాల్లో పోటీ పెరిగిపోవడంతో.. ఇప్పుడు ఎస్‌యూవీ కూపేతో జెన్ జెడ్‌తో పాటు యువ కస్టమర్లను ఆకట్టుకోవాలనేది కార్ల కంపెనీల కొత్త వ్యూహం.

ఇప్పటికే లగ్జరీ కూపే కార్లున్నాయ్..

మెర్సిడెస్ బెంజ్, జాగ్వార్, ల్యాండ్‌రోవర్, పోర్షే, బీఎండబ్ల్యూ తదితర లగ్జరీ కార్ల దిగ్గజాలు ఇప్పటికే కూపే ఎస్‌యూవీలను మన మార్కెట్లో విక్రయిస్తున్నాయి. అయితే, వీటి లుక్కు, డిజైన్‌లాగే ధర కూడా 'టాప్'లేపేలా ఉంటుంది. ప్రస్తుతం దేశంలో అందుబాటులో ఉన్న ఎస్‌యూవీ కూపేల్లో బీఎండబ్ల్యూ ఎక్స్4 రేటే చాలా తక్కువ. ఎంతంటే జస్ట్ రూ. 96 లక్షలే! (ఎక్స్ షోరూమ్) అ'ధర'పోయింది కదూ! అందుకే అచ్చం అలాంటి డిజైన్‌లోనే హాట్ సెల్లింగ్ మిడ్–ఎస్‌యూవీ రేంజ్‌లోనే ఈ స్టయిలిష్ కూపేలను ప్రవేశపెట్టడం ద్వారా కస్టమర్లకు మరింత వైవిధ్యాన్ని అందించేందుకు వాహన కంపెనీలన్నీ క్యూ కడుతున్నాయి. గతేడాది మొత్తం కార్ల అమ్మకాల్లో 16 శాతం వాటా మిడ్–ఎస్‌యూవీలదే కావడం విశేషం!

ఎస్‌యూవీ కూపే అంటే...

ప్రస్తుతం బాగా ప్రాచుర్యంలో ఉన్న ఎస్‌యూవీలన్నీ దాదాపు బాక్స్ ఆకారంలో రగ్గిడ్ లుక్‌తోనే ఉంటున్నాయి. బలిష్టమైన బాడీ, అధిక గ్రౌండ్ క్లియరెన్స్, ఆఫ్‌రోడ్ సామర్థ్యం, ఎత్తుగా, స్పోర్ట్స్ లుక్ కూడా ఉండటంతో ఎస్‌యూవీలు మార్కెట్‌ను కొల్లగొడుతూనే ఉన్నాయి. కస్టమర్లకు హాట్ ఫేవరెట్‌గా మారాయి. అయితే, లగ్జరీ స్పోర్ట్స్ కూపే కార్లలోని స్లీక్ డిజైన్‌ను, ఎస్‌యూవీల్లోని రగ్గిడ్ లుక్‌ను కలగలిపినవే ఈ కూపే ఎస్‌యూవీలు. దీనిలోని ప్రత్యేకత ఏంటంటే, ముందువైపు చూస్తే చాలా భారీగా ఎస్‌యూవీ స్టయిల్లోనే కనిపిస్తుంది. వెనక్కి వెళ్లే కొద్దీ రూఫ్‌లైన్ బాగా ఏటవాలుగా వంగి కూపే లుక్‌తో ఉంటుంది. ఇతర ఫీచర్లన్నీ ఎస్‌యూవీ మాదిరే ఉంటాయి. చాలావరకు లగ్జరీ కార్లలో ఇలాంటి డిజైన్‌ను మనం చూడొచ్చు. కస్టమర్లు సాధారణ బాక్స్ డిజైన్ కంటే స్పోర్ట్ లుక్‌తో ఉండే లైఫ్‌స్టయిల్ ఎస్‌యూవీలకే మొగ్గు చూపుతుండటంతో ఎస్‌యూవీ కూపే క్రాసోవర్‌లకు ఆదరణ పెరుగుతోంది. దీంతో లగ్జరీ, కాంపాక్ట్, సబ్ కాంపాక్ట్ ఎస్‌యూవీలకు తోడుగా బడ్జెట్ ధరల్లో కూపే ఎస్‌యూవీ సెగ్మెంట్‌తో దుమ్మురేపేందుకు కంపెనీలు సై అంటున్నాయి.



రికార్డుల ర్యాలీకి బ్రేక్

- మిడ్ సెషన్ నుంచి అమ్మకాలు షురూ
- సెన్సెక్స్ 264, నిఫ్టీ 37 పాయింట్లు డౌన్
- తొలుత సరికొత్త గరిష్టాలకు మార్కెట్లు




ముంబై: రికార్డుల ర్యాలీకి ఏడో రోజు బ్రేక్ పడింది. అయితే తొలుత మార్కెట్లు మరోసారి సరికొత్త గరిష్టాలను తాకాయి. ఆపై ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు తెరతీయడంతో మిడ్ సెషన్ నుంచీ అమ్మకాలు ఊపందుకున్నాయి. వెరసి మార్కెట్లు చివరికి నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 264 పాయింట్లు క్షీణించి 85,572 వద్ద ముగిసింది. నిఫ్టీ 37 పాయింట్లు నీరసించి 26,179 వద్ద స్థిరపడింది. ఆరు రోజుల ర్యాలీ ప్రోత్సాహంతో తొలుత సెన్సెక్స్ 142 పాయింట్లు బలపడి 85,978కు చేరింది. నిఫ్టీ సైతం 61 పాయింట్లు ఎగసి 26,277ను అధిగమించింది. దీంతో ఇంట్రాడే రికార్డు గరిష్టాలను సాధించాయి. ఈ వారం సెన్సెక్స్ 1,028, నిఫ్టీ 388 పాయింట్లు చొప్పున బలపడ్డాయి!

బ్యాంకింగ్, డీలా...

ఎన్ఎస్ఈలో ప్రయివేట్ బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ, రియల్టీ, మీడియా రంగాలు 1.5–0.5% మధ్య తగ్గాయి. నిఫ్టీ దిగ్గజాల్లో పవర్‌గ్రిడ్, ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హీరో మోటో కార్ప్, ఎల్అండ్‌టీ, కొటక్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్, టాటా కన్జూమర్, హెచ్‌యూఎల్, నెస్లే 3–1% మధ్య నష్టపోయాయి. ఇతర బ్లూచిప్స్‌లో బీపీసీఎల్, సిప్లా, సన్ ఫార్మా, దివీస్, ఆర్ఐఎల్, టైటన్, హెచ్‌సీఎల్ టెక్, ఐషర్, హిందాల్కో, గ్రాసిమ్, ఎన్‌టీపీసీ, కోల్ ఇండియా 6.3–1.3 శాతం మధ్య ఎగశాయి.

చేతులు మారుతున్న ప్రతాప్ స్నాక్స్

- డీల్ విలువ రూ. 847 కోట్లు
- ఆథమ్ ఇన్వెస్ట్‌మెంట్ కొనుగోలు



న్యూఢిల్లీ: లిస్టెడ్ కంపెనీ ప్రతాప్ స్నాక్స్‌ను ఆథమ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కొనుగోలు చేయనుంది. మహి మధుసూదన్ కేలాతో కలసి ప్యాకేజ్‌డ్ ఫుడ్ కంపెనీలో 46.85 శాతం వాటాను సొంతం చేసుకోనుంది. ఇందుకు దాదాపు రూ. 847 కోట్లు వెచ్చించనుంది. యెల్లో డైమండ్ బ్రాండ్ స్నాక్స్ తయారీ కంపెనీ రిచ్ ఫీస్ట్ పేరుతో స్వీట్ స్నాక్స్ సైతం తయారు చేస్తోంది. మొత్తం 46.85 శాతం వాటాకు సమానమైన 1.02 కోట్ల షేర్ల విక్రయానికి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ప్రతాప్ స్నాక్స్ తాజాగా వెల్లడించింది. కంపెనీలో పీక్ ఎక్స్‌వీ పార్ట్‌నర్స్ గ్రోత్ ఇన్వెస్ట్‌మెంట్స్1కు 2.48 శాతం, గ్రోత్ ఇన్వెస్ట్‌మెంట్స్ హోల్డింగ్స్2కు 34.65 శాతం, సీక్వోయా క్యాపిటల్ జీఎఫ్ఐవీ మారిషస్ ఇన్వెస్ట్‌మెంట్‌కు 9.72 శాతం చొప్పున వాటాలు ఉన్నాయి. ఈ మూడు పీఈ సంస్థలు ఆథమ్ ఇన్వెస్ట్‌మెంట్, మహి మధుసూదన్‌తో వాటా కొనుగోలు ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ప్రతాప్ స్నాక్స్ పేర్కొంది.

ఓపెన్ ఆఫర్..: మెజారిటీ వాటా చేతులు మారనుండటంతో నిబంధనల ప్రకారం ప్రతాప్ స్నాక్స్ వాటాదారులకు ఓపెన్ ఆఫర్ చేపట్టాల్సి ఉంటుంది. దీనిలో భాగంగా పబ్లిక్ నుంచి 26% వాటా కొనుగోలుకి కంపెనీ షేరుకి రూ. 864 ధరలో ఓపెన్ ఆఫర్‌ను ప్రకటించింది. ఆఫర్ పూర్తిగా విజయవంతమైతే రూ.544 కోట్లకుపైగా వెచ్చించాల్సి వస్తుంది. కాగా.. ఓపెన్ ఆఫర్ తర్వాత కూడా లిస్టెడ్ కంపెనీగా కొనసాగనున్నట్లు ప్రతాప్ స్నాక్స్ తెలిపింది. 2003లో ఇండోర్‌లో ప్రారంభమైన ఈ కంపెనీకి 8 సొంత, 7 కాంట్రాక్ట్ తయారీ కేంద్రాలు ఉన్నాయి. ఈ వార్తల నేపథ్యంలో ప్రతాప్ స్నాక్స్ షేరు స్వల్ప నష్టంతో రూ. 1,046 వద్ద ముగిసింది. 2024 జనవరి 18న రూ. 1,450కు చేరి రికార్డ్ గరిష్టాన్ని తాకింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఫారెక్స్ కొత్త రికార్డులు 692 బిలియన్ డాలర్లు | ఎక్ఛేంజీల్లో లావాదేవీ చార్జీల మార్పులు

షకీబ్ భద్రత మా బాధ్యత కాదు: బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు

బంగ్లాదేశ్ గడ్డపై తన చివరి టెస్టు మ్యాచ్ ఆడాలని భావిస్తున్న స్టార్ క్రికెటర్ షకీబ్ అల్ హసన్ ఆశలు నెరవేరడం సందేహంగానే ఉంది. షకీబ్ స్వదేశానికి వస్తే అతని భద్రతపై తాము ఎలాంటి హామీ ఇవ్వలేమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) అధ్యక్షుడు ఫరూఖ్ అహ్మద్ స్పష్టం చేశారు. బంగ్లాలో తిరుగుబాటు ద్వారా పతనం అయిన షేక్ హసీనా ప్రభుత్వంలో పార్లమెంట్ సభ్యుడైన షకీబ్... ఒక హత్య కేసులో నిందితుడిగా కూడా ఉన్నాడు. 'షకీబ్ భద్రత బోర్డు బాధ్యత కాదు. బీసీబీ అనేది పోలీసు లేదా ర్యాపిడ్ యాక్షన్ బెటాలియన్ వంటి భద్రతా సంస్థ కాదు. అతనికి నిజంగా సెక్యూరిటీ ఇవ్వాల్సింది ప్రభుత్వమే. అదీ పెద్ద స్థాయి నుంచి రావాలి. అతని కేసు ఇంకా కోర్టులో ఉంది కాబట్టి షకీబ్ గురించి మేం ప్రస్తుత ప్రభుత్వంలో ఎవరితోనూ మాట్లాడలేదు. కాబట్టి స్వదేశంలో సమస్య రావచ్చు కూడా. ఇవన్నీ చూసి షకీబ్ తన నిర్ణయం తీసుకోవాలి' అని ఫరూఖ్ వ్యాఖ్యానించారు.

మొదటి రోజు 35 ఓవర్లతో సరి



బంగ్లాదేశ్ కెప్టెన్ నజ్ముల్ వికెట్ తీసిన ఆనందంలో అశ్విన్

వర్షం, వెలుతురులేమి కలగలిసి భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టు తొలి రోజు ఆటను అర్ధాంతరంగా ముగించాయి. తక్కువ వ్యవధిలో మూడు బంగ్లాదేశ్ వికెట్లు తీసి ఆధిక్యం ప్రదర్శించిన టీమిండియా వాన కారణంగా దానిని కొనసాగించలేకపోయింది. ఆట సాగిన 35 ఓవర్లలోనే భారత బౌలర్లను ఎదుర్కోవడంలో తమ బలహీనతను ప్రదర్శించిన పర్యాటక జట్టుకు ఆట ఆగిపోవడం తెరిపినిచ్చింది. 11 బంతుల తేడాలోనే రెండు కీలక వికెట్లు తీసిన పేసర్ ఆకాశ్‌దీప్ బౌలింగ్ ఈ సంక్షిప్త ఆటలో హైలైట్‌గా నిలవగా... మ్యాచ్ రెండో రోజు కూడా వర్షసూచన ఉండటం భారత అభిమానులకు నిరాశకలిగించే విషయం.

- రెండో టెస్టుకు వర్షం అడ్డంకి
- బంగ్లాదేశ్ 107/3
- రాణించిన భారత బౌలర్లు

కాన్పూర్: భారత్, బంగ్లాదేశ్ మధ్య రెండో టెస్టు వాన అంతరాయాలతో మొదలైంది. వర్షం కారణంగా ఉదయం ఆట గంట ఆలస్యంగా మొదలు కాగా... చివర్లో వెలుతురు మందగించడంతో నిర్ణీత సమయం కంటే గంటన్నర ముందుగానే అంపైర్లు ఆటను నిలిపివేశారు. అంతకుముందు టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ మొదటి రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి తమ తొలి ఇన్నింగ్స్‌లో 35 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. మోమినుల్ హక్ (40 బ్యాటింగ్; 7 ఫోర్లు), నజ్ముల్ హసన్ (31; 6 ఫోర్లు) ఫర్వా లేదనిపించారు. ప్రస్తుతం మోమినుల్‌తో పాటు ముష్ఫికర్ (6 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నాడు. ఆకాశ్‌దీప్‌కు 2 వికెట్లు దక్కాయి. పిచ్‌ను దృష్టిలో ఉంచుకొని టీమిండియా గత టెస్టు తుది జట్టునే కొనసాగిస్తూ ముగ్గురు పేసర్లను ఎంచుకుంది. దాంతో కాన్పూర్ కే చెందిన స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు సొంతగడ్డపై టెస్టు మ్యాచ్ ఆడే అవకాశం దక్కలేదు.

రాణించిన మోమినుల్...

పరిస్థితులు పేస్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉండటంతో బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌ను జాకీర్ (0), షాద్‌మన్ జాగ్రత్తగా ప్రారంభించారు. బుమ్రా తన తొలి 3 ఓవర్లలో ఒక్క పరుగూ ఇవ్వలేదు. మరీ ఇబ్బంది పడిన జాకీర్ 23 బంతుల్లో సింగిల్ కూడా తీయలేకపోయాడు. ఆపై ఆకాశ్‌దీప్ తన తొలి ఓవర్లోనే అతడిని సాగనంపి భారత్‌కు తొలి వికెట్ అందించాడు. జైస్వాల్ పట్టిన క్యాచ్‌పై కాస్త సందేహం కనిపించినా... వరుస రీప్లేల తర్వాత అంపైర్లు జాకీర్‌ను అవుట్‌గా ప్రకటించారు. ఆ తర్వాత ఆకాశ్‌దీప్ మూడో ఓవర్ తొలి బంతికే షాద్‌మన్ వికెట్ల ముందు దొరికిపోయాడు. అంపైర్ నాటౌట్‌గా ప్రకటించినా... రివ్యూ కోరిన భారత్ ఫలితం పొందింది. ఈ దశలో నజ్ముల్, మోమినుల్ కలిసి జట్టుకు ఆదుకునే ప్రయత్నం చేశారు. సిరాజ్ ఓవర్లో నజ్ముల్ ఎల్బీ కోసం రివ్యూ కోరిన భారత్ ఈసారి మాత్రం ప్రతికూల ఫలితం రావడంతో ఒక రివ్యూను కోల్పోయింది. ఇద్దరు బ్యాటర్లూ కొన్ని చక్కటి షాట్లతో పరుగులు రాబట్టి సెషన్‌ను ముగించారు. లంచ్ తర్వాత తన రెండో ఓవర్లో అశ్విన్ బంగ్లాదేశ్‌ను దెబ్బ తీశాడు. చక్కటి బంతితో నజ్ముల్‌ను ఎల్బీగా వెనక్కి పంపించాడు. బంగ్లా కెప్టెన్ రివ్యూ చేసినా లాభం లేకపోయింది. నజ్ముల్, మోమినుల్ మూడో వికెట్‌కు 51 పరుగులు జోడించారు. ఆ తర్వాత భారత బౌలర్లు మరింత ఒత్తిడి పెంచారు. దాంతో మరో 6.1 ఓవర్ల పాటు మోమినుల్, ముష్ఫికర్ కొన్ని ఉత్కంఠభరిత క్షణాలను ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు అనూహ్య ముగింపుతో వారికి కాస్త ఉపశమనం లభించింది. ముందుగా వెలుతురులేమితో ఆటను నిలిపివేసిన అంపైర్లు గంట పాటు వేచి చూసి తుది నిర్ణయం తీసుకున్నారు.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: జాకీర్ (సి) యశస్వి జైస్వాల్ (బి) ఆకాశ్‌దీప్ 0; షాద్‌మన్ (ఎల్బీ) (బి) ఆకాశ్‌దీప్ 24; మోమినుల్ (బ్యాటింగ్) 40; నజ్ముల్ (ఎల్బీ) (బి) అశ్విన్ 31; ముష్ఫికర్ రహీమ్ (బ్యాటింగ్) 6; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (35 ఓవర్లలో 3 వికెట్లకు) 107. వికెట్ల పతనం:** 1–26, 2–29, 3–80. **బౌలింగ్:** బుమ్రా 9–4–19–0, సిరాజ్ 7–0–27–0, అశ్విన్ 9–0–22–1, ఆకాశ్‌దీప్ 10–4–34–2.

కోల్‌కతా నైట్‌రైడర్స్ మెంటార్‌గా బ్రావో



న్యూఢిల్లీ: టి20 క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న వెస్టిండీస్ స్టార్ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)తో తన సుదీర్ఘ అనుబంధానికి ముగింపు పలికాడు. 2025 ఐపీఎల్ సీజన్ నుంచి అతను కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) టీమ్‌కు మెంటార్‌గా వ్యవహరించనున్నాడు. గత ఏడాది ఈ బాధ్యతలు నిర్వర్తించిన గౌతమ్ గంభీర్ భారత జట్టు హెడ్ కోచ్‌గా వెళ్లగా, అతని స్థానంలో బ్రావోను ఎంచుకున్నట్లు కేకేఆర్ టీమ్ మేనేజ్‌మెంట్ ప్రకటించింది. నైట్‌రైడర్స్ హెడ్ కోచ్ చంద్రకాంత్ పండిత్, బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్‌లతో కలిసి అతను పని చేస్తాడు. కేకేఆర్ టీమ్ యాజమాన్యానికి చెందిన ఇతర టి20 జట్లు ట్రిన్‌బాగో నైట్‌రైడర్స్, లాస్ ఏంజెల్స్ నైట్‌రైడర్స్, అబుదాబి నైట్‌రైడర్స్‌లకు కూడా ఇన్‌చార్జ్‌గా ఉండేలా ఈ గ్రూప్‌తో బ్రావో దీర్ఘకాలిక కాంట్రాక్ట్ కుదుర్చుకున్నట్లు సమాచారం. ఈ ప్రకటనకు ముందు రోజే గురువారం తాను ఆటగాడిగా అన్ని స్థాయిల నుంచి రిటైర్ అవుతున్నట్లు బ్రావో ప్రకటించాడు. ఐపీఎల్ ఆరంభంలో ముంబై ఇండియన్స్ తరఫున ఆడిన బ్రావో 2011 నుంచి 2022 వరకు చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో సభ్యుడు. మధ్యలో రెండేళ్లు చెన్నైపై నిషేధం ఉన్న సమయంలో అతను గుజరాత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. సీఎస్‌కే తరఫున ఆడిన 10 సీజన్లలో 3 సార్లు టైటిల్ గెలిచిన జట్టులో అతను ఉన్నాడు. రిటైర్ అయ్యాక గత రెండు సీజన్లు చెన్నైకే బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించిన బ్రావో ఇప్పుడు ఆ జట్టుకు దూరమయ్యాడు.

'టైగర్'కు అస్వస్థత!

దాడి జరగలేదన్న బంగ్లాదేశ్ అభిమాని



కాన్పూర్: బంగ్లాదేశ్ జట్టు ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ క్రికెట్ మ్యాచ్ ఆడినా ఒక వీరాభిమాని కనిపిస్తాడు. ఒళ్లంతా పులిచారలతో పెయింటింగ్ వేసుకొని తమ జట్టును ఉత్సాహపరిచే అతని అసలు పేరు 'రాబీ' కాగా... తనను తాను 'టైగర్' అని చెప్పుకుంటాడు. రెండో టెస్టు లంచ్ విరామం సమయంలో అతను స్టేడియం గేటు వద్ద కాస్త స్పృహ తప్పినట్లు కనిపించాడు. దాంతో అక్కడ ఉన్న భద్రతా సిబ్బంది వెంటనే ప్రాథమిక చికిత్స అనంతరం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. తనపై దాడి జరిగిందని... కొందరు వ్యక్తులు తన వీపు, పక్కటెముకల్లో పిడిగుద్దులు కురిపించినట్లు అతను ఆస్పత్రికి తీసుకెళ్లే సమయంలో చెప్పాడు. ఆస్పత్రిలో అతనికి తగిన చికిత్స అందించడంతో పాటు అన్ని రకాల పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు ప్రమాదమేమీ లేదని తేల్చారు. అక్కడి నుంచి రాబీ తన వ్యాఖ్యను మార్చాడు. 'నాకు ఆరోగ్యం ఒక్కసారిగా పాడైంది. డీహైడ్రేషన్‌కు లోనయ్యాను. పోలీసులు ఇక్కడికి తీసుకొచ్చారు. ఇప్పుడు అంతా బాగుంది' అని అతనే చెప్పాడు. మరోవైపు పోలీసులు కూడా దాడి జరిగిందనే వార్తను ఖండించారు. అయితే అతను 'సి' బ్లాక్‌లో నిలబడి ఉన్న సమయంలో కొందరు భారత అభిమానులు వాదనకు దిగి అతని చేతుల్లోంచి జాతీయ పతాకాన్ని లాక్కున్నారని మాత్రం తేలింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై అత్యాచారాలు జరుగుతున్న నేపథ్యంలో తాను ఈ టెస్టుకు వస్తే తనపై కూడా దాడి చేయవచ్చని గురువారం రాబీ సోషల్ మీడియాలో ఒక పోస్టు కూడా పెట్టాడు. బంగ్లాదేశ్ జట్టు భారత్‌లో ఆడటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మ్యాచ్ ప్రారంభానికి ముందు స్టేడియం సమీపంలో కొందరు వ్యక్తులు నిరసన కూడా వ్యక్తం చేశారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



ఈ చిత్రంలో కనిపిస్తున్న లారీలో లోడ్ పూర్తిగా నిషేధిత గుట్కాతో నిండి ఉంది. కొద్ది రోజుల కిందట ఆదిలాబాద్ జిల్లా తాంసి పోలీసులు కప్పర్ల గ్రామం వద్ద అక్రమ రవాణా చేస్తుండగా ఈ లారీని పట్టుకున్నారు. దీనిలోని సరుకు విలువ అక్షరాల రూ.50లక్షలు (ఫైల్)



హన్మకొండలో పట్టుకున్న అంబర్, గుట్కాలు (ఫైల్)

నిషేధం.. వారికి ఓ వరం

జోరుగా గుట్కా దందా



- కర్ణాటకలో అమల్లో లేని నిషేధం... అన్ని ప్రాంతాలకు బీదర్ నుంచే
- సరిహద్దులు చెరిపేసి చెక్‌పోస్టులు దాటేసి... యథేచ్ఛగా తెలంగాణ జిల్లాలకు రవాణా
- ప్రతీరోజు రూ.కోట్లలో టర్నోవర్
- గుట్కా దందా వెనుక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు

సాక్షిప్రతినిధి, వరంగల్:

రాష్ట్ర ప్రభుత్వం గుట్కాను నిషేధించిన విషయం తెలిసిందే. కానీ ఆ నిషేధిత వస్తువే కొందరికి వరంగా మారి కోట్లాది రూపాయల లాభం చేకూరుస్తోంది. మొన్నటి వరకు వ్యాపారులే గుట్కా దందా చేయగా..ఇప్పుడు కొందరు రాజకీయ నాయకులు కూడా అందులోకి దిగారు. అసలే రాజకీయ నేతలు..ఆపై ప్రజాప్రతినిధులు కావడంతో ఆహార కల్తీ నియంత్రణ, పోలీసు శాఖలు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అడపాదడపా టార్గెట్ల కోసం దాడులు చేసి గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసులు పెడుతున్నారే తప్ప సూత్రధారులు, గుట్కా రాకెట్‌ను నిరోధించలేకపోతున్నారు.

ఒక్క లారీ సరుకుపై రూ.60-రూ.80 లక్షల ఆదాయం

మాణిక్‌చంద్, సితార్, సాగర్, గోవా, రెబల్, సిమ్లా, గోవా, అంబర్..పేర్లేవైనా తెలంగాణవ్యాప్తంగా గుట్కా, తంబాకు ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి. హైదరాబాద్ నుంచి మొదలైన గుట్కా దందా వరంగల్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లోని అన్ని ప్రాంతాలకు విస్తరించింది. గతంలో ప్రతిరోజూ రూ. 5 కోట్ల విలువైన గుట్కా ప్యాకెట్లు అమ్ముడుపోగా.. ఇప్పుడా అమ్మకాలు, ధరలు పెరిగి రూ.10 కోట్లకు చేరినట్టు అంచనా. కంపెనీ నుంచి హోల్‌సేల్ వ్యాపారికి.. అక్కడి నుంచి రిటైల్‌గా షాపులకు సరఫరా చేసేందుకు ప్రతీ జిల్లాలో 'గుట్కా మాఫియా'పెద్ద నెట్‌వర్క్‌నే ఏర్పాటు చేసుకుంది. ఒక్క గుట్కా లారీ (డీసీఎం వ్యాన్) నేరుగా వ్యాపారి వద్దకు వస్తే రూ.60 లక్షల సంపాదన వచ్చినట్టే. ఒక లారీలో 250 కాటన్ల గుట్కా వస్తుంది. ఒక్కో కాటన్‌లో 70 పొడలు, ఒక్కో పొడలో 50 ప్యాకెట్లు ఉంటాయి. 50 పొట్లాలు ఉండే ఒక్క పొడ (బాక్స్) రూ.350లకు ఇస్తుండగా... రిటైల్ వ్యాపారులు 'నిర్బంధం, నిషేధం, పోలీసు నిఘా'తదితర పదాలు వాడుతూ రూ.750 ల వరకు సొమ్ము చేసుకుంటున్నారు. అంటే ఒక్క గుట్కా ప్యాకెట్‌ను రూ.7లకు తీసుకొని రూ.15ల నుంచి 18ల వరకు అమ్ముతున్నారంటే లాభాలు ఏ మేరకు ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. హోల్‌సేల్ వ్యాపారులు ఇవే గుట్కాలను కంపెనీని బట్టి రూ.20ల నుంచి రూ.25ల వరకు.. పాన్ టేలా, కిరాణం దుకాణందారులు రూ.30ల నుంచి రూ.40లు కూడా అమ్ముతున్నారు.

సరిహద్దు 10 కిలోమీటర్ల దూరంలోనే...

తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో కర్ణాటక రాష్ట్రం ఉంది. బీదర్ పట్టణం రాష్ట్ర సరిహద్దుకు 10 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. బీదర్ నుంచి తెలంగాణలోని పలు ప్రాంతాలకు గుట్కా సరఫరా అవుతోంది. కర్ణాటకలో గుట్కాపై నిషేధం లేదు. తెలంగాణ ఉన్న నిషేధం, డిమాండ్‌ను అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. రాష్ట్రంలో గుట్కాకు ఉన్న డిమాండ్‌ను చూసి కొంతమంది వ్యాపారులు పట్టణంలో పరిశ్రమలను స్థాపించారు. అక్రమార్కులు బీదర్‌లో తయారవుతున్న గుట్కాను తక్కువ ధరకు కొనుగోలు చేసి తెలంగాణ అంతా రవాణా చేస్తున్నారు. కాగా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని భారత ప్రభుత్వం 2006 సంవత్సరంలో ఆహార భద్రత చట్టాన్ని తీసుకొచ్చింది. దాని ప్రకారం పొగాకు ఉత్పత్తుల, విక్రయాలపై నిషేధం విధించారు. ఈ నేపథ్యంలో 2005లో గోవాలో గుట్కా, పాన్ మాసాలాను నిషేధించగా, 2012, 2013లలో మరో 15 రాష్ట్రాలు అమలు చేశాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 జనవరి 9న గుట్కాలపై నిషేధం విధించగా, రాష్ట్ర విభజన తర్వాత కూడా ఈ రెండు రాష్ట్రాల్లో అమలవుతోంది. బీహార్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, గోవా, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, హరిణాయా, జార్ఖండ్, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్తాన్, పంజాబ్, మిజోరాం, ఉత్తరాఖండ్, ఒడిశా రాష్ట్రాలలోనూ గుట్కా విక్రయాలపై నిషేధం ఉంది. ఒక్క కర్ణాటక రాష్ట్రంలోనే గుట్కా విక్రయాలు, తయారీకి లైసెన్స్‌లు ఇవ్వగా, అక్కడి నుంచి అన్ని జిల్లాలకు యథేచ్ఛగా రవాణా అవుతోంది.



వరంగల్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న రూ.20 లక్షల విలువ చేసే 52 గుట్కా బ్యాగులు...(ఫైల్)

> **దొరుకతలేవు అంటుండ్రు... అడ్డగోలు ధరకు ఇస్తుండ్రు**
>
> రోజూ పనికి పోయినచోట మా పెద్దన్నతోటి మెల్లమెల్లగా గుట్కా అలవాటు అయ్యింది. టైంపాస్ కోసం ఏసుకున్నందుకు ఇప్పుడు అలవాటుగా మారింది. దొరుకుతలేవు అంటండ్రు.. రోజుకో రూపాయి పెంచి అమ్ముతండ్రు. ఎం.సీ (మానిక్‌చంద్) ఎనిమిది రూపాయలుండే. ఇప్పుడు రూ.35ల నుంచి రూ.40లు అంటండ్రు. రెబల్, కె.7000, 24 క్యారెట్‌లేమో రూ.25ల నుంచి రూ.30లకు ఇస్తుండ్రు. నిషేధం ఉండుడేమో గాని అడ్డగోలు ధరలు పెంచి అమ్ముతండ్రు.
>
> - గుట్కా వినియోగదారుడు, జనగాం

రకరకాల పేర్లు, అధిక రేట్లు... నిండు జీవితాలు బలి

పొగాకు ఉత్పత్తులను రకరకాల పేర్లతో ఎంఆర్‌పీ లేకుండా అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. వీటిలో విమల్, మాణిక్‌చంద్ (ఎంసీ), సితార్, సాగర్, గోవా, ఎంజీఎం, హాన్స్, చైనీఖైనీ, మీరాజ్, రెబల్, సిమ్లా, పాన్‌బార్, విమల్, 1000, ఖలేజా, ఆర్‌డీఎం, కె 7000, కె 9000, 24 క్యారెట్ .. వంటి వాటికి ప్రస్తుతం తెలంగాణవ్యాప్తంగా భారీ గిరాకీ ఉంది. వీటిని విక్రయించే స్థలం, సమయం, పరిస్థితిని బట్టి 20 రూపాయల నుంచి 40 రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. అధిక ధర అయినా, దొరకడమే భాగ్యం అన్నట్టుగా వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. విచ్చలవిడిగా గుట్కా, చైనీఖైనీ, వంటి పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తుండడంతో యువత వాటికి బానిసలవుతున్నారు. 2009-10 ప్రపంచ పొగాకు ఉత్పత్తుల సర్వే ప్రకారం 53.5 శాతం మంది పొగాకు, నికోటిన్ ఉత్పత్తులు వినియోగిస్తున్నట్టు తేలింది. గుట్కా, పాన్ మసాలాను నమిలేవారు 48.07 శాతం మంది ఉన్నారని ఈ సర్వేలో తేలింది. వీరిలో పిల్లలు 16 శాతం వరకు ఉన్నారని అంచనా. 17 సంవత్సరాల నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సున్న యువకులే అధికంగా ఉన్నారు. కేన్సర్, గుండె, కాలేయం, కిడ్నీ సంబంధిత వ్యాధులకు గురవుతూ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ముఖ్యమంత్రి నివాళి



సాక్షి, హైదరాబాద్: స్వాతంత్య్ర సమరయోధుడు, తెలంగాణ కోసం సర్వస్వం ధారపోసిన త్యాగశీలి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘనంగా నివాళి అర్పించారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. బాపూజీ త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు వేంనరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు వివేక్, మైనంపల్లి రోహిత్, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించిన స్పీకర్, మండలి చైర్మన్
తెలంగాణ భవన్‌లోనూ బాపూజీ జయంతి కార్యక్రమం



సాక్షి, హైదరాబాద్: స్వాతంత్య్ర సమరయోధుడు తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు నేటి యువతకు ఆదర్శనీయమని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమంలో మండలి చైర్మన్ పాల్గొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ...'బడుగు బలహీనవర్గాల కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ అహర్నిశలు కృషి చేసిన మహానుభావుడన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవిని కూడా త్యాగం చేసిన చరిత్ర ఆయనదని కొనియాడారు. ఆదిలాబాద్ జిల్లా మారుమూల గ్రామంలో జన్మించిన ఆయన జీవిత ప్రయాణం నేటి యువతకు ఆదర్శప్రాయమన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమంలో శాసనసభ, శాసన మండలి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో లక్ష్మణ్ బాపూజీ జయంతి

బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ నేతలు నివాళులర్పించారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో లక్ష్మణ్ బాపూజీ నిర్వహించిన పాత్రను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, నోముల భగత్, సురేందర్, పార్టీ నేతలు లక్ష్మారెడ్డి, దేవీ ప్రసాద్, ఏనుగుల రాకేశ్‌రెడ్డి, కె.వాసుదేవరెడ్డి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రజా పోరాట యోధుడని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో కొనియాడారు. '1969లో ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ ఉద్యమంలో తన మంత్రి పదవికి రాజీనామా చేసి ఎందరో తెలంగాణ ఉద్యమకారులకు లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తిగా నిలిచారు. స్వాతంత్య్ర పోరాటం నుండి మొదలుకొని మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు ప్రజా ఉద్యమాల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ నిర్వహించిన పాత్ర అనిర్వచనీయం. కేసీఆర్ సారథ్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసంలోనే పురుడు పోసుకుంది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ట్యాంక్‌బండ్ వద్ద లక్ష్మణ్ బాపూజీ వారి విగ్రహం ఏర్పాటుతోపాటు హార్టికల్చరల్ వర్సిటీకి ఆయన పేరు పెట్టింది'అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆదర్శ ప్రాయుడు

ఎంపీ డీకే అరుణ



సాక్షి హైదరాబాద్ : ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బీజేపీ ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. బీసీ కులాల్లో అట్టడుగువర్గాల అభ్యున్నతి కోసం, నిజాంకు ఎదురొడ్డిన మహానాయకుడు కొండా లక్ష్మణ్ అని కొనియాడారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, రాజకీయవేత్తగా తన తుదిశ్వాస వరకు తెలంగాణ ఏర్పాటు కోసం పోరాటం చేశారన్నారు. రాష్ట్ర సాధన కోసం తన ఎమ్మెల్యే పదవికి సైతం రాజీనామా చేశారని గుర్తు చేశారు. చేనేతల అభ్యున్నతి కోసం ఆయన ఎంతగానో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. నేటికీ గద్వాల, నారాయణపేట, పాతూరు, పోచంపల్లి వంటి ప్రాంతాల్లో చేనేత వస్త్రాలకు మంచి ఆదరణ ఉందంటే అది ఆయన చలువవల్లేనన్నారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ జయంతి వేడుకల్లో ఆమె పాల్గొని బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొత్త కార్యవర్గానికి నియామక పత్రాలు

రాష్ట్రంలోని పలు జిల్లాలకు నూతనంగా ఎన్నికైన చేనేత సహకార నూతన కార్యవర్గ సభ్యులకు డీకే అరుణ నియామక పత్రాలను అందజేశారు. కనుమరుగవుతున్న చేనేతరంగాన్ని ఆధునీకరణ వైపు నడిపిస్తూ..సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత సహకార సంఘాల సభ్యులపై ఉందని పేర్కొన్నారు.

డీజీపీ కార్యాలయంలో 'కొండా'జయంతి

సాక్షి, హైదరాబాద్: స్వాతంత్య్ర సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శుక్రవారం డీజీపీ కార్యాలయంలో నిర్వహించారు. శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన విశేష సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఐజీ రమణ కుమార్, డీజీపీ కార్యాలయ సీఎస్‌వో యోగేశ్వర్ రావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయలేం

మాజీ మంత్రి పువ్వాడ పిటిషన్‌పై హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. 2014లో తనపై దాఖలు అయిన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని ఆయన వేసిన పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది. 2014 ఎన్నికల సమయంలో క్రికెట్ కిట్లు, మద్యం పంచుతున్నారని ఎన్నికల అధికారి చేసిన ఫిర్యాదు మేరకు పువ్వాడపై ఖమ్మంలోని ఖానాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అయితే ఈ ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాను అక్కడ లేనని.. సమీప వసతి గృహంలో క్రికెట్ కిట్లు స్వాధీనం చేసుకున్నారని, వాటితో తనకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం 2014లో విచారణపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేసేందుకు నిరాకరించారు.

హైదరాబాద్ నుంచి కొత్త విమాన సర్వీసులు

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: నూతన విమాన సర్వీసులకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా.. విమానయాన సంస్థలు కొత్త సర్వీసులను ప్రారంభిస్తున్నాయని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఒక్క సెప్టెంబర్ నెలలోనే హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 7 కొత్త మార్గాలలో సర్వీసుల ప్రారంభానికి ఇండిగో విమానయాన సంస్థ ముందుకు వచ్చిందన్నారు. ఈ కొత్త మార్గాల్లో హైదరాబాద్ - రాజ్ కోట్ మధ్య డైలీ సర్వీసును ఈ నెల 16న ప్రారంభించగా, హైదరాబాద్ - అగర్తల మధ్య వారానికి 4 రోజుల సర్వీసును ఈ నెల 23న, హైదరాబాద్ - జమ్మూ మధ్య వారానికి 3 రోజుల సర్వీసును ఈ నెల 24న ప్రారంభించిందని వివరించారు. వీటితో పాటు సెప్టెంబర్ 27న హైదరాబాద్ - కాన్పూర్ మధ్య, హైదరాబాద్ నుంచి అయోధ్య మధ్య వారానికి 4 రోజుల సర్వీసు ప్రారంభించారని తెలిపారు. సెప్టెంబర్ 28 నుంచి హైదరాబాద్ - ప్రయాగరాజ్ మధ్య, హైదరాబాద్ - ఆగ్రా మధ్య వారానికి 3 రోజుల సర్వీసును ప్రారంభిస్తారని వెల్లడించారు. హైదరాబాద్ నగరం నుంచి ఒక్క నెలలోనే 7 నూతన విమాన సర్వీసుల ప్రారంభంపై కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నూతన విమాన సర్వీసులు ఆయా నగరాల మధ్య ప్రయాణికుల డిమాండ్ నెరవేరుస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్త సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కిషన్ రెడ్డి ప్రయాణికులను కోరారు.

సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాల సరఫరా

నలుగురు నిందితులను అరెస్టు చేసిన టీజీసీఎస్‌బీ

సాక్షి, హైదరాబాద్: స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరిట మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లకు బ్యాంక్ ఖాతాలు అందజేస్తున్న ముఠాలోని నలుగురు సభ్యులను టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద 14 కరెంట్ అకౌంట్స్‌కు సంబంధించిన 11 చెక్ బుక్స్, 23 సిమ్ కార్డులు,10 ఏటీఎంలు, స్వైపింగ్ మెషీన్, మూడు ల్యాప్‌టాప్‌లు, ఫేక్ డాక్యుమెంట్ల కోసం వినియోగిస్తున్న రబ్బర్ స్టాంప్, రౌండ్ సీల్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయెల్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా నమోదైన 51 సైబర్ నేరా ల్లో రెండు అకౌంట్లలో డబ్బు డిపాజిట్స్, విత్‌డ్రా అయినట్లు గుర్తించినట్లు శిఖా గోయెల్ పేర్కొన్నారు.

ఇదీ జరిగింది...

అరెస్టు చేసిన నిందితుల్లో అల్మాస్‌గూడ వినాయకహిల్స్‌కు చెందిన కందుకూరి రవీందర్‌రెడ్డి, అత్తాపూర్ నలందనగర్‌కు చెందిన బండ్లమూడి రవి సైబర్ నేరగాళ్లకు కమీషన్స్ బేసిస్‌లో బ్యాంక్ అకౌంట్స్ సప్లయ్ చేస్తున్నారు. డబ్బు ఆశ చూపి వారికి తెలిసిన వారితో కరెంట్ అకౌంట్స్ ఓపెన్ చేయిస్తున్నారు. ప్రైవేట్ కంపెనీలకు సంబంధించిన నకిలీ ధ్రువపత్రాలను ఇందుకు వినియోగిస్తున్నారు. ఇలా ఒక్కో అకౌంట్‌ను రూ.25 వేల చొప్పున సైబర్ నేరగాళ్లకు అందిస్తున్నారు. ఇలా సేకరించిన డబ్బులో అకౌంట్ ఓపెన్ చేసి ఇచ్చిన వారికి రూ.5,000 చెల్లిస్తున్నారు. ఇందులోభాగంగా వనస్థలిపురానికి చెందిన కొత్తండ రమణ మురళీ కృష్ణ, కుత్బుల్లాపూర్ సుభాష్‌నగర్‌కు చెందిన సమినేని మాధవరావులతో కలసి మొత్తం14 కరెంట్ అకౌంట్స్ ఓపెన్ చేశారు. వీటిని ఆన్‌లైన్ గేమింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ చేస్తున్న సైబర్ నేరగాళ్లకు సప్లయ్ చేస్తున్నారు.

తీగ లాగితే డొంక కదిలింది..

స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులతో భారీగా లాభాలు వస్తాయని ఆశజూపి హైదరాబాద్ నగరానికి చెందిన ఒకరి నుంచి రూ.5.27 కోట్లు కొల్లగొట్టిన కేసులో టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారుల దర్యాప్తులో ఈ విషయాలు వెలుగు చూశాయి. దర్యాప్తులో భాగంగా నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు శిఖాగోయెల్ వెల్లడించారు.

శ్రీశైలం నిర్వాసితుల సమస్య పరిష్కరించాలి

బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు హర్షవర్ధన్, భగత్

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ప్రాజెక్టు ముంపు బాధితుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం పార్టీ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌తో కలిసి తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. శ్రీశైలం నిర్వాసితుల్లో 78 మందికి లష్కర్లుగా కేసీఆర్ ప్రభుత్వం శాశ్వత ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. ఆరు వేల లష్కర్ ఉద్యోగాల భర్తీలో శ్రీశైలం నిర్వాసితులకు ప్రాధాన్యమివ్వాలని గత ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసిందన్నారు. ఎన్నికల సమయంలో నిర్వాసితులకు రేవంత్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు సొంత పనులకు ప్రాధాన్యమిస్తూ.. ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని విమర్శించారు. నెల్లికల్ లిఫ్టు ఇరిగేషన్ పథకం పురోగతిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలని కోరారు.

మూసీ సుందరీకరణ పేరిట సర్కారు దందా

బీఆర్‌ఎస్ నేత కార్తీక్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మూసీ సుందరీకరణ పేరిట ప్రభుత్వం దందా చేస్తోందని, హైదరాబాద్‌ను రేవంత్‌రెడ్డి వల్లకాడుగా మారుస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో వ్యవస్థలన్నీ కుప్పకూలాయన్నారు. శుక్రవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, 'మూసీ మీద లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు పెడితే తిరిగి రాబడి ఎలా వస్తుంది. మూసీకి సెప్టెంబర్, అక్టోబర్‌లో మాత్రమే వరద వస్తుంది. నీళ్లు లేని నదిలో రివర్‌ఫ్రంట్ ఎలా సాధ్యం. 2,400 కిలోమీటర్ల పొడవున ఉన్న నమామి గంగ ప్రాజెక్టుకు రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తే, కేవలం పదుల కిలోమీటర్ల మేర ఉన్న మూసీకి లక్షన్నర కోట్ల రూపాయలు ఎందుకు. సుందరీకరణ మీద ప్రజాభిప్రాయం సేకరించాలి. మూసీ పరిసరాల్లో నివసిస్తున్న వారిపై హైడ్రా తరహా చర్యలు తీసుకుంటే హైదరాబాద్ అగ్నిగుండం అవుతుంది. మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు కేసీఆర్ అండగా ఉంటారు. సుందరీకరణతో కాంగ్రెస్ నేతల జేబులు నిండటం మినహా ప్రజలకు ఒరిగేదేమీ లేదు. బ్లాక్ లిస్టులో ఉన్న కంపెనీకి మూసీ సుందరీకరణ పనులు కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి'అని అన్నారు.

కోర్టు ఆదేశాలు బేఖాతరు చేస్తే జైలే

కో-ఆపరేటివ్ సొసైటీస్ కమిషనర్‌కు హైకోర్టు హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ మేనేజింగ్ కమిటీ అక్రమాలకు పాల్పడిందన్న ఆరోపణలపై విచారణ నివేదిక సమర్పించినా.. ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కో-ఆపరేటివ్ సొసైటీస్ కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్ ఎం.హరితపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలను బేఖాతర్ చేస్తే జైలుకు పంపాల్సి వస్తుందని హెచ్చరించింది. జూబ్లీ హిల్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అక్రమాలపై తాము దాఖలు చేసిన ఫిర్యాదుపై చేపట్టిన విచారణ నివేదికను బహిర్గతం చేయడంలో కమిషనర్ ఫర్ కో ఆపరేటివ్ రిజిస్ట్రార్ నిర్లక్ష్యాన్ని సవాల్ చేస్తూ సొసైటీ మాజీ కార్యదర్శి మురళీ ముకుంద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి.. 2022, మార్చి 23న సమర్పించిన విచారణ నివేదికను పిటిషనర్‌కు రెండు వారాల్లో అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే, కోర్టు ఆదేశాలు జారీ చేసి నాలుగు నెలలు దాటినా కో-ఆపరేటివ్ అధికారులు ఇప్పటికీ అమలు చేయడం లేదంటూ మురళీ ముకుంద్ హైకోర్టులో ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేశారు. జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి సంబంధించి గతంలో తాము ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో నేరుగా కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని కో-ఆపరేటివ్ సొసైటీస్ కమిషనర్ అండ్ రిజిస్ట్రార్‌ను గత విచారణ సందర్భంగా ఆదేశించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి శుక్రవారం మరోసారి విచారణ చేపట్టారు. విచారణకు హాజరైన కమిషనర్ నివేదిక ప్రతిని పిటిషనర్లకు అందించారు. అయితే, నివేదికను బహిర్గతం చేయకపోవడం, దాని ఆధారంగా చర్యలు ప్రారంభించకపోవడంపై కోర్టు వేసిన ప్రశ్నలకు హరిత సమాధానం చెప్పలేకపోయారు. నివేదికపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ఆదేశిస్తూ, విచారణను అక్టోబర్ 18కి వాయిదా వేశారు.

వైద్య సదస్సులను కమ్మేస్తున్న 'ఫార్మా'

మెడికల్ కౌన్సిల్ నిబంధనలు బేఖాతరు



'క్రెడిట్ అవర్స్'పైనా ఫార్మా కంపెనీలదే పెత్తనం

- విలాసవంతమైన ఆఫర్లతో వైద్యులను ఆకట్టుకునేందుకు యత్నం
- వైద్యుల క్రెడిట్ అవర్స్ సర్టిఫికెట్లూ ఫార్మా ప్రతినిధుల చేతుల్లోనే..
- ఫలితంగా మార్కెట్‌లోకి నాసిరకం మందులు.. రోగులపై తీవ్ర ప్రభావం

తెనాలి: వైద్య రంగంలో నూతనంగా వచ్చిన ఆవిష్కరణలు, కొత్త ఔషధాలు, రోగనిర్ధారణలో నవీన విధానాలపై అవగాహన కోసం నిర్వహిస్తున్న సదస్సులు గతి తప్పుతున్నాయి. ఫార్మా కంపెనీల ×స్పాన్సర్‌షిప్×లతో వైద్య సదస్సులు వివాదాలకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. విలాసవంతమైన ఆఫర్లతో వైద్యులను ఆకట్టుకునేందుకు ఆయా కంపెనీలు చేస్తున్న ప్రయత్నాలు.. చివరకు రోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి.

విలాసవంతంగా.. వైద్యులపై వల

వైద్యుల సదస్సుల నిర్వహణలో ఫార్మ కంపెనీలు భాగం కాకూడదని నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధన ఉంది. అలాగే వైద్యులు, వారి అసోసియేషన్‌లతో ఎటువంటి లావాదేవీలు జరపకూడదని స్పష్టం చేసింది. కానీ ఈ నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. సదస్సులకు వైద్యులు హాజరయ్యేందుకు అవసరమైన విమాన టికెట్ల నుంచీ ఆయా ప్రాంతాల్లో తిరిగేందుకు లగ్జరీ కార్లు, బస చేసేందుకు విలాసవంతమైన హోటళ్లు తదితర సకల సదుపాయాలన్నీ ఫార్మా కంపెనీలే స్పాన్సర్ చేస్తున్నాయి. వైద్య సదస్సు జరిగే ప్రాంగణమంతటినీ తమ బ్రాండ్లు కనపడేలా పోస్టర్లు, ఫ్లెక్సీలు, కటౌట్లతో నింపేస్తున్నాయి. తమ స్టాల్‌కు విచ్చేసినందుకు ఖరీదైన బహుమతులు, వివిధ ఎంటర్‌టైన్‌మెంట్ ఈవెంట్లతో వైద్యులను తమ వైపు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో గుంటూరులో కొద్ది నెలల కిందట జరిగిన వైద్యుల సదస్సులో ఫార్మా కంపెనీ ప్రతినిధి ఒకరు వైద్యురాలిపై అనుచితంగా ప్రవర్తించటంతో అతడికి దేహశుద్ధి చేశారు. చెన్నైలో కొద్దిరోజుల కిందట జరిగిన మరో సదస్సు అశ్లీల నృత్యాలకు వేదికైంది. విజ్ఞానం పెంచాల్సిన వైద్య సదస్సులను ఇలా వివాదాలకు కేంద్ర బిందువుగా చేస్తున్నాయి.

వైద్యవిజ్ఞాన సదస్సులకు హాజరయ్యే వైద్యులకు మెడికల్ కౌన్సిల్.. క్రెడిట్ అవర్స్‌ను కేటాయిస్తుంది. ప్రతి వైద్యుడు వివిధ సదస్సుల్లో పాల్గొని సంవత్సరానికి ఆరు క్రెడిట్ అవర్స్ చొప్పున ఐదేళ్లలో 30 క్రెడిట్ అవర్స్ సంపాదించాల్సి ఉంటుంది. మెడికల్ కౌన్సిల్‌లో తమ వైద్య సర్టిఫికెట్లు రెన్యువల్ చేసుకునేందుకు ఈ క్రెడిట్ అవర్స్ దోహదపడతాయి. ఈ సదస్సులకు ఆయా రాష్ట్రాల మెడికల్ కౌన్సిల్ సభ్యులు, ప్రతినిధులు హాజరై సదస్సు జరిగే తీరును పరిశీలించాల్సి ఉంటుంది. ప్రతి సర్టిఫికెట్‌పైనా మెడికల్ కౌన్సిల్ సభ్యుల సంతకాలు ఉంటాయి. ఇన్ని నియమ నిబంధనలున్నా పలు ఫార్మా కంపెనీలు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నాయి. వైద్యుల పేర్ల నమోదు నుంచి సదస్సు తర్వాత ఇచ్చే క్రెడిట్ అవర్స్ సర్టిఫికెట్ల జారీ వరకు.. అన్నింటిలోనూ ఫార్మా కంపెనీలదే పెత్తనం. సదస్సుకు హాజరుకాని వైద్యుల పేర్లను కూడా ఫార్మా కంపెనీల ప్రతినిధులే నమోదు చేసి.. సర్టిఫికెట్లను తీసుకెళ్లి మరీ వైద్యులకు అందజేస్తుంటారు. తమ ఉత్పత్తులను రోగులకు సూచించేలా వైద్యులను ప్రభావితం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.



తగ్గిన మందుల నాణ్యత



ఫార్మా కంపెనీలు, కొందరు వైద్యుల వల్ల రోగులపై మందుల అధికభారం పడుతోంది. అలాగే నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేని మందులు రోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. కేంద్ర ఔషధాల ప్రమాణాల నియంత్రణ సంస్థ తాజాగా చేసిన పరీక్షల్లో పారాసిటమాల్ సహా 53 రకాల మందుల్లో నాణ్యత లేదని తేలింది. గత ఆగస్టులో 156 కాంబినేషన్ ఔషధాలు హానికరమంటూ నిషేధం విధించింది.

నిరుద్యోగులకు సర్కార్ షాక్

ఖాళీ అయిన పోస్టుల్లో రిటైర్డ్ ఉద్యోగుల నియామకం



- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్‌లో భర్తీకి మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం
- ప్రభుత్వ పెద్దలకు కావాల్సిన రిటైర్డ్ ఉద్యోగులకు కొలువులే లక్ష్యం
- కొత్త పోస్టుల మంజూరు లేకపోగా ఉన్న పోస్టుల్లోనూ నిరుద్యోగులకు నిరాశే
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్

సాక్షి, అమరావతి: సూపర్ సిక్స్‌లో మొట్టమొదటి హామీకే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తూ నిరుద్యోగ యువతకు షాక్ ఇచ్చింది. వారి పొట్టకొట్టే చర్యలు చేపట్టి.. రిటైర్డ్ ఉద్యోగులను కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో నియమించడానికి గేట్లు తెరిచింది. సూపర్ సిక్స్‌లో మొట్టమొదటి హామీగా యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పన, లేదంటే ఉద్యోగాల కల్పించే వరకు నెలకు మూడు వేల రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఉమ్మడిగా విడుదల చేసిన మేనిఫెస్టోలోస్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీని అమలు చేసేందుకు ఎటువంటి చర్యలు తీసుకోపోగా తమకు కావాల్సిన రిటైర్డ్ ఉద్యోగులకు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో ప్రభుత్వ కొలువులు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేసింది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. దీంతో తమకు ఇక సర్కారు కొలువులు ఎండమావే అని నిరుద్యోగ యువత ఆందోళన వ్యక్తం చేస్తోంది.

నిరుద్యోగుల ఆశలపై నీళ్లు జల్లడమే..

ఖాళీ అయిన పోస్టులను కొత్త వారితో భర్తీ చేయకుండా తిరిగి రిటైర్ ఉద్యోగులతోనే భర్తీ చేయడం అంటే నిరుద్యోగ యువత ఆశలపై నీళ్లు చల్లడమేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఖాళీగా ఉన్న పోస్టులను నోటిఫికేషన్‌ల ద్వారా భర్తీ చేస్తేనే నిరుద్యోగ యువతకు అవకాశాలు ఉంటాయని, రిటైర్ వారితో వాటిని భర్తీ చేయడం అంటే నిరుద్యోగ యువతను నిండా ముంచడమేనని ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు. ఒకపక్క రిటైర్డ్ వారికే మళ్లీ అవకాశం ఇస్తూ.. కొత్త పోస్టులు మంజూరు చేయకపోవడంతో సర్కారు కొలువులు నిరుద్యోగ యువతకు అందని ద్రాక్షగానే మిగిలిపోనున్నాయి. ఒక పక్క వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీని రద్దు చేసి.. ఆ నియామక ప్రక్రియను తాత్సారం చేస్తున్న విషయం విదితమే. ఈ ఏడాది డీఎస్సీ ఉండే అవకాశం కనిపించకపోవడంతో నిరుద్యోగులు ఉసూరుమంటున్నారు. వైద్య, ఆరోగ్య శాఖలోనూ గత ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్లను ఈ ప్రభుత్వం రద్దు చేసింది.

రెండు స్క్రీనింగ్ కమిటీలు

డిప్యూటీ కార్యదర్శి, డిప్యూటీ డైరెక్టర్ స్థాయి కేడర్‌లో పదవీ విరమణ చేసిన ఉద్యోగులను తిరిగి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగాల్లోకి తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి, సంబంధిత శాఖల ప్రత్యేక సీఎస్, ముఖ్య కార్యదర్శి, కార్యదర్శులతో స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. డిప్యూటీ కార్యదర్శి, డిప్యూటీ డైరెక్టర్ కంటే దిగువ కేడర్‌లో పదవీ విరమణ చేసిన ఉద్యోగులను కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో తిరిగి తీసుకునేందుకు సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్యకార్యదర్శి నేతృత్వంలో ఆర్థిక శాఖ కార్యదర్శి (హెచ్‌ఆర్), సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో మరో స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ఉద్యోగులతో ఖాళీల భర్తీ ప్రతిపాదనల పూర్తి వివరాలు సంబంధిత శాఖల ప్రత్యేక సీఎస్‌లు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు.. స్క్రీనింగ్ కమిటీలకు పంపాల్సిందిగా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. స్క్రీనింగ్ కమిటీల ఆమోదం తరువాత సీఎం ఆమోదం తీసుకోవాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులను రెగ్యులర్ పోస్టుల్లోనే తీసుకోవాలని, మంజూరు కాని పోస్టుల్లోకి తీసుకోకూడదని తెలిపారు. ఇలా ప్రభుత్వ ఉద్యోగాల్లో తీసుకున్న రిటైర్డ్ ఉద్యోగులకు వేతనాలు, అలవెన్స్‌లను 2018లో ఆర్థిక శాఖ జారీ చేసిన 48 జీవో మేరకు ఉండాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వులు రిటైరైన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులకు మాత్రమే వర్తిస్తాయని, అఖిల భారత సర్వీసు, కేంద్ర సర్వీసు ఉద్యోగులకు వర్తించవని పేర్కొన్నారు.

క్లుప్తంగా...

సీఎం పర్యటనకు ముందు జిల్లాకు సమన్వయ బృందం

సాక్షి, అమరావతి: సీఎం పర్యటనకు 24 గంటలు ముందే ఆయా జిల్లాలు, సందర్శన ప్రాంతాల్లో పరిస్థితులను జల్లెడపట్టేందుకు రాష్ట్ర స్థాయిలో రెండు అడ్వాన్స్ బృందాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రెవెన్యూ, ప్రణాళిక, పోలీసు, సమాచార, నిఘా శాఖల అధికారులతో ఆ బృందాలను ఏర్పాటు చేస్తూ సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మెడికల్ కాలేజీల్లో రిపోర్ట్ చేయని 463 మంది విద్యార్థులు

సాక్షి, అమరావతి: 2024–25 విద్యా సంవత్సరానికి తొలి దశ ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థుల్లో గడువు ముగిసే నాటికి 463 మంది కళాశాలల్లో రిపోర్ట్ చేయలేదు. వీరిలో 133 మంది కన్వీనర్ కోటా, 330 మంది యాజమాన్య కోటా సీట్లు పొందిన విద్యార్థులున్నారు. జీవో 151 ప్రకారం కన్వీనర్ కోటా సీట్ సాధించిన కళాశాలల్లో రిపోర్ట్ చేయని విద్యార్థులు తదుపరి కౌన్సెలింగ్‌కు అనర్హులని వర్సిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.

పాఠశాలల్లోనూ కారుణ్య నియామకాలు కల్పించాలి

సాక్షి, అమరావతి: ఎయిడెడ్ కళాశాలల్లో పనిచేసే ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద ప్రభుత్వ కళాశాలల్లో ఉద్యోగాలు కల్పించినందుకు ప్రభుత్వానికి ఏపీ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.చిట్టిబాబు, చిన్నప్ప శుక్రవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎయిడెడ్ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు కూడా కారుణ్య నియామకాలు కల్పించాలని కోరారు.

కల్లు విధానాన్ని ప్రకటించాలి

సాక్షి, అమరావతి: అక్టోబర్ 1వ తేదీ నాటికి కల్లు గీత నూతన పాలసీని ప్రకటించకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని ఆంధ్రప్రదేశ్ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విజయవాడలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సంక్షోభం, సవాళ్లు ఎదుర్కొంటున్న కల్లు గీత వృత్తిని మరింత సంక్షోభంలోకి నెట్టకుండా ఉపాధి పెంచేలా నూతన కల్లు విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కుటుంబ సంక్షేమ కమిషనర్‌తో స్టార్ ఎన్సీడీ ప్రోగ్రామ్ బృందం భేటీ

సాక్షి, అమరావతి: స్టార్ ఎన్సీడీ ఇంప్లిమెంటేషన్ ప్రోగ్రామ్ బృందం శుక్రవారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ హరికిరణ్‌తో భేటీ అయింది. ఈ ఏడాదిలో ప్రారంభమైన ఈ ప్రోగ్రామ్ నవంబర్ నుంచి క్షేత్ర స్థాయిలో అమలులోకి వస్తుంది. ఐటీ అప్లికేషన్స్, రిఫరల్ విధానం తదితర అంశాలను ఈ బృందం తయారు చేస్తోంది.

కొత్త మద్యం విధానాన్ని సక్రమంగా అమలు చేయాలి

సాక్షి, అమరావతి: కొత్త మద్యం విధానాన్ని సక్రమంగా అమలు చేసేందుకు ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని ఆ శాఖ కమిషనర్ నిషాంత్ కుమార్ ఆదేశించారు. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చుకుని యంత్రాంగాన్ని సిద్ధం చేయాలన్నారు. ఐఎంఎల్ డిపోలు, రిటైల్ అవుట్ లెట్ల బాధ్యులతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి మద్యం దుకాణంలో తగినంత నిల్వలు ఉండేలా, సమయ పాలన పాటించేలా చూడాలన్నారు. మూతపడనున్న ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, పీఓఎస్ మెషిన్లు, బీరువాలు, రిఫ్రిజిరేటర్లు, ఇతర పరికరాల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు.

అమరావతి రైతులకు ప్లాట్లు ఎలా?

ప్లాట్లు అభివృద్ధి చేసేందుకు రూ. 12 వేల కోట్లకు పైగా అవసరం

- నీట మునగకుండా ఉండేలా ఎత్తు చేసేందుకు మరింత ఖర్చు
- నిధులెలా తేవాలో తెలియక ప్రభుత్వం, సీఆర్డీయే మల్లగుల్లాలు
- ఎకరాకు 1,450 గజాలు ఇస్తామని గతంలో టీడీపీ ప్రభుత్వం హామీ
- ఇప్పుడు పెద్దమొత్తంలో ఖర్చుచేసే పరిస్థితిలేక తర్జనభర్జన

సాక్షి, అమరావతి: రాజధాని నిర్మాణం కోసం అమరావతి రైతుల నుంచి తీసుకున్న భూములకు తిరిగి వారికి ఇవ్వాల్సిన ప్లాట్ల అభివృద్ధిపై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. ప్లాట్ల అభివృద్ధికి రూ. వేల కోట్ల నిధులు అవసరం కావడం, ప్రస్తుత పరిస్థితుల్లో అంత మొత్తం ఖర్చు చేసే పరిస్థితి లేకపోవడంతో హామీ అమలుపై కూటమి ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. రాజధాని నిర్మాణం కోసం కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని 29 వేల మంది రైతుల నుంచి 34 వేల ఎకరాలకు పైగా భూములు సేకరించారు. తీసుకున్న ఎకరాకు 1,450 గజాల చొప్పున ప్లాట్లను అన్ని వసతులతో అభివృద్ధి చేసి ఇస్తామని గత టీడీపీ ప్రభుత్వం రైతులకు ఒప్పంద పత్రాలు ఇచ్చింది. ప్రస్తుతం మరో 4 వేల ఎకరాలు సేకరించాలన్న ఆలోచనతో రైతుల నుంచి సీఆర్డీఏ భూములు తీసుకుంటోంది. ఇటీవల అమరావతి పరిధిలోని 29 వేల ఎకరాల్లో రూ. 34 కోట్లతో సీఆర్డీఏ కంప చెట్ల తొలగింపు పనులు చేపట్టింది. అయితే, ఈ పనులు పూర్తయ్యాక ప్లాట్లు అభివృద్ధి చేసి రైతులకు ఇవ్వాల్సి ఉంది. రైతులకు ఇవ్వాల్సిన ప్లాట్ల అభివృద్ధికి దాదాపు రూ. 12 వేల కోట్ల వరకు ఖర్చవుతుందని గతంలోనే అధికారులు అంచనా వేశారు. ఇప్పుడు ఇంత మొత్తం నిధులు ఎలా సేకరించాలో.. పనులు ఎలా చేపట్టాలోనని సీఆర్డీఏ ఆందోళన చెందుతోంది. సీఆర్డీఏ అభివృద్ధి చేసే ప్లాట్లలో నివాస, కమర్షియల్ ప్లాట్లు ఉన్నాయి. మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఆయా ప్రాంతాల్లో ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లు అభివృద్ధి చేయాలి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ సరఫరా, ఎస్టీపీలు, తాగునీరు సదుపాయాలు వంటివి కల్పించాలి. ప్లాట్లు పొందే రైతులకు ఇచ్చిన హామీ మేరకు వీటిని కల్పించాకే రైతులకు అప్పగించాలి. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక అవసరం.

మునిగే ప్లాట్లు రైతులు తీసుకుంటారా?

ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడికక్కడ వర్షం, వరద నీరు ఈప్రాంతంలో నిలిచిపోయింది. ఇప్పుడున్నట్టుగా ప్లాట్లు వేస్తే భవిష్యత్‌లో ఇలాంటి వర్షం వచ్చినప్పుడు ప్లాట్లన్నీ నీట మునగడం ఖాయం. ఇలా చేసినట్టయితే వాటిని రైతులు తీసుకునే పరిస్థితి లేదు. ఆయా ప్లాట్ల ప్రాంతాలను పూర్తిగా మట్టితో ఎత్తు చేయాల్సి ఉంది. కానీ ఈ పనులన్నీ చేయడం ఇప్పట్లో సాధ్యమయ్యే పని కాదంటున్నారు నిపుణులు. ముఖ్యంగా గతంలో సీఆర్డీఏ వేసిన అంచనా వ్యయమే రూ. 12 వేల కోట్లు దాటుతుండగా, ప్లాట్లు నీట మునగకుండా ఎత్తు చేయాలంటే రెట్టింపు నిధులు ఖర్చు చేయాల్సిందే. కానీ ప్రభుత్వం అంత మొత్తం ఖర్చు చేసేందుకు సిద్ధంగా లేనట్టు తెలుస్తోంది.

స్తంభాలు, లైన్ల మరమ్మతులకు రూ.45 కోట్లు

డిస్కంలకు కేటాయించిన విద్యుత్ నియంత్రణ మండలి



సాక్షి, అమరావతి: ప్రజల నుంచి వచ్చే విద్యుత్ స్తంభాలు, లైన్ల మరమ్మతుల ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లకు రూ.15 కోట్లు చొప్పున రూ.45 కోట్లను కేటాయిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) వెల్లడించింది. 2024–25 నుంచి 2024–29 మధ్య డిస్కంల ప్రసార (వీలింగ్)చార్జీలను నిర్ణయిస్తూ మండలి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 33కేవీ, 11కేవీ, ఎల్టీ లైన్లను ఉపయోగించుకున్న వారి నుంచి డిస్కంలు వసూలు చేసేలా రూ.0.32 నుంచి రూ.2.14 వరకూ ఐదేళ్లకు వేర్వేరు చార్జీలను ప్రకటించింది. ఇన్నాళ్లూ కిలోవాట్అవర్ (కేవీఏ) ప్రాతిపదికన వసూలు చేస్తున్న వీలింగ్ చార్జీలను ఇకపై ప్రతి యూనిట్ ప్రాతిపదికన వసూలు చేయాలని ఏపీఈఆర్సీ ఆదేశించింది. అయితే ఈ చార్జీల్లో గృహాలు, పబ్లిక్, ప్రభుత్వ సంస్థలకు 50 శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపింది. దానివల్ల ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ సిస్టంలు ఏర్పాటు చేసేవారి సంఖ్య పెరుగుతుందని అభిప్రాయపడింది. ఏపీ ట్రాన్స్‌కోతో పాటు డిస్కంలు కూడా ఓల్టేజ్ నిర్వహణపై మూడు నెలల్లోగా నివేదిక ఇవ్వాలని కోరింది. గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, స్తంభాలను సరి చేయడానికి తాము కేటాయించిన నిధులను వినియోగించాలని సూచించింది. మార్చి 31 నాటికి అన్ని పెట్టుబడుల వివరాలను కమిషన్‌కు తెలియజేయాలని, తర్వాతి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిసెంబర్ 31వ తేదీలోపు ఖర్చుల వివరాలను సమర్పించి, ఆమోదం పొందాలని కమిషన్ స్పష్టం చేసింది. రాష్ట్రంలో పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడానికి సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ రూపొందించిన 'విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్ ప్లానింగ్ క్రైటీరియా 2023' పత్రాన్ని అనుసరించాలని డిస్కంలను ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్ ఉద్యోగుల ఖర్చుల్లో పెన్షన్, గ్రాట్యుటీ (పీఅండ్‌జీ) ట్రస్ట్‌లకు సంబంధించిన నిబంధనలను కమిషన్ అనుమతించింది.

ప్రభుత్వ విధానాల వల్లే సంక్షోభంలో వ్యవసాయం

మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు



ద్వారకాతిరుమల: వ్యవసాయ సంక్షోభానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే కారణమని మాజీ మంత్రి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యాన ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో శుక్రవారం రాష్ట్రస్థాయి రైతు సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ పండించిన పంటలకు మద్దతు ధర రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. బడా కార్పొరేట్ కంపెనీలకు రూ.14 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేసిన మోదీ ప్రభుత్వం, రైతులకు ఒక్క పైసా కూడా రుణమాఫీ చేయలేదని ధ్వజమెత్తారు. రైతులకు రుణమాఫీ కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే ప్రత్యామ్నాయ విధానాలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ పోస్టుల భర్తీకి మరోసారి అనుమతి

సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో ఖాళీ అయిన డైరెక్టర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో ఇంధన శాఖ తికమకపడుతోంది. ఈ నెల 20న ఈ పోస్టుల భర్తీకి అనుమతిస్తూ ఇంధనశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాలను నిలిపివేస్తున్నట్టు ఈ నెల 24న ఉత్తర్వులిచ్చింది. తాజాగా శుక్రవారం మరోసారి పోస్టుల భర్తీకి అనుమతినిస్తూ కొత్తగా ఉత్తర్వులు విడుదల చేసింది. డైరెక్టర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసేందుకు డిస్కంలతో పాటు ఏపీజెన్‌కో, ఏపీ ట్రాన్స్‌కోలకు అనుమతిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో నియమితులైన పదిమంది డైరెక్టర్ల చేత బలవంతంగా రాజీనామా చేయించిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు ఆ పోస్టులను భర్తీ చేయలేక తలకిందులైపోతోంది.

ట్రిపుల్ ఐటీ మెస్ కాంట్రాక్టర్‌ను మార్చండి

అధికారులతో మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలోని మెస్‌లో భోజనం నాణ్యత పెరగాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ట్రిపుల్‌ఐటీ అధికారులను ఆదేశించారు. నూజివీడులోని మంత్రి క్యాంప్ ఆఫీసులో శుక్రవారం ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, అధికారులతో మెస్‌ల నిర్వహణపై ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ నూతనంగా వచ్చిన డైరెక్టర్ ట్రిపుల్‌ఐటీలో పరిస్థితులను చక్కదిద్ది పాత మెస్ కాంట్రాక్టర్‌ను తొలగించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్యాంపస్‌లో విద్యార్థులకు పూర్తి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యార్థులు ,ఉపాధ్యాయులు రాజకీయాలకు తావు లేకుండా పనిచేయాలని, రాజకీయం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ట్రిపుల్‌ఐటీలో కిచెన్, మెస్‌లను పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు అధ్యాపకులు, విద్యార్థులతో కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటు వంటి భద్రతాపరమైన ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు.



శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 17 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధ రాత్రి వరకు 61,328 మంది స్వామివారిని దర్శించుకోగా 22,033 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.84 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.




కాళ్లకూరులో పవిత్రోత్సవాలు



కాళ్ల: పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలంలోని కాళ్లకూరులో స్వయంభూః వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సప్తనదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మూడో రోజు శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ద్వార తోరణపూజ, యాగశాల అర్చన, లోక కల్యాణార్థం ఆకాంక్షిస్తూ సుదర్శన, నారసింహ, సంక్షేపరామాయణ హోమాలు, సాయంత్రం స్వామి అమ్మవార్లకు పవిత్రవిసర్జన, నీరాజన మంత్రపుష్పాలు, తీర్థగోష్ఠి కార్యక్రమాలు నిర్వహించారు.

ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అహోబిలం




ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం ఆలయానికి గొప్ప విశిష్టత లభించింది. జాతీయ ఉత్తమ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా ఈ క్షేత్రం గుర్తించబడింది. శుక్రవారం పర్యాటక దినోత్సవం సందర్భంగా డిల్లీలో జరిగిన కార్యక్రమంలో భారత ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్కడ్, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చేదుల మీదుగా అవార్డును ఏపీ పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రతినిధి, ఇంటాచ్ నంద్యాల చాప్టర్ కన్వీనర్ శివకుమార్‌రెడ్డి అందుకున్నారు.

బంగారు, వెండి పుష్పాలతో మరిడమ్మకు పూజలు



పెద్దాపురం: కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం




అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.సత్యదేవుని ప్రధానాలయంలో అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రుత్విక్కులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూక్లియర్ సైన్స్‌తో అభివృద్ధి



ఏలేశ్వరం: న్యూక్లియర్ సైన్స్‌తో మానవాళి అభివృద్ధి జరిగిందని రాష్ట్ర కళాశాల విద్యా జాయింట్ డైరెక్టర్ చప్పిడి కృష్ణ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ డి.సునీత అధ్యక్షతన విశాఖపట్టణం బాబా అటమిక్ రీసెంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఆరోగ్య రక్షణ శక్తి, పర్యవరణంలో న్యూక్లియర్ సైన్స్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ న్యూక్లియర్ సైన్స్ అభివృద్ధి చెందిన తరువాత మానవాభివృద్ధిలో పెనుమార్పులు సంభవించాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, క్యాన్సర్ వ్యాధిని గుర్తించడం, కొత్తరకాల మందులు కనిపెట్టడం, మానవ జీవితకాలం పెంచడంలో న్యూక్లియర్ సైన్స్ ఎంతగానో ఉపయోగపడిందన్నారు.



ఎంటెక్ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఎంటెక్ 3వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసంకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

జాబ్ మేళాలో 66 మందికి ఉద్యోగాలు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సిడాప్, డీఆర్డీఏ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 104 మంది హాజరయ్యారు. ఐదు బహుళ జాతీయ కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు ఇంటర్వ్యూ నిర్వహించి 66 మందిని ఆయా సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక చేశారు.

గాంధీయాన్ సోషల్ వర్క్ పీజీ డిప్లమా కోర్సుకు దరఖాస్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో ప్రారంభిస్తున్న పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లమా ఇన్ గాంధీయాన్ సోషల్ వర్క్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ పి.సుజాత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ విద్యార్హత కాగా, వర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని రూ. 200 ఫీజుతో దరఖాస్తులు అక్టోబర్ 5వ తేదీ లోపు చేసుకోవాలని అన్నారు.

శిఖామణికి కవికోకిల పురస్కారం

యానాం: యానాంకు చెందిన సుప్రసిద్ధ కవి, కవిసంధ్య సంపాదకుడు డాక్టర్ శిఖామణి గుర్రం జాషువా కవికోకిల పురస్కారానికి ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ఈ పురస్కారానికి తనను ఎంపిక చేసినట్లు శుక్రవారం శిఖామణి తెలిపారు.





పదివేల నోటు ఉండేదోయ్!

కరెన్సీ నోట్లు మారుతూ ఉంటాయి. అంతకు ముందు మన దేశంలో వెయ్యి నోటు ఉండేది. ఇప్పుడు లేదు. ఆ తర్వాత 2000 రూపాయల నోటు ఉండేది. ఇప్పుడు లేదు. గతంలో రెండు రూపాయల నోటు, రూపాయి నోటు, ఐదు రూపాయల నోటు ఉండేవి. ఇప్పుడు కనిపించడం లేదు. కాని గతంలో 10 వేల రూపాయల నోటు ఉండేదని మీకు తెలుసా? అవును మన దేశంలో 10 వేల రూపాయల నోటు ఐదు వేల రూపాయల నోటు ఉండేవి. 1938లో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం 10 వేల రూపాయల నోటును ప్రవేశ పెట్టింది. ధనికులు ఈ నోటును వాడేవారు. అయితే దీని వల్ల బ్లాక్‌మనీ లావాదేవీలు పెరుగుతున్నాయని 1946లో రద్దు చేశారు. అయితే 1954లో మళ్లీ ఈ పదివేల నోటు మన దేశంలో చెలామణిలోకి వచ్చింది. పాత సినిమాల్లో వెడల్పుగా ఉండే నోట్ల కట్టలు కనిపించేవి. వాటిని మనం పదివేల రూపాయల నోట్ల కట్టలు అనుకోవచ్చు. కాని మన ప్రధానిగా మురార్జీ దేశాయ్ ఉన్నప్పుడు 1978లో ఈ నోటును రద్దు చేశారు. ఆ తర్వాత మళ్లీ రాలేదు. ఈ ఫొటోలో ఉన్న నోటు అది. ఇలాంటివి పది కాగితాలు మీ జేబులో ఉంటే లక్ష రూపాయలు ఉన్నట్టు ఆ రోజుల్లో.

● అక్టోబర్ 2 - గాంధీ జయంతి

గాంధీగారు తప్పు చేస్తే?

(పిల్లలూ... గాంధీగారు తన ఆత్మకథలో రాసిన ఒక ముఖ్య ఘట్టం ఇది. చదవండి)



''ప్రపంచంలో సిగరెట్ల కోసం ఇంత మోజెందుకో నాకు అర్థం కాదు. పొగ త్రాగేవాళ్లతో రైలు ప్రయాణం నేను చేయలేను. నాకు ఊపిరాడదు. అంతకంటే మరో పెద్ద తప్పు చేశాను. నాకు 13 ఏండ్ల వయసులో మొదట సిగరెట్ల కోసం డబ్బులు దొంగిలించాను. తరువాత 15వ ఏట పెద్ద దొంగతనం చేశాను. మా అన్న చేతికి ఉండే బంగారు మురుగు నుంచి కొంచెం దొంగిలించాలని అతను అంటే నేను సరే అన్నాను. దానికి కారణం మా అన్న ఇరవై రూపాయలు అప్పుబడ్డాడు. ఈ అప్పు ఎలా తీర్చడమా అని మేమిద్దరం ఆలోచించాము. అతని చేతికి బంగారు మురుగు ఉంది. దానిలో ఒక తులం ముక్క తీయించడం తేలిక అని నిర్ణయించాం. ఆ పని చేశాం. అప్పు తీర్చాం. కాని ఈ చర్యను నేను సహించలేకపోయాను. ఇక దొంగతనం చేయకూడదని నిశ్చయించుకున్నాను. అయితే నా మనస్సు శాంతించలేదు. తండ్రిగారికి చెప్పవలెనని అనిపించింది. కాని ఆయన ముందు నోరు విప్పి ఈ విషయం చెప్పేందుకు సాహసం కలుగలేదు. వారు కొడతారనే భయం కలుగలేదు. తన బిడ్డలనెవ్వరినీ మా తండ్రి కొట్టరు. బంగారు మురుగు విషయం చెబితే మనస్తాపంతో క్రుంగిపోతారనే భయం నన్ను పట్టుకుంది. ఏది ఏమైనా దోషం అంగీకరిస్తేనే బుద్ధి కలుగుతుందని విశ్వాసం కలిగింది. తండ్రికి మనస్తాపం కలిగించినా పరవాలేదని భావించాను.

చివరికి ఒక చీటీమీద చేసిన తప్పంతా రాసి క్షమించమని ప్రార్థించాలి అను నిర్ణయానికి వచ్చాను. ఒక కాగితం మీద జరిగినదంతా వ్రాశాను. వెళ్లి మా తండ్రిగారికి ఇచ్చాను. ఇంతటి తప్పు చేసినందుకు తగిన విధంగా శిక్షించమనీ, ఇక ముందు దొంగతనం చేయననీ శపథం చేశాను. ఇదంతా వ్రాసిన చీటీ వారి చేతికి ఇస్తున్నప్పుడు వణికిపోయాను. మా తండ్రి అనారోగ్యంతో బాధపడుతూ మంచం పట్టి ఉన్నారు. ఆయన బల్లమీద పడుకుని ఉన్నారు. చీటీ వారి చేతికి ఇచ్చి ఎదురుగా నిలబడ్డాను. వారు చీటీ అంతా చదివారు. వారి కండ్లనుండి ముత్యాలవలె కన్నీరు కారసాగింది. ఆ కన్నీటితో చీటీ తడిసిపోయింది. ఒక్క నిమిషం సేపు కండ్లు మూసుకుని ఏమో యోచించారు. తరువాత చీటీని చింపివేశారు. మొదట చీటీ చదివేందుకు ఆయన పడకమీద నుంచి లేచారు. ఆ తరువాత తిరిగి పడుకున్నారు. నాకు కూడా ఏడుపు వచ్చింది. తండ్రికి కలిగిన వేదనను గ్రహించాను. చిత్రకారుడనైతే ఈ రోజు కూడా ఆ దృశ్యాన్ని చిత్రించగలను. ఆ దృశ్యం ఇప్పటికీ నా కండ్లకు కట్టినట్లు కనబడుతున్నది. వారి ప్రేమాశ్రువులు నా హృదయాన్ని కడిగివేశాయి. అనుభవించిన వారికే ఆ ప్రేమ బోధపడుతుంది.''



నక్షత్ర పూలు

కొలంబియాలో నదుల పక్కన విస్తారంగా పెరిగే నక్షత్ర పువ్వు ఇది. దీని పేరు 'ఇనిరిడ'. ఆ పేరుతో అక్కడ చిన్న ఊరు ఉంది. ఆ ఊరిలోని ఆదివాసులు ఈ అడవి పువ్వును చాలా జాగ్రత్తగా చూసుకుంటారు. ఎందుకంటే ఈ పువ్వును కోశాక ఎన్ని రోజులైనా వాడిపోయినా దీని నక్షత్ర రూపాన్ని కోల్పోదు. చాలా అందంగా ఉండే ఈ పువ్వును కొలంబియా దేశం వేరే దేశాలకు వెళ్లకుండా కాపాడుకుంటోంది. నిన్న మొన్నటి వరకూ ఈ పువ్వును వ్యాపార పంటగా సాగు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. ఇప్పుడు ఇస్తోంది. ఈ అందమైన పువ్వు ఫ్లవర్ బొకేగా అక్కడ అందరికీ అందుతోంది. ఇంట్లో ఈ పూలను అలంకరించుకోవడానికి పోటీ పడుతుంటారు.

బ్రెయిన్ జిమ్

మన పొడుపు కథలు



1) ఇది ఒక పక్షి పేరు.
మొదటి అక్షరం చిక్కడపల్లిలో ఉంది.
పంజగుట్టలో లేదు.
రెండవ అక్షరం లక్షల విలువ చేస్తుంది.
వందల్లో కాదు.
మూడవ అక్షరం కష్టంలో ఉంది... నష్టంలో కాదు

2) అడ్డగోడ మీద బుడ్డచెంబు

3) వాకిలికి తాళం వేసింది - అయ్యా అంటే తెరుస్తుంది
ఆకలి అంటే తెరుస్తుంది - అమ్మా అంటే మూస్తుంది

జవాబులు: 1) చిలక 2) ఎద్దుమూపురం 3) నోరు లేదా పెదవులు





పిచ్చి వేషాలకు పెనాల్టీ



బైక్ నడపొచ్చు. కాని ఇష్టం వచ్చినట్టు నడపకూడదు. హెల్మెట్ లేకుండా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా అస్సలు నడపకూడదు. అన్నట్టు 18 ఏళ్లు నిండాకే నడపాలి. ముందు నడిపితే శిక్ష పడుతుంది. ఇకపై బైక్‌పై స్టంట్స్ అస్సలు చేయకూడదు. కాని కొందరు ఆకతాయిలు ఇదిగో ఇలా రోడ్ల మీద స్టంట్స్ చేస్తుంటారు. ఇటీవల అలాంటి వారిని వెతికి పట్టుకుని పెనాల్టీ వేస్తున్నారు. ఒక యూట్యూబర్ బైక్ మీద అదే పనిగా స్టంట్స్ చేస్తుంటే పట్టుకుని ఫుల్లుగా పెనాల్టీలు వేశారు. ఎన్నో తెలుసా? 80. అంటే ఒక లక్ష దాకా ఫైన్ కట్టాలి. ఇలాంటివి చేసే వారితో దూరంగా ఉండండి.

కాయలు కాయలు తింటారంట
ఏమీ కాయలు తింటారంట?
అల్లరి చేసే పిల్లలు
మొట్టికాయలు తింటారంటా!

* * *

పాశం పాశం తింటారంటా
ఏమీ పాశం తింటారంటా?
అల్లరి చేసే పిల్లలు
తొడపాశం తింటారంటా!

* * *

బాజా బాజా మోగేనంట
ఏమి బాజా మోగేనంట?
అల్లరి చేసే పిల్లలకు
వీపు బాజా మోగేనంట!

మన పాట





ఏఐ చూపిన నాస్కా లైన్స్

పెరూలో ఉన్న నాస్కా లైన్స్ గురించి మీరు వినే ఉంటారు. అక్కడి నిమా నగరం నుంచి 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాతి ఎడారిలో మిస్టరీగా ఉన్న రేఖాకృతులనే 'నాస్కా లైన్స్' అంటారు. నేల మీద నుంచి వీటిని అర్థం చేసుకోలేము. ఆకాశం నుంచి చూస్తే ఎన్నో ఆకారాలు కనిపిస్తాయి. సాలీడు, కోతి, కుక్క, బల్లి... ఇలా. కొన్ని పూల ఆకృతులు కూడా ఉన్నాయి. ఒక బొమ్మైతే అంతరిక్ష జీవిని పోలి ఉంటుంది. 2000 ఏళ్ల క్రితం నాటి ఆదివాసులు ఈ రేఖలు గీసి ఉంటారని ఒక అంచనా. కాని రాతి నేల మీద 4 అంగుళాల లోతు తవ్వి తీర్చిదిద్దినట్టు అంత పెద్ద బొమ్మలు గీయాలంటే చాలా కష్టం. అందుకే ఈ బొమ్మలు ఒక మిస్టరీగా మారాయి. వీటిలో కొన్ని బొమ్మలు 370 మీటర్ల పొడవు ఉన్నాయి. 1920లో మొదటిసారి ఈ రేఖలు లోకానికి తెలిశాయి. అప్పటి నుంచి వీటి పై పరిశోధనలు సాగుతూనే ఉన్నాయి. ఈ ప్రాంతంలో గాలి, వాన రెండూ ఉండవు కనుక ఈ బొమ్మలు ఇప్పటి వరకూ చెక్కు చెదరలేదు. అయితే ఈ బొమ్మలు అంతరిక్ష జీవులు గీసి ఉంటాయని కూడా కొందరు భావిస్తారు. ఎందుకంటే ఈ బొమ్మల మధ్యలో ఒక ఎయిర్ స్ట్రిప్ కూడా ఉంది. అంటే అంతరిక్ష నౌక నేరుగా వచ్చి దిగేలా అన్నమాట. ఆకాశం నుంచి అంతరిక్ష జీవులు తమ నౌకలను దించి వెళ్లడానికి గీసిన హెలిపాడ్‌ల వంటివి ఈ బొమ్మలు అని కొందరు అంటారు. అదేం కాదు దేవతలు ఆకాశం నుంచి తమను చూడటానికి ఆదివాసులు ఈ బొమ్మలు గీసి ఉంటారని ఒక పరిశీలన. ఏమైనా ఇటీవల అందుబాటులోకి వచ్చిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో నాస్కా లైన్స్‌ను ఇలా దర్శించారు. మీరూ చూడండి. మీకు అడ్డంగా ఉన్న ఈ బొమ్మలు ఒక్కోటి ఐదంతస్తుల బిల్డింగ్ నుంచి పది అంతస్తుల బిల్డింగ్ అంత ఎత్తు ఉంటాయని గ్రహిస్తే వీటి మిస్టరీ మీకూ ఆశ్చర్యం కలిగిస్తుంది.



ఇంగ్లిష్‌లో మాట్లాడడం, రాయడం మంచిదే. అలా అని మన తల్లి భాషను మరవకూడదు. ఇక్కడ ఉన్న పదాలు మీకు తెలియపోతే తెలుసుకోండి. రాతలోనో, మాటలలోనో వాడితే అది మీ సొంతం అవుతుంది.

ఈ వారం కొన్ని పదాలు...

మేనీ	కాంతి
మొరప నేల	రాతి నేల
అసి	కత్తి, ఖడ్గం
అసము	అహంకారం, దర్పం
అసహాయశూరుడు	ఒంటరిగా నిలిచి పోరాడే యోధుడు
అహరహము	ప్రతి దినం
అహర్పతి	సూర్యుడు
అంజనము	కాటుక
ఆకాశరామన్న	ఊరు పేరు లేని మనిషి
ఆకాశపురాణం	పరస్పరం సంబంధం లేని ప్రసంగం
నీలకంఠుడు	శివుడు
నెమరు	వెదకు
నెయ్యం	స్నేహం

బుజ్జి హిప్పో

హిప్పోను తెలుగులో ఏమంటారు? నీటి ఏనుగు. ఇది ఉభయచర జీవి. అంటే? నీళ్లలోనూ నేల మీదా ఉండగలదు. ఒక హిప్పో దాదాపు 3 వేల కిలోల బరువుటుంది. ఐదు అడుగుల ఎత్తు, పది అడుగుల పొడవు వరకూ ఉంటుంది. కాని మీరు ఇక్కడ చూస్తున్నది పిగ్మి హిప్పో. అంటే మరుగుజ్జు హిప్పో. దీని పేరు మూడెంగ్. థాయ్‌లాండ్‌లోని ఒక జూలో ఉంటుంది. ఇది ఒక కుక్కపిల్లంత ఉండి పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పశ్చిమ ఆఫ్రికాలోని లైబేరియా దేశంలో ఇవి విస్తారంగా కనిపిస్తాయి.



కథ


మంచి వాళ్లకు మంచే జరుగుతుంది



ఒక వూరిలో ముగ్గురు యువకులు వుండేవారు. వాళ్ళు పేదోళ్ళు. కానీ మంచోళ్ళు. చదువు పూర్తయ్యాక రాజు దగ్గర ఏదయినా కొలువు సంపాదించాలని బైలుదేరినారు. అడవిలో పోతా వుంటే వాళ్ళకి చెట్టు కింద ఒక ముసలామె ఒంటరిగా దిగులుగా కనబడింది.

వీళ్ళు ముగ్గురూ ఆగి ''ఏమవ్వా ఏమయింది. ఎందుకలా బాధపడతా వున్నావు. మేమేదైనా సాయం చేయగలమా'' అన్నారు.

దానికా ముసలామె ''ఏం చేద్దాం నాయనా... నాకు నలుగురు పిల్లలు. అందరికీ అన్నీ చేసి పెంచి పెద్ద చేశాను. ఇప్పుడు ముసలిదాన్ని అయిపోయినా గదా... దాంతో వాళ్ళు కొంచంగూడా జాలీ, దయా లేకుండా నన్ను తీసుకోనొచ్చి ఈ అడవిలో ఒంటరిగా వదిలేసి పోయినారు'' అని చెప్పింది.



''అయ్యో... అవ్వా... మాతో రా. ఉన్నదేదో పెట్టి నిన్ను చూసుకుంటాం'' అన్నారు ఆ ముగ్గురు.

దానికా ముసలామె నవ్వి ''ఏదో మాట వరసకి అలా అంటా వున్నారు గానీ నిజంగా ఈ ముసలి దాన్ని ఎవరు చూసుకుంటారు నాయనా'' అనింది.

అందుకు ఆ ముగ్గురూ నవ్వి ''అవ్వా... మాకు నువ్వేం బరువు కాదు. అనాథలమైన మేము ఎవరో ఒకరు చేరదీయబట్టే గదా ఈ రోజు ఇలా వున్నది. నువ్వు మనసులో ఎటువంటి అనుమానం పెట్టుకోకుండా మా వెంబడిరా'' అంటా ఆమెను పిలుచుకోని పోయినారు.

ముగ్గురూ రాజు దగ్గర ఒక చిన్న కొలువు సంపాదించినారు. మనలాగే లోకంలో పేద వాళ్ళు, అనాథలు చానామంది వున్నారు. వాళ్ళకు కనీసం చదువన్నా చెబుదాం అనుకుంటా ఒక ఉచిత పాఠశాల పెట్టినారు. అవ్వను పువ్వుల్లో పెట్టుకోని చూడసాగినారు.

అలా ఆరు నెలలు గడిచిపోయినాయి. ఒకరోజు పొద్దున అవ్వ ఎక్కడా కనబడలేదు. వూరంతా వెదికినారు. ఎవరినడిగినా మాకు తెలీదంటే మాకు తెలీదన్నారు. కళ్ళనీళ్ళతో అవ్వ గదికి చేరుకున్నారు. అక్కడ మంచం కింద ఒక పెద్ద మూట, దానిపైన ఒక ఉత్తరం కనిపించినాయి. విప్పి చూసినారు.

అందులో ''నాయనలారా... మీకు నా ఆశీస్సులు. నేను మీకు నాకు నలుగురు కొడుకులు వున్నారని, వాళ్ళు అడవిలో వదిలేశారని అబద్ధం చెప్పినాను. నాకు అసలు పిల్లలే లేరు. నా భర్త కూడా ఇటీవలే చనిపోయినాడు. నాకు పదితరాలు తిన్నా తరగనంత ధనముంది. దాన్ని ఏం చేయాలో తోచక భూములన్నీ అమ్మేసి బంగారం కొన్నా. దాన్ని ఎవరైనా మంచివాళ్ళకి, పదిమందికి సాయం చేసేటోళ్ళకి అప్పగించి కాశీకి పోయి హాయిగా గడపాలనుకున్నా. దాంతో అలా ఒంటరిగా అడవిలో కూచున్నా. కొందరు చూసీ చూడనట్టు పోతే మరి కొందరు అన్నీ విని చేతిలో ఎంతో కొంత ధనం పెట్టి పోయినారు. అంతేగానీ మీలాగా వెంటబెట్టుకు వెళతాం అన్నవారు లేరు. మీరు నన్ను నెత్తిన పెట్టుకోని చూసుకున్నారు. ఈ ఆరునెలలూ మీ మంచితనం గూడా గమనించినాను. మీలాంటోళ్ళ చేతుల్లో పెడితే పదిమందికీ ఉపయోగపడుతుంది. మీరు ఈ బంగారంతో హాయిగా బతుకుతా పదిమందికి సేవ చేయండి. నా కోసం వెదకొద్దు'' అని వుంది.



వాళ్ళు ఆ మూట విప్పితే నిండా బంగారు నగలు కనబడ్డాయి. వాళ్ళు వెంటనే అదంతా అమ్మేసి ఆమె పేరు మీదే ఒక బడి పెట్టి అందరికీ ఉచితంగా చదువు చెప్పడం మొదలుపెట్టినారు.

- డా.ఎం.హరికిషన్,
కర్నూలు

బిజినెస్ రీల్



తాష్కెంట్‌లో భారత్-ఉజ్బెకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందంపై సంతకం చేస్తున్న సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

పసిడి ఢిల్లీలో హ్యాట్రిక్..



న్యూఢిల్లీ: పసిడి ధర దేశ రాజధానిలో వరుసగా మూడవరోజూ పెరిగాయి. 99.9 స్వచ్ఛత ధర రూ.50 పెరిగి రూ.78,300 స్థాయిని చేరింది. ఇక వెండి రూ.500 ఎగసి రూ.94,500కు చేరింది. అయితే అటు అంతర్జాతీయంగా, ఇటు దేశీయంగా పలు మార్కెట్లలో పసిడి ర్యాలీకి విరామం కనబడింది.

ట్రినిడాడ్‌కు ఎన్‌పీసీఐ సేవలు

న్యూఢిల్లీ: ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్) తాజాగా ట్రినిడాడ్ మరియు టొబాగో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ మంత్రిత్వ శాఖతో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) మాదిరిగానే రియల్ టైమ్ పేమెంట్స్ ప్లాట్‌ఫామ్‌ను ఎన్ఐపీఎల్ అభివృద్ధి చేయనుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన యూపీఐని స్వీకరించిన మొదటి కరేబియన్ దేశంగా ట్రినిడాడ్ మరియు టొబాగో నిలిచిందని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) తెలిపింది.

బిజినెస్ క్లాస్ ఛార్జీలపై తగ్గింపు: మేక్‌మైట్రిప్



ముంబై: అంతర్జాతీయ బిజినెస్ క్లాస్ ప్రయాణాన్ని పెంచడానికి ప్రముఖ విమానయాన సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఆన్‌లైన్ ట్రావెల్ కంపెనీ మేక్‌మైట్రిప్ శుక్రవారం తెలిపింది. వీటిలో ఎయిర్ అస్తానా, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, మలేషియా ఎయిర్‌లైన్స్, ఒమన్ ఎయిర్, క్వాంటస్, సింగపూర్ ఎయిర్‌లైన్స్, టర్కిష్ ఎయిర్‌లైన్స్, వర్జిన్ అట్లాంటిక్, విస్తారా ఉన్నాయి. ఈ సంస్థలు మేక్‌మైట్రిప్ ప్లాట్‌ఫామ్‌లో సెప్టెంబర్ 27 నుండి అక్టోబర్ 2 వరకు బిజినెస్ క్లాస్ ఛార్జీలపై 20 శాతం వరకు తగ్గింపును అందిస్తాయి. ఐసీఐసీఐ బ్యాంక్ కార్డ్ వినియోగదార్లు అదనంగా రూ.10,000 తగ్గింపును పొందవచ్చని కంపెనీ ప్రకటించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-9-2024	
విశాఖ	530-00
చిత్తూరు	543-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	530-00
విజయవాడ	530-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	505-00
వరంగల్	507-00
రిటైల్ ధర	5.65

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BPCL	366.6	6.23
CIPLA	1,674.50	3.25
SUNPHARMA	1,945.00	2.45
DIVISLAB	5,506.40	2.36
RELIANCE	3,047.05	1.71

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
POWERGRID	354.65	-2.96
BHARTIARTL	1,737.00	-1.93
HDFCBANK	1,753.00	-1.71
ICICIBANK	1,306.50	-1.7
HEROMOTOCO	5,955.05	-1.59

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	10,352
ఎన్ఎస్ఈ	1,72,476
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,33,576
ఎఫ్ఐఐ	- 1,209
డీఐఐ	+ 6,887

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	67.73	$ 67.67
బ్రెంట్	71.09	$ 71.09

సోనాలికా చిన్న కార్లు!

1-2 ఏళ్లలో ఈ-క్వాడ్రిసైకిల్ రాక ● తొలుత యూరప్‌కు ఎగుమతి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ట్రాక్టర్ల ఎగుమతుల్లో అతిపెద్ద భారతీయ సంస్థ సోనాలికా ట్రాక్టర్స్ త్వరలో ఎలక్ట్రిక్ క్వాడ్రిసైకిల్ (చిన్న కార్లు) విభాగంలోకి ఎంట్రీ ఇస్తోంది. తొలుత యూరప్‌కు వీటిని ఎగుమతి చేయాలన్నది సంస్థ ఆలోచన. ప్రముఖ ఇంజనీరింగ్ సంస్థతో కలిసి ఇప్పటికే ప్రోటోటైప్‌కు రూపకల్పన చేసినట్టు పంజాబ్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న సోనాలికా వెల్లడించింది. ఒకట్రెండేళ్లలో ఎలక్ట్రిక్ క్వాడ్రిసైకిల్ నెదర్లాండ్స్ రోడ్లపై పరుగు తీయనుందని తెలిపింది. ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు, ఎలక్ట్రిక్ క్వాడ్రిసైకిల్ అభివృద్ధి, ఈవీ ప్లాంటుకై సంస్థ రూ.1,000 కోట్లు పెట్టుబడి చేయనుంది. ఈ కొత్త మోడల్ పూర్తిగా సంస్థకు చెందిన మూడవ అత్యాధునిక, నూతన ఈవీ ఫ్యాక్టరీలో తయారు కానుంది. ఈవీ క్వాడ్రిసైకిల్‌తో పాటు సోనాలికా ఇదే ప్లాంటులో ఎలక్ట్రిక్ ట్రాక్టర్లను కూడా ఉత్పత్తి చేయనుంది. మూడవ ప్లాంటు ఉత్తరాదిన కొలువుదీరనుంది.

నడపడం సులభం..

యూరప్‌లో ఆదరణ లభిస్తున్నందున ఎలక్ట్రిక్ మైక్రోకార్ల విభాగంలోకి ప్రవేశించడానికి ఇదే సరైన సమయమని సోనాలికా గ్రూప్ అభిప్రాయపడింది. 'ఇవి సంప్రదాయ కార్ల కంటే చాలా చిన్నవి. తేలికైనవి కూడా. రద్దీగా ఉండే వీధుల్లో పార్క్ చేయడం, నడపడం సులభం' అని కంపెనీ వివరించింది. మైక్రోకార్లు వాటి చిన్న సైజు, పార్కింగ్ సౌలభ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రతి యూరోపియన్ దేశానికి అవసరమయ్యేవి అని అభిప్రాయపడింది. భారత్ మాదిరిగా కాకుండా పాశ్చాత్య దేశాలలో ప్రవేశ స్థాయి/చిన్న కార్ల ధరలను నిర్ణయించడం సవాలు కాదని తెలిపింది. కాగా, ట్రాక్టర్ల ఎగుమతుల పరంగా 34.3 శాతం వాటాతో సోనాలికా భారత్‌లో అగ్రస్థానంలో నిలిచింది. దేశీయ మార్కెట్లో కంపెనీకి 13.5 శాతం వాటా ఉంది.

నిర్ధారిత ధరతో ఇక డీలిస్టింగ్

సెబీ డీలిస్టింగ్ నిబంధనల సవరణ



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా స్వచ్ఛంద డీలిస్టింగ్ నిబంధనలను సవరించింది. దీనిలో భాగంగా నిర్ధారిత(ఫిక్స్‌డ్) ధర విధానం ద్వారా షేర్ల డీలిస్టింగ్‌కు వీలు కల్పించనుంది. వెరసి రివర్స్ బుక్‌బిల్డింగ్(ఆర్‌బీబీ) పద్ధతిలో ప్రత్యామ్నాయానికి తెరతీసింది. దీంతో లిస్టెడ్ కంపెనీలకు సులభతర బిజినెస్ నిర్వహణలో మరింత తోడ్పాటు లభించనుంది. ఆర్‌బీబీ విధానంలో ఏదైనా సంస్థ షేర్లను డీలిస్ట్ చేయదలచుకుంటే తలుత పబ్లిక్ అనౌన్స్‌మెంట్ చేయవలసి ఉంటుంది. ఇందుకు తప్పనిసరిగా కనీస ఫ్లోర్ ధరను నిర్ణయించవలసి ఉంటుంది. తదుపరి వాటాదారులు షేర్లను ఆఫర్ చేసేందుకు వీలుంటుంది. తాజా నోటిఫికేషన్‌లో సెబీ ఫిక్స్‌డ్ ధర విధానం ద్వారా ఆర్‌బీబీ విధానంలో ప్రత్యామ్నాయానికి వీలు కల్పించింది. తరచుగా ట్రేడయ్యే షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి డీలిస్టింగ్ చేసేందుకు కంపెనీలు ఫ్లోర్ ధర కంటే కనీసం 15 శాతం ప్రీమియంను ఆఫర్ చేయవలసి ఉంటుంది. మరోపక్క ఆర్‌బీబీ పద్ధతిలో చేపట్టే డీలిస్టింగ్‌కు సంబంధించి కౌంటర్ ఆఫర్ విధానంలోనూ సెబీ సవరణలు చేసింది. పబ్లిక్ వాటాలో కనీసం 50 శాతం టెండర్ అయితే ప్రస్తుత 90 శాతానికికాకుండా 75 శాతానికి కౌంటర్ ఆఫర్ ప్రకటించవచ్చు. అయితే కౌంటర్ ఆఫర్ ధర టెండర్ అయిన షేర్ల సగటు పరిమాణ అధిక ధర కంటే తక్కువగా ఉండటాన్ని అంగీకరించరు. వెరసి కొనుగోలుదారుడు ఆఫర్ చేసిన సంకేత ధరను మించి ప్రకటించవలసి ఉంటుంది. ఆఫర్ తదుపరి కొనుగోలుదారుడి వాటా 90 శాతానికి చేరుకుంటేనే డీలిస్టింగ్‌కు అనుమతిస్తారు.

ఎక్స్ఛేంజీల్లో 1 నుంచి లావాదేవీ చార్జీల్లో మార్పులు

మార్కెట్ ఇన్‌ఫ్రా సంస్థల సభ్యులందరికీ ఒకే రకమైన రుసుముల విధానాన్ని అమలు చేయాలంటూ సెబీ ఆదేశించిన నేపథ్యంలో బీఎస్ఈ, ఎన్ఎస్ఈ తాజాగా క్యాష్, ఫ్యూచర్ అండ్ ఆప్షన్ల ట్రేడింగ్‌పై లావాదేవీ ఫీజులను సవరించాయి. ఇవి అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయి. ఈక్విటీ డెరివేటివ్స్ సెగ్మెంట్‌లో సెన్సెక్స్, బ్యాంకెక్స్ ఆప్షన్స్ కాంట్రాక్టులపై ట్రాన్సాక్షన్ ఫీజును రూ. 1 కోటి ప్రీమియం టర్నోవరుపై రూ. 3,250గా బీఎస్ఈ నిర్ణయించింది. అయితే, ఈక్విటీ డెరివేటివ్స్‌లోని మిగతా కాంట్రాక్టులకు చార్జీల్లో ఎలాంటి మార్పులు ఉండవు. మరోవైపు ఎన్ఎస్ఈలో క్యాష్ మార్కెట్‌కి సంబంధించి రూ. 1 లక్ష విలువ చేసే ట్రేడ్‌కి చార్జీలు రూ. 2.97గా ఉంటాయి. ఈక్విటీ ఫ్యూచర్స్‌కి ఈ రుసుము రూ. 1 లక్షకి రూ. 1.73గాను, ఈక్విటీ ఆప్షన్ల విషయంలో రూ. 1 లక్ష ప్రీమియం విలువపై రూ. 35.03గాను ఉంటుంది. కరెన్సీ డెరివేటివ్స్ సెగ్మెంట్‌లో ఫ్యూచర్స్‌కి సంబంధించి లక్ష ట్రేడ్ వేల్యూకి రూ. 0.35 ఫీజు ఉంటుంది.

రంగు చూసి ఫండ్స్‌లో రిస్క్ తెలుసుకోవచ్చు

ఈ దిశగా కొత్త ప్రతిపాదనలు తెచ్చిన సెబీ

వివిధ రకాల మ్యూచువల్ ఫండ్స్ ఎంపిక ముందు ఇన్వెస్టర్లు సరైన నిర్ణయం తీసుకునేందుకు వీలుగా సెబీ కొన్ని కీలక ప్రతిపాదనలు రూపొందించింది. ఒక మ్యూచువల్ ఫండ్ పథకానికి సంబంధించి రిస్క్‌ను సూచించే 'రిస్క్-ఓ-మీటర్' రంగుల థీమ్‌తోనూ ఉండాలన్నది సెబీ ప్రతిపాదన. మ్యూచువల్ ఫండ్స్ పథకాలకు సంబంధించి రిస్క్-ఓ-మీటర్‌ను ఆరు స్థాయిల్లో తెలియజేయడం తప్పనిసరి. ప్రస్తుతం లో(తక్కువ), లో టు మోడరేట్ (తక్కువ నుంచి మోస్తరు), మోడరేట్ (మోస్తరు), మోడరేట్‌లీ హై (కొంచెం ఎక్కువ), హై (ఎక్కువ), వెరీ హై (మరీ ఎక్కువ)గా అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీలు/ఫండ్స్ నిర్వహణ సంస్థలు) తెలియజేస్తున్నాయి. ఇప్పుడు తక్కువ రిస్క్‌కు ఆకుపచ్చ, తక్కువ నుంచి మోస్తరు రిస్క్‌కు ముదురు చిలకపచ్చ, మోస్తరు రిస్క్‌కు లేత చిలకపచ్చ (నియాన్ ఎల్లో), కొంచెం ఎక్కువ రిస్క్‌కు కాఫీ రంగు (క్యారామెల్), అధిక రిస్క్‌కు చిక్కటి నారింజ రంగు, అధిక రిస్క్‌కు ఎర్రటి రంగును సూచించాలన్నది సెబీ ప్రతిపాదన. ఎక్స్‌పెన్స్ రేషియో, రాబడులు అన్నవి ఒకే పథకానికి సంబంధించి డైరెక్ట్, రెగ్యులర్ ప్లాన్లలో వేర్వేరుగా ఉండడంతో.. ఈ రెండు రకాల ప్లాన్లకు సంబంధించి అన్ని వివరాలు ప్రదర్శించాలంటూ సెబీ మరో ప్రతిపాదన చేసింది. వీటిపై అక్టోబర్ 18 వరకు ప్రజల నుంచి సలహా, సూచనలను సెబీ ఆహ్వానించింది.

స్విగ్గీ ఐపీవో సన్నాహాలు

● సెబీకి తాజా దరఖాస్తు దాఖలు
● రూ. 10,000 కోట్లకుపైగా సమీకరణ!



న్యూఢిల్లీ: ఫుడ్ అండ్ గ్రోసరీ డెలివరీ దిగ్గజం స్విగ్గీ పబ్లిక్ ఇష్యూ సన్నాహాలు ప్రారంభించింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సవరించిన ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 3,750 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 18.52 కోట్ల(అంచనా విలువ రూ. 6,665 కోట్లు) షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి రూ. 10,000 కోట్లకుపైగా సమీకరించే వీలున్నట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇంతక్రితం స్విగ్గీ దాఖలు చేసిన రహస్య దరఖాస్తుకు ఈ వారం మొదట్లో సెబీ ఆమోదముద్ర వేసిన సంగతి తెలిసిందే. కాన్ఫిడెన్షియల్ విధానంలో స్విగ్గీ ఏప్రిల్ 30న సెబీకి తొలుత దరఖాస్తు చేసింది. దీని తదుపరి తిరిగి అప్‌డేటెడ్ ఫైలింగ్ చేయవలసి ఉంటుంది. మూడు వారాలపాటు వీటిపై పబ్లిక్ నుంచి అభిప్రాయ సేకరణ జరుగుతుంది. ఆపై మరోసారి అప్‌డేటెడ్ సమాచారంతో దరఖాస్తు చేయవలసి ఉంటుంది. ఈ బాటలో రెండోసారి దరఖాస్తు చేశాక ఐపీవో చేపట్టేందుకు వీలుంటుందని మార్కెట్ వర్గాలు తెలియజేశాయి.

నిధుల వినియోగమిలా

ఐపీవో ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 137 కోట్లను అనుబంధ సంస్థ స్కూట్‌సీ రుణ చెల్లింపులకు, మరో రూ. 982 కోట్లు క్విక్ కామర్స్ విస్తరణలో భాగంగా డార్క్ స్టోర్ నెట్‌వర్క్ విస్తరణకు స్విగ్గీ వినియోగించనుంది. ఈ బాటలో రూ. 586 కోట్లు టెక్నాలజీ, క్లౌడ్ మౌలికసదుపాయాలకు, రూ. 930 కోట్లు బ్రాండ్ మార్కెటింగ్‌పైనా వెచ్చించనుంది. 2014లో ఏర్పాటైన స్విగ్గీ 2024 ఏప్రిల్‌కల్లా 13 బిలియన్ డాలర్ల విలువను సాధించింది.

ఎన్‌సీఎస్ పోర్టల్‌లో అమెజాన్ జాబ్స్



అవగాహనా ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ, డీజీజీ (ఉపాధి) అమిత్ నిర్మల్, అమెజాన్ పబ్లిక్ పాలసీ డైరెక్టర్ అమన్ జైన్

న్యూఢిల్లీ: ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ ఉద్యోగావకాశాల వివరాలు ఇక నుంచి నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) పోర్టల్‌లో దర్శనమీయనున్నాయి. కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖతో అమెజాన్ రెండేళ్ల కాలానికి ఒప్పందం చేసుకుంది. ఎన్‌సీఎస్ పోర్టల్‌లో నమోదైన అభ్యర్థులు అమెజాన్ చేపడుతున్న నియామకాల వివరాలు తెలుసుకోవడంతో పాటు దరఖాస్తు చేసుకోవచ్చు. మోడల్ కెరీర్ సెంటర్స్ వద్ద జాబ్ ఫెయిర్స్ సైతం కంపెనీ నిర్వహించనుంది. ఇందుకు మంత్రిత్వ శాఖ సాయం చేయనుంది. ఇలా ఒప్పందం చేసుకున్న తొలి ఈ-కామర్స్ కంపెనీ తామేనని అమెజాన్ తెలిపింది. ఎన్‌సీఎస్ పోర్టల్‌లో ప్రస్తుతం 60 లక్షల పైచిలుకు ఉద్యోగార్థులు, 33.5 లక్షల కంపెనీలు సభ్యులుగా ఉన్నాయి. ప్రతిభను పెంపొందించడంలో అమెజాన్ నిబద్ధత దేశంలోని యువతకు కొత్త ఉపాధి అవకాశాలను అందిస్తుందని విశ్వసిస్తున్నామని కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రి మన్సుఖ్ మండావియా అన్నారు.

భారత్‌లో సిస్కో ప్లాంట్

చెన్నైలో ప్రారంభించిన కంపెనీ



చెన్నై ప్లాంట్‌లో కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సిస్కో సీఈవో చక్ రాబిన్స్ తదితర ముఖ్య సభ్యులు

చెన్నై: డిజిటల్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీలో ఉన్న యూఎస్ దిగ్గజం సిస్కో తాజాగా భారత్‌లో తొలి ప్లాంటును ప్రారంభించింది. చెన్నైలోని ఈ కేంద్రంలో రూటింగ్, స్విచింగ్ ఉత్పత్తులను తయారు చేస్తారు. ఈ ఫెసిలిటీ ద్వారా తమిళనాడులో 1,200 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని కంపెనీ శుక్రవారం ప్రకటించింది. ఎగుమతులతో కలుపుకుని ఏటా 1.3 బిలియన్ డాలర్ల ఆదాయ నమోదుకు అవకాశం ఉందని వెల్లడించింది. చెన్నైలో తయారీ కేంద్రాన్ని నిర్మించడానికి, విస్తరణకు ఫ్లెక్స్‌తో సిస్కో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇది ప్రారంభంలో సిస్కో నెట్‌వర్క్ కన్వర్జెన్స్ సిస్టమ్-540 సిరీస్ రూటర్ల తయారీపై దృష్టి పెడుతుంది. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చేతుల మీదుగా ప్లాంటు ప్రారంభం అయింది.

డాక్టర్ రెడ్డీస్‌కు జరిమానా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మెక్సికో ఔషధ నియంత్రణ సంస్థ తమ కంపెనీకి సుమారు రూ.28 లక్షల జరిమానా విధించినట్లు డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ గురువారం తెలిపింది. ఒక యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియెంట్ రెఫరెన్స్ స్టాండర్డ్ ఇంపోర్ట్‌కు సంబంధించిన సమాచారాన్ని దాఖలు చేయడానికి సూచించిన మార్గదర్శకాలను ఉల్లంఘించినందుకు ఈ జరిమానా విధించిందని వెల్లడించింది. డ్రగ్ రెఫరెన్స్ స్టాండర్డ్ లేదా ఫార్మాస్యూటికల్ రెఫరెన్స్ స్టాండర్డ్ అనేది ఔషధ వినియోగం, ఔషధ ఉత్పత్తుల కోసం పదార్థాల గుర్తింపు, బలం, నాణ్యత, స్వచ్ఛతను పరీక్షించడానికి అనువైన అధిక లక్షణాలు కలిగిన పదార్థం.

పీఎన్‌బీ నిధుల సమీకరణ

క్విప్ ద్వారా రూ. 5,000 కోట్లు



న్యూఢిల్లీ: పీఎస్‌యూ దిగ్గజం పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్) ద్వారా రూ. 5,000 కోట్లు సమీకరించింది. క్విప్‌లో భాగంగా షేరుకి రూ. 103.75 ధరలో 48.19 కోట్ల ఈక్విటీ షేర్లను కేటాయించింది. ఫ్లోర్ ధర రూ. 109.16తో పోలిస్తే ఇది 5 శాతం డిస్కౌంట్‌గా పీఎన్‌బీ పేర్కొంది. ఈ నెల 23-26 మధ్య క్విప్ సబ్‌స్క్రిప్షన్ పూర్తయినట్లు వెల్లడించింది. మ్యూచువల్ ఫండ్స్, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు, బీమా కంపెనీలు తదితర అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) నుంచి రూ. 41,734 కోట్ల విలువైన బిడ్స్ దాఖలైనట్లు తెలియజేసింది. ఇవి క్విప్ ప్రాథమిక పరిమాణం రూ. 2,500 కోట్లకు 16.7 రెట్లు అధికంకాగా.. మొత్తం సమీకరణ పరిమాణం రూ. 5,000 కోట్లకు 8.3 రెట్లు అధికమని వివరించింది. క్విప్ నిధులను బ్యాంక్ సీఈటీ-1 నిష్పత్తి మెరుగుకు, కనీస మూలధన నిష్పత్తి పటిష్టతకు వినియోగించనున్నట్లు పేర్కొంది.

బీఎస్ఈలో పీఎన్‌బీ షేరు 2 శాతం ఎగసి రూ. 109 వద్ద ముగిసింది.

రికార్డు స్థాయిలకు ఫారెక్స్

692.29 బిలియన్ డాలర్లకు అప్



ముంబై: ఒకవారం విరామం తర్వాత భారత్ విదేశీ మారకద్రవ్య (ఫారెక్స్) నిల్వలు రికార్డు స్థాయిని చేరాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గణాంకాల ప్రకారం సెప్టెంబర్ 20వ తేదీతో ముగిసిన వారంలో అంతక్రితం వారంతో పోల్చితే 2.838 బిలియన్ డాలర్లు పెరిగి 692.29 బిలియన్ డాలర్లకు చేరాయి. ఫారెక్స్ నిల్వలు ఈ నెల 13వ తేదీతో ముగిసిన వారంలో కొంత వెనక్కుతగ్గినా, అంతక్రితం వరుసగా రెండు వారాలూ రికార్డు బాటన కొనసాగాయి.

అన్ని విభాగాల్లోనూ పురోగతి..

→ డాలర్ల రూపంలో పేర్కొనే ఫారిన్ కరెన్సీ అసెట్స్ సమీక్షా వారంలో 2.057 బిలియన్ డాలర్లు పెరిగి 605.686 బిలియన్ డాలర్లకు ఎగసింది.

→ పసిడి నిల్వలు 726 మిలియన్ డాలర్లు పెరిగి 63.613 బిలియన్ డాలర్లకు చేరాయి.

→ ఐఎంఎఫ్ వద్ద స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్) విలువ 121 మిలియన్ డాలర్లు పెరిగి 18.54 బిలియన్ డాలర్లకు ఎగసింది.

→ అయితే ఐఎంఎఫ్ వద్ద నిల్వల పరిమాణం 66 మిలియన్ డాలర్లు తగ్గి 4.458 బిలియన్ డాలర్లకు దిగివచ్చాయి.

టెక్స్‌టైల్ రంగంలో 6 కోట్ల ఉద్యోగాలు!

● 2030 నాటికి కల్పించేందుకు రోడ్‌మ్యాప్
● కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ వెల్లడి



న్యూఢిల్లీ: టెక్స్‌టైల్ రంగంలో దేశంలో 2030 నాటికి 4.5-6 కోట్ల ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం రోడ్‌మ్యాప్ సిద్ధం చేసిందని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ శుక్రవారం తెలిపారు. ఈ రంగ మార్కెట్ పరిమాణాన్ని ప్రస్తుతం ఉన్న దాదాపు 165 బిలియన్ డాలర్ల నుంచి 350 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. జౌళి మంత్రిత్వ శాఖ యొక్క 100 రోజుల కార్యక్రమంపై విలేకరుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. 'వస్త్ర రంగంలో లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడం లక్ష్యంగా 100 రోజుల రోడ్ మ్యాప్ సిద్ధం చేశాం. గతంలో ఆమోదించిన ఏడు పీఎం-మిత్ర ఇంటిగ్రేటెడ్ మెగా టెక్స్‌టైల్ పార్కులు పూర్తిగా పని చేస్తే రూ.70,000 కోట్ల పెట్టుబడులు, తద్వారా 21 లక్షల ఉద్యోగాలు వస్తాయి. రాబోయే రోజుల్లో 350 బిలియన్ డాలర్ల పరిమాణాన్ని చేరుకోవడానికి మానవ తయారీ వస్త్రం అవసరం. అది సింథటిక్, విస్కోస్ లేదా సహజ ఫైబర్ అయినా మేము అన్నింటికీ కార్యాచరణ సిద్ధం చేస్తున్నాము. ప్రపంచవ్యాప్తంగా 350 బ్రాండ్లు భారత్ నుంచి వస్త్రాలను కొనుగోలు చేస్తున్నాయి. టెక్స్‌టైల్స్ రంగంలో మేక్ ఇన్ ఇండియాను ప్రోత్సహించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. బంగ్లాదేశ్ లేదా వియత్నాం దేశీయ వస్త్ర పరిశ్రమకు ఏమాత్రం సవాల్ కాదు' అని మంత్రి వివరించారు.

100 స్టోర్స్ ఏర్పాటులో ది ఆర్గానిక్ వరల్డ్

హైదరాబాద్: నిమిదా గ్రూప్‌లో భాగమైన ది ఆర్గానిక్ వరల్డ్ వచ్చే ఏడాది ఆఖరు నాటికి 100 స్టోర్స్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలో కొత్తగా హైదరాబాద్ మార్కెట్లో స్టోర్‌ను ప్రారంభించింది. ఇందులో 3,000 పైచిలుకు రసాయనరహిత పండ్లు, కూరగాయలు, నిత్యావసర ఉత్పత్తులు మొదలైనవి లభిస్తాయని సంస్థ వ్యవస్థాపకుడు గౌరవ్ మన్‌చందా తెలిపారు.

స్టెర్లింగ్ విల్సన్ ప్రమోటర్ల వాటా విక్రయం

7.14 % వాటాకు రూ. 1,040 కోట్లు



న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన కంపెనీ స్టెర్లింగ్ విల్సన్ రెనెవబుల్ ఎనర్జీ ప్రమోటర్లు తాజాగా 7.14 శాతం వాటాను విక్రయించారు. ఎన్ఎస్ఈ బల్క్ డీల్ వివరాల ప్రకారం షాపూర్‌జీ పల్లోంజీ అండ్ కంపెనీ 5.78 శాతం వాటాను అమ్మివేసింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా 1.35 కోట్ల షేర్లను ఆఫ్‌లోడ్ చేసింది. ఈ బాటలో ఖుర్షీద్ యజ్దీ దారువాలా 1.35 శాతం వాటాకు సమానమైన 31.5 లక్షల షేర్లను విక్రయించారు. తద్వారా ప్రమోటర్లు 7.14 శాతం వాటాను షేరుకి రూ. 623.28- రూ. 630 ధరల మధ్య అమ్మివేశారు. ఈ వాటా విలువ దాదాపు రూ. 1,040 కోట్లు. వెరసి సోలార్ ఈపీసీ సొల్యూషన్ల కంపెనీలో షాపూర్‌జీ పల్లోంజీ అండ్ కంపెనీ వాటా 12.73 శాతం నుంచి 6.95 శాతానికి దిగివచ్చింది. దారువాలా వాటా 1.48 శాతం నుంచి 0.13 శాతానికి క్షీణించింది. ఫలితంగా కంపెనీలో ప్రమోటర్ల ఉమ్మడి వాటా 52.91 శాతం నుంచి 45.77 శాతానికి దిగివచ్చింది. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం మోర్గాన్ స్టాన్లీ, సొసైటీ జనరాలి, సిటీగ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ మారిషస్ 2.83 శాతం వాటాకు సమానమై 66 లక్షల షేర్లను కొనుగోలు చేశాయి. ఇందుకు షేరుకి రూ. 623 సగటు ధరలో రూ. 411.2 కోట్లు వెచ్చించాయి. మిగిలిన కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు.

ఎన్ఎస్ఈలో స్టెర్లింగ్ అండ్ విల్సన్ షేరు 1.6% లాభపడి రూ. 653 వద్ద ముగిసింది.

యాక్సెంచర్‌లో జోరుగా నియామకాలు

కంపెనీ సీఈవో జూలీ స్వీట్



న్యూఢిల్లీ: ఐటీ, కన్సల్టింగ్ సేవల దిగ్గజం యాక్సెంచర్ భారత్‌లో గణనీయంగా నియామకాలు చేపట్టనుంది. ప్రధానంగా ఫ్రెషర్స్‌ను తీసుకోవడంపై మరింతగా దృష్టి పెడుతోంది. కంపెనీ సీఈవో జూలీ స్వీట్ ఈ విషయాలు వెల్లడించారు. జెనరేటివ్ ఏఐ (జెన్ఏ) మీద ఫోకస్‌తో తమ సర్వీసులను ఎప్పటికప్పుడు సరికొత్తగా తీర్చిదిద్దుకుంటున్నట్లు ఇన్వెస్టర్లతో సమావేశంలో ఆమె వివరించారు. 2024 ఆర్థిక సంవత్సరంలో తమ వ్యాపార వృద్ధికి ఇదే దోహదపడిందని పేర్కొన్నారు. జెన్ఏఐ సాంకేతికతను ఉపయోగించడంలో సిబ్బందికి విస్తృతంగా శిక్షణనిస్తున్నట్లు జూలీ చెప్పారు. ఐర్లాండ్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న యాక్సెంచర్‌కి భారత్‌లో 3,00,000కు పైగా సిబ్బంది ఉన్నారు. అంతర్జాతీయంగా 7,74,000 మంది పైచిలుకు ఉద్యోగులు ఉన్నారు. 2024 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ 64.90 బిలియన్ డాలర్ల ఆదాయం నమోదు చేసింది. యాక్సెంచర్ సెప్టెంబర్-ఆగస్టు వ్యవధిని ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తుంది.

2047 నాటికి 350 విమానాశ్రయాలు

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి



న్యూఢిల్లీ: 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకున్న నేపథ్యంలో అప్పటికల్లా విమానాశ్రయాల సంఖ్యను 350కి పెంచడంపై దృష్టి పెడుతున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. పర్యాటకాన్ని మరింతగా ప్రోత్సహించనున్నట్లు వివరించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ విషయాలు తెలిపారు. దేశీయంగా కనెక్టివిటీని పెంచడం, విదేశీ పర్యాటకులకు సాదర స్వాగతం పలికేలా ఎయిర్‌పోర్టుల్లో సదుపాయాలను మెరుగుపర్చడం తదితర అంశాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. 'ప్రస్తుతం మనకు 157 విమానాశ్రయాలు ఉన్నాయి. కానీ 2047 నాటికి వికసిత భారత్‌గా ఎదగాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్న నేపథ్యంలో వచ్చే 20-25 ఏళ్లలో విమానాశ్రయాల సంఖ్యను 350కి పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది' అని ఆయన వివరించారు. సీప్లేన్, హెలికాప్టర్ కనెక్టివిటీని కూడా మెరుగుపరుస్తున్నట్లు పేర్కొన్నారు.

అసలు సిసలు 'చాంపియన్'!


బ్రావో

ప్రపంచంలోని ఏ మూల ఫ్రాంచైజీ లీగ్ క్రికెట్ జరుగుతున్నా అందులో అతడు ఉండాల్సిందే! జాతీయ జట్టు మొదలుకొని... విశ్వవ్యాప్తంగా మొత్తం 43 జట్లకు ప్రాతినిధ్యం వహించిన చరిత్ర అతడిది! అటు బౌలర్‌గా ఇటు బ్యాటర్‌గా మైదానంలో ఆల్‌రౌండ్ మెరుపులకు కేరాఫ్ అడ్రస్ అతడు! రెండుసార్లు టి20 ప్రపంచకప్ గెలిచిన జట్టులోనూ సభ్యుడు, పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్, ఫ్రాంచైజీ క్రికెట్‌లో అత్యధిక ట్రోఫీలు సాధించిన ప్లేయర్... ఇలా లెక్కకు మిక్కిలి ఘనతలు సాధించిన అతడే వెస్టిండీస్ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో. రెండు దశాబ్దాలుగా ఏదో ఒక జట్టులో ప్లేయర్‌గా కొనసాగుతున్న డ్వేన్ బ్రావో ఆటగాడిగా తన క్రికెట్ ఇన్నింగ్స్‌కు శుభంకార్డు వేశాడు. ఆట నుంచి వీడ్కోలు తీసుకున్నా ఏదో ఒక హోదాలో ఈ ఆటలోనే కొనసాగేందుకు బ్రావో నిర్ణయం తీసుకున్నాడు. వచ్చే ఐపీఎల్ సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు తరఫున బ్రావో 'మెంటార్' పాత్రలో కనిపించనున్నాడు. రెండు దశాబ్దాలుగా మైదానంలో తన ఆటతీరుతో పాటు ఆటాపాటతోనూ అశేష అభిమానులను సొంతం చేసుకొని ప్లేయర్‌గా రిటైరైన నేపథ్యంలో 'చాంపియన్' బ్రావోపై ప్రత్యేక కథనం. –సాక్షి, క్రీడావిభాగం

- అన్ని రకాల క్రికెట్‌కు వీడ్కోలు ప్రకటించిన డ్వేన్ బ్రావో
- టి20 క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఘనత
- రెండు టి20 ప్రపంచకప్ టైటిల్స్ నెగ్గిన విండీస్ జట్టులో సభ్యుడు

టి20 ఫార్మాట్ ప్రారంభమైనప్పటి నుంచి పొట్టి క్రికెట్‌పై తనదైన ముద్రవేసిన వెస్టిండీస్ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో ఆటలోని అన్ని ఫార్మాట్‌ల నుంచి తప్పుకున్నాడు. మూడేళ్ల క్రితమే జాతీయ జట్టు తరఫున చివరి టి20 మ్యాచ్ ఆడిన బ్రావో... తాజాగా ఫ్రాంచైజీ క్రికెట్‌కు కూడా వీడ్కోలు పలికాడు. కెరీర్‌లో 582 టి20 మ్యాచ్‌లాడిన 41 ఏళ్ల బ్రావో... 631 వికెట్లు పడగొట్టి అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో అగ్రస్థానంలో నిలిచాడు. అఫ్గానిస్తాన్ స్పిన్ స్టార్ రషీద్ ఖాన్ 613 వికెట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) నుంచి తప్పుకునే సమయానికి 183 వికెట్లతో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఘనత సాధించిన బ్రావో... వచ్చే సీజన్ నుంచి 'మెంటార్'గా దర్శనమివ్వనున్నాడు. ఐపీఎల్‌లో అపార అనుభవం ఉన్న బ్రావో... డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు మెంటార్‌గా వ్యవహరించనున్నట్లు వెల్లడించాడు. డెత్ ఓవర్స్ స్పెషలిస్ట్‌గా గుర్తింపు సాధించిన బ్రావో... టి20ల్లో చివరి నాలుగు (17 నుంచి 20) ఓవర్లలో 322 వికెట్లు పడగొట్టి ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. ఇంగ్లండ్ పేసర్ క్రిస్ జోర్డాన్ డెత్ ఓవర్స్‌లో 201 వికెట్లు తీసి రెండో స్థానంలో ఉన్నాడు.



చెన్నై చిన్నోడు!

ఐపీఎల్ ఆరంభం నుంచి వివిధ జట్లకు ప్రాతినిధ్యం వహించిన బ్రావో... 2011 నుంచి చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చాడు. మహేంద్ర సింగ్ ధోని సారథ్యంలో ఆడటాన్ని ఎంతగానో ఇష్టపడే బ్రావో... సుదీర్ఘ కాలం పాటు చెన్నై ప్రధాన బౌలర్‌గా కొనసాగాడు. ప్రత్యర్థి ప్లేయర్లు భారీ షాట్లు కొడుతున్న ప్రతిసారీ ధోని బంతిని బ్రావో వైపు విసిరే వాడంటే... అతడిపై మహీకి ఉన్న నమ్మకమేంటో అర్థం చేసుకోవచ్చు. ఇతర లీగ్‌లతో పోల్చుకుంటే ఐపీఎల్‌లో తన బౌలింగ్‌తోనే ఎక్కువ ఆదరణ పొందిన బ్రావో... అత్యుత్తమ ఫీల్డర్ అనడంలో సందేహం లేదు. సర్కిల్‌లో ఫీల్డింగ్ చేస్తే చుట్టు పక్కల గోడ కట్టినట్లే అనే గుర్తింపు తెచ్చుకున్న బ్రావో... బౌండరీ మీద ఎన్నో అద్భుత క్యాచ్‌లు అందుకున్నాడు. సిక్సర్ ఖాయమనుకున్న బంతిని సైతం కచ్చితమైన అంచనాతో గాల్లోకి ఎగిరి అమాంతం ఒడిసి పట్టడంలో బ్రావోది అందెవేసిన చేయి. అందుకే చెన్నై సూపర్ కింగ్స్ తరఫున బ్రావో ఎప్పుడూ బౌండరీ వద్దే కనిపించేవాడు. ఆటతీరుతోనే కాకుండా ప్రైవేట్ ఆల్బమ్స్ రూపొందించి వాటికి నృత్యరీతులను జత చేయడంలోనూ బ్రావో సిద్ధహస్తుడు.

ఆటతో పాటే పాట!

మైదానంలో ఎంతో సరదాగా ఉండే బ్రావోను ప్రత్యర్థి ప్లేయర్లు సైతం ఇష్టపడేవారు. వికెట్ తీసినప్పుడు జరుపుకునే సంబరాల నుంచి మొదలుకొని విజయం సాధించినప్పుడు చేసే డాన్స్ వరకు అన్నింట్లో ప్రత్యేకత చాటుకున్న బ్రావో.. ఐపీఎల్‌లో రెండు సీజన్‌లలో 25 కంటే ఎక్కువ వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డుల్లోకెక్కాడు. 2013 సీజన్‌లో 32 వికెట్లు తీసిన బ్రావో... 2015లో 26 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. వెస్టిండీస్ ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్ టి20 ఫార్మాట్‌లో 684 మ్యాచ్‌లాడి అగ్రస్థానంలో ఉండగా... 582 మ్యాచ్‌లతో బ్రావో రెండో స్థానంలో నిలిచాడు. షోయబ్ మాలిక్ (542 మ్యాచ్‌లు), సునీల్ నరైన్ (525 మ్యాచ్‌లు), రసెల్ (523 మ్యాచ్‌లు) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఫ్రాంచైజీ క్రికెట్‌లో విశ్వవ్యాప్తంగా 28 జట్లకు ప్రాతినిధ్యం వహించిన బ్రావో... 2012, 2016లో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టి20 ప్రపంచకప్ గెలిచిన వెస్టిండీస్ జాతీయ జట్టులో కీలక పాత్ర పోషించాడు. సుదీర్ఘ కెరీర్‌లో పదో స్థానంలో మినహా అన్ని స్థానాల్లో బ్యాటింగ్‌కు దిగిన దిగిన బ్రావో... 442 ఇన్నింగ్స్‌ల్లో 6970 పరుగులు సాధించాడు. ఇందులో ఒక్క సెంచరీ కూడా లేకపోగా... 20 అర్ధశతకాలు ఉన్నాయి.

ఆల్‌రౌండర్‌కు ప్రతిరూపం

బ్యాట్‌తో 5 వేల పైచిలుకు పరుగులు... బంతితో 300 వికెట్లు... 200 క్యాచ్‌లు పట్టిన బ్రావో నిఖార్సైన ఆల్‌రౌండర్ అనిపించుకున్నాడు. పురుషుల టి20 క్రికెట్‌లో 17 టోర్నమెంట్ ఫైనల్స్‌లో బ్రావో విజేతగా నిలిచాడు. ప్రపంచ క్రికెట్‌లో ఇదే అత్యధికం కాగా... కీరన్ పొలార్డ్ 16 టోర్నీల్లో చాంపియన్‌గా నిలిచాడు. కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో ఐదు (2015, 2017, 2018, 2020, 2021), ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో మూడు (2011, 2018, 2021), ఐసీసీ టి20 ప్రపంచకప్‌లో రెండు (2012, 2016), కరీబియన్ టి20 లీగ్‌లో రెండు (2011/12, 2012/13), స్టాన్‌ఫోర్డ్ లీగ్ (2007/08), సీఎల్ టి20 (2014), బీపీఎల్ (2016/17), పీఎస్‌ఎల్ (2019), ఐఎల్‌టి20 (2023/24)ల్లో ఒక్కో టైటిల్ సాధించాడు. ఆటగాడిగా ఉన్న సమయంలోనే సహచరులకు అవసరమైన సమయాల్లో సూచనలిస్తూ పెద్దన్న పాత్ర పోషించిన బ్రావో... ఇప్పుడు ఇక పూర్తిస్థాయిలో మెంటార్‌గా వ్యవహరించనున్నాడు. కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో సుదీర్ఘ కాలంగా ట్రిన్‌బాగో నైట్ రైడర్స్‌కు ప్రాతినిధ్యం వహించిన బ్రావో... వచ్చే ఐపీఎల్ సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ మెంటార్‌గా కనిపించనున్నాడు.

'ఐటా' అధ్యక్షుడిపై అవిశ్వాస తీర్మానం నేడు



కాన్పూర్: అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా)లో అనూహ్య పరిణామం... అధ్యక్షుడు అనిల్ జైన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ఎనిమిది రాష్ట్రాలకు చెందిన టెన్నిస్ సంఘాలు నేడు ఢిల్లీలో అసాధారణ సర్వసభ్య సమావేశం (ఈజీఎం) ఏర్పాటు చేశాయి. చిత్రంగా వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) నిర్వహించతలపెట్టిన రోజే ఈజీఎం ఏర్పాటు చేశారు. ఓవైపు ఎన్నికల కోసం ఏజీఎం నిర్వహించాల్సి ఉండగా... కోర్టు మార్గదర్శకాల మేరకు ఫలితాలను సీల్డ్ కవర్‌లో ఢిల్లీ హైకోర్టుకు సమర్పించాల్సి ఉంది. మరోవైపు భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి చెందిన రాజ్యసభ ఎంపీ అనిల్ జైన్ తన కుటుంబంతో సహా చేసే విదేశీ పర్యటనల ఖర్చులను రాష్ట్ర సంఘాలపై మోపుతున్నారని అస్సాం, గుజరాత్, జమ్మూకశ్మీర్, హరియాణా, మహారాష్ట్ర, పంజాబ్, తమిళనాడు, త్రిపుర సంఘాలు ఆరోపిస్తున్నాయి. అయితే జైన్ మాట్లాడుతూ ఉన్నపళంగా ఈజీఎం నిర్వహణ నియమావళికి విరుద్ధమన్నారు. ఇది నిర్వహించాలంటే కనీసం మూడు వారాల ముందు నోటీసు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. దీనిపై చట్టబద్ధంగా పోరాడుతానని, 'ఐటా' నియమావళిలోని 15వ క్లాజ్ ప్రకారం ఇలాంటి సమావేశాలు చట్ట విరుద్ధం. ఈ నెల 23న నోటీసు ఇచ్చి అంతలోనే 28న ఈజీఎం నిర్వహించాలనుకోవడం ఏంటని ప్రశ్నించారు. 'ఇదంతా కుట్ర! నేను ఐటా, రాష్ట్రాల సంఘాల్లో స్పోర్ట్స్ కోడ్‌ను అమలు చేయాలని కోరినందుకే వారంతా కక్ష గట్టి నాపై బదులు తీర్చుకుంటున్నారు' అని దుయ్యబట్టారు. మరోవైపు రాష్ట్ర సంఘాల ప్రతినిధులు స్పోర్ట్స్ కోడ్ సమస్యే కాదన్నారు. 'కోడ్‌కు ఎవరూ వ్యతిరేకంగా లేరు. కేంద్ర క్రీడాశాఖ ప్రకారం అమలు చేయాల్సిందే. అనిల్ జైన్ చెబుతున్నట్లు ఇదే సమస్య అయితే గత నెల ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌లో ఎందుకు మాట్లాడలేదు? ఏజీఎం, ఎన్నికల ప్రక్రియను ప్రకటించినపుడు ఎందుకు చర్చించలేదు' అని రాష్ట్ర సంఘం అధికారి ఒకరు చెప్పారు. ఈసారి 'ఐటా'ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలనుకుంటున్నామని, క్రీడాకారులకు మద్దతుగా ఇవ్వాలనుకుంటున్నామని తద్వారా భారత టెన్నిస్ ముఖచిత్రాన్ని మార్చుతామని ఆయన తెలిపారు.

ప్రపంచ చాంపియన్‌షిప్ లక్ష్యం

గాయం నుంచి కోలుకున్నా • జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా వ్యాఖ్య



సొనెపట్: కొత్త సీజన్‌ను వంద శాతం ఫిట్‌నెస్‌తో ప్రారంభిస్తానని భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా అన్నాడు. రెండు వరుస ఒలింపిక్స్‌లలో స్వర్ణ, రజత పతకాల విజేత అయిన 26 ఏళ్ల ఈ స్టార్ గాయం నుంచి కోలుకున్నట్లు చెప్పాడు. వచ్చే ఏడాది జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో టాప్-3లో నిలవడమే లక్ష్యంగా శ్రమిస్తానని పేర్కొన్నాడు. బ్రస్సెల్స్‌లో జరిగిన డైమండ్ లీగ్ ఫైనల్లో చోప్రా రెండో స్థానంలో నిలిచి సీజన్‌ను ఘనంగా ముగించాడు. హరియాణాలోని స్పోర్ట్స్ యూనివర్సిటీలో నిర్వహించిన 'మిషన్ ఒలింపిక్స్–2036' పాల్గొన్న నీరజ్ ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 'ఇప్పటిదాకా జరిగిన సీజన్ ముగిసింది. కొత్త సీజన్‌పై దృష్టి పెట్టాలి. ఇందులో పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా. 2025లో టోక్యోలో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకమే లక్ష్యంగా సన్నాహాలు ప్రారంభించాల్సి ఉంది. ఒలింపిక్స్ అనేది ఎప్పటికైనా పెద్ద ఈవెంటే. కానీ దానికి ఇంకా నాలుగేళ్ల సమయముంది' అని అన్నాడు. ఈ ఏడాది గాయంతో ఇబ్బంది పడిన తను ప్రస్తుతం కోలుకున్నానని చెప్పాడు. పూర్తిస్థాయి ఫిట్‌నెస్‌తో కొత్త సీజన్ బరిలోకి దిగుతానన్నాడు. సాంకేతిక అంశాలపై కూడా దృష్టి సారించినట్లు చెప్పిన చోప్రా జర్మన్ బయోమెకానిక్ నిపుణుడైన క్లాస్ బార్టొనిజ్‌తో కలిసి పురోగతి సాధించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పాడు. స్వదేశంలోనూ శిక్షణ తీసుకోవచ్చని అయితే పోటీలు విదేశాల్లో ఉండటంతో అక్కడే ట్రెయినింగ్‌లో పాల్గొంటున్నానని వివరించాడు. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో వరుస ఒలింపిక్స్ క్రీడల్లో పతకాలు గెలిచిన భారత తొలి అథ్లెట్‌గా ఘనతకెక్కిన చోప్రా ఒలింపిక్స్‌లో ఆరు పతకాలే సాధించినా... ఎక్కువగా నాలుగో స్థానాలు వచ్చాయన్న సంగతిని గుర్తు చేశాడు. దీంతో ఒక్క స్వర్ణం లేకపోయినా మన ప్రదర్శన తీసికట్టుగా భావించాల్సిన అవసరం లేదన్నాడు. అయితే పారాలింపిక్స్‌లో మన పారా అథ్లెట్లు అసాధారణ స్థాయిలో పతకాలు సాధించారని అభినందించాడు. తదుపరి మెగా ఈవెంట్లలో భారత్ బలమైన జట్టుగా బరిలోకి దిగుతుందని, మరిన్ని పతకాలు సాధిస్తుందని చెప్పాడు. అంతకుముందు కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో నీరజ్ భేటీ అయ్యాడు. తాను సంతకం చేసిన జెర్సీని మంత్రికి నీరజ్ అందజేశాడు.

కదంతొక్కిన కమిందు, కుశాల్

సెంచరీలతో అలరించిన శ్రీలంక బ్యాటర్లు

- శ్రీలంక తొలి ఇన్నింగ్స్ 602/5 డిక్లేర్డ్
- ప్రస్తుతం న్యూజిలాండ్ 22/2


కమిందు మెండిస్

- కమిందు మెండిస్ టెస్టుల్లో 13 ఇన్నింగ్స్‌ల్లో వేయి పరుగులు పూర్తి చేసి ఆసీస్ దిగ్గజం డాన్ బ్రాడ్‌మన్ సరసన నిలిచాడు. వీరిద్దరి కంటే వేగంగా సట్‌క్లిఫ్ (ఇంగ్లండ్), ఎవర్టన్ (వెస్టిండీస్)లు 12 ఇన్నింగ్స్‌ల్లో వేయి పరుగులు పూర్తి చేశారు.
- ఎనిమిదో టెస్టు ఆడుతున్న కమిందు 5వ సెంచరీ సాధించాడు. ఇంత స్వల్ప కెరీర్‌లో మరో నాలుగు అర్ధసెంచరీలు కూడా ఉన్నాయి.


కుశాల్ మెండిస్

గాలే: రెండో రోజు అదే జోరు! న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక బ్యాటర్లు చెలరేగిపోతున్నారు. తొలిరోజు దినేశ్ చండిమల్ సెంచరీ సాధించగా, రెండో రోజు ఆటలో కమిందు మెండిస్ (250 బంతుల్లో 182 నాటౌట్; 16 ఫోర్లు, 4 సిక్స్‌లు), కుశాల్ మెండిస్ (149 బంతుల్లో 106 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ సెంచరీలతో కదంతొక్కారు. దీంతో ఆతిథ్య శ్రీలంక జట్టు తొలి ఇన్నింగ్స్‌ను 163.4 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 602 పరుగుల భారీస్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 306/3తో శుక్రవారం రెండో రోజు ఆట కొనసాగించిన లంక బ్యాటర్లలో ఏంజెలో మాథ్యూస్ (185 బంతుల్లో 88; 7 ఫోర్లు) తన క్రితం రోజు స్కోరుకు 10 పరుగులు జోడించి నిష్క్రమించాడు. దీంతో తొలి సెషన్ ఆరంభంలోనే 328 పరుగుల వద్ద నాలుగో వికెట్ కూలింది. ఈ దశలో మరో ఓవర్‌నైట్ బ్యాటర్ కమిందు మెండిస్‌కు జతయిన కెప్టెన్ ధనంజయ డిసిల్వా (80 బంతుల్లో 44; 3 ఫోర్లు, 1 సిక్స్) కుదురుగా ఆడటంతో పర్యాటక బౌలర్లకు మళ్లీ కష్టాలు తప్పలేదు. ఈ జోడీని విడగొట్టేందుకు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. జట్టు స్కోరు 400 మైలురాయి దాటాక ఎట్టకేలకు తొలిసెషన్ ముగిసే దశలో ధనంజయను ఫిలిప్స్ పెవిలియన్ చేర్చాడు. అతను అవుటైన 402 స్కోరువద్దే లంచ్ బ్రేక్‌కు వెళ్లారు. కుశాల్ మెండిస్ క్రీజులోకి రాగా... రెండో సెషన్ మొదలైన కాసేపటికే కమిందు మెండిస్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. తద్వారా ఈ మిడిలార్డర్ బ్యాటర్ అరుదైన రికార్డును కొనసాగిస్తున్నాడు. అరంగేట్రం చేసిన టెస్టు నుంచి ఇప్పటివరకు (తాజా 8వ టెస్టు) ప్రతి మ్యాచ్‌లో సెంచరీ, లేదంటే అర్ధసెంచరీ చేసిన బ్యాటర్‌గా ఘనతకెక్కాడు. మరోవైపు అతనికి జతయిన కుశాల్ కూడా కివీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కోవడంతో రెండో సెషన్ ఆసాంతం కష్టపడినా వికెట్ తీయలేకపోయింది. 519/5 స్కోరు వద్ద రెండో సెషన్ ముగిసింది. ఆ తర్వాత మొదలైన మూడో సెషన్‌లోనూ ఈ జోడీ క్రీజు వదలకపోవడంతో పాటు పరుగుల్ని అవలీలగా సాధించింది. కమిందు 150 పరుగులు పూర్తి చేసుకోగా... కుశాల్ సెంచరీ సాధించాడు. జట్టు స్కోరు 600 దాటాక ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశారు. కుశాల్, కమిందు ఇద్దరు అబేధ్యమైన ఆరో వికెట్‌కు సరిగ్గా 200 పరుగులు జోడించారు. గ్లెన్ ఫిలిప్స్ 3 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ మొదలు పెట్టిన న్యూజిలాండ్ ఆట నిలిచే సమయానికి 14 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 22 పరుగులు చేసింది.

భారత టీటీ క్రీడాకారులకు నిరాశ

బీజింగ్: చైనా స్మాష్–2024 వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టోర్నమెంట్‌లో క్వాలిఫయింగ్ రౌండ్‌లో పోటీపడ్డ భారత క్రీడాకారులెవరూ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయారు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ రెండో రౌండ్ మ్యాచ్‌లో మనుశ్ 11–9, 14–12, 5–11, 7–11, 8–11తో జుయ్ ఫె (చైనా) చేతిలో ఓడిపోయాడు. మహిళల సింగిల్స్ క్వాలిఫయింగ్ రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో ఐహిక ముఖర్జీ 6–11, 11–6, 11–6, 11–13, 8–11తో ఇవానా మలోబాబిచ్ (క్రొయేషియా) చేతిలో... సుతీర్థ ముఖర్జీ 5–11, 6–11, 6–11తో ఫాన్ సికీ (చైనా) చేతిలో పరాజయం పాలయ్యారు.

ఫైనల్లో రిత్విక్ జోడీ

సాక్షి, హైదరాబాద్: బ్యాంకాక్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ డబుల్స్‌లో ఫైనల్లోకి దూసుకెళ్లాడు. థాయ్‌లాండ్‌లోని నొంతాబురి పట్టణంలో శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో రిత్విక్–అర్జున్ ఖడే (భారత్) ద్వయం 6–3, 6–4తో రామ్‌కుమార్ రామనాథన్ (భారత్)–తొషిహిడె (జపాన్) జోడీపై గెలిచింది. 77 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్–అర్జున్ ఆరు ఏస్‌లు సంధించారు. తమ సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోకుండా ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశారు. నేడు జరిగే ఫైనల్లో బ్లేక్ ఇలిస్–ఆడమ్ వాల్టన్ (ఆస్ట్రేలియా)లతో రిత్విక్–అర్జున్ తలపడతారు.


రిత్విక్

సెమీస్‌లో గాయత్రి–ట్రెసా జోడీ



మకావ్: వరుసగా ఐదు టోర్నమెంట్‌లలో క్వార్టర్ ఫైనల్ దాటి ముందుకెళ్లలేకపోయిన పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ ద్వయం ఆ అడ్డంకిని ఆరో ప్రయత్నంలో అధిగమించింది. మకావ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో మూడో సీడ్ గాయత్రి–ట్రెసా జాలీ జంట సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో గాయత్రి–ట్రెసా జాలీ జోడీ 21–12, 21–17తో ఆరో సీడ్ సు యిన్ హుయ్–లోన్ జియున్ (చైనీస్ తైపీ) జంటపై గెలిచింది. గత జూన్‌లో సింగపూర్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలో సెమీఫైనల్ చేరిన తర్వాత గాయత్రి–ట్రెసా ఐదు టోర్నీలు ఆడారు. అయితే ఈ ఐదు టోర్నీల్లో వారు క్వార్టర్ ఫైనల్ దాటలేకపోయారు. మరోవైపు పురుషుల సింగిల్స్ విభాగంలో భారత కథ ముగిసింది. బరిలో మిగిలిన ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగాడు. ఎన్జీ కా లాంగ్ అంగస్ (హాంకాంగ్)తో జరిగిన మ్యాచ్‌లో శ్రీకాంత్ 16–21, 12–21తో ఓడిపోయాడు. నేడు జరిగే మహిళల డబుల్స్ సెమీఫైనల్లో సెయి పె షాన్–హుంగ్ ఎన్ జు (చైనీస్ తైపీ)లతో గాయత్రి–ట్రెసా తలపడతారు. గతవారం చైనా ఓపెన్ టోర్నీ తొలి రౌండ్‌లోనే సెయి పె షాన్–హుంగ్ ఎన్ జు చేతిలో ఓడిన గాయత్రి–ట్రెసా ఈసారి గెలిచి బదులు తీర్చుకుంటారో లేదో వేచి చూడాలి.

బోర్జా హెరెరా హ్యాట్రిక్



కోల్‌కతా: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫుట్‌బాల్ టోర్నీలో గోవా బోణీ కొట్టింది. బోర్జా హెరెరా హ్యాట్రిక్ గోల్స్‌తో ఎఫ్‌సీ గోవా జట్టు 3–2తో ఈస్ట్ బెంగాల్ క్లబ్‌పై విజయం సాధించింది. స్పెయిన్‌కు చెందిన ఈ స్ట్రయికర్ 13వ, 20వ, 71వ నిమిషాల్లో గోల్స్ చేసి గోవా జట్టును గెలిపించాడు. బెంగాల్ తరఫున తలాల్ (29వ ని.లో), లాల్‌లన్సంగ (85వ ని.లో) చెరో గోల్ చేశారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో జంషెడ్‌పూర్ జట్టుతో ఒడిశా క్లబ్ (భువనేశ్వర్‌లో), బెంగళూరు జట్టుతో మోహన్ బగాన్ సూపర్ జెయింట్ క్లబ్ (బెంగళూరులో) ఆడతాయి.


బైడెన్

తుపాకీ నియంత్రణకు కొత్త చట్టం

ఉత్తర్వులపై సంతకం చేసిన అధ్యక్షుడు బైడెన్

వాషింగ్టన్: అమెరికాలో తుపాకీ సంస్కృతికి చరమగీతం పాడేందుకు దేశాధ్యక్షుడు బైడెన్ కీలక చట్టం తెచ్చారు. అమెరికా అత్యున్నత అధికారమైన ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ద్వారా ఈచట్టం తీసుకొచ్చారు. ఇందుకు సంబంధించిన కార్యనిర్వాహక ఉత్తర్వుపై శుక్రవారం సంతకం చేశారు. కొత్త చట్టం ప్రకారం లైసెన్స్‌లేని తుపాకులు, సీరియల్ నంబర్‌లేని తుపాకులు, 3డీ పద్ధతిలో ముద్రించిన తుపాకుల కట్టడి, నిషేధంపై ప్రధానంగా దృష్టిసారిస్తారు. సాధారణ గన్, పిస్టల్‌ను ఆటోమేటిక్ మెషీన్ గన్‌గా మార్చే యంత్రాలను నిషేధించేందుకు ప్రభుత్వానికి పూర్తి అధికారం దఖలు పడనుంది. మరికొద్ది వారాల్లో అధ్యక్షుడిగా పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో కొత్త కార్యనిర్వాహక ఉత్తర్వులపై బైడెన్ సంతకం చేయడం గమనార్హం. 3డీ ప్రింటెడ్ గన్‌లను స్కానింగ్ యంత్రాలు, మెటల్ డిటెక్టర్లు కూడా గుర్తించలేకపోతున్నాయని బైడెన్ ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తంచేశారు. కొత్త చట్టంపై ముసాయిదా రూపకల్పన బాధ్యతలను 2023లో ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు అప్పగించడం తెల్సిందే.

ఉత్తర్వులకు ముందు అప్పీల్

ఉత్తర్వులపై సంతకం చేయడానికి ముందు అధ్యక్షుడు బైడెన్ 'ఎక్స్'లో ఓ పోస్ట్ చేశారు. ''అమెరికాలో పిల్లల మరణాలకు వ్యాధులు, ప్రమాదాలకంటే తుపాకీ హింసే ప్రధాన కారణం. ఇది బాధాకరం. ఈ హింసను అంతం చేయడానికి నాతో, ఉపాధ్యక్షురాలు హారిస్‌తో చేతులు కలపండి. తుపాకీ హింసను అరికట్టేందుకు కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేస్తున్నా''అని అన్నారు. ఆయుధాలను పూర్తిగా నిషేధించాలని ఇటీవలే బైడెన్ పిలుపునిచ్చారు. ఒక దేశంగా తుపాకీ హింసను అంగీకరించలేమన్నారు. దేశంలో తుపాకీ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని అమెరికా కాంగ్రెస్‌ను కోరారు. ఆయుధాలు, మందుగుండు సామగ్రి అమ్మకాలపై సమగ్ర తనిఖీలు, సమతుల్యత పాటించాలని పిలుపునిచ్చారు. ఈ చర్యలేవీ చనిపోయిన పిల్లలను తిరిగి తీసుకురాలేవని, అందరం కలిసి ఒక నిర్ణయం తీసుకుంటే భవిష్యత్‌లో పిల్లల ప్రాణాలను కాపాడగలమని చెప్పారు.

అమెరికా కార్పొరేట్ల పార్టీల బాట



అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అమెరికాలో రాజకీయ చీలికలు పెరుగుతున్నాయి. ప్రజాస్వామ్యంలో వ్యక్తులు రాజకీయ పార్టీలకు, నాయకులకు మద్దతు తెలపడం సాధారణం. అయితే అమెరికాలో కార్పొరేట్లు సైతం రెండు వర్గాలుగా విడిపోయాయి. చిన్న, ప్రాంతీయ సంస్థలు మొదలు టెక్, బ్యాంకింగ్ దిగ్గజాల వంటి పెద్ద సంస్థల దాకా మెజారిటీ సంస్థలన్నీ డెమొక్రటిక్, రిపబ్లికన్ అభ్యర్థుల మధ్య విడిపోయాయి. కొన్ని సంస్థలు కమలా హారిస్‌వైపు, మరికొన్ని సంస్థలు డొనాల్డ్ ట్రంప్ వైపు నిలిచారు. ఈ చీలికతో ఉదారవాద, వామపక్ష భావాలు కలిగిన కమలా హారిస్‌కు మితవాద ట్రంప్‌కు మధ్య పోటీగా అమెరికా అధ్యక్ష ఎన్నికలు మారిపోయాయి. టెక్ దిగ్గజాలు మైక్రోసాఫ్ట్, గూగుల్ (ఆల్ఫాబెట్), అమెజాన్, సన్ మైక్రోసిస్టమ్స్ ఉద్యోగులు కమలా హారిస్ ప్రచారానికి మిలియన్ల డాలర్లను విరాళంగా ఇచ్చినట్లు రాజకీయరంగ విషయాలను బహిర్గం చేసే 'ఓపెన్ సీక్రెట్స్'సంస్థ వెల్లడించింది. ట్రంప్ ప్రచారానికి వచ్చిన విరాళాల కంటే కమలా హారిస్ ప్రచారానికి వచ్చిన సహకారం గణనీయంగా ఉంది. ఎలాన్ మస్క్, మార్క్ జుకర్‌బర్గ్ వంటి టెక్ దిగ్గజాలు మాత్రం ట్రంప్‌కు మద్దతుగా ప్రకటించడం తెల్సిందే.

హారిస్‌కు గూగుల్ సహా పలు సంస్థల బాసట

భారత సంతతికి చెందిన అమెరికన్ బిలియనీర్, సన్ మైక్రోసిస్టమ్స్ సహ వ్యవస్థాపకుడు వినోద్ ఖోస్లా, వెంచర్ క్యాపిటలిస్ట్ రీడ్ హాఫ్‌మన్ తదితరులు హారిస్‌కు మద్దతుగా నిలిచారు. సుందర్ పిచాయ్ నేతృత్వంలోని గూగుల్ (ఆల్ఫాబెట్), దాని అనుబంధ సంస్థలు హారిస్‌కు దాదాపు రూ.18 కోట్లు విరాళంగా ఇచ్చినట్లు అమెరికా ఎన్నికల నిధుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కొన్ని కార్పొరేట్ సంస్థ అటు కమలకు విరాళాలు అందిస్తూ ట్రంప్‌కు సైతం విరాళాలు పంపుతున్నాయి. అయితే కమలతో పోలిస్తే ట్రంప్‌కు వస్తున్న కార్పొరేట్ విరాళాలు తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. హారిస్ ప్రచారానికి సత్య నాదెళ్ల నేతృత్వంలోని మైక్రోసాఫ్ట్ దాదాపు రూ.9.2 కోట్లు విరాళం ఇచ్చింది. అమెరికా కుబేరుడు జెఫ్ బెజోస్ నేతృత్వంలోని అమెజాన్ సంస్థ దాదాపు రూ.8.36 కోట్లు విరాళంగా ఇచ్చింది. సిలికాన్‌వ్యాలీలో వందకు పైగా పెద్ద పెట్టుబడిదారులు, పెద్ద టెక్ సంస్థలు హారిస్‌కు మద్దతుగా నిలిచాయి.

ట్రంప్‌కు బ్యాంకింగ్, ఆయిల్ దిగ్గజాల మద్దతు

కార్పొరేట్లపై పన్ను మరింత తగ్గిస్తామని, విదేశాల నుంచి వచ్చే దిగుమతులపై అధిక సుంకాలు విధిస్తామని, చమురు, సహజవాయువు, బొగ్గు గనుల రంగాల్లో పెట్టుబడులు పెంచుతామని ట్రంప్ ఎన్నికల వేళ హామీలు గుప్పించారు. అమెరికాలో చమురు వెలికితీతను మొదట్నుంచీ సమర్థించే ట్రంప్‌కు చమురురంగ సంస్థలు మద్దతు పలుకుతున్నాయి. ట్రంప్‌పై హత్యాయత్నం జరిగినప్పుడు అమెరికా స్టాక్ మార్కెట్ కదలికలు సైతం ట్రంప్‌కు అనుకూలంగా ఉండటం గమనార్హం. చమురు వినియోగం అధికంగా ఉన్నంత మాత్రాన వాతావరణంలో ఎలాంటి మార్పులు రావని, వాతావరణ మార్పులు అనేది పచ్చి అబద్ధమని ట్రంప్ గతంలో వ్యాఖ్యానించారు. అధ్యక్షుడిగా ఉన్నకాలంలో పారిస్ ఒప్పందం నుంచి అమెరికా వైదొలగేలా చేశారు. అమెరికా అభివృద్ధిలో చమురు, బొగ్గుది కీలక పాత్ర అని ప్రకటించారు. దీంతో ఈ రెండు రంగాలు ట్రంప్‌కు మద్దతుగా నిలుస్తున్నాయి. బైడెన్ పాలనలో అమలు చేసిన కఠిన నిబంధనలను ట్రంప్ వెనక్కి తీసుకుంటారని బ్యాంకర్లు భావిస్తున్నారు. బైడెన్ సూచించిన కొత్త కఠిన బ్యాంకింగ్ నిబంధనలపై ఆ రంగం చూపుతున్న విముఖత ట్రంప్‌కు అనుకూలిస్తోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

జుకర్‌బర్గ్, మస్క్ బహిరంగంగానే..

మెటా చీఫ్ ఎగ్జిక్యూటివ్ జుకర్‌బర్గ్ మితవాద ట్రంప్‌కు మద్దతు ఇస్తూ బహిరంగ ప్రకటనలు చేశారు. అయితే తర్వాత జుకర్‌బర్గ్ తాను తటస్థంగా, నిష్పక్షపాతంగా కనిపించాలనుకుంటున్నానని వ్యాఖ్యానించారు. ట్రంప్ ప్రచారానికి జుకర్‌బర్గ్ ఎంత విరాళంగా ఇచ్చారనే అంశాలు ఇంకా బహిర్గతంకాలేదు. ఫేస్‌బుక్‌లో వచ్చే కంటెంట్‌ను సెన్సార్ చేయాలని బైడెన్ ప్రభుత్వం మెటాపై ఒత్తిడి తేవడం తెల్సిందే. ఎలాన్ మస్క్ ట్రంప్‌కు బహిరంగంగా మద్దతు ఇచ్చారు. ట్రంప్ ప్రచారాన్ని చూసుకునే అమెరికా పీఏసీ సంస్థకు తాను వ్యక్తిగతంగా ప్రతి నెలా దాదాపు రూ.376 కోట్లు విరాళంగా పంపుతున్నానని మస్క్ జూలైలో బహిరంగంగా ప్రకటించారు. భారీ వెంచర్ క్యాపిటలిస్ట్ పీటర్ థెయిల్ సైతం ట్రంప్‌కు జై కొడుతున్నారు.



నడిచే చేపలు

వాటి కింద రుచి మొగ్గలు

- వాటి సాయంతో ఆహారం జాడ కనిపెడుతున్న సీ రాబిన్స్
- నూతన అధ్యయనంలో వెల్లడి

సీ రాబిన్ చేపల్లో కొత్త రకం జాతుల వైవిధ్యమైన లక్షణాలను శాస్త్రవేత్తలు తాజాగా కనుగొన్నారు. సీ రాబిన్స్ చేపల్లోని ప్రియోనాటస్ కారోలైనస్ జాతుల మొప్పల వెనకాల రెక్కలతోపాటు, కిందిభాగంలో పీత ఉన్న మాదిరిగా ఆరు కాళ్లను గుర్తించారు. చేప ఈ కాళ్లతో ఎంచక్కా సముద్రగర్భం అడుగుభాగంపై చకచకా ముందుకు కదులుతోంది. ఆ కాళ్లకు మరో ప్రత్యేకత ఉంది. వాటి అడుగున ఉన్న పాదాల్లాంటి మెత్తని భాగానికి జ్ఞానేంద్రియంలాంటి గుణం ఉండటం విశేషం. సముద్రం అడుగున మట్టి కింద ఏదైనా చిన్న జీవి దాక్కున్నా, ఇంకేదైనా ఆహారం ఉన్నా ఈ చేప తన కాళ్లతోనే గుర్తించగలదు. అవసరమైతే మట్టిలో కూరుకుపోయిన ఆహారాన్ని తవ్వి బయటకు తీయగలదు. ఇలాంటి కొత్త విషయాలతో కూడిన అధ్యయన వివరాలు తాజాగా 'కరెంట్ బయోలజీ'సైన్స్ జర్నల్‌లో గురువారం ప్రచురితమయ్యాయి. మట్టి అడుగున అమైనో ఆమ్లాలను కల్గిన చిన్న జీవి జాడనూ చేప గుర్తించగలదు. అక్కడి ఆహారం, జీవి నుంచి విడుదలయ్యే రసాయనాలను గుర్తించే ఏర్పాట్లు సీ రాబిన్ పాదాల్లో ఉన్నాయి. పాదాల్లోని నరాలు ఇందుకు అనుగుణంగా స్పందిస్తున్నాయని అధ్యయనకారులు తెలిపారు. మనిషి నాలుక మీద ఉండే రుచి మొగ్గల లాంటి బొడిపెలు ఈ చేప పాదాల కింద ఉన్నాయి. వీటి సాయంతో అది తన ఆహారం జాడ కనిపెడుతోందని అధ్యయనం వెల్లడించింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

చరిత్రాత్మక తీర్పులతో వెబ్ పేజీ

ప్రారంభించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: సర్వోన్నత న్యాయస్థానం ఇటీవలి కాలంలో తాము ఇచ్చిన చరిత్రాత్మక తీర్పులను గుదిగుచ్చి ఒక వెబ్‌పేజీ ద్వారా అందరికీ అందుబాటులోకి తెచ్చింది. న్యాయవితరణలో భాగంగా సుప్రీంకోర్టు వెలువరించిన కీలక తీర్పుల వివరాలు పౌరులకు తెలియజెప్పడంతోపాటు, న్యాయవ్యవస్థ పట్ల వారిలో మరింత అవగాహన పెంచేందుకు ఈ చొరవ తీసుకున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. www.sci.gov.in వెబ్‌సైట్‌లో 'ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్ సమరీస్'పేరిట విడిగా ఒక వెబ్‌పేజీని అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతానికి 2017 సంవత్సరం నుంచి ఇప్పటిదాకా ఇచ్చిన కీలక తీర్పుల సమగ్ర వివరాలు అందులో అందుబాటులోకి వచ్చాయి. అంతకుముందునాటి చరిత్రాత్మక తీర్పులను త్వరలో అప్‌లోడ్ చేయనున్నారు. ''తీర్పు సంక్లిష్టమైన పదజాలంతో ఇంగ్లిష్ భాష ఉంటుంది. వందల పేజీలున్న కోర్టు తీర్పును చదివి అర్థంచేసుకోవడమూ సాధారణ ప్రజలకు కష్టమే. అందుకే సులభ భాషలో, తక్కువ పదాల్లో తీర్పు సారాంశాన్ని పౌరులకు అందుబాటులోకి తెచ్చాం'' అని సుప్రీం పేర్కొంది.



బర్త్ డే @ 118

దక్షిణాఫ్రికాకు చెందిన ఈ బామ్మ పేరు మార్గరెట్ మారిట్జ్. టౌస్ రివర్ పట్టణంలోని వృద్ధాశ్రమంలో గురువారం 118వ బర్త్ డే వేడుక జరుపుకున్నారు. ఈమె 14 మంది సంతానంలో ఇద్దరు మాత్రం ఈ వేడుకకు హాజరయ్యారు. గుర్తింపు కార్డును బట్టి మార్గరెట్ 1906 సెప్టెంబర్ 27న జన్మించారు. దీని ప్రకారం ప్రపంచంలోని జీవించి ఉన్న అత్యంత వృద్ధురాలు ఈమె. అయితే, అమెరికాలోని జెరంటాలజీ రీసెర్చ్ గ్రూప్ మాత్రం ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా జపాన్ వాసి టొమికో ఇటూకాను ఇటీవలే ప్రకటించింది. టొమికొ 1908 మే 23న పుట్టారు.

మరికొన్ని రాష్ట్రాల్లో హారిస్ ముందంజ

తాజా సర్వేలో వెల్లడి

వాషింగ్టన్: హోరాహోరీ ప్రచారం వేళ అరిజోనా, మిషిగన్, పెన్సిల్వేనియా తదితర రాష్ట్రాల్లో రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ కంటే డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ కాస్తంత ముందంజలో ఉన్నట్లు తాజా సర్వేలో తేలింది. యూమాస్ లోవెల్స్ సెంటర్ ఫర్ పబ్లిక్ ఒపీనియర్, యూగవ్ సర్వే ఫలితాలు తాజాగా వెల్లడయ్యాయి. మిషిగన్‌లో ట్రంప్‌కు 43 శాతం మంది ఓటర్లు మద్దతు పలికితే హారిస్‌కు 48 శాతం మంది మద్దతుగా నిలబడ్డారు. మిగిషన్ వంటి స్వింగ్ రాష్ట్రంలో ఆధిక్యత కనబరచడం హారిస్‌కు బాగా కలిసొచ్చే అంశమని యూమాస్ లోవెల్ రాజకీయ శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్, పబ్లిక్ ఒపీనియన్ సెంటర్ అసోసియేట్ డైరెక్టర్ అయిన రోడ్రిగో క్యాస్ట్రో కార్నేజీ చెప్పారు. పెన్సిల్వేనియాలో ట్రంప్‌కు 46 శాతం మంది, హారిస్‌కు 48 శాతం మంది మద్దతు తెలిపారు. పెన్సిల్వేనియా ఫలితాలను చూస్తుంటే అధ్యక్ష ఎన్నికల్లో ఇక్కడి పోరు హోరాహోరీగా ఉండనుందని స్పష్టమవుతోందని కార్నేజీ అన్నారు. జార్జియాలో 48 శాతం మంది పౌరులు ట్రంప్‌కు మద్దతు పలికితే 51 శాతం మంది హారిస్‌కు అండగా నిలబడతామని చెప్పారు. అరిజోనాలో 48 శాతం మంది పౌరులు హారిస్‌కు మద్దతు పలికితే 51 శాతం మంది ట్రంప్ అండగా నిలబడతామని వెల్లడించారు. ఇప్పటిదాకా వెల్లడైన అన్ని ప్రధాన పోలింగ్ సర్వేల ఫలితాలను విశ్లేషించాక దేశవ్యాప్తంగా చూస్తే ట్రంప్ కంటే హారిస్‌కు 2 శాతం మంది ఓటర్లు అధికంగా మద్దతు పలుకుతున్నట్లు రియల్ క్లియర్ పాలిటిక్స్ సంస్థ ప్రకటించింది. గట్టిపోటీ ఉన్న రాష్ట్రాల్లో ట్రంప్ కంటే హారిస్ ఆధిక్యత కేవలం 0.3 శాతం ఉందని తేలింది.

పేజర్ల బ్యాటరీల్లోనే పేలుడు పదార్థాలు

- వాటినే ఇజ్రాయెల్ హెజ్‌బొల్లాకు అమ్మింది
- వెల్లడించిన లెబనాన్ అధికారులు

బీరుట్: ఈ నెల 17వ తేదీన లెబనాన్‌లోని హెజ్‌బొల్లా శ్రేణుల వద్ద ఉన్న వేలాది పేజర్లు ఒక్కసారిగా పేలిపోవడం తెలిసిందే. ఈ పేలుడు తీవ్రతకు కనీసం 37 మంది చనిపోగా మూడు వేల మంది వరకు గాయాలపాలయ్యారు. దీని వెనుక ఇజ్రాయెల్ కుట్ర ఉందంటూ అందరూ అనుమానాలు వ్యక్తం చేశారు. అందరినీ నిశ్చేష్టులయ్యేలా చేసిన ఈ పేలుళ్లపై రకరకాల ఊహాగానాలు వెలువడ్డాయి. తాజాగా, ఈ మూకుమ్మడి పేలుళ్ల వెనుక రహస్యాన్ని ఛేదించామని లెబనాన్ అధికారులు అంటున్నారు. పేజర్లలో వాడిన బ్యాటరీల్లోనే సాధారణంగా ఎవరూ కనిపెట్టలేని రీతిలో పేలుడు పదార్థాన్ని అమర్చినట్లు చెబుతున్నారు. పేజర్‌కుండే లిథియం బ్యాటరీ లోపలే దీనిని అతికించినట్లు గుర్తించారు. 'పవర్ సోర్స్, ఇనిషియేటర్, డిటొనేటర్, పవర్ చార్జ్.. ఈ ఐదింటిని కలిపి ఒక చిన్న కేస్‌లో ఉంచి బ్యాటరీ లోపల అంటించారు..'తన సర్వీసులో ఇలాంటిది ముందెన్నడూ చూడలేదని లెబనాన్ అధికారి ఒకరు అన్నారు. ఇట్లాంటి వాటిని ఎక్స్ రేలతో కూడా కనిపెట్టడం కష్టమని బ్రిటిష్ ఆర్మీ అధికారి సియాన్ మూర్‌హౌస్ తెలిపారు. అయితే, పేజర్ల లోపల తయారీ దశలోనే పేలుడు పదార్థాలను ఇజ్రాయెల్ నిఘా అధికారులు అమర్చి ఉంటారనే కోణంలోనూ అనుమానాలున్నాయి. కొన్ని విదేశీ సంస్థలే ఎవరూ గుర్తించలేని రీతిలో పేజర్లలో పేలుడు పదార్థాలను అమర్చి లెబనాన్‌లోకి సరఫరా చేశారనే ఆరోపణలున్నాయి. ఎలక్ట్రానిక్ మెసేజింగ్ ద్వారా ఇజ్రాయెల్ అధికారులే వీటిని పేలేటట్లు చేశారంటున్నారు. వీటి తయారీ, సరఫరాతో సంబంధాలున్న తైవాన్, హంగేరీకి చెందిన సంస్థలు మాత్రం ఈ వ్యవహారం తమకేమీ తెలియదని దూరంగా ఉండిపోయాయి. అయితే, ఆయా సంస్థల ముసుగులో ఇజ్రాయెల్ నిఘా విభాగాలు సొంతంగా మూడు నకిలీ సంస్థలను ఏర్పాటు చేసి, ఈ పేజర్లను తయారు చేసినట్లు అమెరికా నిఘా సంస్థలను ఉటంకిస్తూ 'న్యూయార్క్ టైమ్స్' కథనంలో పేర్కొనడం గమనార్హం.

ఎంఎస్పీకి ఫుల్‌ఫాం తెలుసా?

రాహుల్ గాంధీని నిలదీసిన అమిత్ షా

చండీగఢ్: కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీకి ఎంఎస్పీ(కనీస మద్దతు ధర) అంటే ఫుల్‌ఫాం తెలుసా? అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రశ్నించారు. ఖరీఫ్‌లో ఏ పంటలు, రబీలో ఏ పంటలు పండిస్తారో రాహుల్ బాబాకు నిజంగా తెలిస్తే చెప్పాలని అన్నారు. హరియాణాలో బీజేపీ ప్రభుత్వం 24 రకాల పంటలను కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందని చెప్పారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎన్ని పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ, కర్ణాటకలో రైతన్నలకు కనీస మద్దతు ధర చెల్లిస్తున్నారా? అని ప్రశ్నించారు. శుక్రవారం హరియాణాలోని రేవారీలో ఎన్నికల ప్రచార సభలో అమిత్ షా ప్రసంగించారు. రాహుల్ బాబా రైతుల ఓట్ల కోసం ఎంఎస్పీ అంటున్నారని, నిజానికి దాని గురించి ఆయనకేమీ తెలియదని ఎద్దేవా చేశారు.

సందీప్ ఘోష్‌కు బెయిల్ నిరాకరణ

కోల్‌కతా: ఆర్.జి.కర్ మెడికల్ కాలేజి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌పై మోపిన నేరారోపణలు అత్యంత తీవ్రమైనవి, రుజువైన పక్షంలో మరణశిక్షకు ఆస్కారమున్నవని స్థానిక కోర్టు పేర్కొంది. ఆగస్టు 9న ఆర్.జి.కర్ ఆసుపత్రిలో పీజీ ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారం జరిగిన విషయం తెలిసిందే. సాక్ష్యాలను తారుమారు చేశారని, ఆలస్యంగా ఎఫ్.ఐ.ఆర్.ను నమోదు చేశారనే అభియోగాలపై సీబీఐ.. సందీప్ ఘోష్, సీఐ అభిజిత్ మండల్‌లను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఘోష్ పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌కు అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేటు ఎస్.డే తిరస్కరించారు. ఘోష్‌పై నేరారోపణలు చాలా తీవ్రమైనవని, అత్యంత అరుదుగా విధించే ఉరిశిక్షకు వీలు కల్పించేవని జడ్జి పేర్కొన్నారు. అభిజిత్ మండల్‌కు కూడా బెయిల్‌ను నిరాకరించారు.

కుమారస్వామిని ప్రశ్నించిన లోకాయుక్త

బెంగళూరు: భూమి డీ నోటిఫికేషన్ కేసులో జేడీఎస్ నేత, కేంద్రమంత్రి హెచ్.కుమారస్వామిని శుక్రవారం లోకాయుక్త పోలీసులు ప్రశ్నించారు. తమ ఎదుట హాజరైన మంత్రి కుమార స్వామిని గంగెనహళ్లి ల్యాండ్ డీ నోటిఫికేషన్ కేసులో విచారించామని లోకాయుక్త పోలీసులు వెల్లడించారు. మాజీ సీఎం కూడా అయిన కుమారస్వామిపై ఆరోపణలున్న ఈ కేసులో విచారణ వేగవంతం చేయాలని లోకాయుక్తను కర్ణాటక కాంగ్రెస్ కోరింది. బెంగళూరు మున్సిపాలిటీలోని కోట్లాది రూపాయల విలువైన భూమిని సొంత ప్రయోజనాల కోసం సీఎంగా ఉన్న సమయంలో కుమార స్వామి డీ నోటిఫై చేయించారని ఆ పార్టీ ఆరోపిస్తోంది. అయితే, తానెలాంటి తప్పిదం చేయలేదని కుమారస్వామి అంటున్నారు.

త్వరలో 170 ఆయుష్ ప్యాకేజీలు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకం లబ్ధిదారులకు మొత్తం 170 ఆయుష్ ప్యాకేజీలు అందుబాటులోకి రానున్నాయి. హైపర్‌టెన్షన్, డయాబెటిస్ వంటి సంక్రమించని వ్యాధులకు ఆయుర్వేద, నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి విధానాల్లో చికిత్సలు ఈ ప్యాకేజీలో ఉంటాయి. ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన(ఏబీ–పీఎంజేఏవై)ప్యాకేజీ రూపకల్పనపై నేషనల్ హెల్త్ అథారిటీ(ఎన్‌హెచ్‌ఏ)తో తమ చర్చలు తుది దశలో ఉన్నాయని కేంద్ర ఆయుష్ మంత్రి ప్రతాప్‌రావ్ జాధవ్ వెల్లడించారు. 'ఆయుష్ ఔషధాల లభ్యతను సులభతరం చేసేందుకు తహశీల్ స్థాయిలో జనౌషధి కేంద్రాల మాదిరిగా ప్రత్యేక స్టోర్లను ఏర్పాటు చేస్తాం. వీటిలో హెర్బల్, సంప్రదాయ ఔషధాలు కూడా దొరుకుతాయి'అని మంత్రి చెప్పారు. మోదీ ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం మంత్రి జాధవ్ మీడియాతో మాట్లాడారు. ఏబీ–పీఎంజేఏవై దేశంలోని 12 కోట్ల కుటుంబాలకు ఏడాదికి రూ.5 లక్షల చొప్పున విలువైన ఆరోగ్య బీమా సౌకర్యాన్ని అందించనున్నట్లు కేంద్ర ప్రకటించడం తెలిసిందే.

యూపీలో మళ్లీ జంతు దాడుల కలకలం

బహ్రాయిచ్: ఉత్తరప్రదేశ్‌లో జనంపై జంతువుల దాడులు మళ్లీ మొదలయ్యాయి. బహ్రాయిచ్ అటవీ డివిజన్, కతర్నియాఘాట్ అటవీ సంరక్షణ కేంద్రం పరిధిలో గురువారం రెండు చోట్ల చిరుతలు, మరో రెండు ప్రాంతాల్లో తోడేళ్లు ముగ్గురు చిన్నారులు సహా నలుగురిని గాయపరిచాయి. కతర్నియాఘాట్ రేంజ్‌లోని హరఖ్‌పూర్‌లో పొలంలో పనిచేసుకుంటున్న మధుసూదన్(35)పై చిరుత దాడి చేసింది. మెడకు గాయాలైన మధుసూదన్‌ను బహ్రాయిచ్ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అదేవిధంగా, సుజోలి రేంజ్‌లోని అయోధ్య పుర్వా గ్రామంలో సాహిబా(13) అనే బాలిక తన ఇంటి ఆవరణలో ఉండగా చిరుత దాడి చేసింది. ఆమె కేకలు విని కుటుంబసభ్యులు అక్కడికి రాగా చిరుత పరారయ్యింది. మెడకు తీవ్ర గాయాలైన సాహిబాను లక్నో ఆస్పత్రికి తరలించారు. బాధితులకు ప్రాణాపాయం లేదని అధికారులు తెలిపారు. మరో ఘటన..బహ్రాయిజ్ అటవీ డివిజన్ పరిధిలోని ఘూమ్ని గ్రామంలో గురువారం రాత్రి ఓ తోడేలు ఇంట్లో ఉన్న ఆరు నెలల ఆరుష్ అనే చిన్నారిపై దాడి చేసి, లాక్కెళ్లబోయింది. తల్లి కేకలు వేయడం, చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకోవడంతో అది వెళ్లిపోయింది. ఇదే ప్రాంతంలోని నాఖా గ్రామంలో ఇంట్లో నిద్రిస్తున్న మమత(5)అనే చిన్నారిపై దాడి చేసింది. కుటుంబసభ్యులు అప్రమత్తం కావడంతో అది పారిపోయింది.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో బైడెన్ బరి నుంచి తప్పుకున్నాక ట్రంప్‌ను ధీటుగా ఎదుర్కొంటున్న కమలా హారిస్ పేరు ఇప్పుడు ప్రపంచమంతటా మార్మోగుతోంది. అయితే దాదాపు రెండు దశాబ్దాల క్రితమే హారిస్‌పై నమ్మకం నిలుపుకున్న ఏకైక వ్యక్తి లారెన్ పావెల్ జాబ్స్. వాళ్లది 20 ఏళ్ల స్నేహం. శాన్‌ఫ్రాన్సిస్కో జిల్లా అటార్నీగా పోటీ చేసిన కాలం నుంచి ఇప్పుడు అధ్యక్ష అభ్యర్థిగా బరిలోకి దిగడం దాకా హారిస్‌కు చోదకశక్తిగా ఉన్నది లారెన్ పావెల్ అని చాలా మందికి తెలీదు. హారిస్‌కు ఆర్థిక, హార్దిక బలమూ ఆమే. ఆడదానికి ఆడదే శత్రువనే మూస ప్రచారాలను వెనక్కు నెట్టి ఒక మహిళ ఆర్థిక ఎదుగుదల మరెంతో మంది మహిళలకు బాసటగా నిలుస్తుందనడానికి ప్రత్యక్ష ఉదాహరణ వీళ్లిద్దరి స్నేహం.

కమలా హారిస్‌కు అండాదండా ఆమే!

- డెమొక్రాట్ల అభ్యర్థిని వెనకుండి నడిపిస్తున్న లారెన్ పావెల్ జాబ్స్
- నిధుల సేకరణలోనూ కీలక పాత్ర


హారిస్‌తో లారెన్

ఎవరీ లారెన్ పావెల్?

60 ఏళ్ల లారెన్ పావెల్ జాబ్స్... ఎమర్సన్ కలెక్టివ్ అనే దాతృత్వ, పెట్టుబడి సంస్థ వ్యవస్థాపకురాలు. ది అట్లాంటిక్ మేగజైన్‌లో పెద్ద వాటాదారు. ఆపిల్ సహ వ్యవస్థాపకుడు, మాజీ సీఈఓ దివంగత స్టీవ్ జాబ్స్ సతీమణి ఈమె.పావెల్ స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుంచి ఎంబీఏ చేశారు. ఇక్కడే 1989లో స్టీవ్ జాబ్స్‌ను కలిశారు. 1991లో వీరిద్దరూ పెళ్లి చేసుకున్నారు. ఈ దంపతులకు ముగ్గురు పిల్లలు రీడ్, ఎరిన్, ఈవ్. స్టీవ్‌జాబ్స్ మరణానంతరం ఆపిల్, డిస్నీ సంస్థల్లో వాటాలను ఆమె వారసత్వంగా పొందారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ సూచీ ప్రకారం, పావెల్ ప్రస్తుత నికర విలువ 11.5 బిలియన్ డాలర్లు. ఆమె సిలికాన్ వ్యాలీలో అత్యంత సంపన్న మహిళగా పేరొందారు.

హారిస్, లారెన్ స్నేహం..

ప్రజాజీవితం గడుపుతూ రాజకీయాలు, కళలు, సంస్కృతి పట్ల ఇద్దరూ ఒకే అభిరుచి కల్గిఉండటం ఇద్దరినీ స్నేహితులుగా మార్చింది. హారిస్‌కు నిధులు, సలహాలు అందించడమే కాకుండా ప్రజల్లో ఆదరణ పెరగడానికి లారెన్ దోహదపడ్డారు. లారెన్ కొన్నేళ్లుగా డెమొక్రటిక్ పార్టీకి నిధులు సమకూరుస్తున్నారు. 2020 నుంచి డెమొక్రటిక్ నామినీలకు, పార్టీకి దాదాపు రూ.29 కోట్ల విరాళం ఇచ్చినట్లు ఫెడరల్ ఎలక్షన్ కమిషన్ గణాంకాలు చెబుతున్నాయి. 2003లో శాన్ ఫ్రాన్సిస్కో జిల్లా అటార్నీగా పోటీ చేసిన సమయం నుంచే లారెన్.. హారిస్ వెన్నంటి ఉన్నారు. ఆ సమయంలో పావెల్ 500 డాలర్లు విరాళం ఇచ్చారు. తర్వాతి ఏడాది బే ఏరియాకు చెందిన ఇతర మహిళా నాయకులతో కలిసి వాషింగ్టన్‌లో నిర్వహించిన 'మార్చ్ ఫర్ ఉమెన్స్ లైవ్స్'లో ఇద్దరూ పాల్గొన్నారు. హారిస్ కోసం లారెన్ అనేక నిధుల సేకరణ కార్యక్రమాలను నిర్వహించారు. గత ఏడాది కమల ప్రచారానికి ఆమె దాదాపు రూ.8.37 కోట్ల విరాళాలు ఇచ్చారు. 2017లో ఓ ఇంటర్వ్యూ సందర్భంగా 2020 అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేయడం గురించి లారెన్‌ను ప్రశ్నించగా.. ''నా ఓటు హారిస్‌కే'అంటూ ప్రేక్షకుల మధ్యలో కూర్చున్న తన స్నేహితురాలు హారిస్‌ను చూపించారు.

హారిస్‌ను తెరపైకి తెచ్చి..

వాస్తవానికి జూన్‌లో బిగ్ డిబేట్ తర్వాత ప్రభ కోల్పోయిన బైడెన్‌ను అధ్యక్ష రేసు నుంచి తప్పించడానికి తెరవెనుక నుంచి లారెన్ పనిచేశారని అప్పట్లో వదంతులు వినిపించాయి. డిబేట్‌లో బైడెన్ పేలవ ప్రదర్శన చూశాక ట్రంప్‌ను ఓడించలేమేమో అని డెమొక్రటిక్ పార్టీ ప్రధాన దాతల వద్ద లారెన్ అభిప్రాయం వ్యక్తించేశారని వార్తలొచ్చాయి. పోటీలో కొనసాగుతానని బైడెన్ పట్టుబట్టడంతో హారిస్ సలహాలకోసం లారెన్‌ను సంప్రదించినట్లు సమాచారం. హారిస్‌కు మద్దతుగా ఇతర మహిళా టెక్ నాయకుల మద్దతు కూడగట్టే బాధ్యతను లారెన్ తన భుజాలకెత్తుకున్నారు. ఈ నేపథ్యంలో హారిస్ గెలిస్తే డెమొక్రాట్ల పాలనలో లారెన్ ఏదైనా పాలనా బాధ్యతలు తీసుకుంటారనే ప్రచారం జరుగుతోంది. అధికారిక పదవిలో లేకపోయినా 'ఇన్‌సైడర్'గా ఉంటారని తెలుస్తోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి ప్లస్
శనివారం: 28-9-2024

విద్యావిధానంలో కంఠస్థ పద్ధతిని తొలగించాలని సూచించినవారు?

టెట్/డీఎస్సీ ప్రత్యేకం
మెథడాలజీ

మాదిరి ప్రశ్నలు

1. రిచర్డ్ ఆర్.స్కెంప్ ప్రకారం ఆకారం, పరిమాణం, రంగు అనే గౌణ భావనల నుంచి ఏర్పడిన లేదా ఉత్పన్నమైన భావన ఏది?
1) గుణం 2) బరువు
3) గణన 4) నిర్మాణం

2. విద్యార్థికి దశాంశ భిన్నాల భావనలపై అవగాహన కల్పించడం, సమస్యల సాధనలో క్రమత, కచ్చితత్వం, క్లుప్తత లాంటి అలవాట్లు అభివృద్ధి చేయడం ఏ స్థాయి గణిత బోధనా లక్ష్యాలు?
1) ప్రాథమిక స్థాయి
2) ఉన్నత స్థాయి
3) ప్రాథమికోన్నత స్థాయి
4) సీనియర్ సెకండరీ స్థాయి

3. ఉపాధ్యాయుడు, రవిని 'మీ ఇంటిని ఇద్దరు వ్యక్తులు కలిసి 26 రోజుల్లో నిర్మిస్తే నలుగురు వ్యక్తులు ఎన్ని రోజుల్లో నిర్మిస్తారు?' అని అడిగిన ప్రశ్నకు రవి సులభంగా ఆలోచించి సమాధానం చెప్పగలగడం ఏ గణిత విలువ?
1) క్రమశిక్షణ విలువ
2) ప్రయోజన విలువ
3) వినోదపు విలువ
4) సిద్ధపరిచే విలువ

4. వైగాట్‌స్కీ ప్రకారం పరస్పర బోధన వల్ల ఏం సంభవించడంతో విద్యార్థులు పాఠ్య అవబోధనకు క్రమంగా బాధ్యత వహిస్తారు?
1) ZPD 2) సారువ
3) ఇన్‌స్ట్రక్షనల్ స్కఫోల్డింగ్
4) సామాజిక స్కఫోల్డింగ్

5. గణితంలో ఏ సమస్యాసాధన పద్ధతిలో పిల్లలకు ఆలోచనలు రేకెత్తించే సన్నివేశాలు ఉండవు?
1) నిగమన 2) విశ్లేషణ
3) ఆగమన 4) సంశ్లేషణ

6. హెర్బార్ట్ సూచించిన పాఠ్యపథక సోపానాల్లో ఏది విద్యార్థికి క్లిష్టమైనదిగా పేర్కొనవచ్చు?
1) సాధారణీకరణం 2) సమర్పణ
3) సమన్వయం 4) అన్వయం

7. ఒక సంఖ్యను 2, 5 నిశ్శేషంగా భాగించాలంటే ఆ సంఖ్య ఒకట్ల స్థానంలో ఉండాల్సిన అంకె?
ఎ) 2 బి) 5 సి) 0 డి) 7
పై ప్రశ్న ద్వారా సాధించే విద్యా ప్రమాణం 1) అనుసంధానం
2) కారణాలు తెల్పడం
3) ప్రాతినిధ్యపరచడం
4) సమస్యా సాధన

8. అభ్యసన ప్రక్రియలో గుణాత్మక, పరిమాణాత్మక అంశాలను నిర్ధారించేది?
1) మాపనం 2) మదింపు
3) మూల్యాంకనం 4) నిర్ధారణ సూచీ

9. కింది వాటిలో ఘనాకార కడ్డీలకు సంబంధించి సరికాని అంశం ఏది?
ఎ) వేటి సహాయంతో ఆరోహణ, అవరోహణ క్రియలను బోధించలేము.
బి) పెద్ద, చిన్న సైజులను పోల్చవచ్చు
సి) సమాంతరరేఖలు, సరళరేఖలు గీయడానికి ఉపయోగించవచ్చు.
డి) సమబాహు, సమద్విబాహు, విషమబాహు త్రిభుజాలను వాటి ఆకారాలను ఏర్పరచలేము.
1) ఎ, బి సరైనవి 2) బి, సి సరైనవి
3) ఎ, డి సరైనవి 4) బి, డి సరైనవి

10. నూతన ప్రాకల్పనలు, న్యాయాలు, అమరికలను అభివృద్ధి చేయడం వంటి అంశాలు ఇమిడి ఉండే లక్ష్యం?
1) విశ్లేషణ 2) సంశ్లేషణ
3) వినియోగం 4) అవగాహన

11. గణితం నేర్చుకోవడానికి, సహజమైన, అనుకూలమైన పద్ధతి ఏది?
1) ప్రతిస్థాపన పద్ధతి
2) నిగమన పద్ధతి 3) విశ్లేషణ పద్ధతి
4) సంశ్లేషణ పద్ధతి

12. 'రెండు బిందువుల ద్వారా ఒకే ఒక రేఖాఖండాన్ని గీయవచ్చు' అనే ప్రవచనం గణితం ఏ స్వభావాన్ని సూచిస్తుంది?
1) గణితం తార్కికమైనది
2) గణితం అంతర్బుద్ధితో ఏర్పడుతుంది.
3) గణితం అమూర్త లక్షణం కలిగి ఉంటుంది.
4) గణితం సహజమైన ఆలోచనా విధానాన్ని కలిగి ఉండటం

13. ప్రధానసంఖ్యలు అనంతమని తెల్పుతూ కరణీయ సంఖ్యలకు సంబంధించిన అనేక సమస్యలను సాధించిన శాస్త్రవేత్త?
1) భాస్కరాచార్య 2) బ్రహ్మగుప్త
3) యూక్లిడ్ 4) సెర్మా

14. 'గణితంలో విషయాల మీద అవగాహన యొక్క సాధారణీకరణం' అనేది ఏ విద్యా ప్రమాణంలో ఉంటుంది?
1) వ్యక్తపరచడం
2) కారణాలు, నిరూపణలు
3) అనుసంధానం
4) ప్రాతినిధ్యం దృశ్యీకరణ

15. డెరక్ హేలర్ సూచించిన గణితనమూనా విధానంలో సోపానాలు ఎన్ని?
1) 6 2) 8 3) 5 4) 4

16. గణిత సమస్యల సాధన విధానంలో అల్గారిథమ్, అడకోరిథమ్ అనే విధానాల గురించి లేదా 8 – 5 = 3 అనే అంశంలో 8ని మినార్ ఎండ్ అని, 5ని సబ్ట్రాహెండ్ అని అంటారు. ఇలాంటి విషయాలు తెలుసుకునే ప్రదేశం?
1) గణిత క్లబ్ 2) గణిత సంఘాలు
3) గణిత ఫోరం 4) గణిత ప్రదర్శనలు

17. ప్రస్తుతం పాఠశాలల్లో అమలు పరుస్తున్న పీరియడ్ ప్రణాళికలో సోపానాల వరుస క్రమాన్ని గుర్తించండి.
ఎ) బోధనాంశం బి) పాఠంపేరు
సి) సాధించాల్సిన విద్యాప్రమాణాలు
డి) పరిచయం ఇ) ప్రదర్శన-చర్చ
1) ఎ, బి, సి, డి, ఇ 2) బి, సి, ఎ, డి, ఇ
3) ఎ, సి, బి, డి, ఇ 4) బి, ఎ, సి, డి, ఇ

18. కింది ఏ మూల్యాంకన రకానికి నిర్దిష్ట సమయం ఇవ్వనవసరం లేదు?
1) లోపనిర్ధారణ 2) నిర్మాణాత్మక
3) సంగ్రహణాత్మక
4) ప్రిడెక్టివ్ లేదా ప్రాగుక్తి

19. ప్రాచీనులు పిలిచిన అవ్యక్తగణితం అనే దానిని బీజగణితం అనే పేరుతో వ్యవహార రూపంలోకి తీసుకువచ్చిన మొదటి గణిత శాస్త్రవేత్త?
1) భాస్కరాచార్య 2) యూక్లిడ్
3) పృథూదకస్వామి 4) వరాహమిహిరుడు

20. గణిత సంఘ ప్రాథమిక ప్రాధాన్యతలో దేని నిర్వహణ చాలా కీలకమైనది ముఖ్యమైనది?
1) ఫ్లానల్ బోర్డ్ 2) బులెటిన్ బోర్డ్
3) జియోబోర్డ్ 4) డిస్‌ప్లే బోర్డ్

21. $\sqrt{625} = ?$ ఈ ప్రశ్న లక్ష్యం?
1) అవగాహన 2) వినియోగం
3) జ్ఞానం 4) నైపుణ్యం

22. ప్రాథమికోన్నత స్థాయిలో సమాంతర రేఖల ధర్మాలు బోధించడానికి అనువైన బోధనా పద్ధతి?
1) విశ్లేషణ 2) ప్రాజెక్ట్
3) ప్రయోగశాల
4) సమస్యా పరిష్కారం

23. గొప్పకట్టడాల్లో గణిత సౌష్టవం దాగి ఉంది. ఇవన్నీ గణిత శాస్త్ర సూత్రాల ఆధారంగా నిర్మించబడ్డాయి అని తెలిపే విలువ?
1) సాంస్కృతిక విలువ
2) క్రమశిక్షణ విలువ
3) ప్రయోజన విలువ
4) సృజనాత్మక విలువ

24. సమాధానం ఇచ్చేటప్పుడు విద్యార్థికి స్వేచ్ఛను



ఇచ్చే ప్రశ్నలు?
1) విషయనిష్ఠ 2) వ్యాసరూప
3) సంక్షిప్త సమాధాన
4) పూరక ప్రశ్నలు

25. సాంఘికశాస్త్ర బోధనలో ఏ విధమైన ప్రశ్నల ద్వారా విద్యార్థులు విషయాన్ని స్వయంగా కనిపెట్టి కొత్త సాధారణీకరణాలను రూపొందిస్తారు?
1) పునర్విమర్శ ప్రశ్నలు
2) పాఠ్యాభివృద్ధి ప్రశ్నలు
3) పరీక్షించడానికి ఉపయోగపడే ప్రశ్నలు
4) నియత ప్రశ్నలు

26. భూమధ్యరేఖా ప్రాంతం గురించి చదివిన తరువాత.. దానికి, ధ్రువ ప్రాంతానికి ఉన్న తేడా ఏమిటి? అనే ప్రశ్న ద్వారా సాధించే విద్యా ప్రమాణం?
1) ఇచ్చిన పాఠాన్ని చదివి అర్థం చేసుకొని వ్యాఖ్యానించడం
2) సమాచార నైపుణ్యాలు
3) సమకాలీన అంశాలపై ప్రతిస్పందన
4) విషయవగాహన

27. 'సాంఘిక శాస్త్రం అనగా చారిత్రక, భౌగోళిక, సాంఘిక విషయాల అంతర్ సంబంధాల అధ్యయనమే' అని పేర్కొన్నవారు?
1) జేమ్స్ హేమింగ్స్
2) జాన్.వి.మైకేల్స్
3) E.B. వెస్లీ 4) కొఠారి

28. 1986 జాతీయ విద్యా విధానంలోని పేర్కొనని అంశం గుర్తించండి.
1) స్త్రీ, పురుష సమానత్వం
2) భారత ప్రజలకు బీమా భద్రత
3) పరిసరాల సంరక్షణ
4) శాస్త్రీయ ధోరణి

29. విద్యార్థుల అభ్యసనంలో ఎదురయ్యే అన్ని ప్రశ్నలకు సమాధానాలిస్తూ కొనసాగుతూ, విశ్లేషణాత్మక, నిరంతర పరిశోధనాత్మక ఉపగమం ఏది?
1) బహుళ విభాగ ఉపగమం
2) క్రమబద్ధ శిక్షణ ఉపగమం
3) పరస్పరాధారిత ఉపగమం
4) సమస్య ఆధారిత ఉపగమం

30. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు అనే అంశాన్ని చక్కగా అవగాహన కలిగించడానికి ఉపయోగపడే చార్టు?
1) ఫ్లోచార్ట్ 2) టైమ్‌లైన్ చార్ట్
3) వంశ వృక్షచార్టు 4) టేబుల్ చార్ట్

31. పాఠశాలలో విద్యార్థి శిక్షణా కార్యక్రమాలైన బోధనాంశాలు, కళలు, సాంకేతికవిద్య, ఆరోగ్య వ్యాయామవిద్య, జీవన ప్రమాణాలు మొదలైన అంశాల గురించి క్షుణ్ణంగా వివరించే రికార్డు?
1) ప్రోగ్రెస్ రికార్డ్ 2) క్యుములేటివ్ కార్డు
3) CCE రిజిస్టరు 4) వ్యక్తిగత రికార్డు

32. విద్యార్థుల భాషా సామర్థ్యాలు, వారి నిజాయితీ, అభిరుచులు, ఆసక్తులు మొదలైనవి తెలుసుకోవడానికి ఉపయోగపడే సాధనం?
1) లఘుపరీక్ష 2) పోర్ట్ ఫోలియో
3) పిల్లలడైరీ 4) ప్రాజెక్ట్ పనులు

33. ఒక సాంఘికశాస్త్ర బోధకుడు మొదట గ్రామం, తరువాత జిల్లా, రాష్ట్రం, దేశం గురించి పరిచయం చేశాడు. అయితే ఈ అంశంలో సరైనటువంటి అనుభవాల స్వరూప లక్షణాలు ఉన్నాయి గుర్తించండి.
ఎ) తెలిసిన విషయం నుంచి తెలియని విషయం
బి) సరళత నుంచి సంక్లిష్టత
సి) కష్టం నుంచి తేలికవైపునకు
డి) ఊర్ధ్వముఖ ఆలోచన
1) ఎ, బి, సి సరైనవి 2) బి, సి, డి సరైనవి
3) ఎ, సి, డి సరైనవి 4) ఎ, బి, డి సరైనవి

34. గ్రీక్ తత్వవేత్తలు తమ శిష్యులతో అనేక విషయాలను చర్చించిన పద్ధతి?
1) సారూప్య పద్ధతి 2) చర్చా పద్ధతి
3) సమస్యా పద్ధతి 4) ప్రకల్పనా పద్ధతి

35. NCF-2005 ప్రకారం ఎలిమెంటరీ స్థాయి వరకు సాంఘికశాస్త్ర బోధన ఏ పద్ధతిలో సాగాలి?
1) విభాగాల పద్ధతి 2) సమ్మిళిత విధానం
3) అంశాల పద్ధతి 4) ప్రత్యేకశాస్త్ర పద్ధతి

36. 'సాంఘికశాస్త్ర పరిధి చాలా విశాలమైంది. సాంఘికశాస్త్రం ప్రపంచవ్యాప్తంగా మానవుని ప్రస్తుత సమాజానికి సంబంధించింది' అని పేర్కొన్నవారు?
1) హేమింగ్స్ 2) ఆడమ్స్
3) వెస్లీ & రాన్‌స్కీ 4) నికోలస్ రైట్

37. మానసిక చలనాత్మక రంగంలో ఏ లక్ష్యంలో చలనేంద్రియాలకు బదులు జ్ఞానేంద్రియాలు ప్రధాన పాత్రను పోషిస్తాయి?
1) హస్తలాఘవం 2) అనుకరణ
3) సునిశితత్వం 4) సహజీకరణ

38. విద్యార్థుల ప్రతిభను లేదా వారిలోని అవగాహన లోపాన్ని నమోదు చేసి ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించడానికి ఉపయోగపడేది?
1) పిల్లల డైరీ 2) టీచర్స్ డైరీ
3) శోధన సూచిక 4) రేటింగ్ స్కేలు

39. వైగాట్‌స్కీ ZPDకి సంబంధం ఉన్న పద్ధతి?
1) ప్రయోగశాల 2) సహకార అభ్యసనం
3) సహయోగ అభ్యసనం
4) 5E అభ్యసన నమూనా

40. కిందివాటిలో సరైన దానిని గుర్తించండి.
ఎ) భావనలు సాధారణీకరణంలో భాగం
బి) సాధారణీకరణాలు భావనలలో భాగం
సి) మొక్కలు నీటిని పీల్చుకుంటాయి అనేది ఒక యథార్థం
డి) నియమిత పరిస్థితులలో మాత్రమే యథార్థమై, సప్రమాణత కలిగిఉండేది సూత్రం
1) ఎ, డి సరైనవి 2) బి, డి సరైనవి
3) ఎ, సి సరైనవి 4) బి, సి సరైనవి

41. ద్రవ పదార్థాలను వేడిచేసినప్పుడు అవి వ్యాకోచిస్తాయని విద్యార్థి తెల్పగలగడం ఏ విద్యా ప్రమాణం?
1) పరికల్పన-ప్రశ్నించడం
2) ప్రయోగాలు క్షేత్రపరిశీలనలు
3) సమచార సేకరణ 4) విషయావగాహన

42. అభినందించే గుణం అభివృద్ధి చెందే వర్గం?
1) ప్రతిస్పందన 2) విలువకట్టడం
3) వ్యవస్థాపన 4) గ్రహించటం

43. అన్వేషణ పద్ధతిలో విషయజ్ఞాన సముపార్జన కన్నా శాస్త్రీయ విధానానికి ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నవారు?
1) ఆర్మ్ స్ట్రాంగ్ 2) థర్‌స్టన్
3) ప్రస్టన్ 4) వెస్టవే

44. 5E నమూనాలో ఏ దశలో అభ్యాసకులు తమ అనుభవాల ద్వారా సంపాదించిన జ్ఞానాన్ని నూతన పరిస్థితులలో వినియో గించుకుంటారు?
1) విస్తరణ 2) విశ్లేషణ
3) పాల్గొనడం 4) వివరణ

45. ఒక 'అధీకృత నియమం' లేదా మార్గదర్శ కత్వానికి నిర్దిష్ట ప్రమాణంగా ఉండేది ఏది?
1) రేటింగ్ స్కేలు 2) పరిశీలన పత్రము
3) రూబ్రిక్స్ 4) సంచిత పత్రావళి

సమాధానాలు

1) 1	2) 1	3) 2	4) 1	5) 4
6) 1	7) 2	8) 2	9) 3	10) 2
11) 1	12) 2	13) 3	14) 1	15) 4
16) 3	17) 4	18) 1	19) 3	20) 2
21) 4	22) 3	23) 1	24) 2	25) 2
26) 4	27) 1	28) 2	29) 2	30) 2
31) 2	32) 3	33) 4	34) 2	35) 2
36) 4	37) 2	38) 2	39) 3	40) 4
41) 4	42) 2	43) 4	44) 1	45) 3

మృత్తికలు.. సాగుకు మూలాధారం!

జనరల్ స్టడీస్
భూగోళశాస్త్రం

మృత్తికలు

వ్యవసాయానికి కీలకమైన మృత్తికలు క్రమేణా క్రమక్షయం చెందుతున్నాయి. ఇది ఆవరణ వ్యవస్థల సుస్థిరతపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది. పర్యావరణ సమతౌల్యం సాధించడానికి మృత్తికా సంరక్షణ అనివార్యం. మనదేశంలోని మృత్తికలు...
1. ఒండ్రుమట్టి నేలలు 2. నల్లరేగడి నేలలు
3. ఎర్ర నేలలు 4. నలుపు-ఎర్ర మిశ్రమ నేలలు
5. లేటరైట్ నేలలు 6. ఎడారి నేలలు
7. అటవీ నేలలు 8. క్షార లేదా ఆమ్ల నేలలు

ఒండ్రుమట్టి నేలలు

ఈ నేలలు గంగా-సింధు-బ్రహ్మపుత్ర మైదానం, తీర మైదానాలు, డెల్టాలు, నదీ హరివాణ ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. ఈ నేలలు చాలా సారవంతమైనవి. వీటిలో పంట దిగుబడి అధికంగా ఉంటుంది. ఒండ్రుమట్టి నేలలు రవాణా నేలల తరగతికి చెందినవి. మాతృక శిలలు వేర్వేరు ప్రాంతాలకు చెందినవి. దాంతో ఒండ్రుమట్టి నేలల్లో వివిధ స్థూల, సూక్ష్మ పోషకాలు ఉంటాయి. అందువల్ల ఈ నేలలు అనేక రకాల పంటల సాగుకు అనువైనవి. ఈ నేలలు లోమి(Loamy) తరగతికి చెందినవి కావడం వల్ల తేమను బాగా పీల్చుకొని నిల్వ ఉంచుకుంటాయి. మృత్తికా కణాలు గోళాకారంలో ఉండటం వల్ల ఈ నేలలు దున్నడానికి చాలా అనువైనవి. ఒండ్రుమట్టి నేలలను తీర ప్రాంత, నదీ, డెల్టా అని మూడు రకాలు విభజించారు. ప్రతి ఏటా శిలా పదార్థాలు నిక్షేపించడం వల్ల డెల్టా నేలలు సారవంతంగా తయారవుతాయి. సాపేక్షంగా పరిశీలిస్తే తీరప్రాంత ఒండ్రుమట్టి నేలల్లో వ్యవసాయ దిగుబడి తక్కువ.

నల్లరేగడి నేలలు

వింధ్యా-సాత్పురా పర్వత శ్రేణుల నుంచి మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వరకు నల్లరేగడి మండలం విస్తరించి ఉంది. ఈ నేలలు ప్రధానంగా గుజరాత్, మధ్యప్రదేశ్‌లలోని మాళ్వా పీఠభూమి, పశ్చిమ మహారాష్ట్ర, ఉత్తర కర్ణాటక, పశ్చిమ తెలంగాణ ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. దక్కన్ నాపల ప్రాంతంలో బసాల్ట్ తరగతికి చెందిన అగ్నిశిలలు తీవ్ర క్రమక్షయం వల్ల నల్లరేగడి నేలలుగా ఏర్పడ్డాయి. ఇవి తేమను పీల్చుకొని ఎక్కువ కాలం తమలో నిల్వ చేసుకుంటాయి. అందువల్ల ఈ నేలలు వర్షాధార వ్యవసాయానికి అనువైనవి. నీటి ముంపునకు గురైతే ముద్దగా మారి సాగుకు అనువుగా ఉండవు. అందువల్ల నల్లరేగడి నేలల్లో సాగునీటి వ్యవసాయం సాధ్యం కాదు. ఇవి పత్తిసాగుకు చాలా అనువైనవి.

ఎర్రనేలలు

భారత్‌లోని పీఠభూమి ప్రాంతంలో ఈ నేలలు విస్తరించి ఉన్నాయి. ఇవి పోషకాల పరంగా సారవంతమైనవి. అయితే ఎర్ర ఇసుక నేలల్లో పంటల దిగుబడి తక్కువ. తెలంగాణ , రాయలసీమ, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లోని నేలలు ఈ తరగతికి చెందినవి. గులకరాళ్లు, బండరాళ్లు పరుచుకొని ఉంటాయి. అందువల్ల ఈ నేలలను సాగులోకి తేవడం చాలా వ్యయ ప్రయాసలతో కూడుకున్నది. ఈ నేలలను ఆంధ్రప్రదేశ్‌లో స్థానికంగా చెలకలు అంటారు. వీటిలో పంటల దిగుబడి తక్కువ. వరుసగా పంటలను సాగు చేస్తే త్వరగా సారాన్ని కోల్పోతాయి. సాగునీరు, ఎరువులను వాడటం వల్ల దిగుబడిని స్థిరీకరించవచ్చు. ఎర్రనేలలు, నల్లరేగడి మండలాల మధ్య ప్రాంత నేలల్లో ఈ రెండింటి మిశ్రమ లక్షణాలు కనిపిస్తాయి.

లేటరైట్ నేలలు

భారతదేశంలోని కొండలు, పీఠభూమి శిఖర భాగాల్లో లేటరైట్ నేలలు ఏర్పడ్డాయి. అధిక వర్షపాతం, ఉష్ణోగ్రత ఉన్న ప్రాంతాల్లో ఇవి ఏర్పడతాయి. ఖనిజ పోషకాలు ఈ నేలల పైపొరల నుంచి కింది పొరల్లోకి ఇంకిపోతాయి. దీనివల్ల పైపొరల్లో కేవలం ఫెర్రస్ ఆక్సైడ్, అల్యూమినియం హైడ్రాక్సైడ్ లాంటి ఖనిజాలు మాత్రమే మిగులుతాయి. అందువల్ల ఇవి వ్యవసాయానికి అంతగా అనువైనవి కావు. ఈ నేలలు ముదురు జేగురు వర్ణంలో ఉంటాయి. సహ్యాద్రి, అన్నామలై, వింధ్యా పర్వతాలు, తూర్పు కనుమల శిఖరాల్లోని నేలలు ఈ కోవకు చెందినవి.

ఎడారి నేలలు

ఈ నేలలు పశ్చిమ రాజస్థాన్, ఉత్తర గుజరాత్‌లలో విస్తరించి ఉన్నాయి. వీటి పైపొరల్లో కఠిన లవణాలు ఉంటాయి. అందువల్ల ఇవి వ్యవసాయానికి పనికిరావు. సాగు నీటి ద్వారా ఉపరితల కఠిన పొరను తొలగిస్తే పంటలు పండించే అవకాశం ఉంటుంది. పశ్చిమ రాజస్థాన్ లోని ఇందిరాగాంధీ కాలువ ఆయకట్టు ప్రాంతంలో సాగునీటి ద్వారా కఠిన లవణ పొరను తొలగించి పంటలను సాగు చేస్తున్నారు.

ఆమ్ల (క్షార) మృత్తికలు

నిస్సారమైన ఈ మృత్తికలు ఒండ్రుమట్టి నేలల్లో చెదురుమదురుగా కనిపిస్తాయి. ఈ మృత్తికలను స్థానికంగా కల్లార్, రే, ఉసార్, నేలలు అంటారు. ఈ చౌడు నేలలను తటస్థీకరించడానికి సున్నం, జింక్‌లను నేలలకు కలుపుతారు. ఈ మృత్తికల్లో వ్యవసాయ పంటల దిగుబడి తక్కువ. కేరళ తీర ప్రాంతంలోని కొచ్చిన్, అల్లెప్పీల సమీపంలో 'పీట్' తరగతికి చెందిన నేలలు విస్తరించి ఉన్నాయి.

మృత్తికా సంరక్షణ చర్యలు

వేగంగా ప్రవహించే నదుల వల్ల మృత్తికా క్రమక్షయం జరుగుతుంది. కొండల వాలులో చెట్లు నాటడం వల్ల నేలల క్రమక్షయాన్ని తగ్గించవచ్చు. మృత్తికా సంరక్షణ కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోంది. కాంటూర్ బండింగ్, సోపాన వ్యవసాయం, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, వాటర్‌షెడ్ పథకాల నిర్వహణపై దృష్టి కేంద్రీకరిస్తోంది. నేలల క్రమక్షయాన్ని తగ్గించడానికి రైతులు మల్చింగ్, స్ట్రిప్‌క్రాపింగ్ వంటి పద్ధతులను అనుసరిస్తున్నారు. పంట చేతికొచ్చిన తర్వాత మిగిలిన రొట్టను పొలంలోనే ఉంచి దున్నడం ద్వారా నేలల సారాన్ని పెంచొచ్చు. మల్చింగ్ పద్ధతిలో రొట్టను పొలంలో పరిచి, పవనాల వల్ల నేలల క్రమక్షయాన్ని అరికట్టొచ్చు. స్ట్రిప్ క్రాపింగ్ పద్ధతిలో వివిధ కాల వ్యవధుల్లో కోతకు వచ్చే పంటలను వరుసల్లో పెంచుతారు. చంబల్-యమునా లోయ ప్రాంతంలో నేలల తీవ్ర క్రమక్షయం వల్ల గల్లీలు, రావైన్‌లు ఏర్పడి ఆ ప్రాంతమంతా 'బ్యాడ్‌ల్యాండ్' భూస్వరూపాన్ని సంతరించుకుంది. ఈ ప్రాంతంలో భూవనరులను పునరుద్ధరించడానికి ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తోంది. పంటల మార్పిడి పద్ధతి ద్వారా కూడా నేలల సారం పెంచొచ్చు. లెగ్యూమ్ జాతికి చెందిన పంటలను మార్పిడి పంటగా వాడుతున్నారు!!

రాణిగంజ్.. దేశంలోని అతిపెద్ద బొగ్గు క్షేత్రం

భారతదేశంలో విస్తారమైన బొగ్గు నిల్వలు ఉన్నాయి. వీటిలో కోకింగ్ రకం తక్కువగా ఉండటం వల్ల ఆస్ట్రేలియా, చైనాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. నదీ పరీవాహక ప్రాంతాల్లో సహజ వాయువు అపారంగా లభిస్తోంది. సహజ వాయువు రంగంలో స్వయం సమృద్ధి సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

భారతదేశం- ఇంధన వనరులు

ఇంధనాలు ప్రధానంగా రెండు రకాలు అవి
1) శిలాజ ఇంధనాలు
ఉదా: బొగ్గు, చమురు, సహజవాయువు.
2) అణు ఇంధనాలు
ఉదా: యురేనియం, థోరియం, ప్లుటోనియం, రేడియం.

భారతదేశంలో సుమారుగా 220 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఇందులో 200 బిలియన్ టన్నులు బిట్యూమినస్, 20 బిలియన్ టన్నులు లిగ్నైట్ రకానికి చెందినవి. ఆంథ్రసైట్, పీట్ తరగతికి చెందిన బొగ్గు నిల్వలకు మనదేశంలో అంతగా ప్రాధాన్యం లేదు.

బొగ్గు నిల్వలు: భారతదేశంలో బొగ్గు నిల్వలు ప్రధానంగా గోండ్వానా యుగానికి చెందినవి. ఇవి సుమారు 200 మిలియన్ సంవత్సరాల క్రితం నదీ హరివాణాల్లో ఏర్పడ్డాయి. భారతదేశపు బొగ్గు నిల్వలు ప్రధానంగా నాన్‌కోకింగ్ రకానికి చెందినవి. కోకింగ్ రకానికి చెందిన నాణ్యమైన బొగ్గును ఉక్కు కర్మాగారాల్లోని బ్లాస్ట్ ఫర్నేస్‌లలో వాడతారు. ఈ కోకింగ్ బొగ్గు నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయి.

బొగ్గు క్షేత్రాలు: భారతదేశంలో బొగ్గు క్షేత్రాలు దామోదర్, మహానది, సోన్, గోదావరి, వార్ధా నదీ హరివాణాల్లో కేంద్రీకృతమై ఉన్నాయి. దేశంలో 60 శాతం బొగ్గు దామోదర్ నదీలోయ క్షేత్రాల నుంచే ఉత్పత్తి అవుతోంది. దామోదర్ నదీలోయ జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో విస్తరించి ఉంది. ఝరియా, రాణిగంజ్, గిర్డి, బొకారో, పాతకేరా ఈ ప్రాంతంలోని అతి పెద్ద బొగ్గు క్షేత్రాలు. పశ్చిమబెంగాల్‌లో రాణిగంజ్.. దేశంలోని అతిపెద్ద బొగ్గు క్షేత్రం. మహానది-సోన్ నదీ హరివాణాలు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. ఇది గోదావరి-వార్ధా లోయ తెలంగాణ, మహారాష్ట్రల్లో విస్తరించి ఉంది. ఇక్కడ కోర్బా, సింగ్రోలి, టాల్చేర్, ఇబ్‌లోయ, బిలాస్‌పూర్ ముఖ్యమైన బొగ్గు క్షేత్రాలు. మహారాష్ట్రలోని కాంప్టీ, చాందా, బలార్షా బొగ్గు క్షేత్రాలు, తెలంగాణలోని సింగరేణి బొగ్గు క్షేత్రం ఈ లోయలో భాగంగా ఉన్నాయి.

ఈశాన్యంలో బొగ్గు నిల్వలు: ఈశాన్య భారత దేశంలోని బొగ్గు నిల్వలు టెరిషరీ యుగానికి చెందినవి. వీటి బొగ్గులో గంధకం శాతం ఎక్కువ. అందువల్ల ఈ బొగ్గు పారిశ్రామిక విలువ తక్కువ. ఈశాన్య భారతంలో అసోం, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్ రాష్ట్రాల్లో బొగ్గు నిల్వలున్నాయి. అసోంలోని మాకుమ్, నాగాలాండ్‌లోని నజీరా లోయ ప్రధాన బొగ్గు క్షేత్రాలు.

లిగ్నైట్ బొగ్గు: లిగ్నైటు బొగ్గు మృదువైంది. దీన్ని విద్యుత్ ఉత్పత్తికి మాత్రమే ఉపయోగిస్తారు. తమిళనాడు, డార్జిలింగ్, రాజస్థాన్‌లలో నిల్వలు ఉన్నాయి.

పీట్ బొగ్గు: పీట్ బొగ్గు అపరిపక్వమైంది. ఇందులో సేంద్రియ పదార్థం ఎక్కువగా ఉంటుంది. దీని కెలోరి విలువ చాలా తక్కువ. 'పీట్' తరగతికి చెందిన బొగ్గు నిల్వలు కేరళలోని కొచ్చిన్, అల్లెప్పీలలో విస్తరించి ఉన్నాయి.

అవక్షేప శిలల్లో చమురు: చమురు- సహజవాయువు నిల్వలు అవక్షేప శిలల్లో మాత్రమే లభిస్తాయి. ఖండ భాగాల్నే కాకుండా సముద్ర భూతలంపైన ఖండతీర అంచుల్లో కూడా చమురు సహజ వాయువు నిల్వలు ఉంటాయి. మహారాష్ట్ర తీరంలోని ముంబై హై, బేసిన్ క్షేత్రాలు భారతదేశంలో చమురు, సహజవాయువును ఉత్పత్తి చేసే ముఖ్య ప్రాంతాలు. గుజరాత్ తీరంలోని కంభత్ సింధుశాఖలో గాంధార్, వాస్నా, లూనెజ్ ముఖ్య క్షేత్రాలు. గుజరాత్ ఖండాంతర్భాగంలో మెహసానా, కాలోల్, అంకలేశ్వర్, హజీరా ఇతర చమురు-సహజవాయువు క్షేత్రాలు.

యురేనియం నిల్వలు: మనదేశంలో యురేనియం నిల్వలు జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, మేఘాలయా, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. జార్ఖండ్‌లోని 'జాడుగుడా' ముఖ్యమైన యురేనియం గనుల కేంద్రం. మేఘాలయాలోని డొమియోస్టాట్, ఆంధ్రప్రదేశ్‌లోని కడప, తెలంగాణలో నల్గొండల్లో యురేనియం నిల్వల ఉన్నాయి.

మోనజైట్: కేరళ తీరంలోని ఇసుకలో మోనజైట్ లభిస్తోంది. ఇది ఇసుక, థోరియం, యురేనియం, ప్లుటోనియంల మిశ్రమం. ప్రపంచ మోనజైట్ నిల్వల్లో భారతదేశం మొదటి స్థానంలో ఉంది. ఈ గనులు, వాటి శుద్ధి కేంద్రాలు కేరళలోని క్విలన్, తమిళనాడులోని మనం కురిచ్చి, మహారాష్ట్రలోని రత్నగిరి, ఒడిశాలోని ఛత్రపూర్‌లలో ఉన్నాయి.

ఉద్యోగాలు

హాల్, అమేథీలో 81 ఆపరేటర్ పోస్టులు

అమేథీ(ఉత్తరప్రదేశ్)లోని కోర్వాలో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్).. తాత్కాలిక ప్రాతిపదికన ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 81.
» **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఫిట్టింగ్, కెమికల్, టర్నింగ్, ల్యాబ్, ఎలక్ట్రో ప్లేటింగ్, వెల్డింగ్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభా గంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ(బీఏ/బీఎస్సీ/ బీబీఏ) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీల కు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూ బీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.22,000 నుంచి రూ.23,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, సర్టిఫికేట్ల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.10.2024.
» **వెబ్‌సైట్:**https://hal-india.co.in

బామర్ లారీ లిమిటెడ్, కోల్‌కతాలో వివిధ ఉద్యోగాలు

కోల్‌కతాలోని బామర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్ ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07.
» **పోస్టుల వివరాలు:** మేనేజర్-01, డిప్యూటీ మేనేజర్-01, అసిస్టెంట్ మేనేజర్-01, ఆఫీసర్/జూనియర్ ఆఫీసర్-04.
» **విభాగాలు:** ఛానల్ సేల్స్, వెకేషన్స్, కార్పొరేట్ బిజినెస్, ట్రావెల్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, ఎంటీఎం/ఎంబీఏ/గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** మేనేజర్ పోస్టుకు 38 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్ పోస్టుకు 35 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు 32 ఏళ్లు, ఆఫీసర్/జూనియర్ ఆఫీసర్ పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, మెడికల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 04.10.2024.
» **వెబ్‌సైట్:** www.balmerlawrie.com

దేనికి ఫుట్‌బాల్ లాంటి నిర్మాణం ఉంటుంది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం

మాదిరి ప్రశ్నలు

ఇటీవల డిసెంబర్ 2018లో జరిగిన ఆర్‌ఆర్‌బీ పరీక్షల ప్రశ్నల సరళిని గమనిస్తే రసాయన శాస్త్రంలో అనువర్తిత అంశాలపై కాకుండా నేరుగా ప్రశ్నలు అడగడాన్ని గమనించవచ్చు. 8-10వ తరగతి పాఠ్యాంశాలపై అవగాహన ఉంటే సరిపోతుంది.

1. మెండలీఫ్ ఆవర్తన పట్టికలోని గ్రూపులు ఎన్ని?

1) 8 2) 8
3) 18 4) 14

జ: 2;

వివరణ: డాబర్‌నీర్, న్యూలాండ్స్, లోథర్‌మేయర్‌ల తర్వాత విస్తృతంగా మూలకాల వర్గీకరణ చేపట్టిన శాస్త్రవేత్త రష్యాకు చెందిన డిమిత్రీ మెండలీఫ్.

మెండలీఫ్ అప్పటికే కనుగొన్న 63 మూలకాలను, వాటి పరమాణు భారాల ఆరోహణ క్రమంలో అమర్చినప్పుడు, నిర్దిష్ట వ్యవధులతో మూలకాల ధర్మాలు పునరావృతం కావడం గమనించాడు. దీని ఆధారంగానే 'మూలకాల ధర్మాలు, వాటి పరమాణు భారాల ఆవర్తన ప్రమేయాలు' అనే ఆవర్తన నియమాన్ని ప్రతిపాదించాడు.

మెండలీఫ్ ఆవర్తన పట్టికలో 7 పీరియడ్‌లు (అడ్డువరసలు), ఎనిమిది గ్రూప్‌లు (నిలువు గడులు) ఉన్నాయి.

2. కింది వాటిలో ఆవర్తన పట్టికలో భాగం కానివేవి?


1) హాలోజెన్‌లు 2) కార్సినోజెన్‌లు
3) లాంథనైడ్‌లు 3) ఆక్టినైడ్‌లు

జ: 2

వివరణ: 1, 3, 4లు ఆధునిక ఆవర్తన పట్టికలోని వివిధ కుటుంబాల పేర్లు. కార్సినోజెన్‌లు అంటే క్యాన్సర్ కారక సమ్మేళనాలు.

ఆవర్తన పట్టికలో వివిధ గ్రూపుల్లోని మూలకాలను, వాటి ధర్మాల ఆధారంగా వివిధ పేర్లతో వ్యవహరిస్తారు.

- మొదటి గ్రూప్ (IA లేదా 1)లోని మూలకాలు (Li, Na, K, Rb, Cs) ఆక్సైడ్‌లు నీటిలో కరిగి బలమైన క్షారాలనిస్తాయి. అందుకే వీటిని క్షార లోహాలు అంటారు.
- రెండో గ్రూపు (IIA లేదా 2) మూలకాలు (Be, Mg, Ca, Sr, Ba) ప్రకృతిలో స్వేచ్ఛా స్థితిలో లభిస్తాయి. వీటి ఆక్సైడ్‌లు ఉష్ణ స్థిరత్వం (వేడి చేసినా విఘటనం చెందని ధర్మం) కలిగి క్షార ధర్మాలను ప్రదర్శిస్తాయి. వీటిని క్షార మృత్తిక లోహాలు అంటారు.
- 15వ గ్రూప్ (15 లేదా VA) మూలకాలైన N, P, As, Sb, Biలను నిక్టోజన్‌లు అంటారు. గ్రీక్ భాషలో Pnico అంటే ఊపిరాడకుండా చేయు అని అర్థం.
- 16వ గ్రూప్ (VIA) మూలకాలైన O, S, Se, Te, Poలను చాల్కోజన్‌లు అంటారు. అనేక మూలకాలు, ధాతువులు ఆక్సిజన్ లేదా సల్ఫర్ సమ్మేళనాలుగా ఉంటాయి. అందుకే వీటిని చాల్కోజన్‌లు (ధాతువులను ఏర్పరచేవి) అంటారు.
- 17వ గ్రూప్ (VIIA) గ్రూప్‌లోని F, Cl, Br, Iలను హాలోజన్‌లు అంటారు. వీటికి లవణాలను ఏర్పరిచే (హాలస్: లవణాలను ఏర్పర్చడం) గుణం ఉండటం వల్ల అలా పిలుస్తారు.
- 18వ గ్రూప్ (O గ్రూప్)నకు చెందిన He, Ne, Ar, Kr, Xe, Rnలకు చర్యాశీలత దాదాపుగా ఉండదు. అందుకే వీటిని జడవాయువులని అంటారు.
- ఆవర్తన పట్టికలో s-బ్లాక్, p-బ్లాకులను కలుపుతూ ఉన్న 10 గ్రూపుల మూలకాలను d-బ్లాక్ మూలకాలంటారు. వీటిలో జింకు గ్రూప్ తప్ప మిగిలిన మూలకాలను పరివర్తన మూలకాలంటారు. f -బ్లాక్ మూలకాలను అంతర పరివర్తన మూలకాలంటారు.
- ఇక జడవాయువులు, పరివర్తన, అంతర పరివర్తన మూలకాలు తప్ప మిగిలిన మూలకాలన్నిటిని ప్రాతినిధ్య మూలకాలని పిలుస్తారు.



3. ఒక మూలకం ఎలక్ట్రాన్ విన్యాసం 2, 8, 2. ఆధునిక ఆవర్తన పట్టికలో అది____వ గ్రూప్‌నకు చెందుతుంది.

1) 5 2) 8 3) 2____ 4) 12

జ: 3;

వివరణ: వివిధ కర్పరాల్లోని ఉపకర్పరాల్లో ఎలక్ట్రాన్ ఏ విధంగా వితరణ చెంది ఉన్నాయో ఎలక్ట్రాన్ విన్యాసం తెలియజేస్తుంది. వివిధ కక్ష్యల్లోని ఎలక్ట్రాన్‌ల సంఖ్యను 'కామా' గుర్తుతో వేరు చేస్తారు. చివరి కర్పరాల్లోని ఎలక్ట్రాన్‌లను వేలన్స్ ఎలక్ట్రాన్‌లు అంటారు. పై ప్రశ్నలో వేలన్స్ ఎలక్ట్రాన్‌ల సంఖ్య 2 కాబట్టి దీని గ్రూప్ సంఖ్య 2. వేలన్స్ ఎలక్ట్రాన్‌ల సంఖ్య ఆధారంగా గ్రూప్‌లను కింది విధంగా గుర్తించవచ్చు.

వేలెన్స్ ఎలక్ట్రాన్‌లు	1	2	3	4	5	6	7	8
గ్రూపు	1 IA	2 IIA	13 IIIA	14 IVA	15 VA	16 VIA	17 VIIA	18 O
మూలకం ఎలక్ట్రాన్ విన్యాసం	Li 2, 1	Be 2, 2	B 2, 3	C 2, 4	N 2, 5	O 2, 6	F 2, 7	Ne 2, 8
మూలకం ఎలక్ట్రాన్ విన్యాసం	Na 2, 8, 1	Mg 2, 8, 2	Al 2, 8, 3	Si 2, 8 ,4	P 2, 8, 6	S 2, 8,6	Cl 2, 8, 7	A 2, 8, 8

4. కింది వాటిలో దేని పరమాణుకత ఒకటి?

1) ఆక్సిజన్ 2) ఆర్గాన్
3) హైడ్రోజన్ 4) సల్ఫర్

జ: 2

వివరణ: ఒక అణువులోని పరమాణువుల సంఖ్యను దాని పరమాణుకత అంటారు. వేర్వేరు మూలకాల పరమాణుకత వేర్వేరుగా ఉంటుంది.

- లోహాల పరమాణుకత ఒకటి (ఉదా: లిథియం, సోడియం, ఐరన్)
- జడవాయువుల పరమాణుకత ఒకటి (హీలియం , నియాన్, ఆర్గాన్, క్రిప్టాన్, క్జినాన్, రేడాన్)
- ఆక్సిజన్, నైట్రోజన్, హైడ్రోజన్‌లతోపాటు హాలోజన్‌లు (ఫ్లోరిన్, క్లోరిన్, బ్రోమిన్, అయోడిన్)లు ద్విపరమాణుకాలు.
- ఓజోన్ పరమాణుకత - 3
- ఫాస్ఫరస్ పరమాణుకత - 4.
- సల్ఫర్ పరమాణుకత - 8.

5. 144గ్రా. మెగ్నీషియంలో ఉన్న గ్రామ్ పరమాణువుల సంఖ్య ____

1) 6 2) 144
3) 32 4) 64

జ: 1

వివరణ: మూలకాల పరమాణు భారాన్ని గ్రామ్‌లలో వ్యక్తపరిస్తే దాన్ని ఒక 'గ్రామ్ పరమాణువు'గా పేర్కొంటారు.

ఉదా: Mg పరమాణుభారం 24 యూనిట్‌లు. కాబట్టి ఒక గ్రామ్ పరమాణువు మెగ్నీషియం = 24 గ్రామ్‌లు

24 గ్రా. మెగ్నీషియం = 1 గ్రామ్ పరమాణువు

144 గ్రా. మెగ్నీషియం

$=\frac{144}{24}=6$ గ్రామ్ పరమాణువులు.

మరికొన్ని మూలకాల పరమాణు భారాలు (గ్రా) కింద ఇచ్చారు.

H	C	N	O	F	Na	Mg
1	12	14	16	17	23	24
Al	P	S	Cl	K	Ca	
23	31	32	35.5	39	40	

6. NaCl ఫార్ములా యూనిట్ భారం?

1) 5.85 u 2) 58.5 u
3) 0.585 u 4) 584 u

వివరణ:

సోడియం (Na) పరమాణు భారం= 23
క్లోరిన్ పరమాణు భారం = 35.5
NaClఫార్ములా యూనిట్ భారం =58.5 u


7. కిందివాటిలో క్షార ధర్మం కానిదేది?

1) ఎరుపు లిట్మస్‌ను నీలిగా మారుస్తుంది.
2) కొవ్వు పదార్థాలను కరిగించుకుంటుంది.
3) నీటిలో హైడ్రోజన్ అయాన్‌లను ఇస్తుంది.
4) సబ్బు వంటి జారుడు గుణం ఉంటుంది.

జ: 3;

వివరణ: సాధారణంగా రుచికి పుల్లగా ఉన్నవి అమ్లాలు, సబ్బులాగా మృదువైన స్పర్శ ఉన్నవి క్షారాలు.

- అమ్లాలు నీలి లిట్మస్‌ను ఎరుపుగా, క్షారాలు ఎరుపు లిట్మస్‌ను నీలిగా మారుస్తాయి.
- అర్హీనియస్ సిద్ధాంతం ప్రకారం అమ్లాలు నీటిలో హైడ్రోజన్ అయాన్లను, క్షారాలు హైడ్రాక్సిల్ అయాన్లను ఇస్తాయి.
- లోహాలు, లోహ ఆక్సైడ్‌లు నీటిలో కరిగి క్షారాలనిస్తాయి.(ఉదా: సోడియం ఆక్సైడ్, కాల్షియం ఆక్సైడ్)
- అలోహ ఆక్సైడ్‌లు నీటిలో కరిగి అమ్లాలనిస్తాయి.(ఉదా: సల్ఫర్, నైట్రోజన్, కార్బన్ ఆక్సైడ్‌లు)
- కొవ్వులను గాఢ క్షారాలతో కలిపి వేడిచేస్తే జలవిశ్లేషణ (సపోనిఫికేషన్) జరిగి సబ్బులు ఏర్పడతాయి.
- క్షారాలు ఫినాఫ్తలీన్ సూచికను పింక్ రంగుకు, మిథైల్ ఆరెంజ్ సూచికను పసుపు రంగుకు మారుస్తాయి.



- ఆమ్లాలు మిథైల్ ఆరెంజ్ సూచికను నారింజ రంగుకు మారుస్తాయి. ఫినాఫ్తలీన్ రంగు చూపదు.

8. కింది వాటిలో సరికాని జత ఏది?

1) రక్తం p^H : 7.4
2) వెనిగర్ p^H : 2.2
3) శుద్ధమైన నీరు p^H : 7.5
4) పాలు p^H : 6.6

జ: 2;

వివరణ: ఆమ్ల- క్షార బలాలను కొలవడానికి p^H స్కేలును ఉపయోగిస్తారు. దీన్ని సొరెన్‌సెన్ అనే శాస్త్రవేత్త పరిచయం చేశాడు. హైడ్రోజన్ అయాన్ గాఢత రుణ సంవర్గమానాన్నే p^Hగా నిర్వచించారు.

$p^H = -\log [H^+]$
అమ్ల ద్రావణం : $p^H < 7$
తటస్థ ద్రావణం : $p^H = 7$
క్షార ద్రావణం : $p^H > 7$

కొన్ని సాధారణ ద్రవాల p^H విలువలు కింది విధంగా ఉంటాయి.

ద్రవం	p^H	ధర్మం
గ్యాస్ట్రిక్ రసం	1 - 2	ఆమ్లం
ఆపిల్ రసం	3.0	ఆమ్లం
నిమ్మరసం	2 - 3	ఆమ్లం
వెనిగర్	2.2- 2.5	ఆమ్లం
మూత్రం	4.8- 7.5	ఆమ్ల-క్షార
సోడా	5.5	ఆమ్లం
లాలాజలం	6.4- 6.9	ఆమ్లం
పాలు	6.6- 6.8	ఆమ్లం
బ్లాక్ కాఫీ	5.0	ఆమ్లం
టోమాటో రసం	4.5	ఆమ్లం
వర్షపు నీరు	6.5- 6.9	ఆమ్లం
స్వచ్ఛమైన నీరు	7	తటస్థం
రక్తం	7.3- 7.4	క్షారం
కన్నీరు	7.4	క్షారం

ఉద్యోగాలు

రాష్ట్రీయ రక్ష యూనివర్శిటీలో టీచింగ్ పోస్టులు.

» గాంధీనగర్(గుజరాత్)లోని రాష్ట్రీయ రక్ష యూనివర్శిటీ(ఆర్ఆర్‌యూ)లో ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **పోస్టులు:** అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్(రీసెర్చ్), టీచింగ్ కమ్ రీసెర్చ్ ఆఫీసర్, రీసెర్చ్ ఆఫీసర్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, నెట్/స్లెట్/సెట్ ఉత్తీర్ణతతో పాటు బోధనానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు రూ.2,00,000 నుంచి రూ.2,50,000, టీచింగ్ కమ్ రీసెర్చ్ ఆఫీసర్ పోస్టులకు రూ.74,000 నుంచి రూ.92,000, రీసెర్చ్ ఆఫీసర్ పోస్టులకు రూ.55,000 నుంచి రూ.70,000, మిగతా పోస్టులకు రూ.90,000 నుంచి రూ.1,15,000.
» **ఎంపిక విధానం:** విద్యార్హత, పని అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది అసిస్టెంట్ రిజిస్ట్రార్, హ్యూమన్ రిసోర్స్ సెక్షన్, రాష్ట్రీయ రక్ష యూనివర్శిటీ, ఏటీ.లవడ్, టీఏ.దిహెగమ్, గాంధీనగర్, గుజరాత్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 09.10.2024.
» **వెబ్‌సైట్:** https://rru.ac.in/

ఆర్ఆర్‌బీలో 8,113 ఎన్‌టీపీసీ గ్రాడ్యుయేట్ పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ) దేశవ్యాప్తంగా అన్ని రైల్వే జోన్లలో నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీ(గ్రాడ్యుయేట్) పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 8,113.
» **ఆర్ఆర్‌బీ రీజియన్లు:** అహ్మదాబాద్, అజ్మేర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువాహటి, గోరఖ్‌పూర్, జమ్మూ-శ్రీనగర్, కోల్‌కతా, మాల్డా, ముంబై, ముజఫర్‌పూర్, పాట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం.
» **పోస్టుల వివరాలు:** కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్-1,736, స్టేషన్ మాస్టర్-994, గూడ్స్ రైలు మేనేజర్-3,144, జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్-1,507, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్-732.
» **రీజియన్ల వారీగా ఖాళీలు:** ఆర్ఆర్‌బీ సికింద్రాబాద్-478, ఆర్ఆర్‌బీ బెంగళూరు-496, ఆర్ఆర్‌బీ చెన్నై-436, ఆర్ఆర్‌బీ భువనేశ్వర్-758.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి బ్యాచిలర్స్ డిగ్రీ లేదా తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి. జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్/సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్ పోస్టులకు డిగ్రీతో పాటు కంప్యూటర్‌లో ఇంగ్లిష్/హిందీలో టైపింగ్ ప్రావీణ్యం తప్పనిసరిగా ఉండాలి.
» **వయసు:** 01.01.2025 నాటికి 18 నుంచి 36 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ప్రారంభ వేతనం:** నెలకు చీఫ్ కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్/స్టేషన్ మాస్టర్ పోస్టులకు రూ.35,400. ఇతర పోస్టులకు రూ.29,200.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(టైర్-1, టైర్-2), టైపింగ్ స్కిల్ టెస్ట్/కంప్యూటర్ ఆధారిత ఆప్టిట్యూడ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష. రెండు దశల్లో పరీక్ష జరుగుతుంది.
» **మొదటి దశ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్:** మొత్తం 100 మార్కులకు 100 ప్రశ్నలు కేటాయించారు. జనరల్ అవేర్‌నెస్(40 ప్రశ్నలు-40 మార్కులు), మ్యాథ్స్(30 ప్రశ్నలు-30 మార్కులు), జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ (30 ప్రశ్నలు-30 మార్కులు) సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు.
» **రెండో దశ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్:** మొత్తం 120 మార్కులకు 120 ప్రశ్నలు కేటాయించారు. జనరల్ అవేర్‌నెస్(50 ప్రశ్నలు-50 మార్కులు), మ్యాథ్స్(35 ప్రశ్నలు-35 మార్కులు), జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్(35 ప్రశ్నలు-35 మార్కులు) సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు.

ముఖ్య సమాచారం:

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.10.2024.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 16.10.2024 నుంచి 25.10.2024 వరకు
» **వెబ్‌సైట్:** https://indianrailways.gov.in/

Who is sitting fourth to the right of Kavitha?

Model Questions

Directions (Q.No.1-5): Study the following information and answer the given questions:

Vamsi, Prem, Suma, Kavitha, Ravi, and Kiran are sitting in a single row having eight seats. Three of them are facing towards north and three are facing towards south. Two seats are vacant but neither of the extreme ends is vacant. No person is sitting to the right side of Kiran. Neither Vamsi nor Kiran is the immediate neighbour of the seats that are vacant. Prem is sitting third to the right of Vamsi, who is facing towards north. Those people who are sitting to the either side of the vacant seats are facing in opposite directions. No two consecutive seats are vacant. Neither Suma nor Ravi is sitting at any of the extreme ends. Those who are sitting at the extreme ends are facing in the same direction. Ravi is sitting third to the left of Suma, who is facing towards north. Only two people are sitting between the seats that are vacant and both of them face the same direction.

1. Who among the following sit at the corner?
a) Kiran b) Vamsi c) Prem
d) Suma e) Ravi
2. Who is sitting fourth to the right of Kavitha?
a) Vamsi b) Prem c) Suma
d) Kiran e) None of these
3. Who is sitting third to the left of Kiran?
a) Prem b) Ravi c) Suma
d) No one e) None of these
4. Which of the following statement regarding Prem is true?
a) Prem is facing towards south
b) Immediate seats neighboring to Prem are vacant
c) Prem is sitting second to the right of Ravi
d) Prem is sitting between Ravi and Kiran
e) Prem is facing towards north.
5. How many person(s) are sitting between Vamsi and Suma?
a) None b) One c) Two
d) Three e) None of these.

Directions (Q.No.6-10): Study the following information to answer the given questions:

There are 7 pairs of husband-wife among the following A1, A3, A4, A5, A6, A7, A8, A9, A10, A11, A12, A13 and A14. They work in one of the seven Airways namely Indigo, Air India, British Airways, Emirates, Spice jet, Qatar Airways, and Lufthansa. The husband and wife live together in the same city. The following information is known about them:

» A8 is a female who lives in Nagpur and her husband works in Emirates.
» There's only one pair who work in the same Airways and they live in Agra.
» A7 is a male whose wife works in Spice jetAirways.
» A13 is the husband of the one working in Indigo and lives in Indore.
» A3 & A11 are males who live in Coimbatore & Surat respectively and are married to A4&A10 but not necessarily in the same order.
» A9, a male works in Indigo and lives in Ahmedabad and the female who works in Spicejet lives in Hyderabad.
» A2 & A14 are females and A5 is the husband of A12.
» A9's wife and A11 work in Air India.
» A6's husband works in Lufthansa Airways.
» A11's wife and A14's husband work in Qatar Airways.
» A10 works in Emirates.

6. A13 is working in which of the following Airways?
a) Lufthansa
b) Qatar Airways
c) Air India d) Emirates
e) can't be determined
7. Which of the following is correctly framed?
a) Surat - A11 - A10 (Emirates)
b) A3 (Spice jet) - Coimbatore - A10
c) Hyderabad - A7 (Lufthansa) - A4 (Qatar Airways)
d) Ahmedabad - A4 (Qatar Airways) - A3 (Spice jet)
e) None of these
8. A2 lives in which of the following cities?
a) Ahmedabad b) Hyderabad
c) Indore d) Agra
e) can't be determined
9. Who among the following works in Indigo Airways?
a) A8 b) A14 c) A6
d) Either (b) or (c)
e) Either (a) or (b)
10. A9 and A10 are working in which of the Airways respectively?
a) Emirates & Indigo
b) British Airways & Spice jet
c) Indigo & Emirates
d) Qatar Airways & Air India
e) None

Directions (Q.No.11-13): Study the following information to answer the given questions:

In a certain code,
'RING BANGLE MUD JAR' is written as '24#G, 12@R, 28$E, 26%D'
'JOKE BAN RADIO MONDAY' is written as ', 26@E, 16$N, 17#O, 8%Y'
'MOUNTAIN BEAR RANDOM JUMP' is written as '21%N, 13$R, 20#M, 15@P'
'JAM ROUND BAT MONEY' is written as '17@M, 28#D, 10$T, 7%Y'

11. What is the Code for 'BELOW'?
a) 9*B b) 9#W c) 9@W
d) 23$W e) None of these
12. What is the Code for 'MEETING'?
a) '27%G' b) '24#T'
c) '20$N' d) '14@M'
e) None of these
13. What does '28#D 6@X 21%R' Stand for?
a) BRAND SIX RETAILER
b) ROUND BOX MANUFACTURER
c) WORLD CLIMAX ZIPPER
d) BOARD ICEBOX ADVANCER
e) Cannot be determined.

Directions (Q.No.14-15): In each of the questions below are given two statements followed by two conclusions numbered I and II. You have to take the two given statements to be true even if they seem to be at variance with commonly known facts and then decide which of the given conclusions logically follows from the two given statements disregarding commonly known facts.

a) Either conclusion I or II follows.
b) Both conclusions I and II follow.
c) Neither conclusion I nor II follows.
d) Only conclusion II follows.
e) Only conclusion I follow.

14. **Statements:**
Only worms are bugs
Only a few worms are moths
All moth are not fly.
Conclusions:
I. No fly is a worm.
II. All moths being bugs is a possibility.
15. Statements:
Some stars are planets. No planet is a moon.
Conclusions:
I. No star is a moon.
II. Some stars are moons.

Bank Exams
Reasoning

Key with Solutions

(1-5): Kiran ↓ Vamsi ↑ Ravi ↓ Vacant Prem ↑ Suma ↑ Vacant Kavitha

1) **a**; 2) **e**; 3) **d**; 4) **e**; 5) **c**;

(6- 10):

Airways	Male	Female	Airways	City
Emirates	A1	A8	Lufthansa	Nagpur
Lufthansa/Qatar	A7	A6 / A14	Spice jet	Hyderabad
Qatar/Lufthansa	A13	A14 / A6	Indigo	Indore
Spice jet	A3	A10	Emirates	Coimbatore
Air India	A11	A4	Qatar	Surat
Indigo	A9	A2	Air India	Ahmadabad
British	A5	A12	British	Agra

6) **e**; 7) **b**; 8) **a**; 9) **d**; 10) **c**;


(11- 13):

	LETTER	SYMBOL	NUMBER
	Last letter of the word.	If the first letter of the word is R => # B => $ M => % J => @	Sum of the opposite letter value of the last letter in the word from the right end and number of letters in the word.


11) **e**; 12) **a**; 13) **e**;

(14- 15):


14) **d**;



15) **a**;



(16- 19):



Step1: 5×3=15, 5×8=40 and then add 15+40=55
4×3=12, 2×6=12 and then add 12+12=24
1×8=8, 6×1=6 and then add 8+6=14

Step 2: Multiply the digits of first box 5×5=25 and multiply the answer with first digit of second box = 25×2=50. Multiply the digits of Third box 4×1=4 and multiply the answer with second digit of second box = 4×4=16.

Step 3: Adding both the digits of first box = 5+0=5 and square of 5 is 25. Adding both the digits of second box = 6+1=7 and square of 7 is 49.

Step 4: Add both 25+49=74.

16) c; 17) e; 18) e; 19) b;

20) e; It is given that Tej is walking facing the sun, but it is not given weather it is morning or evening so it is hard to conclude the direction which he is facing.